# ఏకలవ్యుడు

పుష్యమాసం.

చలికి భయపడిన సూర్యుడు మబ్బు రగ్గు ఇంకా తియ్యలేదు.

గుడిలో పూసిన పారిజాతాలు మసక వెన్నెల్లో చెట్టుని పూసిన వెండిపువ్వులా మెరుస్తున్నాయి.

పక్కనే విరబూసిన పున్నాగ చెట్టు, పునాగ పువ్వులే చీరగా కట్టుకున్న పెళ్ళికూతురులా వుంది.

గాలికి తరతమ భేదం లేదు.

అది పారిజాతాల పరిమళాన్ని, పున్నాగ పువ్వు లసునావస ననీ, గుడిలోంచి వినిపిస్తున్న భగవద్గీత శ్లోకాన్ని కలిపి మేడల్లోని మా రాజులకీ, పాకల్లోని పాటక జనానికి అందరికీ ఒకేలా అందిస్తోంది.

ఆ శ్లోకాలకే పారిజాతాల వాసన అబ్బిందో, లేక పున్నాగ పువ్వులే శ్లోకాలు అలపిస్తున్నాయో తెలీదుకాని, ఆ చల్లని వాతావ రణంలో ఆ సంగీతం నాస్తికుడ్ని కూడా అలా నిలబెట్టేస్తుంది.

ఆ గుడికి కొంచెం దూరంలో ఉన్న తాలూకాఫీసు కాం పౌండ్‌లో చెట్లన్నీ ఊరవతల ఏటి మీద నుండి వచ్చే చల్లగాలికి మైమరచి మలయమారుతం రాగం ఆలాపిస్తున్నాయి.

తను చేసిన సృష్టి ఇంత అందంగా వుందా అని ఆశ్చర్య పోతున్నాడు గుళ్ళో దేవుడు!

వయసు మళ్ళిన పక్షులు భౌళిరాగంలో భక్తి గీతాలు పాడుతూ గుడి వైపు ఎగిరిపోతున్నాయి. అవి రోజూ తెల్లవారు ఝామునే గుళ్ళో హారతి తీసుకుని, దేవుడి దర్శనం చేసుకొని మేతకి బయలు దేరుతాయి.

కొత్తగా జతకట్టిన పిట్టలు మాత్రం బేహాగ్ జావళీలు పాడుతూ మధ్యలో తెగ నవ్వుకుంటున్నాయి.

మరీ అంత మిడిసిపాటేమిటే గుంట వెధవల్లారా! అలా ఆకుకి అందకుండా, చెట్టుకి చెందకుండా మిడిసిపడకండి. రెక్కలు విరిగేను... మీకేం పోయేకాలం వచ్చిందర్రా! అని తిడు తున్నాయి గుడి వరకూ ఎగరలేని ముసలి పక్షులు.

గుళ్ళో హారతిస్తూ గంట వాయిస్తున్నాడు పూజారి.

ఇటు పిట్టల పాటలు...

అటు కమ్మని సంగీతం...

గంటల గణగణా..

తృళ్ళిపడి లేచాడు తాలూకాఫీజు వరండాలో పడుకున్న అప్పలకొండ.

టైము చూశాడు.

గం. 4.30 ని.లు

అమ్మబాబో! నాలుగ్గంటలు కొట్టలేదు.

ఛెంగున లేచాడు.

ఠంగున గంటలు కొట్టేశాడు.

సర్రున కోపం వచ్చింది. పక్కనే పాకమీద కునుకుతున్న కోడికి, నీకేం పోయేకాలం వచ్చిందిరా కప్పలకొండా (అప్పల కొండకి కోడి పెట్టుకున్న ముద్దు పేరు) ఓరి తాగుబోతు ముండా కొడకా! నీకెప్పుడు ఎన్ని కొట్టాలనిపిస్తే అన్ని కొట్టేయడమేనా? వాటికొక టైము, రైము వుండనక్కర్లేదా? అరగంటకోసారి గంటలు కొట్టేస్తే కుయ్యలేక ఛస్తున్నా. పింజారి వెధవా! ఇందాకే కదా కూసొచ్చి చిన్న కోడికునుకు తీశాను. అసలు టైము నాకు తెలుస్తుందిరా! నీలాగా వాచీ చూడక్కర్లేదు. ఇంతకీ నిన్ను తిట్టి ఏం లాభం? నీలాంటి తాగుబోతులకి ఉద్యోగం ఇచ్చేరే వాళ్ళన నాలి. సరేలే... మరోసారి కూస్తే నా కూతే బాగుపడుతుంది. అని పట్టుకొని మరోసారి కూసి, చిన్నప్పుడు వాళ్ళమ్మ చెప్పిన ఎర్లీ బర్డ్ కేచెస్ ది వార్మ్ అన్నమాట గుర్తొచ్చి కిందికి గెంతేసింది.

గుళ్ళో హారతిస్తున్న క్షణం....

గంటలు మోగుతున్న శుభఘడియ.

నారాయుడింట్లో పసిపిల్ల భూమ్మీద పడింది.

అందుగో గుళ్ళో హారతిస్తున్నారు. జయం.... తొలు చూలు ఆడపిల్ల! గుళ్ళో దీపం లాగుంది పిల్ల. మహాలక్ష్మి మనింట్లో పుట్టింది. ఆ పేరే పెట్టుకో. అంది నారాయుడి తల్లి.

ఆ పేరే పెట్టేడు నారాయుడు.

దీపం లాగుంది పిల్ల! ఏ ఇంటికి దీపం ఔతుందో... అనేవారు మహాలక్ష్మి చిన్నప్పుడు.

నీ బొట్టెని ఎవడు కట్టుకుంటాడో గాని ఆడికి దీపం కరుసునే దురా నారాయుడూ అని ఎవరయినా అన్నప్పుడు నారాయుడి గుండె గర్వంతో పొంగిపోయేది.

చిన్నప్పుడు ఇంటికి దీపం వయసొచ్చేసరికి ఊరికి వెన్నెలైంది.

ఆమె నడక భూమికి గిలిగింతలు పెడుతుంది.

ఆ నవ్వు మోడుకి మొగ్గ తొడుగుతుంది.

ఆమె తాకిన గాలి చల్లగా వుంటుంది.

ఆమె చూపు చందనంలా వుంటంది. ఓల్డ్‌వైన్‌లా మత్తుగా వుంటుంది.

కొందరాడవాళ్ళని చూస్తే దేవాలయాలూ, వంటిళ్ళు గుర్తొస్తాయి.

మరికొందరాడవాళ్ళని చూస్తే అత్తరు వాసనలూ, వెన్నెల నీడలు, రబ్బరు పరుపులూ గుర్తొస్తాయి.

మహాలక్ష్మిని చూస్తే మల్లెపువ్వులూ, పడగ్గదులూ గుర్తొస్తాయి.

ఎవరికి ఏది జ్ఞాపకం వచ్చినా, మహాలక్ష్మికి మాత్రం రోజూ ఒక పూటైనా తిండికి నోచుకోని తల్లి, తోబుట్టువులు, రోజూ రాత్రి తాగొచ్చే తండ్రి వావీ వరసా మరచిపోయి తిట్టే తిట్లూ, కొట్టే దెబ్బలు గుర్తుకువస్తాయి.

నారాయుడికి మహాలక్ష్మి తర్వాత మరో ఇద్దరు సంతానం. మూడో కాన్పు నుండి మంచం పట్టిన జబ్బు పెళ్ళాం. తను తాగకపోయినా ఇంట్లో అందరికీ ఒక్క పూటయినా కడుపునింప లేని ఉద్యోగం వున్నాయి.

తల్లి మంచంపట్టేనాటికిమహాలక్ష్మి నాలుగో క్లాసు చదువు తోంది. తల్లి జబ్బుతో ఆమె చదువుని ఆపేసింది. బాధపడలేదు. ఇంటి బాధ్యతంతా తన నెత్తిమీదే పడినందుకు ఆమె బాధపడ లేదు. అమె బాధంతా ఈ కుటుంబం ఎలా గడుస్తుందా అనే!

అలా... అలా... ఆమె దుఃఖసాగరంలో నాలుగేళ్లు చీకటి ... దొర్లిపోయాయి. ఈ నాలుగేళ్ళూ ఆమెకి స్కూలు ఏమి నేర్పి ఉండేదో కాని, ఇల్లు మాత్రం నలభైయేళ్ళ అనుభవం నేర్పింది. తన తండ్రి తాగినా,తాగకపోయినా అతని ఆర్జనతో యింతమంది బ్రతకటం అసంభవం! తన తల్లి జబ్బు నుండి కోలుకొని మళ్ళీ పనిలోకి వెళ్ళటము అసంభవమే!

తన్నులకీ, తిట్లకీ జబ్బులు పోవు.

జబ్బులకి మందులు కావాలి...

మందులు మట్టిలోంచి మొలవ్వు.

డబ్బు కావాలి.

గంజికే గతిలేకపోతే మందులెలా వస్తాయి?

ఇంక ఆవిడ బ్రతుకలా మంచంలో తెల్లారాల్సిందేనేమో!

ఎలా విడుతుంది ఈ చిక్కు?

తను కూడా కూలికి పోతే!

ఏటి! వొయసుతోఉన్న ఆడకూతురి చేత కూలి సేయిస్తే గాని నా బతుకు బుగ్గికాదేటి? ఇదిగో యిప్పుడే సెప్తున్నాను. మరింక నాకాడెప్పుడూ వూసెత్తకు. కూలికెల్తాదిట ఓలమ్మడూ! మాపిటేలకి ఓ సుక్కేసుకున్నా నానింకా పరువుగానే బ్రతు కున్నానే. అంత కూడెట్టలేన్నాడు ఈ కొంపకి అగ్గెట్టేస్తాను. అందరం ఓసారి సద్దాం. అంతేగాని యిలాంటి పరువు తక్కువ పనులు మాత్తరం సెయ్యకు అన్న నారాయుడి తిట్లతో ఆమె ఆలోచన కూలిపోయింది.

అయితే రోజూ తాగొచ్చి పెళ్ళాం, పిల్లల్ని చావగొట్టడం ఏరకమైన పరువో, రెండు రోజులకో పూటైనా అన్నం పెట్టలేని ఈ పరువు ఎందుకో వగైరా మహాలక్ష్మి తండ్రిని అడగలేని ప్రశ్నలు?

నారాయుడి గుడిసెకాక ఆ వీదిలో ఈ వరసలో ఓ పది, ఆ వరసలో ఓ పన్నెండు పాకలున్నాయి. ఆ వీధి పేరు గాంధీ మార్గం. వీధి రోడ్డును కలిసేచోట ఎత్తుగా వున్న రాతిమీద గాంధీ నిల్చునుంటాడు. వీధికి కాపలా కాస్తున్నట్లు. అతని చేతిలో కర్రకూడా వుంది. ఆ విగ్రహము చేసినప్పుడు రాతిదేగాని పక్కనున్న ఫ్యాక్టరీనుండి వచ్చే దుమ్ముతో విగ్రహం అంతా కప్ప బడిపోయినందువల్ల దుమ్ముతో చేసిన విగ్రహంలా కనిపిస్తోంది.

ఒకప్పుడు దేశభక్తితో మిలమిల మెరిసే కళ్ళ నిండా దుమ్ము!

పసిసాపలా నవ్వే బోసినోటి నిండా దుమ్ము!

ఇదా నేశించిన భారతదేశం?

వీళ్లా నా ప్రజలు?

వీళ్ళకోసమేనా నేను స్వాతంత్రం తెచ్చాను?

దిద్దుకోలేని పొరపాటు చేశానేమో!

నేనీ ప్రజల మధ్య వుండలేను... అని ఏ అర్ధరాత్రో గాని విగ్రహం పారిపోతుందేమో అనిపిస్తుంది.

ఆ విగ్రహానికి కొంచెం ఎదురుగా సారా దుకాణం ఉంది.

తన ఫ్యాక్టరీలోని వర్కర్ల ఆనందానికి, ఆహ్లాదానికి రామ దాసుబాబు తన బామ్మర్ది చేత పెట్టించిన దుకాణం అది! ఫ్యాక్టరీలో ఉదయం బట్వాడా చేసిన జీతాలు సాయంత్రానికి సారా దుకాణా నికి వచ్చేస్తాయి.

ఆ దుకాణానికి కాస్త దూరంలో శివాలయం ఉంది. వర్ణం దరకు రక్తి ఉండదు కదా, ముఖ్యంగా ఆడవాళ్ళకీ, పిల్లలకీ అంచేత వర్ణ ముక్తికీ, మోక్షానికి ఆ శివాలయాన్ని రామదాసు బాబే కట్టించేడు. పండగల్లోను, శలవు రోజుల్లోను విధిగా పురాణాల కాలక్షేపం పెట్టిస్తాడు. అదికాకుండా బాబాల చేత భక్తి మార్గాలూ, స్వాముల వారిచేత వేదాంత చర్చలు కూడా పెట్టిస్తాడు. అక్కడ చెప్పేవన్నీ ఇష్టం ఉన్నా లేకపోయినా మహాలక్ష్మికి వినిపిస్తూనే వుంటాయి.

మనం అంతా దేవుడి చేతిలో కీలుబొమ్మలం. మన చేతిలో ఏమీ లేదు. ఎవరి ఖర్మలను బట్టి వారి వారి జన్మలు వస్తాయి. గొప్పవాడ్ని చూసి బీదవాడు అసూయపడకూడదు. ఈ జన్మలో పుణ్యం చేసుకుంటే వచ్చే జన్మలో నువ్వు సర్వసుఖాలు అనుభవిస్తావు. ఉన్నదానితో తృప్తిపడాలి తప్ప లేనిదాన్ని గూర్చి ఆశించకూడదు. ఈ జన్మలో అనుభవించే కష్టాలే వచ్చే జన్మలో నువ్వు అనుభవించే సుఖాలకి సోపానాలు. మన కష్టాలకీ, లేమికీ, మన బాధలకీ మన ఖర్మ తప్ప మరోటి కారణం కాదు. క్రితం జన్మ తాలూకు పాపుణ్యాల ఫలితమే ఈ జన్మ… ఇది ఆ గుడిలో చెప్పబడే కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

ఇందులో ఏ ఒక్కటీ మహాలక్ష్మికి అర్థం కాలేదు. మాకేటుంది ఆకలి. మరింత మేము ఆకలితో సంతోషించాలే తప్ప అన్నం అడగకూడదు. చీకటి తరువాత వెన్నెల పుస్త కాల్లోను, సినిమాల్లోను ఒస్తుందే కాని మాలాటోళ్ళ బతుకుల్లో చీకటి తరువాత వచ్చేది కటిక చీకటి. ఆకలికి కావల్సింది అన్నం కాని వేదాంతం కాదు అనుకునేది మహాలక్ష్మి.

కనీసం రోజులిలా గడిచినా బావుణ్ను అని ఆశించింది.

కానీ గడువలేదు…

….

ఆ నగరంలో…

ఓ వైపు ప్రేయసి పాటల పిలుపులు.

మరోవైపు ఆకలి పేగుల అరుపులు, ఊలు రగ్గుల వెచ్చదనం.

గోనె చిరుగుల చల్లదనం, ప్రేమపాటల పల్లవింపులు.

మూగ బాధల మేళవింపులు.

తడిసిన రోడ్ల మీదవెదజల్లిన నక్షత్రల్లా వున్నాయి వీధిలైట్లు.

వర్షం – వర్షం – ఒకటే వర్షం.

మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షంతో ఊరంతా తడి తడిగా వుంది. చలిచలిగా వుంది.

ఆ చల్లటి రాత్రి

ఆ చిక్కటి రాత్రి

ఆ చీకటి రాత్రి

పేకాట దాసులకి ఆట దగ్గర్నుంచి కదలాలని లేదు.

మందు దాసులకి మందు వదలాలని లేదు.

క్లబ్బుల్లో పేకాట ఆడుతున్న ఆఫీసర్లు ఇలాంటి బీస్ట్‌లీ వెదర్‌తో శలవు డిక్లేర్ చెయ్యని గవర్నమెంటు అచ్చు వెయ్యలేని బూతులు తిడుతున్నారు.

పొయ్యిమీదికి పొయ్యికిందికి ఉన్న వాళ్ళు తిని పడుకుందాం అనుకుంటున్నారు.

ఈ రెండూ లేనివాళ్ళు తినకుండా ఎలా పడుకోవాలి అనుకుంటున్నారు.

వర్షానికి కొట్టుకొని పోతున్న ఎంగిలాకులు అందని కుక్కలు వర్షాన్ని కుక్క భాషలో తిడుతున్నాయి.

ఈ వాతావరణంలో

రోడ్డు మీద వీధిలైటు దగ్గర

ఒక రిక్షా, పక్కనే పేర్రాజూ

పంచ రంగుల బుష్‌కోటు తొడుక్కున్న ఒక నడి వయసాయన. అతని చేతిలో గొడుగు, పక్కనే ఒక ఆడ మనిషి.

వాళ్ళిద్దరూ గొడుగు వేసుకున్నప్పటికీ నీరుకారి పోతున్నాయి.

ఆవిడ చలిక గజగజ వణుకుతోంది.

"ఏమిటీ మూడ్రూపాయలా?" గొడుగు కొంచెం పక్కని జరిపి రిక్షావాడి మొహం మీద పెడుతూ అడిగేడు నడివయసు.

"ఓ సుట్టు సెప్తే అరదం కాదేటి?" గయ్యిమన్నాడు పేర్రాజు.

"ముండ బస్టాండుకి మూడ్రూపాయాలా?" ఆశ్చర్యపోయేడు నడివయసు.

"పక్కన ఆడోళ్ళున్నారనైనా లేకుండా ఏటామాటలు? ముండల బస్టాండుకైతే ముప్పై రూపాయలు. బస్టాండు కైతే మూడు" బెల్‌కొట్టి మరీ చెప్పాడు పేర్రాజు.

"మామ్మూలుగా అయితే బతిమాలుకొని వచ్చేవాడివి ముప్పావలాకి" గొనిగేడు నడివయసు.

"ఆకలేస్తే అరవై పేసలికే వస్తాను"

"అందుకే ప్రపంచం ఇలా తగలడుతోంది"

"గొడుగు ముడిసే, తగలడుతుందో, తడుస్తుందో తెలుస్తుంది."

"నువ్వంటే నువ్వంటావా?"

"నువ్వంటే ఒరే అనే రోజులు ముందున్నాయి."

"చచ్చినా మూర్రూపాయలివ్వను"

"నువ్వు ఇవ్వకపోయినా నేను సావను."

"అందుకే మీ బతుకులిలా ఉన్నాయి –"

"నడిసెల్తే నీ బతుక ఏమౌతుందో సూసుకో ముందు."

"హి ఈజ్ డ్రక్ పెర్ హేప్స్" ఇంగ్లీషులో తగువు తీర్చ బోయింది పక్కనున్నావిడ.

"ఆల్ లుక్స్ లైక్ డ్రంక్స్ టూ ఎ డ్రంక్" పేర్రాజు ఇంగ్లీషు సమాధానికి వాళ్ళు ముందు ఆశ్చర్యపోయి, తరువాత బిక్క చచ్చిపోయి, తరువాత పారిపోయేరు.

ఈ కేకలకి తలుపులు తీసుకొని బైటకొచ్చింది మహలక్ష్మి.

"ఏటి పేర్రాజన్నా! ఊరికే బేరం వదులుకున్నావ్?"

ఆ గూడెం ఆడవాళ్ళంతా అతన్ని అన్నా అనే పిలుస్తారు. అతను రిక్షా తొక్కడానికి ముందు –

పేర్రాజు ఇంటర్ చదువుతున్నప్పుడు, పరీక్షలింకా ఇరవై రోజులే ఉన్నాయి. అతని తల్లి కనకమ్మకి కుడిచెయ్యి ఫ్యాక్టరీలో మరలో పడి మాంసం ముద్ద అయిపోయింది.

అరచెయ్యి తీసేసారు డాక్టర్లు.

లంచాలు పోను వచ్చిన కాంపెన్సేషన్ ఐదువేలలోను మూడు వేలు పట్టుకొని అతని తండ్రి పోతరాజు తనకు నచ్చిన మెల్లకన్ను దాన్ని తీసుకొని కలకత్తా పారిపోయేడు. తల్లి జబ్బు, తండ్రి పరారీ ఇవి పేర్రాజుని ఇంటర్ పేసవనివ్వలేదు.

ఇంగ్లీషు మాత్రం ఫస్ట్‌క్లాస్ వచ్చింది.

అంతే తండ్రి పట్టుకొనిపోగా మిగిలిన డబ్బు రాని ఉద్యోగానికి పేరు పంపడానికి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో లంచాలకి సరిపోయింది. పేర్రాజు ఆశించిన గుమాస్తా ఉద్యోగం రాలేదు.

కూలిపని చెయ్యడానికి ఇంటర్మీడియెట్ అడ్డొచ్చింది.

అప్పుడు – పస్తులు.

రోజులు రోడ్డుమీద పడ్డాయి.

ఓ రాజు సాయంత్రం

పేర్రాజు పార్కులో కూర్చున్నాడు.

ఆ పార్కులోనే ఒక కూలీ పార్టీ మీటింగు జరుగుతోంది. ఎందరో మాట్లాడేరు.

మనం చేసే పనుల్లో పెద్ద, చిన్న తారతమ్యం లేదన్నారు. ఎవరి శక్తిని బట్టి వాళ్లు ఏదో ఒక పనిచేసి బతకాలే తప్ప సోమరితనం పనికి రాదన్నారు. మనుషుల్లో కూడా చిన్న, పెద్ద, గొప్ప, బీద లేదన్నాడరు. "డిగ్నిటీ ఆఫ్ లేబర్" అంటే ఏమిటో చెప్పేరు.

అందరూ కార్లో ఎక్కి కూర్చోవాలనుకుంటే నడిపేదెవరు? అందరూపల్లకీ ఎక్కాలనుకుంటే మోసేదెవరు?

కష్టపడి పని చెయ్యాలే కాని ఏదీ పరువు తక్కువ పని కాదు.

ఆ లెక్చర్ విన్నాక అతను ఆ పార్టీ ఆఫీసుకెళ్ళి పుస్తకాలన్నీ చదివేడు. ఆ సిద్ధాంతం అతనికి బాగా నచ్చింది.

అతను మొదట్లో ఒక సైకిల్ షాపులో పనికి కుదిరేడు. రాత్రిపూట రిక్షా తొక్కేడు.

దరిద్రం అంటువ్యాధి. అని ఎవరన్నారో కాని అక్షరాలా తనే అనుకున్నాడు పేర్రాజు. తను కుదిరిన సైకిల్ షాపు యజమాని దివాలాతియ్యగానే.

చివరికి రిక్షావాడిలాగానే మిగిలిపోయాడు.

అతను చదువుకున్న వాళ్ళ తెలుగు మాట్లాడగలడు. అయినా తోటివాళ్లకి దగ్గరలో ఉండాలని వాళ్ళ యాస మాట్లాడతాడు.

మహాలక్ష్మి పిలుపుకి కాలుస్తున్న బీడీ పారేసి "నే నకపోతే మాలచ్చి, సదువుకుంటే రిచ్చా తొక్కకూడదా? డబ్బుంటే మాత్తరం నోటికెంత వస్తే అంతమాట అనేయడమేనా? అసలప్పుడప్పుడు అనిపిస్తుంది. డబ్బున్న వాడెవడికీ రిచ్చా కట్టకూడదని" వివరించేడు పేర్రాజు.

మహాలక్ష్మి వానజల్లులా నవ్వింది.

సదూకున్నావేగాని పెంపంచికం తెలీదన్నా నీకు, డబ్బు లేనోడు రిచ్చా ఎందుకెక్కుతాడు. కాళ్లుండగా అంటూ నవ్వుతోంది.

ఇంతలో చీకటి దెయ్యంలా ప్రత్యక్షమయ్యాడు నారాయుడు.

తాగుడు కంపూ, తాగుడు తూలుడూ... అతని కళ్ళు దెయ్యం కళ్ళలా ఎర్రగా ఉన్నాయి. అతని ఆలోచనక్కూడా దెయ్యం పట్టింది. ఏవిటే పట్టపగలు నడిరోడ్డు మీద ఏటే ఆ సరసాలు? అంటూ మహాలక్ష్మి జుత్తు పట్టుకున్నాడు.

జరుగుతున్నదేమిటో అర్థమవలేదు మహాలక్ష్మికి, పేర్రాజుకి. పట్టపగలు కాదనీ, వాళ్ళు సరసాలాడటం లేదనీ, యింకా ఏవో నచ్చచెప్పాలనుకునే లోపున పేర్రాజు నారాయుడు మహాలక్ష్మిని ఒక దెబ్బ కొట్టాడు.

మెడమీద దెయ్యం కొట్టినట్టనిపించింది.

రెండో దెబ్బ ఆమె మీద పడకుండా పేర్రాజు ఆపాలను కున్నాడు. కానీ నారాయుడు కొట్టిన రెండో దెబ్బకి మహాలక్ష్మి కాలువలోను, పేర్రాజు రోడ్డుమీద పడ్డాడు.

పేర్రాజు గబుక్కున లేచి మహాలక్ష్మిని లేవదీయబోయాడు ఆమెకి అప్పటికే స్పృహతప్పిపోయింది.

స్పృహ తప్పిన కూతుర్ని చూసిన నారాయుడికి ఒంటి మీద మత్తు దిగిపోయింది. పడిపోయిన కూతుర్ని లేవదీయాలన్న ఆలోచన కూడా రాలేదు. ఆమె పక్కనే కూలబడి ఏడవటం ప్రారంభించాడు.

అతన్ని చూసిన పేర్రాజుకి అసహ్యం, కోపం, జాలి వరసగా కలిగాయి.

ఆడదాని మీద సెయ్యి సేసుకోవడమెందుకు? ఆడదాన్నాగ ఏడవడమెందుకు? నెగు నెగు ముందు ఆ పిల్లని ఆస్పత్రికి తీసుకెళ్ళకపోతే అనక అందరం కూకుని తీరిగ్గా ఏడవాలి. సాయం పట్టు అంటూ పేర్రాజే మహాలక్ష్మిని ఎత్తి తన రిక్షాలో కూర్చోపెట్టి పడిపోకుండా పట్టుకోమని నారాయుడితో చెప్పి ఆస్పత్రిలో చేర్చాడు.

తోవ పొడుగునా నారాయుడు ఏడుస్తూనే ఉన్నాడు.

అప్పుడతను కూతుర్ని ఆస్పత్రికి తీసుకెడుతున్నవాడిలా వున్నాడు. అస్పత్రిలో డాక్టర్ల ప్రశ్నలకి సమాధాలన్నీ పేర్రాజే చెప్పాడు.

ఈరేత్తిరి నానిక్కడే తొంగుంటాను. కానీ నువ్వు పోయి ఇంటి కాడ ఆళ్లేటైయ్యేరో సూడు. అని పేర్రాజు బ్రతిమాలినా నారా యుడు వినలేదు.

అన్నిటికీ నారాయుడి సమాధానం ఒకటే...

ఏడుపు..

పేర్రాజు బ్రతిమాలడం... నారాయుడి ఏడుపు అలా సాగు తూనే వుంది.

నారాయుడు మిణుకుల మీద తలపెట్టుకుని కూర్చుని అన్ని టికీ తల అడ్డంగా వూపుతూనే వున్నాడు.

ఇంతలో.....

## 3

ఏటూరె ఈ సలి? వణుక్కి ఎవుక విరిగిపోయేలాగున్నాయి అన్నాడు హెడ్డు వెంటకస్వామి కుర్చీలో రెండు కాళ్ళూ పెట్టి వాటి చుట్టూ చేతులు చుడుతూ.

"అవునవును.." అన్నాడు ఏడుకొండలు.

ఏడుకొండలకి డిపార్ట్‌మెంటుతో ఏడు నెలల అనుభవం నేర్పిన మొదటి పాఠం.. అధికారి ఏం చెప్పినా అవునవును అనో ఎస్సర్ అనో అనడం.

వెంకటస్వామికి రిటైరుమెంటు దగ్గరకొస్తోంది. ఆ మధ్య సచ్చీ టయాంకయినా సబిన్సపెక్టరు అవుతానన్న ఆశ వుండేది. కాని ఏటిన్నాబం?

అడుగో... వచ్చినాడో కొత్త ఎస్పీబాబు. సూట్టానికి సుట్ట పీకంత నేదు. ఆడికెంత తెగులురా బాబూ. ఆర్నెల్లలో దేశం వుద్దరించేస్తానంటాడు.

మరే!

మరింక పోలీసోడే ఉద్దరించాలి దేశాన్ని!

డిపార్ట్‌మెంటంతా కడిగేస్తానంటాడు.

ఏటి? ఈ డిపార్టుమెంటుని కడగడమంటే గేదెల్ని కడగడం అనుకుంటున్నాడు గావాలు.

ఇదెలాంటి డిపార్టుమెంటు.

గాంధీగార్ని తీసుకొచ్చి ఆఫీసరు కుర్చీలో కూకుండ బెడితే సొంత డబ్బెట్టి సిగరెట్టు కొనుక్కోడు. ఇంక ఈ సుట్టపీక గాడొక నెక్క?

కొత్తగాదూ, అలాగే వుంటాది.

ఇలాటోళ్ళని, ఇదిగో ఊడిపోయిన ఈ నెత్తిమీద ఎన్ని ఎంట్రుకలున్నాయో అంతమందిని జూయిస్సినాను. మొదట్లో సోడాబుడ్డి వద్దన్నాడు –

సంవత్సరం తిరగక్కర్నేదు స్కాచ్ గావాలంటాడు. ఓరానికో, నెలకో అనుకునేవు, రోజుకి! కావాలంటే స్కాచ్‌లో ఈతకొట్టం చేద్దును. కానీ మన దశ బాగునేదు.

ఈడి పాతివ్రొత్యం టైమూ, మన పామోసను టైమూ ఒకటయిపోనాయి.

ఎప్పుడూ ఎరగనోడికి అడద్దొరికితే ఏదో సేసేట్టు – అలాగ ఛార్జి, చార్జి మీద ఛార్జి తొమ్మిది గుచ్చేసేడు మన పీకల మీదికి.

కన్నెరికానికి కరీం సాయిబు తగులుకున్నాడని, మన ప్రమోషను టయాముకి ఈ బాబు తగులుకున్నాడు. మనమిక "మనం ప్రమోసను ఆశ ఒగ్గేసి రిటైరైపోయిలోపల అన్నీ సరుదు కోవాల" అని చెట్టుకీ, పిట్టకీ ఒక్కసారి కాకుండా చెరోసారి చెప్పుకుని ఏడుపు నవ్వు నవ్వడం అతనికీ మధ్య అలవాటై పోయింది.

కుర్చీలో పెట్టిన కాలివేళ్ళు మెటికలు విరుస్తూ ఎఎస్‌పిని మనసులోబూతలు తిట్టుకొని ఒరేయ్ ఏడుకొండలూ" పిలిచాడు.

ఎస్సర్ పలికాడు ఏడుకొండలు

వీధిలైట్ల కాంతిలో వర్షం వెండి మేకుల్లా మెరుస్తోంది.

ఒక వీధికుక్క అర్జెంటు పనున్నట్టు వర్షంలో పరిగెడు తోంది.

సరసం చేసుకుంటున్న జంటని ఎక్కించుకొని తొక్కు తున్న రిక్షా వాడు వర్షానికి చలికీ ఇంక వణకలేకపోతున్నాడు.

స్టేషను ఆవరణలో చెటుక్కట్టిన, నిన్న ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి బట్టల మూటనుండి అతని తల్లి కన్నీళ్ళలా నీళ్ళు కారుతూనే వున్నాయి.

పాము నోట పడిన కప్ప ఏడుపు కాకా హోటల్ కవాలీ పాటతో కలిసిపోయింది.

వీధిలైట్లు మాత్రం మొహాలు కడుక్కున్న ముత్తయి దువల్లా కళకళలాడుతున్నాయి.

ఒక కాలు మెటికలు అయిపోయాయి.

రెండో కాలు ప్రారంభించాడు హెడ్డు.

"ఏడుకొండలు" పిలిచాడు మళ్ళీ.

"ఎస్సర్" ప్రతిధ్వనించాడు ఏడుకొండలు.

రెండో కాలు కూడా అయిపోయింది.

మరింకేం చేయాలో తోచలేదు హెడ్డుకి. అంచేత కళ్ళు మూసుకుని కలలో మాట్లాడినట్టు అస్పష్టంగా "యింత ముసుర్లో మొగాడికేటి కావాల్రా అనడిగాడు?"

ముందు ముసిముసిగా నవ్వాడు ఏడుకొండలు. కానీ కళ్ళు మూసుకున్న వాడికి ముసిముసి నవ్వు, చిరునవ్వు వగయిరాలేం కనిపించవని గ్రహించాక పకపకా నవ్వాడు.

"మొగోడికేటి కావాల్రా అంటే అలా గుర్రంలా సికిలిస్తా వేట్రా?" కలలోనే కసిరాడు హెడ్డు.

ముప్పై సెకండ్లు గడిచాయి.

తపస్సులో ఉన్న వాళ్ళా హెడ్డు కళ్ళు విప్పలేదు.

మీ యాడదానికెన్నో నెలరా? కలలోనే అడిగాడు హెడ్డు.

మూడేళ్ళ క్రితం. మంత్రసాన్ని పోలీస్ స్టేషన్‌లో రేప్ చేశా దన్న కేసులోంచి బయటపడ్డానికి హెడ్డు మూడు చెరువుల సారా తాగలవసి వచ్చింది. అప్పటికి సర్వీసులో చేరకపోయినా ఆ సంగతి ఏడుకొండలకి తెలుసు.

"ఏడు" అన్నాడు ఏడుకొండలు.

హెడ్డు తపస్సైపోయింది.

"అయితే పర్లేదులే!" అన్నాడు కళ్ళు విప్పుతూ. ఎలా పర్లేదో వివరించాడు. గర్భదానం నాడు భార్య కాడకాకుండా బందు ల్దొడ్డిలో తొంగోవలసొచ్చిందే అనుకున్నాట్ట ఎనకటికో యిలేజ్ మునసబు. నీ పని అలాగే ఔద్దేమోనని అడిగాను అంతే. వొయి సులో వున్నోడివి యింటికాడ కాకుండా ఇంత ముసురులో యిక్కడుండి పోనావే అని బాధపడిపోనాను. అది సరే నీకు నేనో మాట చెప్తాను వింటావా?

వింటున్నాడు ఏడుకొండలు.

మళ్ళీ తపస్సులోకి వెళ్ళిపోయేడు హెడ్డు. కళ్ళు మూసుకునే గీతోపదేశం ప్రారంభించేడు. "మన బతుకులు ఎలాంటివో తెలుసా?"

తెల్దన్నాడు ఏడుకొండలు.

"సానిదానికీ, మనకీ తేడా వుందంటావేటి? ఏటి సాని దానితో పోల్చుతున్నానంటావా? అదీ మడిసే, మనం మడు సులమే. అదీ డబ్బు కోసమే ఉజ్జోగం సేస్తన్నాం. వొయసులో ఉండ గానే, అదీ సర్వీసులో వుంగానే మనం సేతికందింది సక్క బెట్టేసు కోవాల. వొయసైపోయేక దానివేపు మరో వొయిసైనోడు చూస్తా

దేమో కాని, రిటైరైపోయేక మనవేపు కుక్కల కూడా సూడదు ఏటంటావ్?

అవునన్నాడు ఏడుకొండలు.

"సేతికి ఏదీ అందకపోతే నో అంటావా?" మనమే అందుకోవాల.

అదురుష్టం గుడ్డు విప్పుకొచ్చేసి మన పక్కలో తొంగోని మన యీపు గోకదు. నానింక రిటైరైపోతున్నా, నాకేం మొహమాటం నేదు నీకాడ. మీ ఇంటి పక్క గుంటకి నీమాద ఎంత మోజున్నా నీ దగ్గరకు రాదది. మందడి గోడమీంచి నువ్వే ఓ గులకరాయి దాని మీదకి యిసరాల. లేకపోతే ఏ సెల్లెలి చేతో సిన్న సీటీ ముక్కన్నా పంపాల. నువ్వు మరీ ధ్యెయిర్యవై ఒవనుకుంటే సీకట్లో రెక్కట్టుకోవాల.

అప్పుడదెంత బెట్టు చేస్తాదో అనుభవం వున్నా నాలో టోద్నదుగు.

ఇదేటిది. సీతమ్మ సెల్లెలా?

అరుంధతి అప్పా?

సావిత్రి సుట్టవా?

అన్నట్టు బెట్టు సేస్తాది?

నీ మీద మోజున్న పక్కింటి గుంటే–దానికి తెలిసిన మొగోళ్ళు తండ్రి తమ్ముడుతో కలిపితే ముప్ఫై మందుం దరు. అదే అంత బెట్టు చేస్తాదే, మరలాంటప్పుడు అదురుష్ట దేవత సంగతేటి.

ఆ యమ్మసేత దండేయించుకోవాలని ఎంతమంది ఆడా, మగ సిద్దంగుంటారు.

అంచేత మరింక ఆయమ్మ లవ్‌లెటర్ రాస్తాదని వూరుకోకు.

ఆ తల్లి ఎక్కడుంటాదో అక్కడికి నువ్వే పరిగెత్తాల. అక్కడ నీలాంటోళ్ళు ఎయ్యిమందున్నా ఆళ్ళని ఫీల్డులోంచి తప్పించేసి నువొక్కడివే నిలబడాలి.

ఆయమ్మ అంటే ఎవరు?

"లచ్చిందేవి?" జవాబిచ్చేరు ఏడుకొండలు.

సల్లగా కతవింటూ నిద్దరపోతన్నావేటో అనుకున్నాను. ఉషారుగానే యింటున్నావన్న మాట. మరైతే యిను.

ఆ యమ్మ అందరికాడికీ ఒక్కనాగ రాదు. డాక్టరు కాడికి పేషెంటు ఏసంలో... వస్తాది.

ఇంజనీరు బాబుకాడికి కంట్రోక్టరు ఏసంలో వస్తాది.

సావుకార్లకి కంట్రోల్లాగొస్తాది

రెవిన్యూవోళ్ళకి వరద నాగాస్తాది

పంతుళ్లకి పరీచ్చనాగొస్తాది.

మనకి అంటే పోలీసోడికి శవం నాగొస్తాది. ఏటలా సూస్తన్నావు? శవంకాడ డబ్బెలా దొరుకుద్దనా? ఎవరూ డబ్బు జోబీలోనో, జాకెట్టులోనో కుక్కీసుకుని సావరు అలా సచ్చినా శవం నీకాడకొచ్చీలోపునే యింకోడు కొట్టేస్తాడు.

సచ్చిన పేషంటు సుట్టాల కాడ ఫీజుపీకి బలకాల డాట్రు.

కేసుపోయిన పార్టీని పీక్కాని బతకాల ప్లీడరు.

శవాన్ని వాడుకొని బలకాల పోలీసోళ్ళు.

సెట్టెక్కవలసినోడివి. ఎంతకనితోస్తామ? అయినా ఒక కథ సెప్పి ఒగ్గేస్తా. ఇనుకో.

వింటున్నాడు ఏడుకొండలు.

"నాను సర్వీసులో జేరిన కొత్తల్లో నరసిమ్ములని మాకో ఎస్సై వుండేవోడు. దేంకరు డబ్బు గుంజడంలో ఆ బాబుది తోడా తొడిగించుకున్న చెయ్యి.

ఇచిత్తరం ఏటుంటే దెబ్బలు తిన్నోడికాడా, డబ్బుపోయి నోడికాడా కూడా పీకేవాడు డబ్బు.

నన్నా రౌడీనాయల సితగొట్టేసినాడు అని ఎవుడన్నా తల మాసినోడో, తన్నులు తిన్నోడో స్టేషనుకొచ్చేడనుకో.

ముందీ లంజకొడుకుని మూసేంద్రా... అని ఆడ్ని మూయించేసేవోడు.

తరువాత తన్నినోడ్ని మూయించేవోడు.

తన్నులు తిన్నోడి కాడికెళ్ళి తను గాంధీవో, మెరార్జీవో అయినట్టు తాగుబోతు నంజికొడుకా పొద్దుపోతే సారాయి తాగేసి రోడ్డుమీద తన్నీసుకోవడమేనా ఇంకేటేనా పనుందా? ఆడు సేతకనోడు కాబట్టి నిన్ను ముద్దు ముద్దుగా తన్ని వూరుకున్నాడు. కానీ నానైతే కీళ్ళిరిచేసి కాలవలో కప్పెట్టేసేవాడ్ని. నేకపోతే కేసెట్టి ఆర్నెల్లు జైలుక్కట్టించేద్దును! నువ్వు బతికి బట్టకట్టాలంటే జామీను బొండియ్యి ముందు మా ఫండియ్యి అని బెదిరించి ఆడి పెళ్లాం చేత మట్టె, మంగళసూత్రం తాకట్టు పెట్టి గుంజేవోడు డబ్బు.

అత్తనెత్తుకొచ్చినోడు అలినొగ్గేస్తాడా? మరింక తన్నినోడి కాడికెళ్ళి ఏరా బేవార్సు గాడిద కొడకా! తాగేసి కనిపించిన ప్రతివాడినీ తన్నటమేనా నీ పని? అందర్నీ నువ్వే తంతే మరి మేమెందుకున్నట్టు? ఆడు అమాయపు గొడ్డు కాబట్టి మాకాడి కొచ్చేడు. అదే నాలోటోడైతే నీ ఎముకలిరిచేసి పొట్లాం కట్టి నీ పెళ్ళానికి పులుసొండుకోమని పంపించే వాడు. నిన్నేటి అర్నెల్లు జైలుక్కటీమంటావేటి? అని అడి దగ్గర డబ్బు గుంజేవాడు.

"మొత్తానికి వుండతగ్గోడు" మెచ్చుకున్నాడు ఏడుకొండలు.

"నీ సర్టిఫికెట్లు తరువాత గాని ముందు కథ విను" విసుకున్నాడు హెడ్డు.

వింటున్నాడు ఏడుకొండలు.

"ఓపాలి ఏటైందో తెలుసా? అప్పుడు "టి" పల్లిపాడులో పనిసేస్తన్నాం ఏటో! ఈ రోజులే వేరు. ఇప్పట్లా ముప్పై ముండ కంపెనీలు, నలభై సారా దుకాణాలు వుండేవి కావు. అప్పుడు "పగటి పతివ్రతలు" కూడా వుండే వారు కాదు.

"పొడుగు సిట్టి" అని  ఓ సాని ఉండేది.

దాన్ని చూస్తే యిస్వామిత్రుడికీ, వశిష్టులవారికీ తేడా నేదు.

దాని జెబ్బలు జూసినోడి చూపు జెబ్బల దగ్గర ఆగేది కాదు.

ఇంత ముక్కూ, అంత కన్నూ -

ఇంత మెడా, అంత జెబ్బ

అబ్బా! తలుసుకుంటే రిటైరయీ ముండాకొడుకుని నాకే మతిపోతోంది.

అర్నెల్లు అబ్బనీ, అర్నెల్లు కొడుకునీ వుంచుకొనేది.

తప్పు అబ్బదీ కాదు.

అబ్బాయిదీ కాదు.

ఆ పొడుగు లంజదే.

దాన్ని మూడేసి నెలలు కొకడు చొప్పున ముప్పై మంది షావుకార్లు వుంచుకున్నారు.

ఆ రోజుల్లో షావుకారుకి ముండస్టేటస్ సింబల్

అకదోడు మాత్తరం మతిపోగొట్టుకొని, పెళ్ళాన్ని పుట్టింటికి పంపించేసి తను ఆర్నెల్లు సూర్యుడ్ని కూడా సూడకుండా దాన్తో ఉండిపోయాడు.

సెప్పేను కదా, ఆ రోజులే వేరు.

ఆ మనుషులే వేరు.

ఆ రోజుల్లో ఓ షావుకారు ఓ ముండని వుంచుకున్నా డంటే మండకెంత పరపతి!

దాన్ని పెళ్ళాం కంటే బాగా చూసేవాడు.

కొన్ని ఇళ్ళలో అయితే పెళ్ళాం, ముండ సక్కం సొంత అప్ప చెల్లెళ్ళలా కలిసి మెలిసి వుండేవారు. ఈ ఇంటకీ, ఆ ఇంటికీ రాకపోకలూ వుండేవి.

ఇప్పుడా! పరాయి ఆడదాని పేరు కలవరిస్తేనే యిడాకు లిచ్చేస్తాది పెళ్ళాం. ముండ ఒంటిమీది కోక ఒల్చుకు పోతాడు మొగాడు.

సీ! సీ! ఇప్పుడోళ్ళకి నీతి నేదు, జాతీ నేదు.

ఏటి సెప్తన్నానూ.... దాన్తో ఆర్నెలు వుండిపోనాడు. దాన్తో ఆర్నెల్లు కాపరం అంటే మాటలా?

అందులో అది మంచి స్టేండింగున్న ముండ మరింకేటుంది?

మనోడికి చట్టలు సాగిపోయి, నరాలు వుండిగిపోయి మంచె మొక్కీసినాడు. మంచమ్మీదే మోసుకొచ్చేరు సొంత యింటికి.

"ఈ మనిషికి ఇంత బుద్ధిలేకపోవడమేమిటి?" అని ఆ ఇల్లాలు మొగుడ్నే విసుక్కుంది. కాని అవతల ఆడదాన్ని ఒక్క మాట అన్లేదు.

అయినా దురద తీర్లేదు మనోడికి.

మళ్ళీ ఆర్నెలల్లో పులైపోనాడు, మళ్ళీ ఓ ఎలుగు ఎలగనా అనుకున్నాడో ఏటో ఆ ముండ మేడకి కాపలా ఎట్టినాడు.

ముప్పై మందిని మరిగిన ముండ చట్టలు సాగిపోయినా నా కోసం ఆర్నెల్లు ఆగుద్దా అన్న గేనం లేకపోయిందాడికి. ఈ రోజుల్లో కట్టుకున్న పెళ్ళాలే మొగుడు మూణ్నెల్లు మంచం ఎక్కితే మరోడితో పోతున్నారు.

మరింక దానికి యీడి లెక్కేమిటి?

మంచంమీద షావుకారున్నాడు.

మేడమీద షావుకారున్నాడు.

మూడు నెలలు గడిచేయి

ఈ లోపల ముండ నెల తప్పింది.

పగలు కడుపు సెయించీసుకొని రేత్తిరి దింపేసుకోవడానికి ఇప్పటి రోజులు కావు. ఇన్ని మందులూ లేవు.

ఇంతమంది డాక్టర్లూ లేరు.

ఇన్ని ఉపాయాలు లేవు.

మూడు ముళ్ళూ కట్టిన మొగుడ్ని ఆఫీసుకి పంపించేసి రంకు మొగుడ్ని యింటికి తెచ్చుకుంటున్నారు ఇప్పటి ఆడోళ్ళు.

కానీ నేను ముందే సెప్పేను కదా ఆ రోజులే వేరని.

నాను వయసులో వున్న ముండని, నువ్వెవడివి? ముప్పయ్యో మొగుడివి.

నీ ముందు ఇరవై తొమ్మండుగురుంటే, నీ తరువాత తొంభై తొమ్మండుగురుంటారు.

పోరా కోన్‌కిస్కా అని ఆ షావుకార్ని అగ్గీవచ్చు. కాని అలా చెయ్యలేదది.

ఆ రోజుల్లో ముండలక్కూడా నీతుండేది.

సీటీ రాసి నూతిలోకి గెంతీసినాది.

ఇంక సూసుకో నరిసిమ్మలు సంగతి.

అప్పటికి మూడ్నెల్ల నుండి కోడి పందెం కేసులూ, పేకాట కేసులూ తప్ప పెద్ద కేసొక్కటీ లేక ఆ బాబు జేబు ఎండి పోయిం దేమో, ఇంక జూసుకో నారాజా, సచ్చిన ముండకల్లో కబురెట్టి నట్టు మునసబు, కరణాలకంటే ముందు పరుగెత్తినాడు నూతి కాడికి.

ముండ ఒంటిమీదున్న పదితులా బంగారం కోరటు కంపాల జేబులో ఏసుకున్నాడు.

కోరటు అంటే ఆ బాబు జేబే.

పంచాయితీ చేసి శవాన్ని డాక్టర్లుకాడికి అంపినాడు.

ముండ యిల్లు తనిఖీ చేస్తే ముప్ఫై మందితోనూ అది తీయిం చుకున్న ఫోటోలు దొరికేయి. పోలీసోడ్ని అయినా నాకు సిగ్గే స్తోంది ఫోటోలు చూస్తే.

ఇంక జూస్కో మనోడి సంగతి.

ఆ ముప్పై మంది సావుకోర్లకీ ఒక్కసారి మొగుడై పోనాడు.

మామూలు మొగుడు కాదు.

రంకు మొగుడు.

రోజూ సీకటడగానే ఒక సావుకారుకి కబురెట్టడం సెల్ తలుపులు తియ్యడం.

సూడు షావుకారూ! ముండని వుంచుకన్నావు బాగానే ఉంది కానీ నువ్వు ఏటీ వడ్డీయాపారం సేస్తన్నావా? బూతు పుస్తకాలు రాస్తున్నావా? ఏటీ పోటోలు సిగ్గు, శరం వుండనక్కర్లా...? పోన్లే ఆటి సంగతలా వుంచు. ఏదో ఒళ్ళు తెలీని టయిములో సేసువు సరే.

ఇప్పుడు నిన్ను ప్రైవేటుగాను, మరో పావుగంటలో పబ్లిక్ గ్గానూ అడిగే ఇసయమేమంటే అది అంటే ఎవరు? నీ సాన్ది సావడానికి ముందు మూడు రేత్తిళ్ళూ నువ్వెళ్ళి దాన్ని అల్లరి పెట్టినావట.

ముండైనా నీతి గలది కాబట్టి నీ బాధ పడనేక నూతిలోకి గెంతేసినాదట... ఐతే.... దాని మొహం చూసి ఆర్నెల్లే అయిందో, ముక్కు మూసి మూడురోజులే అయిందో, నాకేటి తెల్సు....? అదిగో కాపలావాడు కోట్లో నీ ముక్కు గుద్ది మరీ సెప్తానం టున్నాడు–సావడానికి ముందు మూడ్రోజులు నువ్వుదాన్ని నానా అల్లరి పెట్టేవని.

కొట్లో తోసేడానికి నిమిషం పట్టదు.

బైటకి లాగడం బెమ్మతరం కాదు.

నువ్వల్లరి పడతానంటే నాను పెట్టనన్ను.

అదుగో సెల్.

తలుపులు కూడా తీసే ఉంది.

"లోనకెల్తావో, నేకపోతే యింటికెళ్ళి" మాట్లాడ్డానికి సిద్దమై వొస్తావో నీ యిష్టం" అనేవోడు.

ఏ షావుకారూ సెల్‌లోకి వెళ్లడానికి ఒప్పుకోలేదు. ఇలా ముప్పై మందిని జమాబంధీ చేసేక ముగ్గురు కూతళ్ళ పెళ్ళిల్లూ ఒక్క పందిట్లోనే జెస్సేడు నరిసిమ్ములు బాబు.

మరంచేత "నీతి ఏటంటే శవాన్ని వాడుకోలేని పోలీసోడికి ప్రమోషను వుండకూడదు" నీతోపదేశం అయిపోగానే హెడ్డు మళ్ళీ కళ్ళు మూసుకొని తపస్సులోకి వెళ్ళిపోయాడు.

ఏమిటి చెయ్యాలో తెలీని ఏడుకొండలు వర్షం చూస్తూ కూర్చున్నాడు.

"ఏటోరే అలా కునికిపాట్లు పడుతున్నావ్. నిద్దరొస్తోందా? రాదేటి వస్తాదిలే. ఏదో సామెజ్జెప్పినట్లు ఏకులు వడికి నట్టూ కాదు, మొగుడి పక్కల్లో తొంగున్నట్టూ కాదు అందిట వెనకటి కెవర్తో" అలాగున్నాయి మన బ్రతుకులు.

విక్రమార్కుడికి విసుగు రాకుండా భేతాళుడు కథ సెప్పే వాడు. ఏటే భేతాళుడెవరంటావా? ఇదిగో యిలాగే వుంటాయి మన సదువులు నాలాంటోడి దగ్గర నాల్నెల్లు ట్రైనింగవ్వు. నన్ను మించిపోకపోతే నన్నడుగు.

హెడ్డు ఓసారి కుర్చీలోంచి దిగి గుమ్మంవరకూ వెళ్ళి వర్షం పడుతోందో లేదోనని చెయ్యి పెట్టి మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చు న్నాడు. కాళ్ళు రెండూ టేబిలు మీదకు చాపి చేతులు రెండూ ఒకదానికొకటి రాసుకున్నాడు.

ఏడు కొండలు మాత్రం వర్షం వేపు చూస్తూ కూర్చున్నాడు.

ఆ వానలో అతనికేం కనిపించింది?

రోడ్డుమీద పరుగెడుతున్న కుక్కా?

స్టేషను వరండాలోల చూరుకి పెట్టిన పిచ్చిక గూట్లో నిద్ర పోతున్న పిచ్చిక పిల్లా?

స్టేషను అరుగువారని తడికి అటూ ఇటూ దొర్లుతున్న చిన్న … పిల్లా?

కాదు!

కానే కాదు!

ఏడుకొండలు! మరేమిటి చూస్తున్నాడయ్యా….

ఒక్క చక్కటి పల్లెటూరు.

ఒక చిన్న పెంకుటిల్లు.

చుట్టూ తోటలు, పంట కాలువలు.

ఆ కాలువల్లో పడవలు.

ఆ కాలువల్లో పది, పన్నెండేళ్ళ పిల్లలు వేస్తున్న కేకలు, ఈతకొడుతున్నారు.

వాళ్ళలో ఏడుకొండలు కూడా వున్నాడు.

ఆ సీను డిసాల్వ్ అయిపోయింది.

మరో సీను కనిపిస్తోంది.

మిట్ట మధ్యాహ్నం.

అంతవరకూ ఫెళ్ళున ఎండ.

అంతలో ఆకాశం కాటుక పెట్టుకున్నట్టు నల్లటి మబ్బులు, ఆకాశం బద్దలైనట్లు వాన.

భూమికి ఆకాశం ముత్యాల తలంబ్రాలు పోస్తున్నట్టు పడు తున్నాయి వడగళ్ళు.

ఏడుకొండలు, చెల్లెలు గిన్నెలు పట్టుకొని వానలో నడుస్తూ వడగళ్ళు ఏరుకున్నారు.

భూమ్మీద తుళ్ళుతున్న వడగళ్ళు మెరుపుల వెల్తురులో మల్లె పువ్వుల్లా వున్నాయి.

వాటిని ఏరి గిన్నెలో వెయ్యగానే కరిగి నీరైపోతున్నాయి.

ఆ కరిగిన నీటిని తాగేసి మళ్ళీ ఏరుతున్నారు.

రోడ్డంతా పిల్లలు, వడగళ్లు ఎవరెన్ని ఏరేరో లెక్కపెడు తున్నారు.

వెధవల్లారా! అలా తడిసి ముద్దయిపోతే రోగాలొస్తే ఎవరు చేస్తారు? లోపలికి రండి అని యింట్లో నుండి పెద్దవాళ్ళ కేకలు.

అయినా ఎవరూ వినడం లేదు.

ఎంత సంతోసం.

ఎంత సరదా.

ఏడుకొండలు మొహం సంతోసంతో వెలిగిపోతోంది.

ఆనందంతో మెరిసిపోతోంది.

కళ్లు మూసుకున్న హెడ్డుకి ఆ మెరుపు గాని, ఆ వెలుగు గాని కనిపించలేదు.

అలవాటుగా "ఏడుకొండలూ!" పిల్చాడు.

ఏడుకొండలు పలుకలేదు.

హెడ్డు కళ్ళు విప్పాడు.

ఏడుకొండలు మొహం తపస్సిది పొందినవాడి మొహంలా వెలిగిపోతోంది.

అతను పలకనందుకు కోపం వచ్చిన హెడ్డుకి అతని మొహంలోని మెరుపుకి ఆశ్చర్యం వేసింది.

"ఏడుకొండలు!" గట్టిగా అరిచాడు.

"సార్!" సమాధిలోనుండే పలికాడు.

"ఏం చేస్తున్నావు?"

"వడగళ్ళు ఏరుతున్నాను"

హెడ్డు గబుక్కున లేచి నిటారుగా కూర్చున్నాడు. వర్షాని క్కూడా భయంతో ఎముకల్లో చలేసింది.

కొంపదీసి వీడికి పిచ్చెక్కలేదు కదా!

లేకపోతే ఏ దెయ్యమైనా…

దెబ్బకి దెయ్యం జడుస్తుందట.

లాఠీతో ఏడుకొండలు వీపు మీద ఒక్క దెబ్బ వేశాడు.

దెయ్యం కాకపోయినా మైకం దిగిపోయింది ఏడు కొండలకి.

"పిల్చేరా సార్?"

"పిలవలేదు... అరిచాను నేనేదో నీకు నిద్రరాకుండా కథల్జె బ్దామను కంటే నువ్వేటి సావులోరులా సమాధిలోకెళ్ళి పోయేవు?"

"సెప్పండి సార్!" ఎటెన్షల్లో కూర్చున్నాడు ఏడుకొండలు.

హెడ్డు మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు నేనింకా గొంగళి పురుగు దశలోనే వున్నాను. అంటే నీలాగే కానిస్టేబిలన్న మాట. ఏవూరు చెప్మా...పేరు గుర్తుకు రావడం లేదు. కాని మాకొక కొత్తఎస్సై బాబొచ్చేడు. పేరు ఎంకట్రావు. అదే తొలి పోస్టింగు. ఆడు ఎలాంటి కుటుంబంలోంచి ఒచ్చినాడంటావేటి? ఆ బాబు తల్లి పొద్దున సూర్యుడ్ని చూస్తేగాని మంచి నీళ్ళు కూడా ముట్టేది కాదుట. ఆళ్ళ నాన్న పొద్దున రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు పూజ చేసేవాడుట. ఈ బాబు కూడా వచ్చిన కొత్తలో మహా స్ట్రిక్టుగా ఉండేవాడులే. మంచి గంధపు సెక్కకి సెదపట్టినట్టు ఈ బాబుని ఓ ప్రొఫెసరు బాబు పట్టేడు. శానామంది శానారకాలుగా పోలీసోడి స్నేహం చేస్తారు. ఆ ప్రొఫెసరు బాబు అన్నం కాడ కూడా మంచి నీళ్ళకు బదులు మందు తాగేవాడు. పోలీసోళ్ళకి తాగాలే కాని మందుకి లోటేమిటి? మనశాళ్ళు మనల్ని మందుతో ముంచెయ్యరూ? మరింక ఈ వెంకట్రావు ఎర్రిపేరు. అంచేత ఆ బాబుకి ఫ్రీగా మందు సప్లై సేసేవోడు. అంతే అడికో ఇద్దరు కూతుళ్ళున్నారు. ఎలాగుండేవోరనుకున్నా వేటి.

పైలా పచ్చీసులో వున్నారు.

పకడ్బంధీగా వున్నారు.

ఈ ఎర్రపేదు బాబు ఆ అమ్మాయిల కోసం ఆరింటకెళ్ళీ వాడు. జీపు నిండా పెట్రోలు పోసుకొని తల్లినీ, పిల్లల్నీ షాపిం గులకీ, సినిమాలకీ తిప్పేవోడు.

అక్కడితో ఆడికీ... కథోటుంది.

నెమ్మదిగా మందు అలవాటు సేసుకున్నాడు.

స్టేషనుకి రావడం మానేసినాడు.

ఓ పాలేటైందో తెలుసా?

తెలీదన్నాడు ఏడుకొండలు

ఆ బాబు ఏదో పార్టీకెళ్ళి ఫుల్‌గా మందుకొట్టేసి మోటారు సైకిలుపై అర్ధరాత్రి బయలెల్లినాడు. ఎలాగ? యిమానం స్పీడుతో, మధ్యదార్లో రోడ్డుపక్కన ఓ జెట్కావోడు గుర్రాన్ని విప్పేసి, బండీ కింద తొంగున్నాడు. మన బాబుకి రోడ్డే కనపడ్డేదు. ఇంక యీడూ, యీడి గుర్రం కనపడ్తాయా?

సక్కగా ఆ గుర్రాన్ని గుద్దేసి పక్కనున్న రాళ్ళకుప్పమీద పడ్డాడు. కుప్పెక్కడిదంటావా? అంతకు ఎడాది క్రితం మునిసిపాలిటీ వోళ్ళు ఆ రోడ్డు..ఏద్దావని ముందు రాళ్ళకుప్ప లేసారు.

ఆ బాబుకి ఒళ్ళంతా సీరుకుపోయింది.

గుర్రం సచ్చీసినాది.

"బండివాడే ఈ బాబుని లెగదీసినాడు."

ఏడుకొండలు లేచి గుమ్మం దగ్గరికెళ్ళి బయటకి చెయ్యి పెట్టి చూసి "వరసం తగ్గినాది" అన్నాడు.

"దాని సిగ్గోసిరి! తగ్గకేటి చేస్తాది?" ఏటి కథ అయిపోనాద నుకున్నావేటి. యిప్పుడే మొదలైంది. ఆ మార్నడు పొద్దుటే ఆ ఎస్సైబాబు బండి వోడ్ని యీడుసుకొచ్చి లాకప్పులో పడేసాడు. ఆ బండీవోడే తాగీసి తనని గుద్దేసినాడని ఎఫ్ఫైఆర్ గుద్దీసినాడు.

ఇంక సూడు...

ఆ బండివాడు ఒకటే ఏడుపు.

"గుర్రం సచ్చి నానేడుస్తుంటే ఈ లాకప్పులేవిటి?" అని గోల?

అడివిలో అమ్మా అంటే పెద్దపులైనా వొస్తాదేమో కాని పోలీస్ స్టేషన్లో ఏడిస్తే ఎవడూ రాడు. ఆడ్ని అలా రెండ్రోజులు లాకప్పులో వుంచేసరికి ఆడి పెళ్ళాం పుస్తె పూస అమ్ముకొని, ఎస్సైకి చదివించుకొని అడ్ని విడిపించుకు పోనాది.

అవిరా బాబూ మన పోలీసోళ్ళ అరాచకాలు.

"దీన్ని బతుకంటారేటి?" గొణుక్కున్నాడు ఏడుకొండలు

ఏటా గొణుగుడు? ఔనుగాని ఒరే ఏడుకొండలూ! ఊర్లో అంతా ఒక్కసారి గాంధీగోరి శిష్యులై పోనారేట్రా? ఒక్క కేసూ రానూలేదు. అందరూ మంచోళ్ళైపోతే యింక మనవెందుకూ? బాధపడ్డాడు హెడ్డు.

ఏడుకొండలుకి నవ్వొచ్చింది.

మనం తప్ప అంతా మంచోళ్ళే. మనకేటి జనానికి మంచి సేస్తున్నావేటి? దొంగని పట్టుకుంటున్నావా? ఖూనీకోరుని పట్టు

కుంటున్నావా? ఎవడో తలమాసినవాడ్ని పట్టుకోవడం డబ్బు తీసుకోని ఒగ్గీడం అంతే మనం సేస్తున్నాం రోడ్డుమీద అడుక్కునే వాడి దగ్గర కూడా మామూలు వసూలు వేస్తాం. మనం ముష్టి వాళ్ళం కూడా కాదు. వీర ముష్టివాళ్ళం.

డబ్బుకి బానిసలం!

డబ్బున్నవాడి చెప్పులు తుడుస్తాం!

లేనివాడ్ని చెప్పుతో కొడతాం!

సీ, స్సీ అసలు మనవీ బతుకులేనా?

అసలు మన పెళ్లాం పిల్లలు బాగుపడతారా?

"మనకి పుట్టగతులుంటాయా?" బాధపడ్డాడు ఏడు కొండలు

ఉండవు డిక్లేర్ చేశాడు హెడ్డు. అందుకేనేమో ఓ జడ్జి గారు నాతోనవ్వుతూ అనేవారు ఎవయ్యా హెడ్డూ! నరకం అనేదే వుంటే పోలీసు వాళ్ళకి స్పెషల్ నరకం ఏదయినా వుండాలయ్యా అని.

"మనిద్దరం జాయింటు డూటే ఎన్నాళ్ళ నుంచి జేస్తన్నా వురా?" తపస్సులోంచే అడిగాడు హెడ్డు.

మూఁడ్రోజులు అన్నాడు ఏండుకొండలు.

"మూఁడ్రోజుల్లోను ఏటి ముట్టినాయిరా మనకి?"

మీకో ఛార్జీ అన్లేదు ఏడుకొండలు.

"ఇలాగయితే మరింక మనం సర్వీసేం చేస్తాం? సంసా రాలేం లాగుతాం?" అన్నాడు హెడ్డు, పోలీసులకి లంచాలు ముట్టకపోతే ప్రపంచం ఆగిపోతుందన్నట్టు.

ప్రపంచం ఆగిపోలేదనడానికి నిదర్శనంగా అదే టైముకి బయట సైకిలు గంట వినిపించింది.

మురళీరవం విన్న గోపికల్లా గంట విన్న హెడ్డూ, ఏడు కొండలూ ఆనందంతో వికసించారు.

కృష్ణుడి కోసం గోపికల్లా ద్వారం వేపు ఎదురు చూశారు.

గోపికలకి కృష్ణుడు కనిపించాడో లేదో తెలీదు కాని వాళ్ళకి మాత్రం అస్పత్రి వార్డుబోయ్ కనిపించాడు.

కృష్ణుడి బదులు కీచకుడ్ని చూసిన గోపికల్లా ఇద్దరూ భయ పడ్డారు. "ఈ వొరసంలో ఇప్పుడు డైయింగ్ డిక్లరేషన్‌కి ఎళ్ళాలో ఏటో?" అని "ఎమ్మెల్సీ" ఎట్రా దేవుడా? మనసు లోనే మూలి గాడు హెడ్డు.

వార్డ్‌బోయ్ సరాసరి హెడ్డు దగ్గరికి వెళ్ళాడు.

సంతకంపెట్టండి అన్నాడు కాగితం యిస్తూ.

"బాబూ ఏడుకొండలూ! ఆ డ్రాయిర్లో నా కళ్ళద్దాలుంటాయి. అందుకో.. కళ్ళద్దాలేకపోతే ఎంపీకి ఎమ్మెల్యేలకి భేదం తెల్దునాకు అని ఏడుకొండలుకి పురమాయించి ఎపుడూ బాబూ మీ డూటీ డాట్రూ అని వార్డు బోయ్ని పలకరించాడు.

సిరాజుద్దీన్!

"అనుకున్నాన్లే ఆ బాబేనని. ముందుటేడు సెషన్స్ కొరటుతో మొట్టికాయలు తినేసేక మరింక తేలుకుట్టినకేసులో కూడా పోలీసోళ్ళకి మెమో గుద్దేస్తున్నాడు. ఇక్కడ మేమేదో పెళ్ళాన్ని పట్టుకొని స్టేషన్లో తొంగొని సుకపడిపోతున్నట్లు"

ఏడుకొండలు అద్దాలవేట అయిపోయింది.

"డ్రాయర్లో అద్దాల్లేవు" ఫలితం చెప్పేడు.

"ఇంటికాడ మరిసిపోయినావో ఏటో దేవుడా! లోపల ఎద కరా బాబూ "ఏడుకొండల్ని పురమాయించి "ఇంతకీ కేసేటి?" అని వార్డుబోయిని అడిగాడు.

"ఎవుర్తో గుంట తలమీద దెబ్బుంది. ఒంటిమీద తెలివి నేదు. బట్టలు తడిసిపోయాయి"

"రచ్చించినావ్ ఏన్నేంళ్లుంటాయి గుంటకి?"

బుర్రగోక్కున్నాడు వార్డుబోయ్. ఎంత గోక్కున్నా ఆ గుంట వయసు దొరకలేదు.

"ఏమో! గుంట మాత్తరం జబర్‌గానే వుంది"

హెడ్డు మొహంలో ఓ మెరుపు మెరిసింది.

ఏడుకొండలు గుండెలో ఓ పిడుగు పడింది.

"గుంట జెబర్‌గా వుంది. ఒంటిమీద తెలివిలేదు. కాని గుడ్డలు తడిసిపోయాయి. తలమీద దెబ్బ వుంది"

మరింక డౌట్ నేదు.

అయితే సూసైటు.

"కాకపోతే ఎటెమ్ట్ టు మర్దరు."

తీర్పు చెప్పాడు హెడ్డు.

అతని తీర్పుని కోర్టులో కేసు పెట్టేక కావాలంటే - కాద నొచ్చు కాని అంతవరకు ప్రైమినిష్టరుకి పార్లమెంటుకి కూడా కాదనే హక్కు లేదు.

"ముసురజెప్పి ఎవుడ్నో ముద్దెట్టేసుకుంటూ వుంటే తల్లో, తండ్రో సూసి, తగల్నిచ్చుంటారు. నేకపోతే సినిమాలో హీరో యిన్లా నెగదీసుకుపోతానన్న నంజికొడుకు రాకపోతే ఏ నూతి లోకో గెంతేసుంటాది" తీర్పు తరువాత ఆర్గ్యుమెంటు చెప్ప బోయేడు హెడ్డు.

"అద్దాలు మీ కుర్చీకిందే వున్నాయ్."

ఇచ్చాడు ఏడుకొండలు.

"పక్కలో మొగుడ్ని పెట్టుకొని పక్కింట్లో ఎదికిందట ఎనక టికో ఇల్లాలు. అలాగుంది మన పని. నువ్వూ ఒస్తావేట్రా ఏడుకొండలూ! రా పోనీ. మూడ్రోజులై నాతో పాటు నూతిలో పడ్డ శవం నాగ పళ్ళికగ్గట్టు కూర్చున్నావు .... పద... పద.... మన సెంట్రేలు లాకప్పులోంగున్నట్లున్నారు. లెగ్గొట్టు సైకిలు మీద పోనల్సిందేనా రిక్షావాడెవడన్నా వస్తున్నాడేటో చూడు.

చూశాడు ఏడుకొండలు.

వీధంతా స్మశానంలా నిర్మానుష్యంగా వుంది.

సైకిళ్ళ మీదే బయల్దేరారు ముగ్గురూ.

❖ ❖ ❖

ఊరికి దూరంగానూ, స్మశానికి దగ్గరగానూ వున్న ఆ బంగళా ఒకప్పుడు బ్రిటీష్ వాళ్ళు కట్టించారు. వాళ్ళ ఆపీసర్లు కేంపుకి వచ్చినప్పుడది గెస్ట్‌హౌస్‌గా వాడేవారు. ఇప్పుడది ప్రభుత్వాసుపత్రి.

ఆ ఆసుపత్రిలో ఆపరేషను థియేటరుంది. ఆపరేషను అవసరమయ్యే పేషెంట్లు వుంటారు. ఆపరేషను చేసే సర్జను మాత్రం వుండడు అంచేత ఏ సర్జరీ కేసొచ్చినా హైదరాబాదు పంపించేస్తారు.

ఎక్స్‌రే కూడా ఉంది. అదెప్పుడూ రిపేరులోనే ఉంటుంది. అది రిపేరులో ఉండడానికీ, ఊళ్ళో వున్న శుశ్రూతలేబ్‌కీ ఏదైనా సంబంధం వుందేమోనని కొందరి అనుమానం. ఆ టెక్నీషియన్ జీతం తీసుకుంటూ, సిస్టర్స్‌తో బాతాఖానీ కొడుతూ వుంటాడు.

అక్కడ ఇద్దరు ఆడ, ఒక మొగ వెరశి ముగ్గురు డాక్టర్లున్నారు. నాలుగో ఖాళీలో ఏ సర్జనూ లేడు. డాక్టర్లకి డ్యూటీలు వెయ్యటం, శలవులివ్వటం, మందులు తెప్పించడం వగైరాలన్నీ సీనియర్ డాక్టరు పేరిందేవి చేస్తుంది.

పేరిందేవికి జబ్బులంటే అసహ్యం, రోగాలంటే రోత, ఆస్పత్రి అన్నా పేషెంట్లు అన్నా ఆవిడకి జుగుప్స.

మరైతే మెడిసిన్ ఎందుకు చదివినట్టు? పేరిందేవికి చిన్నప్పటి నుండి ఇండియా అంటే యిష్టం లేదు. "ఏముందిక్కడ? దరిద్రం తప్ప" అంటుంది.

అమెరికా అంటే అభిమానం.

అమెరికాలో సెటిలవ్వాలని ఆశ.

మిగతా ఉద్యోగాల కంటే డాక్టరైతే ముఖ్యంగా లేడీ డాక్టరుకి ఆమెరికా వెళ్ళటం తేలిక అని చాలా మంది చెప్పేరావిడకి. ఆమెరికా పెళ్ళి కొడుకులంతా లేడీ డాక్టరునే ప్రిఫర్ చేస్తారుట.

పైగా రూపాయి కట్నం లేకుండా ఎగరేసుకుపోతార్ట అని కూడా చెప్పారు.

ఈ ఆశలన్నీ మెడిసిన్ చదవించాయి.

మెడిసిన్ చదవడానిగ్గాను, డాక్టరు ఉద్యోగం సంపాదించడానిగ్గాను ఆవిడ ఏ మాత్రం కష్టపడలేదు. ఆవిడ మేనమామ యూనియవర్శిటీ సిండికేట్ మెంబరవటం వల్ల. ఆవిడ కష్టమంతా అమెరికా ఉద్యోగానిక్కావల్సిన పరీక్ష పాసవడం దగ్గరే. ఆ పరీక్ష మాత్రం ఏ మేనమామా పాస్ చేయించలేకపోయాడు. ఏ పెళ్ళికొడుక్కీ ఈవిడ నచ్చలేదు.

అంచేత ఆవిడ అమెరికా ప్రయాణం అవలేదు. పెళ్ళీ అవలేదు.

ఫారినే వెళ్ళాలనుకుంటే అరేబియాలు, ఆఫ్రికాలు అవలీలగా వెళ్ళిపోవచ్చు. ఏ పరీక్షలూ పాసవ్వక్కర్లేదు. అయితే ఆవిడకి ఇండియా అంటే ఎంత అసహ్యమో ఆ దేశాలన్నీ అంతే అసహ్యం. అంచేత కాలక్షేపం కోసం ఉద్యోగం చేస్తోంది.

మరో డాక్టరు శ్యామల ఈ మధ్యే చదువు పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. ఈ అమ్మాయికి వైద్యం అంటే వేదంతో సమానం.

అన్నిటికంటే ముఖ్యమైనది ఇండియా అంటే అపరిమితమైన అభిమానం.

మనది పెంకుటిల్లని చెప్పి పక్కింటి మేడలో ఎన్నాళ్ళుంటాం? ఉన్న దాట్లోంనే సుఖంగా గడపటం అలవాటు చేసుకోవాలి అన్నది ఈవిడ ఆశయం.

ఈ అమ్మాయికి ఫారిన్ అంటే యిష్టం లేదు సరికదా ఫారిన్ వెళ్లే ... పురుగుల క్రింద చూస్తుంది. ఈ అమ్మాయి గురించి చెప్పడానికి రెండు మాటలు చాలు.

మనిషిగా మంచిది.

డాక్టరుగా అతిమంచిది.

మూడో డాక్టరు సిరాజుద్దీన్.

ఇతను మంచి డాక్టరనిపించుకోవాలన్న కోరికే గాని ప్రయత్నం లేదు. నేడో, రేపో గల్ఫ్ వెళ్ళిపోతారు.

పోలీస్ పార్టీ ఆస్పత్రి చేరేసరికి మహాలక్ష్మికి ఇంకా తెలివి రాలేదు.

ఆ రాత్రి సిరాజుద్దీన్ డ్యూటీ.

అతను మహాలక్ష్మికి వైద్యం చేస్తూనే వున్నాడు.

వరండాలో ఆమె తండ్రి నారాయుడు మునుగుల మీద తల పెట్టుకొనికూర్చునే ఉన్నాడు.

పేర్రాజు ఆ వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తూనే వున్నాడు.

ఖూనీ కేసులో శవాన్ని ప్రశ్నించక్కర్లేదు. అదే సూత్రాన్ని దెబ్బలాట కేసులో కూడా పాటిస్తాడు హెడ్డు. సాధ్యమైనంత వరకు దెబ్బలు ఉన్న వాళ్ళని ఆఖర్న అడుగుతాడు.

పేర్రాజు నిజమే చెప్పాడు.

"మైకంతో ఒళ్ళు తేల్నేదు. అసలు పిల్ల పడిపోయీ వొరకూ నా కేటి సేస్తన్నానో నాకే తెల్దు. తాగిన కళ్ళకి నచ్చిందేవి లాంటి పిల్ల పిశాచంలాగ అగుపడ్డాది" బోరుమన్నా నిజమే చెప్పాడు నారాయుడు.

తండ్రి మీద బలమైన కేసు గుద్దొచ్చు.

పేర్రాజుని లవర్‌గా ఇరికిస్తే

హెడ్డు మనసు ఒక్క నిమిషం ఊగింది. కాని పేర్రాజు అతనికి బాగా తెలుసు.

చదువుకున్నవాడు. రిక్షా యూనియన్ ప్రెసిడెంటు.

అలాంటి వాడ్ని ఏ నక్సలైటు కేసులోనే ఇరికిస్తే బావుంటుంది.

ఇలాంటి ముండమోపి కేసుల్లో ఇరికిస్తే ఊరేగింపులు రావచ్చు. రోజులు బావులేకపోతే (అసలే తన రోజులు బాగా లేవు) తనమీద దెబ్బకొట్టవచ్చు. వీడ్ని వదిలేసినంత మాత్రాన తనకేం నష్టం వుండదు. డాక్టరు సహకరించాలే కాని ఎటెమ్ప్టు మర్డర్ గుద్దెయ్యొచ్చు.

ఈ సిరిజుద్దీన్ తిక్క ముండావాడు. ఆలోచన అయిపో యింది హెడ్డుకి. వెంటనే ఆచరణలో పెట్టదల్చుకున్నాడు. ఏదైనా అనుకున్న తరువాత మరింక ఆలశ్యం చెయ్యడం అతని అల వాటు కాదు మరంచేత.

పేర్రాజు బాబూ, నువ్వు ఆ పిల్లకాడుండు. ఇతగాడ్ని స్టేషన్‌కి తీసికెళ్ళాల. నేనూ పిల్లలు గలవాడ్నే.నాకేవో ఒగ్గేయ్యాలనే ఉంది. నానేటి సేస్తాను? పద్దతి అలాగుంది. అయితే యిప్పటి వరకు ఎటెమ్ప్టు మర్డరు కిందే వస్తాది. ఈడదృష్టం బాగులేక ఆ గుంట కునికీసిందనుకో మాత్రం మరి మర్డరు కేసే అవుద్ది, ఏమో ఆ గుంట బతకూడదేమిటి అని మొత్తగా మాట్లాడి నారాయుడ్ని స్టేషనుకి తీసుకెళ్ళి లాకప్‌లో పెట్టి తిరిగొచ్చేసరికి మహాలక్ష్మికి తెలివొచ్చింది.

ఆమెకేం ప్రమాదం లేదు. తగిలిన దెబ్బ కూడా చిన్నదే. మైకంవల్ల గాభారా పెట్టింది ఎందుకైనా మంచిది ఈ రాత్రికి ఇక్కడే వుంచి పొద్దునే తీసుకెళ్ళండి అన్నాడు సిరాజుద్దీన్ పేర్రాజుతో.

తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు పేర్రాజు. పళ్ళు బిగబెట్టి నిట్టూ ర్చాడు హెడ్డు. రోటీన్‌గా నాలుగు ముక్కలడిగాడు మహాలక్ష్మిని.

ఆ పిల్ల నిజమే చెప్పింది. మరింక కేసేవుంది?

అక్కడే వుంది గమ్మత్తు ఈ కేసుని ఎలాగైనా వదలకూడద నుకున్నాడు హెడ్డు. వదల్లేదు.

పేర్రాజుకి ఆ పిల్లకి కాపలా పెట్టి స్టేషనుకి తిరిగి వచ్చాడు హెడ్డు. రాత్రి ఒంటిగంట రాటింది.

కానిస్టేబుల్స్ అంతా నిద్రమత్తు వదలి హుషారుగా వున్నారు.

"గుంట కునికేసిందా" ఆశగా అడిగాడు ఏడుకొండలు.

గజ్జెల గుర్రంలాగుంది. కాస్సేపు నువ్వు నోర్మూసుకో ఆడ్ని తీసుకురండి ఆజ్ఞ వేశాడు హెడ్డు.

వాడిని తీసుకొని వచ్చాడు. వాడు తలొంచుకునే వున్నాడు.

కళ్ళ నుండి కారుతున్న నీళ్ళు పాదాలను తడుపుతున్నాయి.

కన్నీళ్ళు వెచ్చగా వున్నప్పటికీ కాళ్లు వణుకుతున్నాయి.

కాళ్ళతో పాటు మనసూ వణుకుతోంది.

తనమీద తనకే అసహ్యం వేస్తోంది.

ఆ అసహ్యం..... అదుగో తన వేపు చూస్తూ తనని అపహాస్యం చేస్తోంది.

తనింక చూడలేదు.

వాడు మొహానికి చేతులడ్డం పెట్టుకున్నాడు.

"నీ కూతురికింకా తెలివి రాలేదు. ఏటేద్దో సెప్పలేం అంటు న్నాడు దాట్రు" హెడ్డు హెచ్చరించాడు.

ముక్కు మీద వేలేసుకున్నాడు ఏడుకొండలు.

"సెబాస్ హెడ్డుబాబు, సెబాస్ నువ్వు నరిసిమ్ములు బాబుకి తాతవైపోనావు. గునపంలాగున్న గుంటని పట్టుకొని ఏటొద్దో ఏటో అంటావా? ఆ ముసలాడ్ని అంత బాధ పెట్టిన నీకు ఏ నరకం వొస్తాదో?" మనసులోనే తిట్టుకున్నాడు ఏడుకొండలు.

తనని అక్కడే అలాగే ఉరితీస్తే బాగుండుననిపించింది నారాయుడికి.

"పిల్ల సచ్చిపోయే లోపల ఒక్కసారి... ఒక్కసారి సూడ్నీ బాబూ సచ్చి నీ కడుపున పుడతా! నన్నడ్కడికి తీసుకెళ్ళు.." అంటూ ప్రాణం పోయిన వాడిలా అక్కడే కూలబడి హెడ్డు కాళ్ళు చుట్టు కున్నాడు.

"బాబూ! హెడ్డు బాబూ! నానేటి అడగను నామీద కూనేకే సెట్టి ఉరితీయించు. నేకపోతే – అదుగో – నువ్వే ఆ తుపాకీతో కాల్సిసంపే. నా లాంటి తాగుబోతులు బత క్కూడదు. బంగారం లాంటి పిల్లని బుగ్గిసేసుకుంటున్నాను. పదేళ్ళకాన్నించీ అది పిల్లని మావూ మర్సిపోనావు అదీ మర్సిపోనాది.

మంచం పట్టిన తల్లికి తలైపోనాది.

తల్లీకి, తమ్ముడికీ, నాకూ సాకిరీ చేసింది.

అది సాకిరీ సెయ్యటానికే పుట్టిందనుకున్నానే తప్ప అది కూడా పసిపిల్లని కాసుకోలేకపోయేను. తాగుబోతు ముండా కొడుకుని. నాను తాగగా మిగతా డబ్బులు దాని యదాన కొట్టేనే తప్ప అది ఆ డబ్బుతో గంపంత సంసారం ఎలా నెట్టు కొస్తాదోనని ఆలోసనే నేదు.

నామీద కేసెట్టు. ఒద్దనను.

నన్ను ఒగ్గేమని కూడా అడగను.

"ఆ గుంట సచ్చీపోయే లోపల ఒక్కసారి సూడ్నీ బాబు నీ కాళ్ళట్టుకుంటాను. కాదనకు హెడ్డు బాబూ అంటూ అతను రాళ్ళూ, కళ్ళూ కరిగిపోయేటట్లు" ఏడిచాడు.

యముడిక్కూడా ఏడుపు వచ్చేటట్టు బ్రతిమాలాడు.

ప్రత్యక్షమైన పరమేశ్వరుడి కాళ్ళు పాపి పట్టుకున్నట్టు అతి దీనంగా పట్టుకున్నాడు హెడ్డు కాళ్ళు.

అతను పాపి అయినా కాకపోయినా హెడ్డు మాత్రం పరమే శ్వరుని కాదు.

అంచేత "ముందా కాళ్ళు ఒగ్గీ" నాన్చెపుతాను అన్నాడు హెడ్డు కళ్ళజోడు పెట్టుకుంటూ.

"నీలాటోడేనట నీకు ఉరేసేఁరా అంటే" ఒక్కపాలి వూరేగిం చండి అన్నట్టు. ఆస్పత్రికి తీసుకెళ్ళాలటోయ్ ఈ దొరగార్ని? యింకానయం ముండింటికి తీసికెళ్ళమన్లేదు. ఇనండోయ్ నీకేసేటో తెల్సా? నిను లాకప్పులోంచి ఒగ్గితే నా ఉద్యోగం, మాయాడదానితాడు ఒక్కపొర వూడిపో తాయి....ఒరే ముందీడ్ని నిలబెట్టండి. కొండచిలవలా సుట్టేసినాడు నా కాళ్ళు.

కానిస్టేబుల్స్ వాడ్ని నిలబెట్టారు.

వంగిపోతున్న వాడి కాళ్ళు వాడి బరువు మొయ్యలేక పోతు న్నాయి. వాడు మూర్ఛపోయి కిందపడిపోయాడు.

"ఈ తాగుబోతు నా కొడుకు స్టేషన్లో కునికేస్తాడో ఏటో. కొంపతీసి ఈడుగాని సస్తే పోలీసోళ్ళే సంపేసేరని లాకప్ డెత్ కేసు, ఎంక్వైరీ, ఓరినాయనో! ఏం దాఁరా భగవంతుడా" అని గాభరాపడిపోయాడు హెడ్డు.

ఇంతలో...

భక్తుడ్ని రక్షించబోయే భగవంతుడిలా కొంచెం కళ్ళు తెరి చాడు నారాయుడు.

అంతవరకు గుప్పెట్లో వున్న ప్రాణాలు మళ్ళీ గుండెలోకి వెళ్ళినాయి హెడ్డుకి.

"అమ్మయ్య యీడు సావనేదు. ఒరేయి టూట్వంటీ నువ్వెళ్ళి ఈడికి "టీ" అట్టుకురా అంటూ ఓ కానిస్టేబుల్ని "టీ"కి పంపిం చాడు.

కళ్ళిప్పిన వాడికి పసిపిల్లకి తల్లిపాటు పట్టినట్టు అతి జాగ్ర త్తగా "టీ" పట్టాడు.

వేడి వేడి టీ తాగిన వాడు కొంచెం సత్తువ వచ్చి లేచి కూర్చున్నాడు.

వాడు పూర్తిగా కోలుకున్నాడన్న ధైర్యం వచ్చాక హెడ్డు వాడికి పరిస్థితి వివరించాడు.

"ఆ పిల్లగాని సస్తే ఎలాగూ మర్డరు కేసే, అది బతికినా ఎటెమ్ప్టు టు మర్డరు. అంటే కూనీ కేసు,నక్సలైట్ కేసూ తరువాత యిదే పెద్ద కేసు"

నీ దురదృష్టం బాగుండి నీ కూతురు బతికి బట్ట కట్టిందనుకో

యిప్పుడు నీ మీద కేసెట్టి నిన్నురాజమండ్రి కట్టిచ్చేస్తే నాకే ట్నాబం? సావుతప్పి ఇంటి కొచ్చిన నీ కూతు రేటైపోవాల?

అందుకే యింకా కాయితం నలుపు సెయ్యనేదు... నా నూరుకున్నా సబిన్సుస్పెక్టరు వూరుకోడు.

అడసలే మంచోడు కాదు.

రావణాసురుడి అన్న...

యముడికి బాబు...

మోటుగా సెప్పాలంటే తల్లికి మొగుడు.

ఆ బాబు పెట్టిన కేసులో ఉరిశిక్ష పడినా ఆ బాబుకేం సంతుష్టి ఉండదు.

ఆడ్ని ఉరితీసినప్పుడు తను దగ్గరుండాలి.

ఆ రాత్రి సుకంగా నిద్దరపోవాల.

అదీ ఆ బాబు గుణం.

రేపొద్దున వొర్సంవల్ల సూర్యుడైనా రాడో ఏటో గాని ఆడు మాత్తరం స్టేషనుకి రాకమానడు.

మరంచేత "ఆ బాబు వచ్చేలోగా ఈ రేత్తిరే యీ యవ్వారం సెటిలైపోవాలన్న మాట."

అన్న మాటకాదు.

తమ్ముడి పాట కాదు.

వ్యవహారం సెటిలవడం అంటే ఏమిటో నారాయుడి అర్థం కానేదు. "పిల్లనోసారి సూపించి అనక మీ యిష్టం వొచ్చినట్టు చేసుకోండి. అని నానేడుస్తుంటే యవ్వారం అంటా రేంటి?"

ఆ మాటే మొరపెట్టాడు.

అయితే ముందుగా తన కూతురు బతికి బట్టకట్టాలని ముక్కోటి దేవతలకు మొక్కుకున్నాడు.

"అమ్మా! కనకమాలచిమీ! నా బిడ్డ బాగుంటే నీ కాడకి తీసుకొస్తా" నీకు కొత్త కోక కొంటాను. ఈశెడు పసుపు, ఈశెడు కుంకుమ నీకు పోస్తాను.

తల్లీ అనకాపల్లి నూకాల్తల్లీ! నా బిడ్డనేం సేయకు కొత్త మాసంనాడు నీక పండుగ సేస్తాను. నీకు ఉపారం ఎడతాను.

కోడినిస్తాను....

కోకనిస్తాను....

తల్లీ నా బిడ్డనేం సేయకు.

అమ్మా! గవిరమ్మా! నా బిడ్డ పెళ్ళి నీ గుడికాడే సేస్తాను.

నీ పేరే పెట్టుకుంటాను. నాను సేసిన తప్పుకి నా పిల్లని సిచ్చించకమ్మా.

అబం శుభం తెలియని పిల్ల....

నీ కాకలిగా ఉండే నన్ను మింగే తల్లీ...

నాను ఎవరికీ పనికిరాను...

ఎందుకూ పనికిరాను...

నానున్నా ఒకటే నేకపోయినా ఒకటే....

మీ అందరికీ కోటి దండాలు...

దేవుళ్ళకి మొక్కడం అయిపోయింది.

నారాయుడు హెడ్డుకాళ్ళు పట్టుకున్నాడు.

"బాబూ హెడ్డు బాబూ! ఒక్కపాలంటే ఒక్కపాలి నా పిల్లని చూపించు. ఆ తరువాత నన్ను జైలుక్కట్టే...

ఊదేసే.....

నిప్పుల్లో తోసీ.....

ముక్కలుగా నరికి, కాకులకీ, గెద్దలకీ ఏసీ...

నాలాటి తాగుబోతెదవకి ఏ సిచ్చ ఏసినా తప్పులేదు.

నేకపోతే నాను తాగడవేఁవిటి?

దేవతలాంటి పిల్లని కొట్టవేంటి?

అది సావు బతుకుల్లో వుండడవేఁటి?

ఏటి బాబూ యిదంతా?

నాకేతే అరదం కావడం లేదు.

నాబొట్టె బతికితే ఇంటికాడ దింపేసి వస్తాను.

సచ్చిపోతే బుగ్గిచేసి వస్తాను.

అసలు నాలాటోళ్ళకి కేసులు, కోరటులు, శిచ్చలు ఏటి బాబూ?

అల్లదుగో అక్కడ తుపాకీ వుంది కదా ...

దాన్తో కాలిసిపారేయండి.

నాలాంటి తాగుబోతు నంజకొడుకులందర్నీ పిట్టల్ని కాల్సి నట్టు కాల్సిపారేయండి.

అప్పుడయినా మా పెళ్ళాం పిల్లలా పిడికెడు వణ్ణం తింటారు.

గలాసుడి గంజినీళ్ళు తాగుతారు.

బాబూ! నా మాటినండి....

ఒక్కపాలి ఒగ్గండి...

నాను తప్పకుండా వస్తాను...

అప్పుడు సంపేయండి.

అని అలనాడు ఆవుని పులి చంపబోతే... ఆవు తన పిల్లకి పాలిచ్చి మళ్ళీ వస్తానని పులిని బ్రతిమాలింది. ఆ పులి కేవలం ఆకలి తీర్చుకోవడానికే చంపుతోందితప్ప దుర్మార్గం వల్ల, పగవల్ల కాదు అంచేత ఆ పులి తన ఆకలిని కొంతసేపు వాయిదా వేసి ఆవు మాటనమ్మి వెళ్ళి రమ్మంది.

నారాయుడు ఆవుకంటే నెమ్మదయినవాడు.

ఆవుకంటే దైన్యంగా బ్రతిమాలాడు.

కానీ ఆ హెడ్డు పులి కాదు.

అంచేత పులిలో ఉన్నపాటి దయకూడా లేదు.

ఆ హెడ్డుపులికంటే దుర్మార్గుడు.

స్వార్ధం అతని వూపిరి.

దోపిడీ అతని వృత్తి.

అంచేత అతనికి నారాయుడి మీద ఏ మాత్రం జాలికలగ లేదు సరికదా విసుగొచ్చింది.

కోపమొచ్చింది....

దొరక్క దొరక్క ఈ కేసు దొరికితే ఇందులో పదో, వందో, రెండొందలో బొక్కురుదావనుకుంటే వీడేవిటి చంపేమంటాడు. వీడ్ని చంపితే మాకు వచ్చేదేవిఁటి?

పోలీసులు ఫలానావాడ్ని స్టేషన్లో కొట్టి చంపేసారన్న వార్త పేపర్లో హెడ్‌లైన్స్ వేసేస్తారు.

లాకప్‌డెత్....

అసెంబ్లీలో అపోజిషన్ గోల....

డ్యూటీలో ఉన్నవాళ్ళని సస్పెన్షన్...

ఇంతా చేస్తే ఆ చచ్చినవాడి మీద జాలితో కాదు.

ఎవరూ వాడి కుటుంబానికొక రూపాయి కూడా దానం చేయరు.

పేపర్‌లకి వార్తలు కావాలి.

అపోజిషన్‌కి అరవడానికో పాయింటు కావాలి.

ఏ రిటైర్డ్ జడ్జీనో ఎంక్వయిరీ కమీషన్.

(ఈ మధ్య జడ్జీలంతా కమీషన్‌ల కోసం కాసుక్కూర్చుంటున్నారు)

అంతే!

అక్కడితో గరవ్నమెంటు బాధ్యత అయిపోయి చేతులు దులిపేసుకుంటుంది.

పత్రికలు, ప్రజలు ఆ కమీషన్ సంగతే మరచిపోతారు.

కమీషన్ మాత్రం అలా సాగుతూనే వుంటుంది.

జడ్జీలు జీతాలు పుచ్చుకుంటూనే వుంటారు.

ఒరే నారాయుడూ! నిన్ను చంపటం వెనుక ఇంత కథ వుందిరా నాయనా!

నారాయుడికి గుండె ముక్కలయిపోతోంది.

"అవతల బొట్టె ఏటైపోనాదో భగవంతుడా" మనసులోనే ఏడుస్తున్నాడు.

"బాబూ! నాకేతే అరదం కావడం లేదు"

హెడ్డు లేచి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

తరువాత ఏడుకొండల్ని దగ్గరకి రమ్మని సంజ్ఞ చేశాడు.

దగ్గరగా వెళ్ళాడు ఏడుకొండలు.

"వీడ్ని అడవిలోకి తీసుకెళ్ళి చెట్టుక్కటి కాల్చిపారే" అని చెప్పి అంత నెమ్మదిగా, రహస్యంగా..

"వీడ్ని బయటకు తీసుకెళ్ళి వ్యవహారం సెటిల్ చెయ్యి. ఇంక మళ్ళీ ఈడు నా కంటబడకుండా సూడు, నా బుర్రతా తినేశాడు" అని ఏందుకొండలుకి పురామాయించాడు.

ఏడుకొండలు నారాయుడ్ని చెయ్యి పట్టుకొని లేవదీసి నిల్చో పెట్టి పడిపోకుండా పట్టుకొని బయటకి తీసుకెళ్ళాడు. స్టేషన్ బయట అరుగుమీద యిద్దరూ కూర్చున్నారు.

ఏడుకొండలే నెమ్మదిగా ప్రారంభించాడు.

"ఇదిగో నారాయుడూ! మా హెడ్డు ఎలాటివాడో నీకు తెల్దు"

హిరణ్యకశిపుడికి అన్న.

రావణాసురుడికి తమ్ముడు.

నీ కూతురు సచ్చినా, బతికినా ఆడికి ఒకటే.

ఆడిక్కావల్సింది డబ్బు.

ఆదిచ్చేస్తే నీ కూతురు వర్షంలో కాలుజారి కాలువలో పడ్డాదని రాసేస్తాడు.

డబ్బు ఇయ్యలేదనుకో నువ్వే కావాలని దాన్ని తోసి చంపేశాడు అని కేసెట్టి వుడాయించేస్తాడు.

నా నోమాట సెప్తాను యినుం.

నీ కూతురి పేనానికేం బయంనేదు.

దాని గురించి బెంగెట్టుకోకు.

ఇప్పుడు జరగాల్సింది నువ్వు బయటపడటం. మరింత ఎంతివ్వగలవో సెప్పు. నాను నీతో వున్నదున్నట్టు చెప్పాను. మరింక నీ యిష్టం.

తన కూతురికి ప్రాణభయం లేదని విన్న నారాయుడి గుండె కుదుటపడింది.

ఏడుపు ఆగిపోయింది.

ఇప్పుడతనికి కూతురి బెంగ బదులు తన బెంగ పట్టుకుంది.

"నా ఒంటిమీదున్న ఈ గుడ్డముక్క తప్ప నాకేటుంది బాబూ"

నాకదంతా అనవసరం. పద మీ ఇంటికెల్దాం. నిన్నొక్కడే ఒగ్గేస్తే, నువ్వు పారిపోతే నాను నా వుజ్జోగం ఒగ్గేయ్యాల ఎదుంటే అమ్మేసి డబ్బుతే. "ఇదేటి? ఈ యవ్వారంతోటే తెల్లారిపోయీట్టుంది"

ఇద్దరూ రిక్షాలో బయల్దేరారు.

తోవపొడుగునా నారాయుడు "నాకాడ ఏట్నేదు" అని సణుగుతూ వున్నాడు.

మా ఆడదాని మెళ్ళో మంగళసూత్రాలు తప్ప మరేవీ లేవు... మరింక యిప్పుడవి అమ్మేయాల...! ఇంత రాత్తిరిపూట నాకాడ ఎవడు కొంటాడు? దొంగసొమ్మని చెప్పి మరో పోలీసోడు మళ్ళీ స్టేషన్‌లో పడేస్తాడు అని గోలపెట్టేడు.

అమ్మడం సంగతి నాన్జూసుకుంటాను ముందు ఒట్టుకురా అభయమిచ్చాడు ఏడుకొండలు.

ఇద్దరూ నారాయుడి ఇల్లు చేరారు.

ఏడుకొండలు బైట నిల్చున్నాడు.

నారాయుడు లోపలికి వెళ్ళాడు. కుక్కిమంచం మీద అతని భార్య నిద్రపోతోంది. ఆవిడ నిద్రలేవకుండా నెమ్మదిగా మెళ్ళోని మంగళసూత్రాలు తీసి బయటికి వచ్చేడు నారాయుడు.

ఇద్దరూ మళ్ళీ రిక్షాలో బయల్దేరారు.

రిక్షా షావుకారు పెంటయ్య ఇంటి దగ్గర ఆగింది. పెంటయ్య తండ్రి ఆ ఊర్లో పెద్ద షావుకారు. కేవలం వడ్డీ వ్యాపారంతోనే లక్షలార్జించాడు.

పెంటయ్య తల్లి ఒకటే చూలింత...

లేకపోతే బాలింత.

కాని ఒక్క బిడ్డ కూడా దక్కలేదు.

ఆవిడ కనిపించిన స్వాములకి మొక్కింది.

రామేశ్వరం వెళ్ళి నాగప్రతిష్ట చేసింది.

ఐదుగురు పిల్లలు పోయారు.

ఆరోవాడు పుట్టగానే వాడ్ని తీసుకెళ్ళి పెంటకుప్పమీద పారేయించింది. వాడి ముఖం కూడా చూడనంది. తెల్లవారే వరకూ బ్రతికుంటే తెచ్చుకుంటానంది.

ఆశ్చర్యం!

పిల్లాడు బ్రతికాడు.

పెంటయ్య అని పేరు పెట్టుకుంది.

అతను పెరిగి పెద్దవాడై తండ్రిని మించిన షావుకారు అయ్యాడు వడ్డీ వ్యాపారానికి దొంగ వ్యాపారం జోడించాడు.

పోలీసుల వాటా పోలీసులకి పారేస్తాడు.

తండ్రి లక్షాధికారి మాత్రమే!

కొడుకు కోటీశ్వరుడు.

ఏడుకొండలు, నారాయుడ్ని తీసుకుని అతనింటికి వెళ్ళేడు.

నారాయుడు మంగళసూత్రాలు ఇచ్చేడు.

పెంటయ్య వాటిని అటు తిప్పాడు.

ఇటు తిప్పాడు.

తూకం వేసేడు.

గీటు చూశాడు.

రేటు పలికాడు. "రెండొందలు."

ఏ వందో యాభయ్యో వస్తుందనుకున్న నారాయుడికి రెండొ దలు అన్న మాట నాటుసారా కోసం వెళ్ళిన వాడికి ఫారిన్ విస్కీ దొరికినట్టయింది.

"అంతే ఇప్పించండి బాబూ" అన్నాడు చేతులు కట్టుకొని.

పెంటయ్య నోట్లు లెక్కపెట్టి నారాయుడి చేతిలో పెట్టబోతు న్నాడు.

ఏడుకొండలు నారాయుడి వేపు చూశాడు.

పెళ్ళాన్ని తగలబెట్టడానికి మంగళసూత్రాలు అమ్ము కోవలసి వచ్చిన వాడిలా దీనంగా కనిపించాడు.

వెంటనే "ఐదొందల"కి అర్ధరూపాయి కూడా తగ్గడానికి వీల్లేదన్న హెడ్డు ఆజ్ఞ జ్ఞాపకం వచ్చింది.

ఏడుకొండలులోని మనిషి మేలుకున్నాడు.

అతనికి ఈ పరిస్థితి అంతా అసహ్యంగానూ, చికాగ్గానూ అనిపించింది.

ఎవడో తాగొచ్చి తన కూతుర్ని ఓ దెబ్బ వేస్తే మధ్యలో పోలీసువాడి కేమిటి?

పిల్ల నిక్షేపంగా వుంది.

అయినా ఈ అర్భకుడ్ని భయపెట్టి, వాడి పెళ్ళాం మంగళ సూత్రాలు అమ్మించి డబ్బు గుంజడం ఏమిటి?

ఆ మాటకొస్తే తాగని ఆఫీసరెవడైనా ఉన్నాడా?

వాళ్ళంతా ఇంటి దగ్గర పెళ్ళాన్ని తన్నడం లేదా?

లక్షణంగా తంతున్నారు. కాకపోతే ఆఫీసర్లు కాబట్టి బయ టికి రావు.

ఈ మధ్యనే ఒక కలెక్టరు తప్పతాగి అర్ధరాత్రి తలుపు తియ్యటం అలస్యం అయిందని పెళ్ళాన్ని చితక్కొట్టేశాడు. ఆవిడ చెయ్యి చెరుగ్గడ విరిచినట్టు విరిచేశాడు.

ఆవిడ చెయ్యి విరిగింది.

ఈయన మత్తు వదిలింది.

పెళ్ళాన్ని కారులో వేసుకొని ఆస్పత్రికి తీసుకెళ్ళాడు పాపం... ఆ ఇల్లాలు బాత్రూములో జారిపడ్డాను. అని చెప్పి మొగుడి పరువు కాపాడింది.

ఆ డాక్టర్‌కి కలెక్టర్ వాలకం చూడగానే అర్థమయిపోయింది.

నువ్వు ఏ పొజిషెన్‌లో పడినా ఇలా విరగటానికి వీల్లే దమ్మా... అన్నాడు.

అయినా ఆవిడ నిజం చెప్పలేదు.

ఈ ఆఫీసరు మొగుళ్ళంతా తలెత్తుకొని తిరుగుతున్నా రంటే వాళ్ళ పెళ్ళాలే కారణం.

వాళ్ళందర్నీ వదిలేసి ఇలాంటి బక్కవాళ్ళను పట్టుకున్నాం.

ఛీ! వెధవ ఉద్యోగం మానేస్తే!

వీడ్ని ఇలాగే హాస్పిటల్‌కి పంపించేస్తే!

నేరస్తుడ్ని వదిలేశారన్న నేరం మీద అరెస్ట్ చేస్తారు.

ఉద్యోగం పోతుంది.

ఇంటి దగ్గర లేవలేని తండ్రి, వయసొచ్చిన చెల్లెలు జ్ఞాపకం వచ్చారు. వెంటనే పెంటయ్యతో "నాలుగొందలు" అన్నాడు.

పెంటయ్య మాట్లాడకుండా నాలుగొందలు యిచ్చేశాడు.

వ్యవహారం సెటిలైపోయింది.

ఆ రాత్రే ఆ వ్యవహారం సెటిలైపోయింది.

మంచంమీదున్న మహాలక్ష్మి తల్లి ఒంటిమీదున్న పుస్తెలు షావుకారు దగ్గరకు వెళ్ళిపోయాయి.

నారాయుడికి తోటి కూలీలు కొంత అప్పిచ్చేరు.

ఐదువందలు చేతులు మారాయి.

ఆ మర్నాడే మహాలక్ష్మి ఆస్పత్రి నుంచి ఇంటికి చేరింది.

మహాలక్ష్మిని ఇంటికి చేర్చి వెళ్ళిపోతున్న పేర్రాజు రెండు చేతులు పట్టుకున్నాడు నారాయుడు.

ఏంటి మావా ఇది? అని విడిపించుకోబోయాడు పేర్రాజు.

గజేంద్రుడి కాళ్ళు మొసలి పట్టుకున్నట్టు అతని చేతులు గట్టిగా పట్టుకున్నాడు.

"నీకు తెల్దురా పేర్రాజూ!" మీ అత్త మంచమొక్కిన కాడ్నించి నాకు మతినేదురా! సీకటిపడేసరికి సుక్క పడకపోతే మరింక మడిసిని కాన్రా. నిన్నరేత్తిరి ముసురుగుందేమో! మరీను... ఆకాడికీ ఒక గలాసు ఏసుకున్నాక నాకాడ డబ్బున్నేవు. నానెలి పోతానన్నాను ఒగ్గడే ఆ దుకాణం నంజకొడుకు! ఆడిగి ఇజా నగరం మా రాజు మీద ఎంత నమ్మకమో, నా మీద అంతే దమాటం ... ఈరేత్తిరి మరో రెండు గళాసులు తీసుకోకపోతే నీకిన్సల్టు, నాకిన్సల్టు.

అసలు ఈ సారాకే ఇన్సల్టు

అని పీక పట్టుకొని మరీ పోయిస్సినాడు

పొద్దుటి నుండి వొణ్ణం కూడా నేదేమో డైరెక్టుగా ఎక్కి పోనాది నషాళానికి అంతే!

ఆ దుకాణం ఒగ్గటం గేపకంనేదు

నిన్ను సూడ్డం గేపకంనేదు

పిల్ల కాలవలోపడిపోనాది.

నాకు దెయ్యం దిగిపోనాది

ఏట్నాబం?

తల్లికీ, పిల్లకీ తేడా తెలియనివ్వదు ముండసారా, కొడుకు లాంటి నీలాంటోడికి రంకు కట్టేను.

సచ్చి ఏ సొరగానున్నాడో గాంధీగోరు, అందుకే సెప్పాడు "సారా తాగొద్దురా బాబులూ" అవి! అంటూ నిన్న రాత్రి తన ప్రవర్తనకి సంజాయిషీ యిచ్చాడు.

"ఇప్పుడిదంతా ఎందుకులే మామ" అంటూ మళ్ళీ చేతులు విడిపించుకోబోయేడు పేర్రాజు.

ఇంకా గట్టిగా పట్టుకున్నాడు నారాయుడు.

అయిందేదో అయిపోయింది నాను తాగుబోతునై పోనాను. కట్టుకున్నదానికీ, కన్నోళ్ళకి పనికి రాకుండా పోనాను.

నువ్వో పన్జెయ్యి – నాను బతికున్నానని మర్చిపో

మరిసిపోయి నా కుటుంబాన్ని సూసుకో

అళ్ళకింక నువ్వే దిక్కు

సిన్నోడివైనా నీ కాళ్ళట్టుకుంటున్నా. అని చేతులు వదిలి కాళ్ళు పట్టుకోబోయేడు.

గబుక్కున కాళ్ళు దూరం చేసుకుంటూ ఇప్పుడెంత ఏడిచినా, బాధపడినా ఒకటే. జరిగిందేదో జరిగి పోయింది.

ముందా తాగుడు మానుకో.

నువ్వు తాగినన్నాళ్ళు ఆళ్ళ బతుకులు అంతే నేను మళ్ళీ రాత్రికి వస్తాను అని వెళ్ళిపోయాడు.

మహాలక్ష్మి గుడిసెలో

మంచం మీద పడుకున్న మహాలక్ష్మి తల్లి కళ్ళు చీకట్లో వెండి చేపల్లా మెరుస్తున్నాయి.

ఆ మంచానికి అనుకొని కూర్చున్న మహాలక్ష్మి సర్వం పోగొట్టుకున్న మనిషిలా అతి దీనంగా వుంది.

ఓ మూలగా రాటని ఆనుకొని కూర్చున్న పేర్రాజు పరిస్థితులకి లొంగిపోకుండా ఆత్మ విశ్వాసం వున్న నక్సలైటూ వీరుడిలా ఉన్నాడు.

అతను ఆశలు కాలిపోయిన వాళ్ళా అతి దీనంగా వున్నాడు.

ఆ పరిస్థితిలో అతన్ని చూసిన పేర్రాజుకు జాలేసింది.

వెంటనే అతను దాగి వున్నాడని తెలిసిన కోసం ఆ జాలిని జయించేసింది.

"ఇంతకీ నువ్వనేదేటి?" అన్నాడు కోపంతో కూడిన చికాకుతో

కళ్ళమీద కొరడాతో కొట్టినట్టైంది నారాయుడికి. తుళ్ళి పడి చూశాడు.

ఆ కళ్ళల్లో కన్నీరు ఎండిపోయింది.

"నానేటి అన్ను" నా మాటికి యిలవానేదు. నీకు తెల్దు. పదేళ్ళు అవుద్ది... అదిగో.. అప్పుడు ఆ రెండోది కడుపులో ఉంది ఈ యేళ తాగేసి వచ్చేను. అప్పటికే అదిగో అది భార్యని చూపిస్తూ నెలలు నిండేయేమో నిండు కోనేర్లా ఉంది. ఆ మైకంలో ఎందుక్కొట్టేనో తెల్దుకాని దాని అరుపుకి మూసుకు పోయిన కళ్ళు యిడ్డాయి.

నెత్తికెక్కిన మైకం దిగపోనాది.

దాని సెయ్యిరిగి పోనాది.

ఆ యిరిగిన సెయ్యిమీద ఒట్టెట్టుకున్నాను మళ్ళీ తాగనని.

మూడ్రోజులు నిలవనేదు ఆ ఒట్టు.

మరోసారి....

ఇదిగో ఇలాగే తాగి బీటు కానిస్టేబుల్ మీద కూలబడ్డాను.

మూడ్రోజులు ఒళ్ళంతా కుళ్ళబొడిసేసేరు పోలీసోళ్ళు. మన్ను కుమ్మినట్టు కుమ్మేసేరు.

అప్పుడెట్టుకున్న ఒట్టూ మూడు రోజులు నిలబడ్నేదు.

ఇప్పుడు తాగని ఒట్టేసుకోవాల్నే వుంది. ఇంకెవరి మీదా కాదు.

సచ్చి బతికిన మా లచ్చిమి మీదే.

"నా ఒట్టుకు అది సచ్చిపోద్ది గాని నాను నిలబెట్టుకోలేను" వెచ్చగాకారుతున్న కన్నీళ్ళు చేత్తో వత్తుకున్నాడు.

"ఏడకయ్యా ఆ దేవుడేటి రాస్తే అదే ఔద్ది" తన కన్నీళ్ళు మరచి పోయి తండ్రి కన్నీరు తుడిచింది మహాలక్ష్మి.

"ఏడుపు కాక యింకేటుంటాది మన బతుకులకి? నానేడ కైనా పోతాను పేర్రాజూ ఈళ్ళని నీకప్పజెప్తున్నాను బెక్కుల మధ్య బావురుమన్నాడు నారాయుడు.

"నువ్వెళ్ళినంత మాత్రాన యాళ్ళు సుకపడిపోతారా? అప్పుడు నువ్వు తాగాక మిగిలిన డబ్బులు కూడా దక్కవు" పేర్రాజు ఓదార్చేడు.

ఔను

అతను వెళ్ళిపోతే?

అతని సంసారం ఎండన పడుతుంది.

ఈడొచ్చిన మహాలక్ష్మి వీధిన పడుతుంది.

రెక్కలు రాని పిల్లలు గెద్దల పాలవుతారు.

నువ్వు పారిపోయే ముందు.

మంచం మీదున్న దాన్ని మంచంతోనే పూడ్చేసి.

వయసొచ్చిన కూతుర్ని కసాయివాళ్ళకి అమ్మేసి–

రెక్కలు రాని పిల్లల్ని రైలు కిందకి తోసేసి –

మరీ పోవడం మంచిది.

లేకపోతే –

ఇప్పుడున్న గంజీనీళ్ళు, కన్నీళ్ళు కూడా కరువైపోతాయి.

చలికి కాకపోయినా, సిగ్గు దాచుకోవడానికైనా యిప్పు దున్న చింకి చీరలు కూడా వుండవు వీళ్ళకి.

ఇదంతా పైకి అన్లేదు పేర్రాజు.

పైకి మాత్రం "నువ్వు తాగినా, తాగకపోయినా నీ ఆర్జన కుటుంబానికి ఎలాగూ సాల్టు. ఏదో ఉపాయం సూద్దాంలే. నువ్వు ఎర్రి ఆలోచన్లు పెట్టుకోకు. రేపటి నుండి పన్లో కెళ్ళు" అని హితబోధ చేశాడు.

పేర్రాజు మాటలకి నారాయుడుకి ఏనుగంత బలం వచ్చింది. ఏనుగెక్కినంత సంతోసం కూడా కలిగింది. మర్నాడు ఏనుగు లాగే పన్లోకెళ్ళాడు.

❖ ❖ ❖

దూరం నుండి చూస్తే ఆ ఫ్యాక్టరీ, ఆ పాకలు అన్నీ భూమికి తగిలిన గాయాల్లా ఉన్నాయి.

అక్కడున్న మనుషులు ఆ గాయాల్లో వున్న జబ్బు క్రిములు వున్నారు.

అదుగో... అల్లక్కడ.. ఆ పాక గుమ్మంలో కూర్చున్న ఆమెకి ముప్పై ఏళ్ళుంటాయి.

మొహాన బొట్టు తప్ప యింకే ఆభరణం లేదావిడ ఒంటిమీద.

ఆవిడేం ఆలోచిస్తోంది?

రేపటి భోజనం దొరుకుతుందా లేదా అనా?

నిన్నటి భోజనంతో కడుపు నిండలేదా?

నిన్న రేపుల మధ్య వున్న ఇవేళ సంగతేమిటనా?

ఏమో! చెప్పటం కష్టం.

ఎంచేతంటే ఆ ఫ్యాక్టరీ దుమ్ము అక్కడి యిళ్ళనీ, చెట్లనీ మనుషులనే కాకుండా మనసులనీ, మెదడునీ కూడా తినేసింది.

ఆవిడ ఆలోచనల బరువు పైట జారడం కూడా తెలియ నివ్వలేదు. అంచేత ఆమె పైట సర్దుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

ఆవిడ ఒళ్ళో వున్న పిల్లాడికి పది నెలలుంటాయి. వాడావిడ ఎలాపోయినా రొమ్ముల్ని ఆత్రంగా చీకుతున్నాడు. రెండు నిమిషాల తరువాత బుగ్గలు పీకేయి గాని పాలుగాని, నీరుగాని వాడికి అందలేదు. కోపంతో వాడివిడ గుండెల మీద కాళ్ళతో తన్నేస్తున్నాడు.

తన్నేస్తూ ఏడుస్తున్నాడు.

వాడి తన్నులు ఆమె శరీరానికి గాని, ఏడుపు మనసుకి కాని తాకలేదు. సర్వం త్యజించిన సన్యాసిలా ఆమె అలా శూన్యం లోకి చూస్తూ కూర్చుంది. ఆమెకి కొంచెం దూరంలో ఓపాకరాట నానుకుని నిల్చున్న కుర్రాడికి ఇరవైయేళ్ళుం డవచ్చు.

వాడికి చదువులేదు.

ఆర్జన లేదు.

ఆర్జించే అవకాశం లేదు.

వాడికున్నదల్లా కడుపునిండా ఆకలి.

గుండెనిండా మంట.

ఈ ప్రపంచం మీద ఈ మనుషుల మీద కసి, ద్వేషం.

అతనా రాట నానుకొని నిల్చుని ఏవాలోచిస్తున్నాడు?

రేపటి అన్నం మాటేవిటనా? కాదు.

"ఈ ఊర్ని, ఈ ఫ్యాక్టరీని, ఈ మనుషుల్ని అందర్నీ ఒకేసారి బుగ్గిచేద్దామన్న తన కోరిక ఎప్పుడు తీరుతుందనా?" ఆయుం డవచ్చు.

ఆ అబ్బాయి నిల్చున్న రాటకి పక్కనున్న పాక పేర్రాజుది.

పేర్రాజు తల్లి కనకమ్మ.

పోయిన చెయ్యిపోగా, లేచిపోయిన మొగుడు లేకపోయినా ఒంటి ఒక్కగానొక్క కొడుకుని సాకుతోంది.

ఒక ఆఫీసరు గారింట్లో వంటపని చేస్తుంది.

పేర్రాజుకి తల్లి, తండ్రి, గురువు అన్నీ తల్లే.

ఆ వేళ మహాలక్ష్మిని ఆస్పత్రి నుండి ఇంటికి దిగబెట్టాక తల్లితో మహాలక్ష్మి ఇంటి సంగతి, నారాయుడి సంగతి చెప్పేడు. చెప్పి మరంచేత ఇల్లు గడవాలంటే ఆడుకాక మరోడు కూడా ఆర్జించాలి. తల్లి చూస్తే మంచం పట్టేసింది. కడపటోళ్ళు యిద్దరూ చిన్నపిల్లలు. మరింక ఎటుచూసినా మిగిలింది మా లక్ష్మే. నీఎరికని ఎదన్నా మంచి ఇంట్లో పనుంటే ఆళ్ళకింత అన్నం పెట్టిన పుణ్యం దక్కుతుంది అన్నాడు.

అలా కనకమ్మ దయవల్ల రాఘవయ్యగారింట్లో దాసీ పని కుదిరింది మహాలక్ష్మి.

ఇప్పుడు నారాయడింట్లో పిల్లలు ఒకపూట కడుపునిండా తింటున్నారు.

రాఘవయ్యకి రంజని రెండో భార్య.

సాధారణంగా రెండో పెళ్ళాం మొగుడికంటే చాలా చిన్నగా వుంటుంది. కాని రంజనికి రాఘవయ్యకి తేడా అయిదేళ్ళు.

రాఘవయ్య మొదటి భార్య సువర్ణమ్మ.

ఆవిడ చచ్చిపోలేదు.

ఆవిడే అతన్ని వదిలేసింది.

అలా వదిలెయ్యడానికావిడ తొందరపడలేదు.

ఆవేశపడనూలేదు.

పెళ్ళిఅయ్యేక పూర్తా మూడేళ్ళు ఆలోచించి, ఆలోచించి వదిలేసింది.

నీ మొదటి పెళ్ళాం నిన్నెందుకు వదిలేసిందని రంజని అడగలేదు.

పెళ్ళయిన కొత్తలో అడగడం బావుండదని వూరుకుంది.

పెళ్ళయిన నెలకి కారణం చూచాయిగా ఊహించ గలిగింది.

మూడు నెలలకి ఆ కారణం ధృవ పర్చుకుంది.

సంవత్సరం తిరిగేసరికి ఆవిడ గ్రహించిన సత్యం – తననె లాగ రాఘవయ్య పట్టించుకోడు. మొదటి ఆవిడలా వదిలేయ కుండా వుంటే చాలు. అదే పదివేలు.

రాఘవయ్య ఆస్థిపరుడు.

భారీ వ్యాపారీ

అతను పాడిగేదె.

పెద్దాపిడ సువర్ణమ్మ తెలివి తక్కువది అందుకే వదిలేసింది.

రంజని తెలివైంది.

అంచేత వదిలిపెట్టలేదు.

వదిలి పెట్టదు.

రంజని వయస్సు పాతిక్కీ, ముప్పైకీ మధ్యలో ఉంటుంది.

అయినా ఆవిడ ముప్పై అయిదేళ్ళదాన్లా, వడల వలసినంత వడలిన ప్రౌఢలా వుంటుంది.

ప్రబంధ నాయికలా ఎట్రాక్టివ్‌గా వుంటుంది.

పలచగా (సన్నగా) వున్న ఆడవాళ్ళు ఫోటో గ్రాఫర్లకి పని కొచ్చినా పక్క మీదికి పనికిరారు.

రంజనిలావు ఫోటోగ్రాఫర్లకీ, పక్కమీదికీ కూడా బావుం టుంది.

ఆమెకి –

నొక్కుల జుత్తుంది.

నొక్కుల బుగ్గలున్నాయి.

ఎత్తు ముక్కుంది. ఎత్తు గుండెలున్నాయి.

ఆమె కళ్ళల్లో ఎప్పుడూ కాకర పువ్వొత్తులు వెలుగు తుంటాయి.

ఆవిడ పెదవుల మీద ఎప్పుడూ చిరునవ్వు వుంటుంది.

మొహాన ఎప్పుడూ చిరుచెమట వుంటుంది.

ఆమె జడలో ఎప్పుడూ తాజా గులాబీ పువ్వుంటుంది.

ఆమె చిన్న నుదుటి మీద నల్ల నాగుపాము పిల్లలాంటి జుత్తు రింగులు కదుల్తూ వుంటాయి.

ఆ పిల్లపాముల మధ్య ఎర్ర చంద్రుడిలా పెద్ద బొట్టుం టుంది.

ఆమెకి –

పట్టు చీరలంటే ఇష్టం.

జరీవి అయితే యింకా యిష్టం.

అంచేత ఆ మూఁడ్రోజులూ తప్పిస్తే, ఆమె ఎప్పుడూ జరీ పట్టు చీరలే కడుతుంది.

ఆ కుంకం బొట్టు, పట్టుచీర, చమటతో తడవ వలసినచోట్ల తడిచిన జాకెట్టుతో ఆమెని చూసిన సగం మంది అప్పుడే ఆమె పూజలోంచి లేచిందనుకుంటారు.

మిగతా సగం పూజకు వెళ్తోందనుకుంటారు.

భక్తి పారవశ్యం వల్లో, మోహ పారవశ్యంవల్లో కాని ఆమె ఎప్పుడూ చిరుమైకంలో వుంటుంది.

ఆమె పుట్టింది పల్లెటూర్లో.

పెరిగింది పల్లెటూర్లోనే.

చిన్నతనంలో ఆమెకి దైవభక్తీ, పాపభీతి వుండేవి.

అబద్ధం చెప్పడం పాపం.

మోసం చేయడం మరీ పాపం.

దొంగతనం, రంకుతనం పాతకాలు.

ఆవిడ డిక్షనరీలో పాపాలకీ, పాతకాలకీ అర్థాలు అవి.

ఆవిడకి రాఘవయ్యతో పెళ్ళై కాపురానికొచ్చేసరికి ఆవిడకి ఇరవయ్యేళ్ళు.

ఆ వయసులో పెళ్ళి గురించి తెలియవలసినంత తెలుసు.

ప్రతీ ఆడదీ ఇష్టం వున్నా, లేకపోయినా మొగుడితో కాపురం చేస్తుంది. ఆ కాపరంలో కొంతైన సుఖం వుండకపోదు అనుకునేది.

కానీ...

ఒక భర్త భార్యని వెండికొండలు యెక్కించగలడు.

మరొకడు చీకటి గుహల్లోకి తోసెయ్యగలడు.

ఒకడు ఇంద్రధనస్సు రంగుల్లోనడిపించగలడు.

మరొకడు ఇంద్రధనస్సు ఎక్కించగానే అది విరిగి భార్య పాతాళంలో పడిపోతుంది.

ఇలాంటివేవీ ఆమెకి తెలీదు.

ఆమె చిన్నప్పుడు, బాగా చిన్నప్పుడు వాళ్ళ పనిమనిషి "ఎతా వాతా గాని మొగుడు మంచంనిండా వున్నాడు" అని తరుచు అనడం విన్నది.

అప్పట్లో ఆ సామెత అర్థం తెలీకపోయినా వూరికే నువ్వుకునేది.

ఇప్పుడు కాపురానికొచ్చాక ఆ సామెత అర్థం తెలిసి కుమిలి కుమిలి ఏడిచింది.

కాపరానికొచ్చిన కొత్తలో....

మొదటి కొన్ని రోజులు గమ్మత్తుగా గడిచాయి.

తరువాత గమత్తులో 'గ' పోయి మత్తే మిగిలింది.

రాత్రిళ్ళు...

గులాబీ రంగు నిండిన గది అది కొద్దిసేపట్లోనే నల్లనాగులు తిరిగే కర్కశపు గుహ అయిపోయేది.

అప్పుడే విడిన తాజా పువ్వులు పెట్టుకున్న మరుక్షణం మాడి బొగ్గులైపోయేవి.

ప్రతి నరంలోను తియ్యగా మొదలైన బాద కొద్ది సేపట్లోనే అదే నరాల్ని మెలితిప్పేది.

రక్తం అంతా నీరైపోయి బైటికి ప్రవహిస్తున్నట్టు ఒళ్ళంతా చమటలు పట్టేవి.

ఆ బాధ తీరాలంటే...

ఎదుటి గోడ బద్దలయ్యేటట్టు గుద్దెయ్యాలి.

మంచానికి బుర్ర కొట్టుకొని బద్దలు చేసుకోవాలి.

సీసాడు విషం గడగడా తాగెయ్యాలి.

ఇవేవీ చేయలేకపోతే దైవానికి ఈ జీవితం అంకితం చెయ్యాలి.

భగవద్ధ్యానంతోనే కాలం గడపాలి.

రంజని ఆఖరి మార్గాన్నే ఎన్నుకుంది.

ప్రతిరోజూ గుడికి వెళ్ళింది.

రోజూ పూజ చేసింది.

ఆమెలో దైవభక్తి ప్రారంభించేక రాఘువ్య రాత్రిళ్ళు నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

అతనిలో ఏ మార్పు లేదు.

ఆమెలోనే మార్పు వచ్చింది.

దేవుడు, మతం, బక్తి ఇవన్నీ మత్తుమందులాంటివి. ఆ మందు పట్టు విడిపోగానే మళ్ళీ ఇహం గుర్తొస్తుంది.

ఇరవై నాలుగ్గంటలూ భక్తి మత్తులో వుండాలంటే ఈ ప్రపంచంలో బంధాలు తెంచుకొని ఏ అడవులకో పోయి తపస్సు చేసుకోవాలి.

కేవలం దైవ చింతన చేసినంత మాత్రాన కోరికలు పోతాయన్న ఆమె అపోహ మాత్రమేనని గ్రహించింది.

ఆమె బాధని దైవభక్తి తీర్చలేకపోయింది.

పాతికేళ్ళు వరకు కాపాడుకున్న ప్రాతివత్యం ఇంక కాపాడు కోలేనేమోనన్న భయం పట్టుకుంది.

ఆ భయం ఆమె చేత నిద్రమాత్రలు మిగించింది.

చావు, పుట్టుకలు మనచేతిలో లేవు.

నిద్ర మాత్రలు మింగిన వాళ్ళంతా చచ్చిపోరు.

రంజనీ కూడా చచ్చిపోలేదు.

డాక్టర్ ఆమెచేత మింగినవన్నీ కక్కించాడు.

చావుకంటే అధ్వానమైన బ్రతుకులోకి తోశాడు.

అయితే….

ఆ తర్వాత రాఘవయ్య మారాడు.

అనుకోని విధంగా మారాడు.

తాగుడు అలవాటైంది.

మహాలక్ష్మి పనిలో చేరినప్పటికి రంజని ఇంటి పరిస్థితి అది.

పనిలో చేరిన పదిరోజుల్లోనే "మా అమ్మగారు మంచిది" అనుకుంది ఆమె. అయితే రంజని చేతలు మాత్రం మహాలక్ష్మి కెప్పుడు అర్థం అయ్యేవి కావు.

ఒక్కోసారి పొయ్యిమీద కూర మాడి బొగ్గయిపోయినా లేచేది కాదు.

పాలుపొంగి కాలుపై పారినా పట్టించుకునేది కాదు.

చదువుకున్న పుస్తకం గంటయినా పేజీ తిరగదు.

వింటున్న రేడియో ప్రోగ్రాం అయిపోయినా కట్టదు.

ఒక్కొక్క నాడు రోజుకి నాలుగుసార్లు స్నానం చేసేది. ఒక్కొక్క సారి స్నానం చేయదు.

ఒక్కొక్కనాడు వరసగా నాలుగు పట్టుచీరలు కడుతుంది. తలలో పువ్వులు పెట్టుకొని మహాలక్ష్మిని తీసుకొని రోజూ మాట్నీలకు వెళుతుంది.

పడుకుంటే రోజంతా లేవదు.

లేచిన తర్వాత ఎంతో ఏడ్చినట్లు కళ్ళు వాచిపోయి వుండేవి.

"మంచిదే కాని వట్టి పిచ్చిది" అని నిర్ణయించుకుంది మహాలక్ష్మి.

రంజని మహాలక్ష్మి స్వంత పిల్లలా చూసుకునేది. ఏనాడు యింటికి వట్టిచేతులతో వెళ్ళనివ్వలేదు.

మహాలక్ష్మి తన బ్రతుకు బాగానే వున్నాననిపించింది. అప్పటికామె వయసు పదిహేనో, పదహారో.

ఆ వయసుకి వుండవలసిన లైంగిక జ్ఞానం మినహా ఆమెలో అసాధారణ కోరికలేవీ లేవు.

## 3

రమణమూర్తి గవర్నమెంటాఫీసర్. అతను తరచు క్యాంపులకి వెళ్తాడు. క్యాంపుల్లేని రోజుల్లో ఆఫీసుకు వెళ్ళడు.

అతని భార్య భానుమతికి...

అందం లేదు,

చదువు లేదు.

శరీర వైశాల్యమే కాని హృదయ వైశాల్యం లేదు. అయితే ఇవేవీ లేనిలోటు ... ఆమెకి పిసరంత కూడా లేదు.

మనిషి బ్రతకడానికి కావల్సినవి యివేవీ కావనీ, మనిషికి అన్నిటికంటే అవసరమైనది డబ్బనీ గ్రహించిన వాళ్ళ నాన్న ఆవిడకి వందకాసుల బంగారం, రెండు లక్షల కట్నం, పాతిక ఎకరాలు యిచ్చి మూర్తిని కొన్నాడు.

సాధారణంగా ఆడవాళ్ళందరికీ తమ మొగుళ్ళని పరాయి వాళ్ళు తన్నుకుపోతుందేమోనన్న భయం వుంటుంది.

రమణమూర్తి అందగాడికిందే జమ.

నల్లమబ్బుల అందం అతనిది.

వెండి వెలుగులు అందం అతని కళ్ళది.

ఎండలో చిరుజల్లు అతని చిరునవ్వు.

అతనికి కవిత్వం గనుక వచ్చి వుంటే శృంగార కావ్యాల్లో ఉండేవాడు.

అతనికే అధికారం వుంటే పెళ్ళిళ్ళు రద్దు చేసి వుండేవాడు.

కోర్టులు, కేసు భయం లేకపోతే పెళ్ళానికి విషం పెట్టే వాడు.

వాళ్ళిద్దర్నీ చూసిన వాళ్ళెవరైనా అనుకునేది ఒకటే – రమణా రావు ఆమెను కేవలం డబ్బు కోసమే చేసుకున్నా డని.

భానుమతి మాత్రం పెళ్ళయిన మర్నాటి నుండి 'ఖదేరావ్' చేసేసింది.

డబ్బుండాలే గాని వెధవ సుఖాలు ఎక్కడపడితే అక్కడే దొరుకుతాయి అనుకున్న రమణమూర్తి భానుమతి దగ్గర డబ్బుకి లొంగిపోయాడు.

ఆ డబ్బుతో బైట సుఖం కొనుక్కోవచ్చు.

అతను బైట రమణమూర్తి.

ఇంట్లో భానుమతి మొగుడు, అంతే!

"ఈవిడతో నేను ఇన్నాళ్ళు ఎలా కాపురం చేశానో" అని అప్పుడప్పుడు తనలో తనే ఆశ్చర్యపోతాడతను.

భానుమతి చిన్నప్పుడు నేర్చుకున్న అక్షరాల సాయంతో గ్రంథాలు, వ్రత కథలూ కూడబలుక్కొని చదువుతుంది.

ఆమె ప్రకారం మనిషి పాపభూయిష్టమైన కోరికలు పుట్ట. ధనాశ కోరికలు లిస్టులో ఎంచేతో చేర్చలేదు.

భార్యాభర్తలు కాడి ఎద్దులు! భర్త పక్కన తోవలు పట్టకుండా ఆమె ఆంబోతులా అతన్ని కంట్రోల్ చేసింది.

సుమతీ, సావిత్రీ ఆదర్శ భార్యలు! అయితే వాళ్ళ టైంలో ఈ ఆస్థిహక్కులూ, కట్నాలు వగైరాలు లేవు. అంచేత ఈ కాలంలో ప్రాతివత్య సూత్రాలు కొంచెం మార్పు చెయ్యాలి. భర్తమీద ఒక కన్నేసి వుంచాలి.

భానుమతి పరమ పతివ్రత! అంచేత ఆమె అతని మీద రెండు కళ్ళూ వేసి వుంచింది.

తన కాళ్ళకింద కట్టిపడేసింది.

రమణమూర్తికి కట్టుకొయ్యక్కట్టిన గేదెలా పడుండటం మహా ఇబ్బందిగా వుంది. చిరాగ్గానూ వుంది.

ఈ కళ్ళూ, కట్లూ తప్పించుకోవాలి.

రమణమూర్తికి ఒకటే ఉపాయం తోచింది.

ఆఫీసర్లు గవర్నమెంటు, నాన్ గవర్నమెంటు ఎవరైనా సరే కేంపుల కెందుకెళతారు?

ఎందుకంటే –

కొందరు విశ్రాంతి కోసం,

కొందరు లంచాల కోసం,

కొందరు మందుల కోసం,

కొందరు ముండల కోసం,

పరమ చాధస్తులు తనిఖీల కోసం,

ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క దానికోసం వెళతారు.

కొందరు అన్నిటికోసం వెళతారు.

రమణమూర్తి వీటన్నిటితో పాటు ఆడచిలకల కోసం వెళతాడు.

కేంపుల్లో దొరికే పిట్టలన్నీ నాటువి

రంగులు వెలిసిపోయినవి.

కోయిలలా కనిపించి, కాకిలా అరిచేవి

బంగారు పిచ్చుకల వేషం వేసుకున్న గండభేరుండాలు.

కొన్ని చవకరకం సెంటు వాసన వేసినా, ఎక్కువ సారా వాసనే వేసేది.

ఈ బజారు గువ్వలంటే రమణమూర్తికి ఇష్టం లేదు. ఇంట్లో గిద్దతన్నులూ నచ్చడం లేదు.

ఏదైనా ఫ్యామిలీ దొరికితే బావుండునని అనుకున్నాడు.

అదుగో, సరిగ్గా ఆ టైములోనే అతను రాఘవయ్య గారి ఎదురింట్లో దిగాడు.

దిగిన మర్నాడు.

రమణమూర్తి కేంపుకి బయల్దేరుడు. జీపు ఎక్కబోతూ అతను ఎదురింటివేపు ఒక్కక్షణం చూశాడు.

ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక్కక్షణం అతి విలువైనది. ఆ క్షణం కొందరి జీవితాల్ని ఆకాశంలోకి యెగరేస్తుంది.

కొందర్ని అదఃపాతాళంలోకి తోక్కేస్తుంది.

అద్భుతాలూ ఒక్కక్షణంలోనే జరుగుతాయి.

హీరోషిమా, నాగసాకీలు అరక్షణంలో ఆహుతైపోయాయి.

రమణమూర్తి జీవితంలో కూడా ఆ క్షణం చాలా విలు వైంది.

అతను ఎదురింటి వేపు చూసిన క్షణంలోనే రంజని గుమ్మం దిగుతోంది.

ఆమె రమణమూర్తికి వయసులో ఉన్న బంగారు చిలుకలా కనిపించింది.

స్వర్గం నుండి దిగొచ్చిన అందమైన పక్షిలా కనిపించింది.

బండి రామచిలకలా కనిపించింది.

కెంపుల రజను అద్దుకున్న కర్పూరపు బొమ్మ!

పొంగిన పాల సరస్సు.

ఫ్రిజ్‌లో పెట్టిన పెరుగులా కనిపించి, అమాంతం తినె య్యాలనిపించింది.

అదే క్షణంలో రంజని కూడా రమణమూర్తిని చూసింది అతను ఆమెకు గొడ్లమధ్య కాకుండా గోపికల మధ్య కృష్ణుడిలా కని పించాడు.

ఆ క్షణం తను గోపికలా కాకుండా ఒరిజన్ రాధలా పీలైన రంజని తనవేపు కన్నార్పకుండా చూస్తూ నిలుచుంది.

రంజని రాధ అయిన క్షణంలో లోపల్నించి భోజనం కేరి యర్ పట్టుకువచ్చింది భానుమతి. ఆమె సత్యభామలా లేదు. అయినా రుక్మిణితో వున్నప్పుడు దొరికిపోయిన కృష్ణుడిలా ఫీలయ్యాడు రమణమూర్తి.

సత్యభామ కేరియర్ జవానుకిచ్చింది. ఆమెను చూడని రంజని రాకడ వచ్చి వెంటనే వెళ్ళిపోతున్న కృష్ణుడి వేపు చూసిన రాధలా చూస్తూ నిల్చుంది. అయితే సత్యభామ రాదను చూసింది.

ఆ చూపుకే గనుక తపశ్శక్తి వుంటే రంజని రజను అయిపోయేది.

జీపు కదిలింది.

కదిలిపోయిన కలవేపే చూస్తోంది రంజని.

రంజని వేపే చూస్తోంది భానుమతి.

జీపు మలుపు తిరిగింది.

గుడికి వెళ్దామనుకొని మెట్లు దిగుతున్న రంజని దేవుడి దర్శనం వాయిదావేసి లోపలికి వెళ్ళిపోయింది.

భానుమతి ఇంట్లోకి వెళ్ళలేదు.

పక్కింటికి వెళ్ళి రంజని గురించి వివరాలు సేకరించ డానికి, వివరాలు అందలేదు, పక్కింటావిడ నిన్ననే వచ్చింది.

ప్రత్యక్షంగా కనిపించే వాటిని సాక్ష్యాధారాలు కోర్టులు అడగచ్చు.

భానుమతి అడగదు.

తన కాపరం నిలబడాలంటే తక్షణం ఇల్లు మార్చేయ్యాలి అను కుంది భానుమతి.

తన కాపరం నిలబెట్టుకోవాలనిపించలేదు రంజనకి.

ఏవండీ...

మీరు నన్ను ఏవండీ అనడం బావులేదు.

మీరు నన్ను మీరనొచ్చా?

అయితే అనన్లెండి.

తర్వాత జాయింటు నవ్వు.

ఆ తర్వాత జాయింటు నిట్టూర్పు.

కొందర్ని చూడగానే వాళ్ళు మనకోసమే పుట్టారని పిస్తుంది. కదూ!

నాకు మాత్రం మిమ్మల్ని చూడగానే అలా అనిపించలేదు.

నిజం?

సరస్వత్తోడు

మరేం అనిపించింది?

నేనే మీ కోసం పుట్టాననిపిస్తోంది.

తర్వాత జంట నవ్వులు.

మీ ఆయన ఎలాంటివాడు?

పాపం! మంచివారే..

మా ఆవిడ ఎలాంటిదని అడుగుతారనుకున్నాను.

మీరు చెప్పారు కదా!

గడుసువారే

మరే

మళ్ళీ జంట కిచకిచలు

మా ఆవిడ మాత్రం మంచిది కాదు.

ఏం పాపం

వట్టి ఢిల్లీ గేదె...

ఒట్టిపోలేదుగా

చూలు కడితే కదా ఒట్టిపోవడానికి

మనం ఎక్కడికయినా వెళ్ళిపోతే హాయిగా వుంటుంది కదా!

డబుల్ హాయి

కాని లోకం

ఔనౌను వెధవ లోకం

చెడ్డది

చాలా చెడ్డది

అవునవును బహు చెడ్డది ఎవరెలా పోయినా దానికే కావాలి

ఎన్నాళ్ళిలా

గాఢమైన నిట్టూర్పులు.

మనం ఒక్కసారి కలుసుకుంటే చాలండి. ఒక్కటంటే ఒక్కసారి.

చాలదండీ.

ఒక్కసారి చాలండీ. ఆ తరువాత నేను చచ్చిపోయినా ఫరవాలేదు.

నాకు ఫరవా వుంది.

ఏవండీ

రంజనీ

ఏవండీ

నా రంజనీ

నా మనో రంజనీ

నాలుగు కళ్ళు పరవశంతో మూతలు పడ్డాయి.

మూతలు పడిన కళ్ళలో ఇంద్రధనస్సులు వెలిగాయి.

ముత్యాల జల్లులు కురిశాయి.

మూతలు పడిన కళ్ళు పరవశంతోనే తెరచుకున్నాయి.

మీ ఆయన ఎప్పుడూ ఊరికి వెళ్ళరా?

వెళ్తారు కాని మీ ఆవిడా?

ఔను మరచిపోయాను

అయితే మనం కలుసుకోలేమా?

లేం కాబోలు.

లైలా మజ్నూల్లా కలుసుకోకుండానే చచ్చిపోతాం కాబోలు.

ఏవండీ

రంజనీ

ఇవి వాళ్లు మాట్లాడుకున్న మాటలు కావు.

వాళ్ళ కళ్ళు కిటికీ నుంచి, తెర వెనుకనుంచి యిచ్చుకున్న టెలిగ్రాములు.

# 4

గాంధీగారు లాంటివాడు గజదొంగగా మారవచ్చును.

పతివ్రత సడన్‌గా పతిత అయిపోవచ్చు.

ముష్టివాడు ముఖ్యమంత్రి అవవచ్చు.

మార్పు మానవ సహజం.

రంజని కూడా మామూలు మనిషే.

రమణమూర్తి ఎదురింట్లో దిగిన్నాటి నుండి రంజనిలో మార్పు ప్రారంభమయిందని చెప్పుకోవచ్చు. ఎప్పుడూ పడగ్గది లోనో, పూజగదిలోనే వుండే రంజని యిప్పుడు వీధి కిటికీ తెరవెనుకే నిల్చుంటోంది.

"అమ్మగారూ!" మహాలక్ష్మి పిలుపుకి తెరవెనుక నుంచి సమాధానం.

మొదట్లో కేవలం దాసీగా చేరిన మహాలక్ష్మికి రంజని క్రమేపీ పని, వంటపని అంతా అప్పగించేసింది. జీతం కూడా పెంచింది.

"వంట ఏటి సెయ్యమంటారండి?"

'ఏదో ఒకటి తగలెట్టు" తెర జవాబు చెప్పింది.

అమ్మగారికి అంత కోపం ఎందుకొచ్చిందో, తను చేసిన పొరపాటు ఏమిటో ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా అర్థమ వలేదు.

అసలీ గొప్పవాళ్ళ ఆగ్రహానుగ్రహాలకి కారణాలుండవు. ప్రాణం రాకడ పోకడ తెలీవంటారు. గొప్పవాళ్ళ అగ్రహాను గ్రహాలు కూడా ఇందులో చేర్చవచ్చు. తెర వెనుక నిల్చోనప్పుడు మాత్రం 'మహాలక్ష్మీ" అని పిల్చి పక్కన కూర్చోపెట్టుకుంటుంది. మంచి చెడ్డలడుతగుతుంది. యోగ క్షేమాలయ్యాక "ఆయన బావుంటారు కదే" అంది. ఆయన గారి ఆంతర్యం తెలీని మహా లక్ష్మి "అయ్యగారి కేటంటి మరాజులా వుంటారు" అంది.

మహాలక్ష్మి అమాయకత్వానికి రంజని నవ్వుకుంది. నవ్వి అదికాదే ఆ ఎదురింటి ఆయనకి ఏం పనే? అంది.

"ఏదో ఆఫీసులో ఉద్యోగవటండీ!"

"అది నాకూ తెలుసు, ఏ ఆఫీసులో"

"నాకు తెల్దండి."

"వాళ్ళావిడ ఎలా వుంటుందే.?"

"నాను సూళ్లేదండి."

"ఆవిడ మంచిదేనా?"

"ఆళ్ళ పనిమిసి మా పేటేనండి, అది సెప్తాదండి. ఆయమ్మకి దేవుడంటే శానా భక్తిండి వొరానికి మూడ్రోజులు వణ్ణం తిన దటండి."

"అతన్ని బాగా చూస్తుందా?"

"నాకేటి తెలుస్తాదిగానండి!" ఆళ్ళ పనిమనిషితో మాత్తరం "ఒసే రంగీ మీ అయ్యగారు ఊరికెళితేనే నా ప్రాణం సల్లగా వుంటూంది" అంటూదంటండి పాపం.

రంజని ఎంత ప్రయత్నించినా రమణమూర్తి గురించి అంతకు మించిన వివరాలు తెలుసుకోలేకపోయింది. ఆమె కున్న ఒక్క సి.ఐ.డి. మహాలక్ష్మి. మహాలక్ష్మికి ఇన్ఫర్మేషన్ యిచ్చేది రమణమూర్తిగారింటిలో పనిమనిషే. మరింక ఆ ఇద్దరు పని మనుషులు యిచ్చిన వివరాలు రంజనికి తృప్తినివ్వలేదు.

దొంగని దొంగే పట్టాలన్నది నానుడి.

ఆడదొంగని ఆడదొంగే పట్టాలన్నది న్యూనుడి.

రంజని మీద ఒక కన్ను, మొగుడి మీద రెండో కన్ను వేసే వుంచింది భానుమతి. అంచేత రంజని తెరవెనుక వ్యవహారం అంతా భానుమతికి తెలియదనుకోవడం కేవలం పొరపాటు.

భానుమతి భక్తురాలే.

అయితే భక్తి భక్తే.

మొగుడు మొగుడే.

పతి దేవుడౌతాడేమో కాని, దేవుడు పని అవడు కదా.

దేవుడి ధ్యాసలోపడి మొగుడ్ని విచ్చలవిడిగా వదిలేస్తే మరింక దేవుడు కూడా తనని కాపాడలేడు.

ఈ ఇంట్లో దిగిన ముహూర్తం మంచిదికాదు. దిగి రెండు వారాలు అయింది. అప్పుడే నడికొప్పుకి నిప్పంటు కుంటోంది. అది రాజుకోక ముందే ఆర్పెయ్యాలి.

ఈ రెండు వారాల్లో తెరవెనుక భాగోతం మరో రెండు వారాలకి తెరముందుకు రాదని గ్యారంటీ ఏమిటి? ఏవీ లేదు. అంచేత ఈ భాగోతాన్ని తెరవెనుకే నొక్కేయాలి అనుకుంది భానుమతి. నొక్కెయ్యడానికి యిదేమైనా నల్లా, బల్లా?

ఆలోచించింది.

రమణమూర్తిని మందలించి ప్రయోజనం ఉండదు. ఆవిడ్ని ఆపే అధికారం తనకి లేదు. తన బంగారం మంచి దయితే ఒకర్ని అనడం ఎందుకూ? అసలిలాంటి వ్యవహారాలు ముదర నివ్వకూడదు. చూపుల దగ్గరే తుంచేయాలి.

చూపులు లేకుండా చేయాలంటే తన మొగుడ్ని దూరంగా తీసుకెళ్ళాలి. అనుకున్నాక ఆలశ్యం ఎందుకూ? ఈ ఇంటికి కట్టిన మూడు నెలల అడ్వాన్స్ వదులుకొని మూడో వారం తిరక్కుండానే మూడు వీధుల అవతలకి ఇల్లు మార్చేసింది.

## 5

"కామాతురాణాం నభయం నలజ్జా" అన్నాడు భారతం రాసిన మహానుభావుడు.

రంజని రమణమూర్తి విషయంలో ఏ మాత్రం భయపడ లేదు. సిగ్గుపడలేదు.

అంచేత వాళ్లు ఇల్లు మారినా ఆమె మనసు మార్చుకోలేదు.

అతను వెళ్ళిపోయాక రంజనికి...

ఒక్కసారి వెలిగిన హారతి అకస్మాత్తుగా అరిపోయినట్టు ...

పండు వెన్నెల మండి మసైపోయినట్టు...

ప్రపంచంలో అందరూ చచ్చిపోయి తనొక్కర్తే ఏకాకిగా మిగిలి పోయినట్టు అనిపించింది.

ఈ బాధ తను భరించలేదు.

బాధల నుండి తాత్కాలికంగా తప్పించేది భక్తి ఒక్కటే.

అంచేత మళ్ళీ గుడికి వెళ్ళింది. అయితే ఈసారి ఆమె భగ వంతుడిని ప్రార్థించింది. తన ప్రాతివత్యం నిలబెట్టాలని కాదు.

చెడగొట్టమని అర్థించింది.

చెడగొట్టుకోవడానికే నిర్ణయించుకుంది.

ఆవిడ తల్చుకుంటే చెయ్యలేనిదేం వుంటుంది?

మనిషికి ఆకలికంటే భయంకరమైనది కోరిక.

ఆకలేస్తే అన్నం తినొచ్చు. అన్నం లేకపోతే రొట్టె, అది లేక పోతే మరోటి. కడుపు నింపుకోవడానికి సవాలక్ష మార్గాలు న్నాయి. ఆఖరికి గ్లాసుడు మంచినీళ్ళు తాగైనా తాత్కాలికంగా ఆకలిమంట చల్లారుతుంది.

కోరికల మంట తీర్చుకోవాలంటే ఒకటే మార్గం అది తీర్చేసు కోవడం. ఆ తీర్చుకోవడంలో వ్యాయావ్యాయాల ప్రసక్తి ఉండదు.

పాపపుణ్యాల ప్రసక్తి రాదు.

నీతి, అవినీతి ఆ ఛాయలకే రాకూడదు.

రంజని తను చెయ్యబోయే పని మంచిదా? చెడ్డదా? పాపమా? పుణ్యమా? అన్న ఆలోచన రానివ్వదల్చుకో లేదు. తనలో ఇన్నేళ్ళుగా రగుతులున్న ఈ మంట చల్లార్చు కోవడమే పాపమైతే, తను పాపాత్మురాలవడానికి సిద్ధమే.

న్యాయంగా ఆలోచిస్తే ఈ పాపం తనది కాదు.

రాఘవయ్యది

మరింక తన కోరిక తీర్చుకునే దారి ఆలోచించింది. ఉపాయమూ దొరికింది.

అప్పటికి రమణమూర్తి ఇల్లు మారి వారమైంది. ఓనాడు పొద్దున్నే

మహాలక్ష్మిని పిలిచింది రంజని.

వచ్చింది మహాలక్ష్మి.

"మీ అమ్మెలా వుంది" పరమార్శించింది.

"మీ దయవల్ల బాగానే వుంది"

"నా దయేమిటి నీ మొహం నువ్వు కష్టపడి పనిచేసు కుంటున్నావు. తల్లిని, తోడును పోషిస్తున్నావు" ఇంద తీసుకో అని రెండు రూపాయలిచ్చింది.

అకస్మాత్తుగా డబ్బు ఎందుకిస్తున్నాదో అర్థం కాకపోయినా తీసుకుంది మహాలక్ష్మి.

"రిక్షాలో వెళ్ళు"

ఎక్కడికో తెలియకపోయినా బుర్ర ఊపింది మహాలక్ష్మి.

"రమణమూర్తిబాబు ఇల్లెక్కడో వాళ్ళ పనమనిషిని అడిగిరా? వంటింట్లో బుట్టలో పళ్ళున్నాయి, తీసుకెళ్ళి మీ అమ్మకియ్యి, రిక్షాలో వెళ్ళు."

అన్నింటికీ తలూపింది మహాలక్ష్మి. ఇంటికి నడిచే వెళ్ళింది. నడిచే తిరిగి వచ్చింది.

ప్రియుడి కోసం తపించిపోయే విరహనాయికిలా వీధి గుమ్మంలో నిల్చుంది రంజని మహాలక్ష్మి కోసం.

మహాలక్ష్మి రానే వచ్చింది, వార్త కూడా తెచ్చింది.

"కొత్తపేటలోనండి, ఎంకటేశ్వరా సినిమి ఎనుక డాబా ఇల్లండి."

రంజని మనస్సు రాగమాలిక పాడింది.

అమ్మయ్య! ఇల్లు దొరికింది.

మనిషి దొరకాలి, అవకాశం దొరకాలి.

రమణమూర్తి కనిపించకముందు రంజని పరమ భక్తురాలు.

భక్తుల కోరికలు భగవంతుడు తప్పక తీరుస్తాడట. అంచేత రంజనికి ఆ అవకాశం ఆ రోజు మధ్యాహ్నామే వచ్చింది.

ఆ మధ్యాహ్నం "రంజూ అర్జంటుగా మెద్రాస్ వెళ్ళాలి బట్టలు సర్దు" అన్నాడు.

"ఎన్నాళ్ళు పడుతుంది?" ఆత్రంగా అడిగింది రంజని.

రంజని ఆతృతను రాఘవయ్య మరోలా అర్థం చేసుకు న్నాడు.

"మూడు నాలుగు రోజులు అంతే. ఒంటరిగా వుండకు" మహాలక్ష్మిని సాయం పడుకోమను.

మూడుగంటలకి రాఘవయ్య బయలుదేరాడు.

మూడు నిమిషాలకి మహాలక్ష్మి బయలుదేరింది కొత్తపేట.

పురాణాల రోజుల్లో ప్రియుడికి రాయబారం హంసలు, చిలకలు తీసికెళ్ళేవి.

రాజకుమారికైతే ప్రియసఖి తీసుకెళ్ళేది.

నవలల్లోను, సినిమాల్లోను పోస్టుమేన్‌లు, ఫోన్లు తీసికెళ్తాయి.

రంజనికి మాత్రం ఇవేవీ లేవు.

అంచేత ప్రేమ రాయబారి మహాలక్ష్మి.

రంజని రాజకుమారైతే, మహాలక్ష్మి ప్రియసఖి.

సినిమాహాలు దగ్గరే ఎదురయ్యాడు రమణమూర్తి.

"మా యమ్మగారోసారి సాయంకాలం ఇంటికాడికి రమ్మన్నారండి" పాఠం అప్పచెప్పిన స్కూలు పిల్లలా నిల్చుంది మహాలక్ష్మి.

తృళ్ళిపడ్డాడు రమణమూర్తి.

"ఆ పిల్లెవరు? దీని అమ్మగారెవరు? నన్ను రమ్మనట మేమిటి. నాతో ఏం పని?" రమణమూర్తికి ఆ రాయబారం అర్థం అవలేదు. పైగా అతని డైరెక్టు ఏటేకేగాని యిలాంటి ప్రేమ రాయభారాలు అలవాట్లేదు.

"అసలు నువ్వెవరు?"

"ఆలింట్లో పనిమనిషినండి."

"ఆళ్ళెవరు."

"ఆదేనండి! తమరుగోరు ఇదివరక వుండేవారు కదండీ! ఆ ఇంటికి ఎదురుగమ్మమేనండి! అమ్మపేరు రంజని అండి! మా అయ్యగారు..."

రాయబారం అర్థం అయిన రమణమూర్తికి ఎగిరి ముద్దు పెట్టుకోవాలనిపించింది.

సినిమాలో హీరో హీరోయిన్ని తిప్పినట్టు గాలిలో గిరగిరా తిప్పాలనిపించింది.

ఎవర్ని?

రంజన్ని కాదు

మహాలక్ష్మిని.

పూర్వం ఇలాంటి రాయబారాలు తెచ్చినవారికి రాజులైతే మెళ్ళో వున్న ముత్యాలహారమో, వేలికునన వజ్రపు టుంగరమో బహుతి ఇచ్చేసేవారు.

రమణమూర్తి రాజూ కాదు.

అతని మెళ్ళో కాని, చేతివేళ్ళకి కాని ఏమీ లేవు.

వున్న ఒక్క రిష్టువాచీ అతని అత్తగారు ఇచ్చినది.

అంచేత జేబులో చేయిపెట్టాడు.

థేంక్‌గాడ్ ! పరువు దక్కింది.

పదిరూపాయల నోటు తగిలింది.

ఇంతకీ అది పదిరూపాయల నోటు కాకుండా వందనోటై అతనికా సమయంలో తేడా తెలీదు.

ఆ నోటు మహాలక్ష్మి చేతిలో పెట్టి "థ్యాంక్సు" అన్నాడు ఆమెను ముద్దుపెట్టుకోవాలన్న కోరికను వాయిదా వేసి.

మహాలక్ష్మి ఆ నోటునుజాగ్రత్తగా జాకెట్టులో దాచుకుంది.

ఆ తర్వాత "జీపులో" వొద్దన్నారండి అంది.

"జీపేమిటి దరిద్రం! గాలిలో వస్తానని చెప్పు" అన్నాడు గాలిలో తేలిపోతూ.

అతని భావం అర్థం కాలేదు మహాలక్ష్మికి.

అయినా అర్థం అయినట్టు బుర్రూపి వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం.

రోడ్డుమీద వెలుగుతున్న వీధిలైట్లు వయసులో వున్న కన్నె పిల్లలా కళకళలాడుతున్నాయి.

రంజని మనసు బంగారు తాళ్ళతో కట్టిన పువ్వుల ఉయ్యాల ఊగుతోంది.

రంజని కళ్ళలో కెంపుల నక్షత్రాలు వెలుగుతున్నాయి.

అప్పుడామె ప్రవరుడి కోసం ఎదురుచూసే వరూధినిలా వుంది.

మహాలక్ష్మి ఆరుగంటలాటకి వెళ్ళింది.

ప్రవరుడు రంజని గృహప్రవేశం చేశాడు.

మహాలక్ష్మి తిరిగొచ్చేసరికి

ఇంద్రభవనానికి వేసిన సినిమా సెట్టింగులా వెలిగి పోతోంది ఇల్లు.

రబ్బరు పరుపుమీద పట్టుచీరతో రంజని.

పట్టుకలలు నిజమైనట్టు.

వళ్లు అంతా పువ్వులు పోసినట్టు.

పువ్వు పువ్వుకీ తుమ్మెద వాలినట్టు

పరవశిస్తూ..

పులకరిస్తూ...

అరమోడ్పు కన్నులతో

ఆనందపుటంచుల మీద

ఇంద్రధనస్సు రంగుల కలల లోకంలో

కరిగిపోతున్న సమయంలో

"అమ్మగారూ" మహాలక్ష్మి పిలుపు.

ఈ రంగుల కల కరగకూడదు.

ఈ ఆనందం ఆరకూడదు.

రంజని పలుకలేదు.

"అమ్మగారూ" మళ్ళీ పిలిచింది మహాలక్ష్మి.

కల చెదిరింది.....

తుళ్ళిపడింది రంజని.

"నువ్వేటే... రా.... రా... ఎలా వుంది సినిమా!"

ఎలా వుందని చెబుతుంది.

మ్యూజిక్ బావులేదనా? డైరెక్షన్ బావుందనా?

మహాలక్ష్మికి అన్ని సినిమాలు ఒక్కలాగే ఉంటాయి. అంచేత ఏం మాట్లాడలేదు.

ఐదు నిమిషాలు గుమ్మం దగ్గరే అలాగే నిల్చుంది.

రంజని తిరిగి కలల ప్రపంచంలోకి వెళ్ళిపోయింది.

"భోజనం వడ్డించమంటారా?" ఆమె అడిగింది.

నవ్వింది రంజని....

కడుపు నిండిన నవ్వు...

మనసు పండిన నవ్వు...

వెన్నెట్లో మల్లెల నవ్వు....

సాయంత్రం సంపంగిల నవ్వు...

ఒద్దే ఆకలి లేదు. నువ్వు తినేసి పడుకో.

మహాలక్ష్మి అన్నం తిని పడుకుంది.

రంజని పడుకోలేదు.

రాబోయే కలలు ఆమె కళ్ళముందు కదులుతున్నాయి. రమణమూర్తి తన మనసు నింపాడు.

కడుపు కూడా పండులే?

రాఘవయ్య ఏం అనడు, అనలేదు.

కాని రంజనికి తెలీని విషయం రమణమూర్తి ఒట్టి గొడ్డు.

అతను తన జల్సాలకి అడ్డులేకుండా చేసుకున్నాడు.

ఆ మర్నాడు రాత్రి భోజనాలయ్యాయి.

రంజని పడుకోలేదు.

మహాలక్ష్మి పడుకుంది.

అర్ధరాత్రి తలుపు చప్పుడు.

ఛంగున లేచి కూర్చుండి మహాలక్ష్మి.

ఎదురుగా వీధి గుమ్మం లోపల చివరిసారి రంజన్ని ముద్దు పెట్టుకుంటున్న రమణమూర్తి.

మహాలక్ష్మికి అర్థం అవలేదు.

అర్థం అయ్యేసరికి రమణమూర్తి వెళ్ళిపోయేదు.

ఆ మర్నాడు రాత్రి –

రంజనీ, మహాలక్ష్మీ భోంచేశారు.

పడగ్గదిలో రంజని....

వీధి గదిలో మహాలక్ష్మి...

ఇద్దరూ నిద్రపోలేదు.

పదకొండు కొట్టి పది నిమిషాలైంది.

రంజని వీధి తలుపు గడియ వేసి మళ్ళీ పడగ్గదిలోకి వెళ్ళిపోయింది.

పదకొండున్నరైంది.

వీధి తలుపు సన్నగా తెరుచుకుంది.

మందు సెంటు వాసన...

తర్వాత సిగరెట్టు పొగ...

ఆ తర్వాత రమణమూర్తి వచ్చాడు.

అతను తిన్నగా పడగ్గదిలోకి వెళ్ళాడు.

పడగ్గదికీ, వీధిగదికీ మధ్య కిటికీ వుంది.

దాని తలుపులు మూసే వున్నాయి.

వెనుక వరండా వేపు కిటికీ వుంది. అవి తెరిచే వున్నాయి.

లోపల లైట్లు వెలుగుతూనే వున్నాయి.

చప్పుడు ముద్దులు...

మూలుగులు...

పాము బుసలు...

ఎదిగే వయసు..

తెలీని ఆత్రం

తెలుసుకుందామన్న ఆరాటం...

ఆ యవసుకుండే కుతూహలం...

అన్నీ కలిపి మహాలక్ష్మిని నెమ్మదిగి పెరిటి వరండా కిటికీ దగ్గరికి తీసికెళ్ళాయి.

కిటికీకి వున్న లేసుతెర వెండి మబ్బులా వుంది.

ఆ తెర వెనుకున్న రమణమూర్తి, రంజని మబ్బు చాటున బూతు బొమ్మల్లా ఉన్నారు.

రాత్రి పదహారు భాగముల పూర్తి బండారాం చూసింది మహాలక్ష్మి.

ఆమె గుండెలు బరువెక్కాయి.

బుగ్గలు వేడెక్కాయి.

ప్రతి నరం బిగిసిపోయి తెగిపోతోంది.

ఊపిరి అందటం లేదు.

వెంటనే ఆ గదిలోకి వెళ్ళి రంజనిని పీక పిసికి చంపేసి అతన్ని లాగేసుకోవాలనిపించింది.

కోరికా, ఊపిరి బిగబెట్టి తన గదిలోకి వెళ్ళి చాపమీద పడుకుంది.

గది మండిపోతోంది...

చాప కాలిపోతోంది..

తనకి పిచ్చెక్కిపోతోంది...

ఆమె నిట్టూర్పుల వేడికి ఆమె బుగ్గలు వాడిపోయాయి.

కన్నీళ్ళు ఇంకిపోయాయి.

లేచి చాపమీద కూర్చుంది మహాలక్ష్మి.

సరిగ్గా అప్పుడు ఆ వీధి గధిలోకి వచ్చాడు రమణమూర్తి. ఆ గదివరకు అతన్ని దిగబెట్టడానికి యిష్టమున్నా లేనట్లు నటిస్తూ వచ్చింది రంజని.

గోడ నానుకుని కూర్చున్న మహాలక్ష్మిని చూసిన రంజని అర్ధరాత్రి అమ్మవార్ని చూసినట్టు పరిగెత్తి పడగ్గదిలోకి పారిపోయింది.

వీధిగుమ్మం దగ్గర నిల్చున్న అతని చేతినుండి పదిరూపాయల నోటు మహాలక్ష్మి వళ్లో పడింది.

పది నిమిషాలైంది.

ఇంకా ఆమె గోడనానుకొని కూర్చునే వుంది.

ఇంతలో రావే పాపం చలో ఏమిటో, నా గదిలో పడుకో అంటూ రంజని వచ్చి ఆమెని తన మంచం మీద పడుకోపెట్టుకుంది.

ఆ తర్వాత ఇద్దరికీ వెచ్చటి రగ్గు కప్పింది.

మరికొంత సేపయ్యాక ఆమె జెబ్బలూ, నడుము రాసింది.

మర్నాడు వాళ్ళిద్దరూ లేచేసరికి పదైంది.

❖ ❖ ❖

రాఘవయ్య వూళ్ళో వుంటే మేటనీ

క్యాంప్‌కెళ్తే సెకండ్‌షో

ఇరవై రెండురీళ్ళ బ్లూ పిలిమ్స్ వేస్తూనే వున్నారు, రంజనీ, రమణమూర్తి.

చూస్తూనే వుంది మహాలక్ష్మి.

హీరోని, రోజూ సినిమాకి పిలుచుకు వస్తూనే వుంది.

హీరో, హీరోయిన్లు యిద్దరూ ఆమెకు డబ్బులిస్తూనే వున్నారు.

మహాలక్ష్మి యింట్లో అందరూ మూడు పూటలా కడుపు నిండా అన్నం తింటున్నారు.

నారాయుడు సారా ధారాపాతంగా తాగుతూనే వున్నాడు.

ఒకనాటి రాత్రి....

సినిమాలో...

హిరో హీరోయిను సినిమాకి ముందు న్యూస్ రీల్లో ఏదో పీటంత పుస్తకం చూస్తున్నారు.

చూస్తూ నవ్వుతున్నారు.

నవ్వుతూ నిట్టూరుస్తున్నారు.

నిట్టూరుస్తూ మూలుగుతున్నారు.

న్యూస్ రీలు అయిపోయాక పుస్తకం పరుపుకింద దాసేసింది రంజని.

తర్వాత విషయాలు రాస్తే సభ్యతగల చదువరులు అసహ్యించుకుంటారు.

అయితే ఆ రాత్రి మహాలక్ష్మి 'స్పెషల్ షో చూసింది' తరువాత వాళ్లు పడుకున్నారు.

ఆమె పడుకోలేదు.

ఆమెకి వాళ్ళు చూపించిన సినిమాకంటే, వాళ్ళు చూసిన పుస్తకం చూడాలన్న కోరిక ఆమెని నిద్రపోనివ్వలేదు.

ఏమిటా పుస్తకం?

ఏవుంది దాంట్లో!

ఒక్కసారి చూస్తే?

ఆ మర్నాడు అవకాశం కోసం చూస్తోంది ఆమె. ఎక్కువ ఎదురు చూడనవసరం లేకుండా ఆ అవకాశం రానే వచ్చింది. రంజని స్నానం చేస్తున్నప్పుడు.

రంజని బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

మహాలక్ష్మి పడగ్గదిలోకి వెళ్ళింది.

పరుపు ఎత్తింది.

పుస్తకం తీసింది.

దాని అట్టమీద బొమ్మ కనిపించింది.

ఆ తర్వాత ఏమీ కనిపించలేదు.

ఎంత సేపైందో తెలీదు.

"చిన్నపిల్లవి. ఇలాంటివి చూడకూడదు" అని నవ్వుతూ రంజని పుస్తకం లాక్కున్నప్పుడు వంటిమీద తెలివొచ్చింది ఆమెకి.

"పెళ్ళవనీ చూద్దువుగానీ" బుగ్గమీద చిటికవేసి ప్రామిస్ చేసింది రంజని.

ఆ రాత్రి ఆ పుస్తకం పట్టుకొనిపోయాడు రమణమూర్తి.

❖ ❖ ❖

రాఘవయ్యది పదిగదుల యిల్లు. మేడ మీద మూడు గదులు ఎప్పుడూ ఖాళీగానే వుంటాయి. కింద ఏడు గదులకీ పర్మనెంటు జనాభా యిద్దరు.

టెంపరరీ జనాభా రమణమూర్తితో కలిపి ముగ్గురు.

"రేపు మా తమ్ముడొస్తారు మేడ కడిగి శుభ్రం చేయి. అసలు వాడు నెలకి పదిహేను రోజులు ఇక్కడే వుంటాడు. ఈ మధ్య అమ్మని యాత్రలకి తీసికెళ్ళాడు" అంచేత రాలేదు రంజని చెప్పింది.

మేడ అద్దంలా కడిగింది ఆమె.

మర్నాడు తమ్ముడొచ్చాడు.

తమ్ముడు...

లూజు పైజామా వాడు.

సిల్క్ షర్టు వాడు.

ముత్యాల పలువరుస వాడు.

ముసి ముసి నవ్వుల వాడు.

పాల బుగ్గల వాడు.

పాతికేళ్ళవాడు.

మాంసమే తిని పెరిగిన వాళ్ళా కండ కలవాడు.

మొత్తం మీద చూడచక్కనివాడు.

హీరోకైనా, విలన్‌కైనా సరిపోయేవాడు.

మొదటి బూతు సినిమా చూసిన్నాడే చెడిపోవడానికి నిర్ణ యించుకుంది మహాలక్ష్మి. అయితే ఎవరి చేతుల్లో చెడతానా? అన్న విషయం మాత్రం తేల్చుకోలేక పోయింది.

తన పేట కుర్రాళ్ళు ఆమెకి నచ్చలేదు.

నచ్చిన స్టూడెంటు కుర్రాళ్ళు తనకి తెలీదు.

తనకంటే చాలా పెద్దవాడైన రమణమూర్తి చేతిలో చెడిపోదా మన్న ఆలోచన ఆమెకు చాలాసార్లు వచ్చింది. కానీ ఆమెని చెడుపుదామన్న ఆలోచన అతనికి వచ్చినట్లు లేదు.

అంచేత తమ్ముడ్ని చూసిన మహాలక్ష్మి తను వెతుకుతున్న హీరో యితనే అనిపించింది.

"సెడితే యిలాటోడు సేతిలోనే సెడాలి" అని కూడా నిర్ణయిం చుకుంది.

తమ్ముడి పేరు రంగనాథం.

అతను ఆడవాళ్ళ విషయంలో గోపాలకృష్ణుడు.

అతనికి గోపికలు చాలామందే వున్నారు.

అతనికి పల్లెటూర్లో పిప్పరమెంటులాంటి పెళ్ళాం వుంది. పాతికెకరాల సుక్షేత్రమైన మాగాణి వుంది. అదికాపాడ్డానికి కామధేనువులాంటి తల్లి వుంది.

మరింక అతని జీవితం పైలా పచ్చీసే.

అతను సాధ్యమైనంత వరకు పెళ్ళైన ఆడవాళ్ళనే ప్రిఫర్ చేస్తాడు. వాళ్లవల్ల చాలా లాభాలున్నాయి. వాళ్ళు మనోవర్తికి కోర్టుకి వెళ్ళరు. వాళ్ళ దగ్గరుంటే యిస్తారే తప్ప, తన దగ్గర పావలా కూడా పుచ్చుకోరు. పొరపాటున కడుపొస్తే మొగుడికి అంటగట్టేస్తారు.

ఈ మధ్య యిలాగే ఒకదానికి కడుపొచ్చింది. ఆ మొగుడు గాడికి పిల్లలు పుట్టరని డాక్టరు చెప్పేశారు. మరి ఈవిడ కడు పుతో ఆ మొగుడు గాడికి అనుమానం రాదా?

రాలేదు?

ఎందుకు?

ఆవిడ నెల తప్పగానే ఆ పక్క వూళ్ళో వున్న బాబాగారి కాళ్ళమీద పడింది తనకి పిల్లలు ప్రసాదించమని. ఆ బాబాగారు యింత విభూది యిచ్చి కడుపుకి రాసుకుని ఆ రాత్రి మొగుడి పక్కలో పడుకోమన్నారు.

బాబాగారి విభూది ముందు డాక్టర్ల మాట ఒక లెఖ్ఖ?

వాళ్ళేం దేవుళ్ళా?

అంతే!

ఆ సమస్య అలా సమసిపోయింది.

అందుకే అతనెప్పుడూ బాబాలని విమర్శించడు.

ఏమో! ఎప్పుడెవరి అవసరం వస్తుందో?

పల్లెలో అతని పిల్లలు నాలుగైదు ఇళ్ళలో వున్నారు కూడా.

అంతమాత్రాన పెళ్ళికాని పిల్లలు నిషిద్ధం అని కాదు.

కాకపోతే అతను వాళ్ళతో చాలా ఖచ్చితంగా ఉంటాడు.

పెళ్ళి వగైరా పిచ్చి ఆలోచనలు వీల్లేదని గట్టిగా వార్నింగి స్తాడు. పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు.

మొత్తానికి దైవానుగ్రహం వల్ల అయితేనేం, అతని అదృష్టం వల్ల అయితేనేం యింతవరకు పంచాయితీలు, రచ్చబండలు లేకుండా జీవితం సాఫీగానే వెళ్ళిపోతోంది.

అతని ఖరీదైన సూటుకేసులు మేడమీదికి మహాలక్ష్మి మోసింది. అతని గదిలో పెట్టింది. అద్దంలో చూసుకుంటూ తల దువ్వుకుంటున్న రంగనాథం ఆమె వైపు చూడకుండానే అటు కాదుయిటు అన్నాడు.

ఇటే పెట్టింది మహాలక్ష్మి.

ద్వారం దగ్గరే నిల్చుంది.

అతను ఆమెను చూడగానే మనసులోనే మెచ్చుకున్నాడు. మచ్చిక ఎలా చేసుకోవాలో అతనికి తెలుసు.

“కాఫీ పట్రంమ్మంటారా?”

“వద్దు” ఇప్పుడు కూడా ఆమె వైపు చూడలేదు.

ఆడదాన్ని మచ్చిక చేసుకోవడం ఒక కళ.

ఆడదే తనని మచ్చిక చేసుకోనేటట్టు చేయడం ఒక ఫైన్ ఆర్ట్. లలితకళ.

మూడ్రోజుల్లో పక్కలోకి రావలసింది. కొంగు పట్టుకొని తిరుగుతే మూడు నెలలు తిప్పుతుంది. ఒక్కొక్క మాయదారి ముండు గొడవ చేసినా చేస్తుంది.

ఆడదాన్ని మచ్చిక చేసుకోవడానిక్కావలసింది చొరవ కాదు. టాక్ట్.

ఆడదాని చెయ్యి తగలగానే హీటెక్కిపోకూడదు.

మొగాడు ఎంత కూల్‌గా ఉంటే ఆడది అంత హీటెక్కి పోతుంది.

తర్వాత కొన్నాళ్ళు న్యూట్రలు చేసెయ్యడం మంచిది.

అప్పుడు మళ్ళీ ఫస్ట్‌గేర్లో పెట్టి ఫైనల్‌గా టాప్‌గేర్లో వెళితే వుంటుంది మజా.

ఎంత టెక్కు మనిషైనా సరే భీమునిపట్నం బీచ్‌రోడ్‌కి పోని మ్మంటుంది.

అంచేత ఆడిది తనంతట తనే చెయ్యి తగిలించేవరకు వూరు కున్న మగాడు శతదినోత్సవ హీరో.

ఆడదాన్ని మచ్చిక చేసుకోవడంలో మొదటిపాఠం నిర్లక్ష్యం.

ఇది అతని ఫిలాసఫీ.

ఈ ఫిలాసఫీ అతన్నెప్పుడూ దగా చెయ్యలేదు. ఒక్కసారి తప్ప.

రెండేళ్ళ క్రితం....

స్నేహితుడి చెల్లెలి పెళ్ళికి వెళ్ళాడు. పెళ్ళి డబ్బున్న వాళ్ళింట్లో పెళ్ళిలాగే ఆర్భాటంగా జరిగింది. గెస్టులందరికీ హోదాని బట్టి వేర్వేరు గదులు ఇచ్చారు.

ఆ అమ్మాయి పెళ్ళికూతురు స్నేహితురాలు.

తెనెలో ముంచిన తమలపాకులా వుంది.

పాలలో ముంచిన పారిజాతంలా వుంది.

ఆమెని చూడగానే చందనం వాసన, కర్పూరం పరిమళం గుర్తొస్తున్నాయి.

రెండుసార్లు కాఫీ యిస్తూ ఆ అమ్మాయే కాలు తగిల్చింది.

మరోసారి మంచినీళ్ళు ఇస్తూ వేళ్ళు తగిల్చింది.

పిట్ట గూటిలోకి వస్తోంది అనుకున్నాడు.

పూర్తిగా రానీ అని టెక్కు చేశాడు.

ఆ సాయంత్రం మాట కలిపింది.

తన గదికి రమ్మంది. వెళ్ళేడు.

మంచి నీళ్ళిచ్చింది. తాగేడు.

కూర్చోమంది. నిలుచునే వున్నాడు.

ఆ మాటా ఈ మాట మాట్లాడింది.

టేప్ రికార్డర్ ఆన్ చేసింది.

నీ కంటే నా మొగుడే నయం అన్నపాట వినిపించింది.

ఆ మర్నాడే రైలెక్కేసింది.

అదిగో... ఆ ఒక్కసారి అతని థియరీ దెబ్బతింది.

ఇటీస్ ఎన్ ఎక్సెప్షన్ దట్ ప్రూవ్డ్ ది రూల్ అనుకున్నా డతను.

అతనికి ఎలాంటి ఆడవాళ్ళు నచ్చుతారు?

నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు–

లావుగా వున్నవాళ్ళు, సన్నగా వున్నవాళ్ళు –

పల్లెపడుచులు, పట్నం పిల్లలు –

దొరసాన్లు, దొమ్మరసాన్లు –

పొడుగువాళ్ళు, పొట్టివాళ్ళు –

అతనికి నచ్చనిది ఒకటే రకం ముసలిరకం.

నల్లగా ఉన్నా నేరేడుపండు లాగుంది గుంట.

అనుకున్నాడు మహాలక్ష్మిని చూడగానే.

పిట్ట చిన్నది పైగా యిందులో కొత్తలాగుంది. బెదురుతుంది. డైరెక్టు ఎటాక్ యిస్తే ఎగిరిపోవచ్చు. పావురాన్ని ఎలా మచ్చిక చేసుకుంటాం?

గింజలు వేసి.

కానీ ఈ పావురం గింజలకి, డబ్బుకీ లొంగే రకంగా లేదు.

ఎక్కడా చిల్లర కొట్టు కూడా ఉన్నట్టు లేదు.

మరింక ఏదైనా ట్రిక్కు వేసి రేకెత్తించాలి.

అదే మన మీద పడాలి అనుకున్నాడు.

వయసు ఆమెలో రేపే నిప్పురవ్వ లాంటి కోరికని రాజేసి ఆమెని నిలువునా దహించుకుపోయేలా చెయ్యాలి.

ఎలా?

ఎలా?

యిలాంటి సమయాల్లోనే అతనికి తన మేమమామ జ్ఞాపకం వస్తాడు.

ఆ మేనమామకి ఆడ అనుభవం ఎక్కువ.

అతనోసారి రంగనాథానికి సలహా యిచ్చేడు.

ఏమని?

ఏమిటా సలహా?

ఒరే రంగా అమ్మాయిని పట్టడం ఒక ఆర్ట్ కాదు. అదొక సైన్స్ కూడా. అది అందరికీ చేతకాదు. ఆడపిల్లలు మన అందం, ఐశ్వర్యం చూసి వచ్చేస్తారనుకోకు. దేశంలో మనకంటే కుబేరులు, మనకంటే మన్మధులు కోట్ల కొద్దీ వున్నారు.

డబ్బిస్తే వచ్చేది బజారు సరుకు.

దాన్ని పట్టడానికి మనం ఏ ప్లానూ వెయ్యనక్కర్లేదు.

డబ్బుంటే అదే పట్టుకుంటుంది మనల్ని.

డబ్బుదాని దగ్గర కాదు మన దగ్గర.

మరంచేత మనం మొదట ఆలోచించాల్సింది–పిల్ల ఎవరు?

దాని బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి?

దానికేవిటి యిష్టం?

యింకా ముఖ్యం యిష్టం.

యింకా ముఖ్యం దానికేవిటి అయిష్టం?

మాట వరుసకి ఓ గుంటకి సెంట్లంటే పిచ్చి. హోమియో డాక్టరు దగ్గర సీసాల్లా దాని దగ్గర రకరకాల సెంట్లు వున్నాయి. దాని దగ్గర లేని సెంటు ఏదో కూపీలాగి అది రెండు సీసాలు కొను.

ఒకదాంట్లో నువ్వు స్నానం చెయ్యి!

రెండోది ఆ గుంటకి సమర్పించుకో.

మరో సొసైటీ లేడీకి సినిమాహాలు దగ్గర పకోడీలంటే పరమ యిష్టం.

అప్పుడు నీ రోజేవిటి?

నీకు పకోడీలంటే ఎలర్జీ ఖరీదైన హోటలు పకోడీలంటే డోకు. సృష్టిలో అన్నిటికంటే రుచికరమైనవి సినిమాహాలు పకోడీలే. ఈ డైలాగులు అప్పచేస్తే సరిపోదు.

నీకు యిష్టం వున్నా, లేకపోయినా నువ్వు కూడా తినాలి– ఆర్రోజులు ఉపవాసం తరువాత ఐస్‌క్రీము తింటున్న మొహం పెట్టి –

భూమ్మీద ఆకులెన్ని రకాలో అమ్మాయిలు అన్నిరకాలు.

ఒకర్తెకి కవిత్వం యిష్టం.

మరో గుంటకి కథలంటే పిచ్చి.

అలాంటి వాళ్ళ దగ్గర నువ్వు ఒకవిగాడ్నో, కథకుడ్నో పట్టుకుని డబ్బిచ్చో, ముద్దు పెట్టుకునో వాళ్ళచేత రాయించి అవి నువ్వే రాసేనని చెప్పాలి.

నమ్ముతారా అని నీ అనుమానమా!

ఈ ఆడ గుంటలున్నారు చూడు. వీళ్లు ఒట్టి అమ్మాకపు గొర్రెపిల్లలు.

మేక కసాయివాడ్నే నమ్ముతుంది!

సామ్యం బావులేదా?

బావున్నా, లేకపోయినా నిజం అంతే, కాలేజీ పిల్లల్లో మాత్రం ఒక స్పెషల్ వెరైటీ వున్నారు.

వాళ్ళెవరంటావా?

దేశభక్తి గుంటలు.

ఆమ్మో, వీళ్ళు పరమ డేంజరస్.

వీళ్ళకీ మామూలు బాణాలు పనిచెయ్యవు.

పాశుపతాస్త్రం తియ్యాల్సిందే.

వాళ్ళ దగ్గర నువ్వు కేవలం నక్సలైటు కబుర్లే చెప్పాలి.

విప్లవం, ఆకలి కేకలు వెయ్యాలి.

మరో మేనల్లుడిలా ప్రవర్తించాలి.

మార్క్స్ మనవడిలా కనిపించాలి.

అయితే ఆడవాళ్ళందరికీ పనికొచ్చే జనరల్ మందులు రెండున్నాయి.

అదృష్టం బెడిసి కొట్టకుండా అమోఘంగా పనిచేస్తాయి.

ఒకటి పొగడ్త !

రెండు బూతు పుస్తకం.

పొగడ్తకి ఆడది వుండదు.

కాని ఈ కేసులో లాబం వుండకపోవచ్చు.

"నువ్వు తోమిన అంట్లు ధగధగ మెరుస్తున్నాయి" అనాలా?

"నువ్వు తుడిచిన గదులు అద్దంలా మెరిసిపోతున్నాయి" అనాలా?

ఈ కేసులో పొగడ్త పనికిరాదు.

మరింక రెండోది వాడి చూస్తే?

"మొగుడూళ్ళో లేనప్పుడు ఎంత మహాపతివ్రత అయినా సరే దాన్చేత ఓ ఘాటైన పుస్తకం చదివించు. గంటలో అది నీ పక్కలోకి రాకపోతే నేను పేరు మార్చుకుంటాను" అని సవాలు కూడా చేసాడు ఆ మేనమామ.

ఆ గుంటకి చదువు వచ్చునో రాదో? అయినా ట్రై చెయ్యటంలో తప్పలేదు.

మర్నాడు పొద్దునే ఫ్రెండు దగ్గరికి వెళ్తున్నాను అక్కా. రాత్రికి గాని రాను అని మహాలక్ష్మికి వినేటట్టు చెప్పి వెళ్ళిపోయాడు.

మరో అరగంటలో గదిలోకి అడుగుపెట్టిన మహాలక్ష్మికి మంచం మీద ఓ పుస్తకం కనిపించింది.

తీసి చూసింది.

బొమ్మలే కాకుండా పక్కన కామెంటరీ కూడా వుంది.

తను మరచిపోయిన నాలుగో తరగతి చదువు కూడ బలుక్కుని చదివింది.

పుస్తకం పూర్తి అయింది.

ఒళ్ళంతా నిప్పు రాసుకున్నట్టు మండిపోతోంది.

కండ కండ బిగిసిపోతోంది.

నరం నరం తెగిపోతోంది.

బాధ, ఆనందం కలిసిన పీలింగ్.

అలా వారం గడిచింది.

ఎనిమిదోనాడు –

మహాలక్ష్మి కోరిక ఒక్కటే – ఎవరు పిలిస్తే వాడి దగ్గరకు వెళ్ళిపోవడం.

ఎనిమిదోనాడు ఉదయం –

రంగనాథం మేడమీద గదిలో మంచంమాద వెల్లకిలా పడుకున్నాడు.

పడుకొని పైకప్పు వేపు చూస్తున్నాడు.

పైన సీలింగ్ ఫేన్ మెల్లిగా తిరుగుతోంది.

ఉహుఁ అతను ఫేన్ వేపు చూడ్డంలేదు. పైన తన గూట్లో కొట్టుకుంటున్న ఈగవేపు దెయ్యం కాళ్ళతోనడిచి వస్తోంది సాలెపురుగు.

సింబాలిక్‌గా దానివేపు చూస్తున్నాడా?

అబ్బే... లేదు!

మరేం చేస్తున్నాడు?

ఆలోచిస్తున్నాడు.

ఆలోచిస్తూ ఎదురుచూస్తున్నాడు.

తన అంచనా ప్రకారం మహాలక్ష్మి గడియో క్షణమో రావలి.

అతని అంచనా రైటే.

అప్పుడే వచ్చింది మహాలక్ష్మి లెగండి... గది వూడవాలి అంటూ.

చీర ఓవేపు ఎత్తి నడుం దగ్గర దోపుకుంది. వయసులో వున్న ఒక గుండ్రటి అడమణుకు కనిపించేటట్టు దోపుకుంది.

ఎత్తైన గుండెలు మధ్య లోయలో పైట!

రేగిన జుత్తు!

అచ్చు ప్రబంధనాయికలా వుంది.

కష్టాల్లో సీన్లో కూలి పని చేస్తున్న హీరోయిన్లా వుంది.

మహాలక్ష్మి ఎప్పుడొస్తుందా, అసలు వస్తుందా రాదా అన్న ఆలోచనతో సతమతమయ్యేడే తప్ప తీరా వచ్చేక ఎలా ప్రోసీడ్ అవాలి అన్నది ఆలోచించలేదు.

వెధవది ఎంతమందితో అలవాటున్నా అదేవిటో ఎప్పటి కప్పుడు కొత్త టెన్షను.

ఒక్కొక్కప్పుడే ఏక్షనుకి దిగేలోగా, ఆలోచించడానికి మిలిటరీ వీరులకీ, మంచం శూరులకీ టైము దొరకదు.

అప్పుడు ఆలోచిస్తూ కూర్చుంటే శతృవే కాల్చేస్తాడు.

పిట్ట పారిపోతుంది.

డైరెక్టు ఎటాక్ ఒక్కటే మార్గం.

అంచేత నక్సలైటుని చూసిన సి.ఆర్.పి. వాళ్లా ఒక్క గెంతు గెంతాడు రంగనాథం.

మహాలక్ష్మి నక్సలైట్లా ఎదురుతిరగలేదు. పారిపోనూ లేదు.

పోలీసుల్లో కలిసిన దొంగ నక్సలైట్లా నవ్వుతూ నిల్చుంది.

ఛమ్మీగా నిల్చుంది.

ముందు చెయ్యి పట్టుకొని తరువాత కౌగిలించుకుం దామని రంగనాథం ప్లాను

కౌగిలించుకునే లోపలే పారిపోయింది.

చెయ్యి మాత్రం దక్కింది.

రెండోనాడు....

ముందు చెయ్యి పట్టుకోవడం.

తరువాత కౌగిలించుకోవడం.

వెంటనే ముద్దు పెట్టుకోవడం.

ఇదీ రంగనాథం ప్లాను.

అయితే అతనికి ముద్దు దక్కలేదు.

వెంటనే అతనికో పెద్ద అనుమానం వచ్చింది. కొంపదీసి దీనిక్కూడా ఏ మేనత్తో మొగాడ్ని లొంగదీసుకోవడం ఎలా అన్న విషయం మీద సలహాలు యివ్వలేదుకదా.

మొగాడ్ని లొంగదీసుకోవడం ఆడదానికి జన్మతో వచ్చిన విద్య. అది చెప్పడానికి ఏ మేనత్త, మేనమామ అవసరం లేదని రంగనాథానికి తెలీదు.

మూడోనాడు అతనికి ముద్దూ, మహాలక్ష్మి కూడా దక్కారు.

కొన్ని నెలలు.

మహాలక్ష్మి

ఇంద్రధనస్సు మీదే నడిచింది.

వెండి మబ్బుల్లో పడుకుంది.

వెన్నెల శాలువా కప్పుకుంది.

నక్షత్రాలు తలలో పెట్టుకుంది.

మాటలో ముత్యాలు మూటగట్టింది.

నవ్వులో నవరత్నాలు నింపింది.

ఒళ్ళు పెరిగింది.

మనసు ఎదిగింది.

## 6

మహాలక్ష్మి ఎన్నడూ ఎవర్నీ డబ్బు అడగలేదు.

కాని ఆమెకి రంజని డబ్బు యిచ్చేది.

రమణమూర్తి యిచ్చేవాడు.

రంగనాథం యిద్దరికంటే ఎక్కువ యిచ్చేవాడు.

అంచేత ఆమె తండ్రి తాగుడు ఎంత ఎక్కువ చేసినా ఆమె ఇంట్లో ఎవరూ పస్తులుండలేదు.

రంగనాథం నెలకి పదిహేను రోజులు మహాలక్ష్మి యింటికి వస్తూనే వున్నాడు.

ఆ పదిహేను రాత్రుల ఆమెకి వెన్నెల రాత్రులే. కాలం యిలా గడిచిపోతే బావుండుననుకుంది.

ఇలా గడిచేటట్టు చూడమని దేవుడ్ని ప్రార్థించింది.

రెండేళ్ళు దేవుడు ఆమె ప్రార్థన విన్నాడు.

ఒక వర్షం రాత్రి...

చీకటే వర్షంగా పడుతోందా అనిపించే రాత్రి... ప్రపంచంలో వున్న పాపం భరించలేక దేవుళ్ళు, దేవతలు మూకుమ్మడిగా ఏడుస్తున్నారా అనిపించే రాత్రి... పెద్ద పెద్ద చెట్లు ఎండుటాకుల్లా ఎగిరిపోతున్నాయి. మహాలక్ష్మివీధి గదిలోను, రంజనీ, రమణ మూర్తి ఒళ్లు మరచి నిద్రపోతున్న రాత్రి...

పూరి గుడిసెలు పేకముక్కల్లా ఎగిరిపోతున్నాయి.

టక్.... టక్....

వీధి తలుపు ఎవరో కొడుతున్నారు.

మొదట లేచింది మహాలక్ష్మి

తలుపుతీసింది.

బయట వరండాలో

జీపు డ్రైవరు!

దెయ్యాన్ని చూసి భయపడినవాళ్ళా వున్నాడు. పిచ్చెత్తిన జంతువులా వెర్రి అరుపులు అరుస్తున్నాడు. ఒక్కసారి ప్రాణం పోయిన మనిషిలా కుప్పలా కూలబడిపోయాడు.

మహాలక్ష్మికీ ఏమీ అర్థంకాలేదు.

ఏం చెయ్యాలో తోచలేదు.

పరిగెత్తికెళ్ళి రంజన్ని లేపింది.

రంజనీ, రమణమూర్తీ యిద్దరూ బయటికి వచ్చారు.

స్పృహలేని డ్రైవర్ని లోపలికి మోసేరు రమణమూర్తి, మహ లక్ష్మి.

అరగంట నానా అవస్థపడ్డాక అతనికి తెలివొచ్చింది. పిచ్చి కేకలూ, వెర్రి అరుపులూ, ఏడుపు తీసేస్తే అతను చెప్పింది – ఎవరు ఎంత వద్దన్నా వినకుండా ఆ గాలి వానలో జీపులో బయలుదేరాడు రంగనాథం తన పల్లెటూరు నుంచి.

బాగా త్రాగివున్నాడు.

డ్రైవరు బ్రతిమాలేడు. నచ్చచెప్పాడు.

అయినా వినలేదు.

రంగనాథమే డ్రైవ్ చేశాడు.

డ్రైవరు వెనుక సీట్లో పడుకున్నాడు.

కళ్ళు తెరిసేసరికి రోడ్డుమీద పడున్నాడు.

జీపు పిప్పి అయిపోయిది.

రంగనాథం అప్పటికే చచ్చిపోయాడు.

రంజని భోరుమంది.

మహాలక్ష్మి ఏమీ అనలేదు. అలా బొమ్మలా నిల్చుండిపోయింది.

రమణమూర్తి ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్ళాడు.

రమణమూర్తి మహాలక్ష్మిని ఎప్పుడూ యితర ఆడవాళ్ళని చూసిన దృష్టితో చూడలేదు. అతనికి ఆమె గురించి రంజని చెప్పడం వల్ల అతనికి ఆమె అంటే జాలి, అభిమానం, మహా లక్ష్మికీ రంగనాథం మధ్య సంబంధం అతనికి చూచాయిగా తెలిసినా అతనేం పట్టించుకోలేదు. కాని యిప్పుడు రంగనాథం చావు ఆమె మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో అసలే చిన్నపిల్ల పైగా బోలెడు బాధ్యతలు.

రమణమూర్తి రసికుడే తప్ప రాక్షసుడు కాదు. ఆ క్షణంలో మహలక్ష్మిని దగ్గరకు తీసుకొని ఒక తోడబుట్టిన వాడిలా ఓదార్చాలనిపించినా రంజని ఏమనుకుంటుందోనని భయం వల్ల ఆగిపోయాడు.

రంజనికి మహాలక్ష్మి పట్ల అభిమానం ఆమెనెప్పుడూ కన్న పిల్లలాగే చూసుకునేది. తన తమ్ముడు మహాలక్ష్మిని చేరదీసి నందుకు ఆమె బాధపడలేదు సరికదా ఎంతో సంతోషించింది. అంచేత యిప్పుడు అతని చావు తనకన్నా మహాలక్ష్మికే ఎక్కువ దెబ్బ అనిపించిన రంజని మహాలక్ష్మిని పట్టుకొని బావురుమంది.

ఆ రాత్రంతా యిద్దరూ అలా ఏడుస్తూనే వున్నారు.

మర్నాడు ఉదయం....

రాక్షసులు పత్రిపూజ చేసినట్టు రోడ్డంతా గాలికి రాలిన ఆకులు కుప్పలుగా పడి వున్నాయి.

గాలికి విరిగి రోడ్డుకడ్డంగా పడిపోయిన చెట్లు యుద్ధంలో చచ్చిన రాక్షస వీరుల్లా వున్నాయి.

తనూ, తన పిల్లలూ రాత్రి ప్రళయ గండం దాటి బ్రతికి బట్టకట్టినందుకేమో ఒక వీధి కుక్క భగవంతుడికి కృతజ్ఞత చెప్తున్నట్టు ఆకాశం వేపు మోర చాచి చూస్తోంది.

నేను లేనప్పుడు ఎంత ఘోరం జరిగిపోయింది అని ఆశ్చర్య పడుతున్నట్టు పెద్ద మొహం చేసుకొని ప్రపంచాన్ని చూస్తున్నాడు సూర్యుడు.

ఏక్సిడెంటులో చచ్చిన శవాన్ని ఎంత చూసినా తనివి తీర దన్నట్టు చూస్తున్నారు ప్రజలు.

ఈ కేసులో ఏవైనా తేల్తుందా? లేక కంచి గరుడ సేవేనా? అని పోలీసులు ఆలోచిస్తున్నారు.

రోడ్డుకి పక్కగా వున్న చెట్టుకింద నిల్చుంది రంజని. ఏడవ లేని ఆమె కళ్ళు ఎర్రగా వాచి వున్నాయి. రాఘవయ్య పోలీసు లతో ఏదో మాట్లాడుతున్నాడు.

మనుషులకి దూరంగా మరో చెట్టుకింద నిల్చుంది మహా లక్ష్మి ఏడవకూడదని మహాలక్ష్మి ఏడుపు ఆపుకోలేక చెట్టు వెనక్కి వెళ్ళిపోయింది.

ఆమె నీళ్ళు నిండిన కళ్ళకు ఎర్రటి ఎండలో ప్రపంచం అంతా మండిపోతున్నట్లనిపించింది.

తన దహనానికి తనే ఏర్పాటు చేసుకోవలసి వచ్చిన అభా గ్యుల్లారా వుందామె.

శవ పంచాయితీ వగైరాలన్నీ చకచకా జరిపించేశారు రాఘ వయ్య. రంగనాథం శరీరాన్ని రాఘవయ్యకి అప్పగించారు పోలీసులు.

ఆ తరువాత రంగనాథం భార్య, తల్లి అంతా రావడం, పదిరోజులు కర్మకాండ అంతా కలలో చూస్తున్నట్టు చూసింది మహాలక్ష్మి.

తన బతుకులోకి మళ్ళీ చీకటి వచ్చేసింది అనుకుంది ఆమె.

తనుకూడా రంగనాథం భార్యలా బొట్టు చేరిపేసుకొని గాజులు బద్దలు కొట్టేసుకుందామా అనుకుంది.

నూతిలోకి గెంతేద్దాం అనుకుంది.

రైలు కింద బుర్ర పెట్టేద్దామనుకుంది.

కాని తండ్రి నారాయుడి దైన్యం, తల్లి అవిటితనం, తోబుట్టు వుల పసితనం, ఆమెని ఏమీ చెయ్యకుండా ఆపేశాయి.

❖ ❖ ❖

బొట్టు చెరిపేసుకొని, గాజులు బద్దలుకొట్టేసుకుందామా అని కూడా అనుకుంది.

బొట్టు చెరిపేసుకొని, గాజులు బద్దలు కొట్టేసుకుందామా అని కూడా అనుకుంది.

ఇదంతా రంగనాథం చచ్చిపోయిన కొత్తల్లో....

కాలం గడిచిన కొద్దీ క్రమేపీ ఆమెలో రంగనాథం జ్ఞాపకాలు చెరిగిపోవడం ప్రారంభించేయి. మరికొంత కాలానికి రంగ నాథంతో గడిపిన రోజు జ్ఞాపకం వచ్చినప్పుడు కోరిక పెరిగిందే తప్ప బాధ పెరగలేదు.

ఆ పరిస్థితుల్లో రాఘవయ్య గారి ఎదురింట్లో అద్దెకు దిగేడు కామరాజు.

దిగడం మాత్రం ఒక్కటే దిగేడు.

అతని భార్య పురిటికి వెళ్ళిందట.

ఆమెకు ఎన్నో నెలని ఎవరూ అడగలేదు.

అతను చెప్పలేదు.

ఇంట్లో దిగిన మర్నాడు....

కామరాజు రాఘవయ్య ఇంటికి స్వయంగా వచ్చి తనని పరిచయం చేసుకున్నాడు.

నాకీ వూరు కొత్త. హోటల్లో భోంచేస్తాను. పనిమనిషిని పెట్టుకోవడం వైగరాలు ఆడవాళ్లు చెయ్యవలసిన పన్లు. అవన్నీ మా ఆవిడ వచ్చేక చూసుకుంటుంది. అంతవరకు మీ పని మనిషిని కాస్త ఇల్లు తుడిచి, మంచినీళ్ళిచ్చి పొమ్మనండి. ఎంత కావలిస్తే అంత యిస్తాను అన్నాడు.

అతను చెప్పిన దాంట్లో అసందర్భం ఏదీ కనిపించలేదు రాఘవయ్యకి గాని, రంజనికిగాని, పైగా మహాలక్ష్మికూడా మరో పది రూపాయలు ఎక్కువ వస్తాయి. పోన్లే పాపం అను కున్నారు. అంచేత వాళ్లే మహాలక్ష్మిని కామరాజింట్లో పనికి కుదిర్చేరు.

మొదట్లో కామరాజింటికి పొద్దున్న మాత్రమే పనికి వెళ్ళేది.

కొన్ని వారాలు గడిచాయి.

కామరాజు పెళ్ళాం పుట్టింట్లోనే వుంది.

రంగనాథం స్వర్గంలోనో, నరకంలోనో వున్నాడు.

కామరాజుకి ఆడబాధ పట్టుకుంది.

మహాలక్ష్మికి మొగబాధ పట్టుకుంది.

ఇద్దరూ... కాలంలో వున్నారు.

కామంలో వున్నారు.

కావరంలో వున్నారు.

అంచేత కామరాజు పనిమనిషిని పక్కమీద మనిషిగా చేసుకోవడానికి ఎక్కువ కష్టపడలేదు.

మహాలక్ష్మి కూడా ఏ మాత్రం యిబ్బంది చూపించలేదు. ఇప్పుడు మహాలక్ష్మి రాత్రివేళ కావాలనుకున్నప్పుడల్లా కామరాజింటికి వెళ్ళిపోతోంది. రాఘవయ్య వూళ్ళో లేదని చెప్పి.

మళ్ళీ ఆమె బ్రతుకు రాచబాట అయింది.

మళ్ళీ ఆమెకి వెన్నెల రాత్రులు వచ్చాయి.

మళ్ళీ ఆమె మొహంలో మెరుపు బుగ్గల్లో ఎరుపు వచ్చాయి.

❖ ❖ ❖

మహాలక్ష్మికి ఓ మేనమామ వున్నాడు

అతని పేరు కిట్టయ్య.

ఊరు : సిటీకి పదిమైళ్ళ దూరాన పల్లె

ఆస్థి : రెండు బక్క ఎడ్లు, అగ్గిపెట్టెల్లాంటి జెట్కా బండి, అరెకరా చెక్కా.

ఉద్యోగం : తన ఎద్దుల్తో మూడో ఎద్దు పనిచెయ్యడం.

అతను మంచాన పడ్డ అక్కని చూడ్డానికి ఏడాదికో, ఆర్నెల్లకో ఓసారి వస్తాడు. వచ్చినప్పుడల్లా బావగారి తాగుడు, చిందులు చూస్తాడు.

చూసినప్పుడల్లా బాధపడతాడు.

"తాగితే తాగేడు, తంతే తన్నేడు. కాని ఈడొచ్చిన పిల్లకి పెళ్ళి సేద్దాం అనుకోడేటప్పా? తాగినోళ్ళంతా యిలాగే సేస్తన్నారా?" అని తన అక్క దగ్గర బాధపడ్డాడోసారి.

మూలిగింది మహాలక్ష్మి తల్లి.

బాధ వ్యక్తం చెయ్యడానికి భాషలేని మనిషి మూలిగే మూలుగు అది.

విన్నవాడి ఎముకలు కొరదు బారిపోయే మూలుగు.

దేవుడు ఆత్మహత్య చేసుకునే మూలుగు,

కురుక్షేత్రంలో కుంతి మూలుగు.

లంకలో సీత మూలుగు,

ఇప్పుడు కూలీల మూలుగు

ఆ మూలుగు దేశానికీ, కాలానికీ కూడా మంచిది కాదు.

"ఎప్పటికైనా ఆడేటన్నా సూస్తాడా? నన్ను సూడమంటాడా? గుర్రంలా ఎదిగిన గుంటని ఎదురుగా సూస్తే ఆడికి నిద్దరెలా పడుతున్నాది? ఆ సారా ఎలా సయిస్తున్నాది? అడ్ని అడిగి సెప్పు నన్ను సూడమంటాడేమో. ఎంతైనా తోడబుట్టిన వాడ్ని కదా మరింత నాకు తప్పదు మళ్ళీ అడిగేడు మేనమామ.

పక్కకి తిరిగి పడుకున్న మహాలక్ష్మి తల్లి కన్నీరు జారి మంచం మీద పడి జల్లులా మళ్లేయి.

"బాబ్బాబు! ఈ ఉపకారం గనుక సేసిపెడితే సచ్చి నీ కడుపున పుడతాను" ఆ కన్నీటి జల్లు అర్థం.

మా ఊర్లోనే రాజయ్యగాడని ఓ కుర్రాడున్నాడు. పటాలంలో పని! ముందటేడే ఒక్క పిల్లడ్ని కని పెళ్ళాం సచ్చిపోయింది. అతగాడు మహా కరకండి మనిషి! మాటాడమంటావా? ఇంతక వారమో, రెండు వారాలో వుంటాట్ట వూళ్ళో ఏ సంగతి చెప్పు.

మహాలక్ష్మి కళ్ళు కృతజ్ఞతో మెరిశాయి.

❖ ❖ ❖

అయితే ఎప్పుడు పెళ్ళి? కామరాజు అడిగాడు మహాలక్ష్మి చేయి పట్టుకుంటూ.

సిగ్గుతో తలదించుకుంది లక్ష్మి.

ఏలా వున్నాడు పటాలం మొగుడు?

నీకంటే బాగానే వుంటాడు చెయ్యి లాగేసుకుంది.

దేవుడి కొండమీద జరిగింది మహాలక్ష్మి పెళ్ళి. రాజయ్య లక్ష్మికి ఒక జత బంగారు గాజులు పెట్టేడు.

పెళ్ళి అయ్యేక పదిరోజులు అత్తగారింట్లో వుంది లక్ష్మి పదకొండో నాడు మిలటరీలోకి వెళ్ళిపోయాడు రాజయ్య.

రాజయ్యంటే అయిష్టం లేదు లక్ష్మికి.

మహాలక్ష్మి మళ్ళీ పుట్టింటికొచ్చేసింది.

ఆమె పది రోజుల్లో వస్తుందని తెలిసిన రంజని, కామరాజు మరోపనిషిని పెట్టుకోలేదు. అంచేత మళ్ళీ మామూలుగా పనికి వెళుతోంది లక్ష్మి.

ఆమె వచ్చిన ఒక వారం వరకూ కామరాజు ఏం మాట్లాడలేదు.

ఏనిమిదో రోజు...

ఈ రాత్రి రాఘవయ్య ఊళ్ళో లేదని చెప్పిరా అన్నాడు కామరాజు.

ఆ రాత్రి లక్ష్మి రాలేదు.

"ఓస్! పాతివ్రత్యం వెలగబెడుతోందోయ్ గుంట" తిట్టుకున్నాడు కామరాజు.

మర్నాడు -

"పటాలం మొగుడు బాగానే పనిచేసేడే అన్నాడు" కామరాజు.

లక్ష్మి మాట్లాడలేదు.

చెయ్యి పట్టుకున్నాడు.

విడిపించుకోబోయింది.

కామరాజుది ఉడుంపట్టు! విడవలేదు. దగ్గరగా లాగి గట్టిగా కౌగిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు.

సి! స్సీ! ఒద్దు నా కిష్టం లేదు. అంది విడిపించుకుంటూ.

"శెభాష్! మొన్న ఆదివారం నుండి మా ఇంట్లో రంకుల్లే వందిట వెనకటికెవత్తో నీలాంటిదే..." రెట్టించేడు.

లక్ష్మి మాట్లాడలేదు.

తెగే వరకూ లాగే మనిషి కాదు కామరాజు.

ప్రేమలో పట్టు, విడుపూ వుండాలి.

ఒడుపు, ఒరవడి వుండాలి.

ఈ వేళ రమ్మన్నది రేపు పొమ్మంటుంది.

రేపు పొమ్మన్నది ఎల్లుండి రమ్మంటుంది.

ఇప్పుడే మచం ఎక్కు అంటే అసలుకే మోసం రావచ్చు. పన్లోకి రావడం మానేస్తుంది.

సరేలే! నీ ఇష్టం! నీ మనసు మారినప్పుడే రా...." రాజీ కొచ్చేడు కామరాజు.

లక్ష్మి పెళ్ళై రెండు మూడు నెలలైంది. ఈ ఐదారు నెలలో ఆమె బ్రతుకులో చెప్పుకోదగిన మార్పు ఏదీ లేదు.

రాజయ్య దగ్గర్నించి -

నీకు మంచి చీర కొన్నాను అనో-

నీ ఫోటో చూసి తోటి సిపాయిలంతా చాలా బావుందన్నారు అనో -

వారానికో, పదిరోజులకో ఓ ఉత్తరం వస్తూనే వుంది.

రోజులు బాగానే ఉన్నాయి అని సంతృప్తి పడింది లక్ష్మి.

అయితే ఆ సంతృప్తి ఎక్కువ కాలం నిలవలేదు.

ఓనాడు...

మహాలక్ష్మి అని పిలిచేడు కామరాజు.

ఒంగి తుడుస్తున్న మహాలక్ష్మి లేచి నిల్చుంది.

ఎత్తి దోపుకున్న చీర వెనక లేసుపరికిణీ కనిపిస్తోంది. హటాత్తుగా లేచి నిల్చున్నందువల్ల ఆరోగ్యవంతమైన ఆమె గుండెల మీద పైట జారిపోయింది.

నల్లగా వున్నా నల్ల ద్రాక్షగుత్తుల్లా వున్నాయి.

కామరాజు కోరిక కట్టలు తెంచుకుంటోంది.

అయినా అసభ్యంగా వుండకుండా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు.

అతనిలో రామరావణ యుద్ధం జరుగుతోంది.

ఏం? అంది లక్ష్మి.

కామరాజులోరావుడు గెలిచేడు.

అతను తల దించుకున్నాడు.

లక్ష్మి మళ్ళీ వంగి గది తుడుస్తోంది.

తుస్తున్నప్పుడు ఆమె గుండ్రటి భుజాల కదలిక కామరాజు కళ్ళు మెరిసాయి. ఒంగి ఉన్న ఆమె జాకెట్టులోకి చూసేడు.

వెంటనే అతనిలో వున్న రావణాసురు గదతో రాముడి బుర్ర మీద ఒక్క పెట్టుపెట్టాడు.

రామణాసురుడు లక్ష్మిని మంచం మీదకి లాగాడు.

"నీ వంటి మీద ఎక్కడ ఏ మచ్చ వుందో నాకు తెలుసు. కాదన్నావో నీ మొగుడికి ఉత్తరం రాస్తాను."

పై కప్పు మీదపడిపోయిన బల్లిలా అయిపోయింది లక్ష్మి.

మనుషుల్లో నైచ్యం ఉంటుందని తెలుసు కాని మరీ ఇంత ఉంటుందని ఆమెకు తెలీదు.

కాలిపోతున్న కాపురం మంటలు ఆమెకు కనిపించేయి. నిలబడ్డ నేల నిలువుగా బద్దలైనట్టు.

పన్నీటి సరస్సు విషపు మడుగుగా మారిపోయినట్టు, తాగిన పాయసము కడుపులో కాలకూట విషంగా మారిపోయినట్టు.

ఎవరో రాక్షసుడు తనని బట్టలు విప్పేసి తన తండ్రి ఫ్యాక్టరీ ముందు తన భర్త పటాలం ముందు నడిపిస్తున్నట్లు అనిపించింది మహాలక్ష్మికి.

తర్వాత మూర్ఛపోయిన మనిషిలా అలా కదలకుండా వుండి పోయింది.

ఆ తర్వాత కూడా అలా చాలాసార్లు వుండిపోవలసి వచ్చింది.

మరో రెండు నెలలకి కామరాజు ట్రాన్సఫరై వెళ్ళి పోయాడు.

పీడ విరగడైంది అనుకొని సంతోషించింది లక్ష్మి.

అంతకంటే పెద్ద పీడ రాబోతోందని తెలీదు లక్ష్మికి.

## 16

ఆ వేళ దీపావళి

రాత్రి ఎనిమిదన్నర.

నేల చీల్చుకొని వచ్చిన రంగుల ఫౌంటెన్‌లా వెలుగు తున్నాయి. చిచ్చుబుడ్లు.

వెన్నెల పూసలు రాల్చుతున్నాయి మతాబాలు.

ఆకాశం రంగుల రత్నాలతోను, మెరుపు గీతలతోనూ నిండి పోయింది.

సంతోషం పట్టలేని లైట్‌హౌస్ అల్లరిపిల్లలా వానా వానా వల్లప్ప తిరుగుతోంది.

గాలి సెంటు రాసుకుంది.

చీకటి కాటుక పెట్టుకుంది.

చీరల జరీపువ్వుల్లో లక్ష దీపాల వెలుగు.

జడ మల్లెల్లో మత్తుల దొంతర్లు.

లక్ష్మి తెచ్చిన మతాబు సామాను కాలుస్తున్నారు ఆమె చెల్లెలు, తమ్ముడు.

తల్లి కూడా తన పక్షవాతం కాలు చాపుకొని గుమ్మంలో కూర్చుని కష్టాలు మరిచిపోయింది.

లక్ష్మి తలలో పువ్వులు పెట్టుకుంటూ గుమ్మంలో నిల్చుంది.

ఇంతలో....

దూరంగా ఒక పెనుపక్షి లాంటి వాడు కోడిపిల్లలాంటి వాడ్ని పట్టుకొని లాక్కొస్తున్నాడు గజగజ వణికింది మహాలక్ష్మి.

వాళ్ళు తన ఇంటికే వచ్చారు.

ఆ కోడిపిల్ల నారాయుడు.

ఆ పెనుపక్షి కాబూలీవాడు.

తానున్నర పైజమా, అరతాను లాల్చీ తొడుక్కున్నాడు.,

మనిషిన్నర పొడుగున్నాడు.

ఇద్దరు మనుషుల వెడల్పున్నాడు.

అతను జటాయువులా వున్నాడనవలసి వస్తే రావణుడితో లాలూచీ అయిపోయిన జటాయువులా వున్నాడు.

అతని చేతికి మణుగు మణుగు కండలున్నాయి.

అతని చేతిలో లారీ, లారీల్లో కాబూలీ వాడిలా వుంది.

అతను మెట్లెక్కి వరండాలోకి వచ్చాక మహలక్ష్మి తండ్రి మెడ వదిలాడు. మహలక్ష్మి పెట్టుకుంటున్న పువ్వులు జారి కిందపడిపోయాయి. ఆమె ఇంట్లోకి పరిగెత్తింది.

కాబూలీవాడు ముందు తెలుగులో తిట్టేడు. కానీ అతనికి తెలుగు బూతులు అంతబాగా రావు. అంచేత స్వంత భాషలో తనివితీరా తిట్టాడు.

తిట్టడం అయిపోయాక అయిదు నిమిషాలు అయాసం తీర్చుకున్నాడు. అయాసం తీర్చుకున్నాక అతను చెప్పింది వింటుంటే... తనని ఆ భగవంతుడు కూడా తప్పించలేడు తను తన బాకీదార్లను కోర్టుకి యీడవడు. ఈ కీలుకాకీలు విరిసేసి పులుసు పెట్టుకొని తాగేస్తాడు.

తను ధర్మరాజు, కాబట్టి అడపాదడపా మధ్య మధ్య ఒక్కో నెల వడ్డీ కట్టకపోయినా వూరుకున్నాడు. కాని యింక వూరుకోడు.

అసలు ఊరుకోదల్చుకోలేదు.

ఆ రాత్రే మహలక్ష్మి తండ్రి కీళ్ళన్నీ మెటికలు విరిచినట్టు విరచదల్చుకున్నాడు.

మహలక్ష్మి వంటిమీదున్న బంగారం కాకుండా ఆమె కోక కూడా లాక్కుని వీధిలో నిలబెట్టేయదల్చుకున్నాడు.

అలా తను చేయదల్చుకున్నవన్నీ లిస్టు చదవడం అయి పోయాక ఒక్కసారి మాట్లాడడం ఆపేశాడు.

ఆమెకి ముచ్చెమటలు పోశాయి.

ఇప్పుడేవిటి చేస్తాడు? ఏవిటి? ఏవిటి?

ముందు తనకోక విప్పేసి తరువాత తండ్రి ఎముకలు విరిచేస్తాడా?

భగవాన్

అలనాటి ద్రౌపదీ వస్త్రాపహరణంలో శ్రీకృష్ణుడిలా తన నెవరూ కాపాడలేరా?

ఏ శ్రీకృష్ణుడూ రాలేదు.

కాబూలీవాడే ఆమెని గాజులూ, దుద్దులూ ఇచ్చేయమన్నాడు. మంగళసూత్రం మాత్రం ముట్టుకోనన్నాడు.

ఆమె మాట్లాడకుండా యిచ్చేసింది.

అవి తీసుకుంటూ "నీ కూతురీ కంగన్ మాకీ వద్దు. మా పైసా మాకిచ్చేసి, నీ మాల్ నవ్వు పట్టుకుని పో" అని గాజులు, దుద్దులు జేబులో వేసుకొని వెళ్ళిపోయాడు.

అసలు సంగతేమిటంటే....

మహాలక్ష్మి తండ్రి నారాయుడు సంవత్సరంన్నర క్రితం నూట యాభై రూపాయలు కాబూలీవాడి దగ్గర అప్పు తీసు కున్నాడు. అందులో కొంత తాగుడికి పోయినా మిగతాది ఇంటికే ఖర్చు పెట్టేడు.

వడ్డీ నెలకు రూపాయకి అర్ధరూపాయే. ఇప్పటికి అంతా కలిపి ఏడువందలపై చిలుకు అయింది. ఆ సొమ్ము అతనికి ఆణాపైసలతో కొట్టేస్తే ఆమె తన పటాలం మొగుడు పెట్టిన వస్తువులతో తన యిష్టం వచ్చిన చోటికి పోవచ్చు.

ఇవ్వకపోతే ఆమె మొగుడి దగ్గరికి వెళ్ళినా, మానినా నారా యుడు మాత్రం యముడి దగ్గరికి వెళ్ళడం ఖాయం.

ఇది కాబూలీ వాడి తీర్పు.

తీర్పు విన్న నారాయుడు కుప్పకూలిపోయాడు.

రోడ్డు మీద వెలుగుతున్న చిచ్చుబుడ్లు, తనని, తన కుటుం బాన్నీ సజీవ దహనం చేయడానికి వచ్చిన విషసర్పపు నిప్పునాలి కల్లా వున్నాయి.

ప్రకృతి తనమీద పగబట్టి విసురుతున్న నిప్పు కణికల్లా వున్నాయి. ఆకాశంలోంచి రాలుతున్న తారాజువ్వలు.

ఆమె కాళ్ళదగ్గర పడివున్న పువ్వుల మాల ఆమెని కాటు వేయడానికి వచ్చిన కాలనాగులా వుంది.

పాము కాటుతిన్న దాన్లా మహలక్ష్మి అలా నిర్జీవంగా నిలు చుండిపోయింది.

అయితే అంతకంటే భయంకరమైన తాచుపాము కాటేస్తోం దని ఆమెకి ఆ మర్నాటి వరకూ తెలీదు.

ఆ వర్నాడు...

మామూలుగానే రంజని ఇంటికి పనికి బయలుదే రిందామె. కొంచెం నీరసంగా వున్నట్టనిపించింది. నిన్న రాత్రి ఆ కాబూలీ వాడి గొడవ మూలంగా తనుగాని, తండ్రిగాని, అన్నం తినలేదు. రాత్రంతా కంటిమీద కునుకు లేదు. అంచేతనేమో నీరసం అనుకుంది. నాలుగడుగులు వేసింది.

కళ్లు తిరిగాయి.

కాళ్ళు తడబడ్డాయి.

చుట్టూ ఉన్న మనుషులు, భూమి, ఆకాశం అంతా రంగుల రాట్నములా గిర్రున తిరుగుతున్నాయి.

కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కెలుకుతున్నట్టు వికారంగా వుంది.

అతి కష్టం మీద రంజని ఇల్లు చేరుకున్న మహాలక్ష్మి గుమ్మం లోనే కూర్చుండిపోయింది.

గుమ్మంలో ఆమెని చూసిన రంజని ముందు భయపడింది.

ఎక్కడో అట్టడుగు పొరల్లో ఉన్న ఆమె తల్లి మనసు ఒక్కసారి పైకుబికింది. మహలక్ష్మిని పొదివి పట్టుకొని లేవదీసి మంచం మీద పడుకోబెట్టింది.

వేడి వేడి కాఫీ యిచ్చింది.

మహలక్ష్మి కొంచెం తేరుకున్నాక పక్కింటి పనిమనిషిని తోడిచ్చి డబ్బిచ్చి తనకి తెలిసిన డాక్టరు దగ్గరికి రిక్షాలో పంపించింది.

డాక్టర్ మహలక్ష్మిని చూసింది.

ప్రశ్నలు వేసింది.

పరీక్ష చేసింది.

ఆ తరువాత

డాక్టర్ ఏం చెప్పింది?

ఏం చెప్పింది?

ఏం చెప్పింది డాక్టర్?

నువ్వు వెంటనే చచ్చిపోతావనా?

నీ జబ్బుకి మందు లేదనా?

నీ ఒళ్ళంతా విషపూరితం అయిందనా?

నీ రక్తం అంతా నీరైపోయిందనా?

నీ గుండె అంతా గడ్డకట్టి పోయిందనా?

నీ నరాలన్నీ నేడో రేపో పురికొసల్లా పుటుక్కున తెగిపోతాయనా?

ఏది చెప్పింది తల్లీ ఏం చెప్పింది?

చెప్పమ్మా.

ఏం ఫర్వాలేదు.

ఎలాంటి వార్తనైనా భరించగలిగే గుండె ధైర్యం ఉందమ్మా మీకు.

ఎంత బాధనయినా ఓర్చుకునే శక్తి ఉంటుందమ్మా మీకు.

ఎంత దరిద్రాన్నయినా భరించగలిగే నేర్పు ఉంటుం దమ్మా మీకు చెప్పమ్మా!

నువ్వు తల్లివి కాబోతున్నావనా?

నీ కడుపులో కామరాజు విత్తనం మొతకెత్తుతోందనా?

ఆ విత్తనం మొక్కయితే నీ సంసారం సర్వనాశనం అయి పోతుందా?

నీ బ్రతుకు బూడిదయిపోతుందా?

అందరికీ వరం అయ్యే మాతృత్వం నీకు శాపంగా మారిందా?

పరాయి మొగాడి పిల్లల్ని కనే హక్కు ఒక పురాణ స్త్రీలకే వుంటుందమ్మా!

అయ్యో వెర్రి తల్లీ! అంత మాత్రం తెలీదా?

అయిదుగురు పిల్లల్నీ అయిదుగురికి కన్న కుంతి మహా పతివ్రత.

పాండురాజు, దృతరాష్ట్రుడు ఎలా పుట్టారంటావా?

అయ్యో వెర్రిదానా! అది పురాణం.

ఇది జీవితం.

కలకాదు తల్లీ నిజం.

అంతా కల అయితే బావుండుననుకుంది.

కలలో నడిచినట్లే నడిచి ఇల్లు చేరుకుంది.

కుక్కి మంచంలో కదలలేని స్థితిలో పడున్న తల్లిని చూడగానే కడుపులో దుఃఖం కళ్ళలోకి వచ్చిన మహాలక్ష్మి ఆమెను పట్టుకొని బావురుమంది.

కూతరు ఎందుకేడుస్తున్నాదో అర్థం కాలేదు. ఆ అమాయకపు తల్లికి. కనీసం కూతురి వీపుమీద చెయ్యి వేసి ఓదార్చే శక్తి కూడా లేని నిస్సహాయ స్థితికి ఆ తల్లి కార్చిన కన్నీరుని వర్ణించడం కాళిదాసుకి కూడా చేతకాదేమో.

ఓ పది నిమిషాల తరువాత మహాలక్ష్మి ముందుగా తేరుకుంది. తనిలా కన్నీరు కారుస్తూ వుంటే తన కన్నీటితోనే ఆ విత్తనం మెలకెత్తి, మొక్కై, మానై తన బతుకుని కూకటి వేళ్ళతో పెకలించేస్తుంది.

అందరికీ వరం అయ్యే మాతృత్వం తనకి శాపంగా మారింది.

తననీ నిప్పుల గుండం నుండి ఎవరు రక్షిస్తారు?

ఈ విషపు కోరల నుండి ఎవరుకాపాడతారు?

మచం మీదున్న తల్లితో చెప్పినా, తల్లికిందున్న మంచంతో చెప్పినా ఒకటే.

ఆనాడు పనిలోకి వెళ్తానంటేనే పరువు పోతుందన్న తండ్రి ఈ సంగతి తెలిస్తే నిజంగానే ఇంటికి నిప్పెట్టేస్తాడు.

మరింక ఎవరున్నారు? ఎవరు?

పేర్రాజు ఒక్కడే రక్షించగలడు.

ఆ వేళ మహాలక్ష్మి వెళ్ళేసరికి పేర్రాజు ఇంట్లోనే వున్నాడు. ఆ టైములో మహాలక్ష్మిని చూసిన పేర్రాజు మనసు ఏదో కీడు శంకించింది.

ఏమైంది మాలక్ష్మీ? అమ్మ బావుందా?

తలూపింది.

అయ్య ఏవైనా అన్నాడా?

తల అడ్డంగా వూపింది?

డబ్బేమైనా కావాలా?

తల అడ్డంగా వూపింది.

పేర్రాజు మహాలక్ష్మివేపు పరీక్షగా చూశాడు. ఎండ దెబ్బ తగిలిన గులాబీలా వాడింది. కళ్ళు ఏడిచినట్టు తెలుస్తున్నాయి. పేర్రాజు గుండె ఒక్కసారి లయ తప్పింది. ఈ వయసులో వున్న ఆడపిల్ల చెప్పుకోలేని కష్టం కొంప దీసి...

మహాలక్ష్మికి దగ్గరగా వచ్చేదే పేర్రాజు. అపనింద నెత్తిన వేసుకొని అడవిలో వాల్మీకి ఆశ్రమంలో వున్న సీతలా కనిపించింది మహాలక్ష్మి పేర్రాజు కళ్ళకి.

ప్రపంచంలో వున్న పాపభారమంతా మోస్తున్న దానిలా తల కిందికి వాల్చేసింది.

తను నిలువునా కాలిపోతే బావుండుననిపించిది ఆమెకు.

పేర్రాజు ఆమె భుజాలు పట్టుకొని కుదిపేడు.

ఏమైంది మహాలక్ష్మి చెప్పు. నేనునీకు అన్నలాంటి వాణ్ని కాను. అన్ననే తండ్రిలాంటి వాణ్ని కాను తండ్రినే. చెప్పు ఏ కష్టమైన సరే ఎలాంటిదైనా సరే కడుపులోనే దాచుకుంటాను. చెప్పు మాలక్ష్మీ. చెప్పు అని ఆమె తలను పైకెత్తాడు.

అతని మొహంలోకి చూడలేని మహాలక్ష్మి అతని పాదాల దగ్గర పడిపోయింది. పసిపిల్లలా అతని కాళ్ళని చుట్టేసింది.

కన్నీళ్ళతో అతని కాళ్ళు కడిగేసింది.

పేర్రాజుకి తన అనుమానం అబద్ధం కాదని అర్ధమైంది.

ఇలాంటి విషయాలు ఒక ఆడది మరో ఆడదానితోనో, తల్లితోనో, తోబుట్టువుతోనో చెప్పుకోవాలి అలాంటిది తన దగ్గర కొచ్చిందంటే!

భగవాన్!

ఎంత దురదృష్టవంతురాలు!

డబ్బు లేకపోవడం దరిద్రం కాదు. తిండి లేకపోవడం దరిద్రం కాదు. బట్టలేకపోవడం కూడా కాదు.

ఈ దారిద్రాలన్నింటికీ ఏదో ఒక ఉపాయం వుంటుంది.

కాని... కాని... కష్టాన్ని మరొకరితో చెప్పుకోవడానికి తోడు లేక పోతే?

ఏ బాధైనా మరొకరితో చెప్పుకుంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

ఆ మరొకరు కరువైతే?

అది దరిద్రాల్లో కెల్లా నిజమైన దరిద్రం అలాంటి దుర్భర పరిస్థితి శతృవుక్కూడా రాకూడదు.

ఇప్పుడే మహాలక్ష్మి పరిస్థితి యింత దుర్భరంగానూ వుంది.

ఈ పాపానికి పరోక్షంగా తను కారణం కాదు కదా? తనే కదా నారాయుడ్ని ఒప్పించి మహాలక్ష్మిని పనిలో కుదిర్చేడు?

ఈ పనే లేకపోతే ఆమెకి అన్నం మాటెలాగున్నా అవమానం వుండేది కాదు.

అపనిందా వుండేది కాదు.

దేవుడి మెళ్ళో వేద్దామనుకున్న మల్లెదండ దెయ్యం మెళ్ళో వేసి నట్లయింది.

వర్షంలోంచి రక్షించి వరదలో ఒదిలేసినట్లయింది.

ఇప్పుడే సంగతి నారాయుడికి తెలిస్తే? తెలియాలి. తప్పదు.

ఆ తరువాత వూరవతల చెరువులో చేపలు తినగా మిగిలి తేలుతున్న నారాయుడి శవం...

రాజయ్యకి తెలిస్తే ఆమె బ్రతుకు బుగ్గయిపోతుంది.

ఆమె కలల మేడ కాలిపోతుంది.

ఆమె కట్టె కాట్లో కలిసిపోతుంది.

కాళ్ళ దగ్గరున్న మహాలక్ష్మిని భుజాలు పట్టుకొని లేవదీశాడు పేర్రాజు.

మాలక్ష్మీ నేను చెప్పినట్లు విను. నీకేం ఫరవాలేదు. నేను న్నాను. రేపటినుండి మామూలుగా పన్లోకి వెళ్ళు. అన్నం, నీల్లు మాని ఆరోగ్యం పాడుచేసుకోకు. ఇంకెరితోనూ ఈ సంగతి చెప్పకు. లే! లేచి ఇంటి కెళ్ళు పద. నేను దిగబెడతాను. అని ఆమెని ఇంటి వరకూ దిగబెట్టాడు.

మహాలక్ష్మిని ఇంటికి దిగబెట్టిన పేర్రాజు ఇంటికి వెళ్ళలేదు. వెళ్ళి పార్కులో కూర్చున్నాడు. దాన్ని పార్కు అనడం కంటే పెద్ద ఖాళీ స్థలం అనడం సబబుగా వుంటుంది. అక్కడ ఓ రెండు పెచ్చులూడిపోయిన సిమెంటు బెంచీలు, ఎండిపోయిన రెండు వేపచెట్లూ వున్నాయి. ఆ చెట్లకింద కొందరు ముష్టివాళ్ళు కాపరం చేస్తూ వుంటారు. అప్పుడప్పుడు లంబాడీ వాళ్ళు కూడా గుడిశెలేసుకుంటారు.

దాని పేరు గాంధీ పార్కు.

ప్రతి దేవాలయానికి, ప్రతి గోపురానికి ఒక స్తల పురాణం ఉంటుంది.

ప్రతి మనిషికి ఓ చరిత్ర వుంటుంది.

అలాగే ప్రతి రోడ్డుకి, ప్రతి చెట్టుకి, పుట్టకీ అన్నింటికీ కథ వుంటుంది.

ఈ పార్కుకి కూడా ఓ చరిత్ర వుంది.

గాంధీ పార్కుకి ఆ పేరు పెట్టక పూర్వం గాంధీగారు వార్నింగు లేకుండా చచ్చిపోయేరు. అతను చచ్చిపోయేక అందరిలాగే ఆ ఊరి వారు కూడా విచార సముద్రంలో మునిగి పోయారు.

సంతాప సభలు జరిపేరు.

ఆ సభకి... అదివరకు బ్రిటీష్ రాజభక్తుడూ, దరిమిలా దేశభక్తుడూ అయిన మోహనరావుగారు అధ్యక్షత వహించేరు. ఆయన ప్రియమైన పౌరులారా! అని సంభోధించిన వెంటనే భావగర్భితంగా కొంతసేపాగి సభలోని జనాన్ని మొదటి నుండి చివర వరకూ నిశితంగా పరిశీలించేరు.

ఇంగ్లీషులో పాజ్డ్ ఫర్ ఎఫెక్ట్ అంటారు. తెలుగు అనువాదం కష్టం.

తరువాత సభ నుద్దేశించి బాంబులాంటి ప్రశ్న వేశారు.

"గాంధీగారు అంటే ఎవరు?"

ఏవో రెండు ముక్కలు చెబితే విని పోదామని వచ్చిన సభికులు ఈ ప్రశ్నకి తుళ్ళిపడ్డారు. జరుగుతున్నది గాంధీగారి సంతాప సభ.

మరి "గాంధీగారెవరు?" అంటాడేవిటీ యన

అందరూ తెల్ల మొహాలు వేశారు.

గాంధీగారంటే ఎవరు? ఆయన మళ్ళీ గర్జించారు. ఈసారీ ఎవరూ జవాబు చెప్పలేరు. మరంచేత ఆయన తన ప్రశ్నకి తనే సమాధానం చెప్పుకున్నారు.

నేను చెబుతాను. గాంధీగారంటే... మళ్ళీ పాజ్డ్ ఫర్ ఎఫెక్ట్.... గాంధీగారే.

కాగితం వలిచి చాక్లెట్ చేతిలో పెట్టినట్లయింది సభకి.

ఉపన్యాసం మధ్యలో గాంధీగారంటే దేశభక్తుడుగాను, అహింసావాదిగాను, మనకి స్వరాజ్యం తెచ్చిన వాడు గాను మాత్రమే మీకు తెలుసు. కాని ఆయన భాషా సేవ కూడా చేశాడు. ప్రపంచ భాషలన్నింటికీ ఆయన ఒక కొత్త మాట చేర్చేరు. ఏమిటా మాట?

జవాబు కోసం ఎదురు చూశారాయన.

అలవాటును బట్టి ఆయనే జవాబు చెప్తారు కదా అని ప్రజ.... తుపాకీ శబ్దం విన్న వార్‌హార్స్‌లా ... దొంగ ముఖమల్ అడుగుల విన్న పోలీసు కుక్కలా చెవులు నిక్క పెట్టారు.

ఆ మాట ఏమిటో తెలుసా? అది "గాంధీ."

ఇందాక వలిచిన చాక్లెట్ ఇప్పుడు తింటున్నటై మిన్ను ముట్టేటట్టు చప్పట్లు కొట్టారు.

అన్ని భాషల్లోనూ ఆ మాటకి ఒకటే అర్థం. "దేవుడు" అని అలాంటి దేవుడు ఇప్పుడు చచ్చిపోయాడు. లేదు నీ అవసరం మాకు లేదని మనమే అతన్ని నిర్దాక్షిణ్యంగా కాల్చేశాం. "మనలో ప్రతి ఒక్కరు ఒక గాడ్సే" అని ప్రజలని మొత్త మొత్తగా ముఖమల్ చీవాట్లు పెట్టారు.

(అతను మొదట పడగ్గదిలో పెళ్ళాంతో కూడా భయం వల్ల మాట్లాడలేకపోయేవారట. తర్వాత రెండు ఎలక్షన్లకి నిలబడి ఓడిపోయి, ప్రస్తుతం దేశభక్తుడి అవతారంలో రెండు ఎలక్షన్లు గెలవగానే సరస్వతీ దేవికి ఆమె చేత్తోనే నోరు మూసేయించేటంత వక్తృత్వం వచ్చింది).

ఉపన్యాసం చివర "ప్రతి వూళ్ళోను, ఆస్పత్రిల్లో, అనాధ శరణాలయాలలో, కాలేజీలో, లైబ్రరీలో ఏవో ఒకటి గాంధీ గారి పేరుతో వున్నాయి ఏవీ లేనిది మనూళ్ళోనే అని అతను వాపోయాడు.

సభానంతరం గాంధీగారి పేరు మీద ఏదో ఒకటి చేయడానికి మోహనరావుగారితో సహా యితర పెద్దలతో ఒక కమిటీ ఏర్పాటైంది.

కాలేజీ కట్టాలనీ, దానికోసం చందాలు వసూలు చేయాలని కమిటీ నిర్ణయించింది. ఆ విషయమై చాలాసార్లు సమావేశమైంది కూడా. ఈ సమావేశాలలో సభ్యుల అంచనా ఏమిటంటే కాలేజీ కమిటీలో రెండు కులాల వారికీ సమాన బలం వుండొచ్చునీ, అంచేత గాంధీ గారి పేరు మీద చందాలు వసూలు చేసి, తీరా కాలేజీ పెట్టేక రెండో కులానికి మెజారిటీ పోయి తమకి ప్రిన్సిపాల్ కాద్సరి కదా ప్యూను ఉద్యోగం వేసుకోవడానికి క్కూడా అధికారం వుండేదేమోనని, రెండు కులాలూ భయపడ్డాయి.

అంచేత కాలేజీకి కడుపులోనే సంధి కొట్టింది.

పోనీ ఆస్పత్రి కట్టిస్తే?

కట్టించవచ్చు.

కానీ అప్పటికే ఆ వూళ్ళో గవర్నమెంటు ఆస్పత్రి వుంది ఆస్పత్రి కట్టించడమంటే ఆషామాషీ కాదు. మందులు పుచ్చుకోవడానికి పేషెంట్లూ, మింగెయ్యడానికి డాక్టర్లూ, కాంపౌండర్లూ చాలామంది వుంటారు. అస్పత్రి కట్టడం కన్నా దాన్ని నడపడానికి ఎక్కువ డబ్బు ఖర్చవుతుంది.

దేవుడు ఇలాంటి గాంధీ కారు సరికదా అసలు దేవుడు చచ్చిపోయినా అతని స్మారకనిధికి ప్రతి సంవత్సరం చందాలు

యివ్వరు. ప్రతి సంవత్సరం మందులకీ, జీతాలకి చందాలు వసూలు కాకపోతే ఆస్పత్రిలో మగడాక్టర్లకీ, ఆడ డాక్టర్లలకీ, పిల్ల డాక్టర్లని కనడం తప్ప వేరే పనేం ఉండదు.

పోనీ పశువుల ఆస్పత్రి కడదావన్నా ఇదే పేచీ.... అంటే పిల్ల డాక్టర్లు పుట్టడం కాదు. ఎంచేతో ఆడ పశువుల డాక్టర్లు (అంటే పశువుల ఆడ డాక్టర్లు వుంటారు. సాలీనా చందాలు రాకపోతే మగ డాక్టరు పశువులతో పేకాడు కోవడలసిందే.)

పోనీ చెరువు తవ్విస్తే?

ఆశోకుడి నుండీ చెరువులూ, బావులూ తవ్విస్తూనే వున్నారు.

కమిటీ సభ్యులంతా ఆలోచించి, ఆలోచించి ఆఖరున ఒక నిర్ణయానికి వచ్చారు.

ఏమిటా నిర్ణయం?

గాంధీగారి పేరు మీద పార్కు పెడితే బావుంటుంది.

సాధారణంగా పార్కులు, అస్పత్రులు వగైరా ప్రజలకి ఉప యోగించేవి ఊరు మధ్యనే వుంటాయి.

ఊరు చివర వుండేది స్మశానం మాత్రమే.

మరిప్పుడు పార్క్ ఊరు మధ్యలో పెడితే?

ఊరి మధ్య స్థలాలున్న కమిటీ పెద్దలకి గుండెల్లో రాయి పడింది. ఎవరి స్థలం పార్క్‌కి యిమ్మంటారో? అందరూ మళ్ళీ ఆలోచించారు.

మనదేశమంతా పెద్దవూరు? పైగా ఇప్పుడు వూరు చివరు న్నది. పదేళ్ళలో మధ్య అయిపోతుంది. ఊరవతల స్థలాలు చవక కూడాను అంచేత ఊరవతలే పెడదాం అని నిర్ణయించారు.

సినిమా హాలుకి నాలుగ్గోడలు, ఒక తెరా, కొన్ని సీట్లు వగైరా కావాలి. కోర్టుకి బిల్డింగు, బీరువాలు, కుర్చీలు, ప్లీడర్లూ వగైరాలు కావాలి.

అలాగే స్కూలుకి చదువు చెప్పినా, మానినా కొంతమంది మాష్టర్లు, బిల్డింగ్, కుర్చీలు, బెంచీలు వగైరా కావాలి. ఇంత స్థలం మూడో, ఆరో మొక్కలు వుంటే దాన్ని పార్క్ అనవచ్చు.

అలాగని కమిటీ పెద్దలు మూడుగజాల స్థలంలో మూడు మొక్కలు పాతి దాన్ని పార్క్ అనలేదు.

ఊరి చివర పంట భూములన్ని ఎక్కువ డబ్బు పెట్టి కొనడం కంటే బంజరు భూములు చవగ్గా వస్తాయి.

ఊరు చివర పంచాయితీ పోరంబోకు రెండెకారాలుంది. దాంట్లో మూడు చింతచెట్లు, నిద్రగన్నేరు చెట్టొకటి, మిగతావి తుమ్మలు వున్నాయి.

పంచాయితీ మెంబర్లంతా కమిటీ సభ్యులవడం వల్ల పంచా యితీ పోరంబోకు పార్క్ అయికూర్చుంది.

పార్క్ కాక పూర్వం ఆ పోరంబోకు ఎదుట ఉపయోగ పడేదో చేప్తె జాతిపిత మీద ఈ చరిత్రకారుడికి గౌరవం, భక్తీ లేవని పాఠకులు అపోహ పడవచ్చు.

ఒక సంవత్సరమో, రెండు సంవత్సరాలో పెరిగాక పార్క్‌ని పంచాయితీకి అప్పచెప్పేయ్యాలనుకున్నారు కమిటీవారు. అంచేత ముందు తమ్ముచెట్లన్నీ, కొట్టించారు. పువ్వుల మొక్కలు వేయించారు. వాటి నీటి కోసం కుళాయిలు పెట్టించారు. వాటిని పెంచడానికి ఒక తోటమాలిని కూడా పెట్టారు. మొక్కల్ని మేకలు తినకుండా చుట్టూ కంచే వేయించాడు. మధ్యలో అక్కడొకటీ, ఇక్కడొకటీ సిమెంటు బెంచీలు కూడా వేయించారు.

"గాంధీపార్క్" అని ముందు పెద్ద బోర్డు తగిలించారు. అక్కడితో ఆపేస్తే బావుండేది.

ఏ పనైనా సరే ప్రారంభం మాటెలా వున్నా ఎక్కడ ఆపాలో తెలియడం చాలా అవసరం.

పార్క్ మధ్యలో గుండ్రటి దిమ్మ, దానికి మెట్లు కట్టించాడు.

అక్కడితో ఆపేసిని బావుండేది.

"గాంధీపార్క్" అన్న బోర్డు చదవడం రాని వాళ్లు "ఈ పార్క్ పేరేమిటి చెప్మా?" అని బుర్ర బద్దలు కొట్టుకోకుండా వుండడానికేమో ఆ దిమ్మి మీద గాంధీగారి సిమెంటు విగ్రహాన్ని నిలబెడదామనుకున్నారు.

మరింక విగ్రహం చేసేపని బ్రహ్మానికి పురమా యించారు.

బ్రహ్మం సిమెంటు బొమ్మలు చేయటంలో సిద్ధహస్తులు, అందులో సందేహం లేదు. అయితే అతను ఇంతవరకూ చేసిన వన్నీ దేవుళ్ళనీ, దేవతలనీ, వాళ్ళయినా ముసలివాళ్ళు కారు. మంచికాలంలో వున్న దేవుళ్ళు.

కాలంలో వున్నవాళ్ళకి .... దేవుళ్ళకైనా, మనుషులకైనా సరే.... బంతుల్లాంటి బుగ్గలుంటాయి.

చెంపల వరకూ కళ్ళుంటాయి.

సూటైన ముక్కులుంటాయి.

గాంధీగారికి కళ్ళూ, ముక్కూ, బుగ్గలు వుండేవి. అంత మాత్రాన ఒక దేవుడు గుండు గొరిగేసి చేతిలో కర్ర పెట్టేస్తే చాలనుకోలేదు బ్రహ్మం.

అతను గాంధీగారి విగ్రహమే చేయదల్చుకున్నాడు. దాని కోసమే అతను గాంధీగారి ఫోటోలు చాలా స్టడీ చేశాడు.

విగ్రహం పూర్తి అయింది.

అలవాటు చేత.... బై షీర్‌ఫోర్స్ ఆఫ్ హేబిట్... కను బొమ్మలకీ, కంటి రెప్పల అంచులకీ నల్లరంగు వేశాడు. తన్మూలంగా గాంధీగారికి దొంగ రూపొచ్చింది.

అలవాటు ప్రకారమే పెదిమలకి ఎర్రరంగు కూడా వేశాడు. అంచేత గాంధీగారు ఖారా కిళ్ళీ నములుతున్నట్టు న్నారు. దానికి వారి బూరి బుగ్గలు సహాయపడుతున్నాయి.

బ్రహ్మం మా మాంచి గాంధీ భక్తుడన్నా ఒకటే; మా చెడ్డ గాంధీ భక్తుడన్నా ఒక్కటే ... చెడ్డ గాంధీ గారికి విశేషణము కాదది. చదువరులు గ్రహింతురుగాక. అంతేగాక ఈ ప్రయోగం వల్ల 'మంచి' చెడ్డలకు భేదం లేదని కూడా విజ్ఞులైన చదువరులు గ్రహించగలరు.

బ్రహ్మం చూసిన అన్ని ఫోటోలలోనూ, ఆఖరికి జిన్నాతో వేయించుకున్న ఫోటోలు కూడా గాంధీగారు నవ్వుతూనే వున్నారు. మరంచేత బ్రహ్మం గాంధీగారి విగ్రహానికి నవ్వు పెట్టదల్చుకున్నాడు.

పెట్టాడు కూడా.

అయితే విగ్రహాలకు నవ్వు పెట్టడం అలవాటు లేక పోవడం వల్ల, ఖారా కిళ్ళీ వికటించి వాంతి చేసుకోవడానికి గాంధీగారు నోరు తెరిచినట్టుంది ఆ నవ్వు.

"ఆఖరికి నీ బ్రతుకు నవ్వులపాలైందా గాంధీ?" అనుకున్నాడు.

పార్కులో మొక్కలన్నీ మేకలు తినేశాయి. గడ్డి గాడిదలు తినేశాయి.

గాంధీగారి చేతిలో కర్రను పశువులు మేపుకునే కుర్రాళ్ళు తీసుకున్నారు.

మిగిలినవి గాంధీ విగ్రహం, కంచె మాత్రమే! ఇప్పుడు పార్కులో పందులవాళ్ళూ, ఎరకల వాళ్ళూ, వగైరాలు అప్పుడప్పుడూ కేంప్ చేస్తూ వుంటారు.

పార్కులో విరిగిపోయిన, పెచ్చులూడిపోయిన బెంచీమీద కూర్చున్న పేర్రాజుకి గాంధీని చూడగానే నవ్వొచ్చింది. తర్వాత బాధ కూడా వేసింది. ఇంత అమాయకపు ముండావాడ్ని యింతవరకూ చూడలేదు అనుకున్నాడు. లేకపోతే అర్ధరాత్రి ఆడది ఒంటిరిగా రోడ్డుమీద తిరగ్గలిగిన్నాడే దేశానికి స్వతంత్రం వచ్చినట్టు అంటాడా? అసలు ఆడదేమిటి? మగాడికి సేఫ్టీ వుందా? మగాడు ఒంటరిగా వెళ్ళ గలుగుతున్నాడా?

ఇదేనా గాంధీ నువ్వు ఆశించిన దేశం?

ఎందుకయ్యా మాలాంటి పోరంబోకులకి స్వతంత్రం తెచ్చేవు?

ఆ బ్రిటీషువాళ్ళు వుంటే తొక్క ఒలిచి పని చేయించేవారు కదా?

ఇప్పుడు చూస్తున్నావా?

నూటికి ఒక్కడయినా పనిచేస్తున్నాడా?

సోమరిపోతుకు స్వాతంత్ర్యం ఇస్తే ఏం చేస్తారు? కాళ్ళు చాపుకొని బోర్లాపడుకుంటారు. కలల్నీ, పిల్లల్నీ కంటారు.

నువ్వు అంత గొప్పవాడివని పేరు పడ్డావు కదా! మరి పాత్రయెరిగి దానం చెయ్యాలని తేలీలేదా?

ఎందుకింత తెలివితక్కువ పని చేశావు?

స్వతంత్రం అయితే ఇచ్చేవు. కానీ... నిలపుకొనే సత్తా మాకెక్కడుంది? నిలపగలిగే నాథుడేడీ?

కాకుల్ని కొట్టి గద్దలకి వేసేవు.

నీకు తెలీదు గాంధీ మేమెంత లుచ్చాలమో!

మీకు తెలీదు బాపూ మేమెంత కుళ్ళిపోయేమో!

మాకిప్పుడు క్యాన్సర్లాటి డబ్బు జబ్బు పట్టుకుంది.

మా పిల్లలకి మాతృభాష రాదు!

మాకు మేడ్ ఇన్ ఇండియా అంటే అసహ్యం.

ముష్టివాడిక్కూడా అడుక్కోవడానికి ఫారిన్ చిప్పే కావాలి. ఫారిన్ గోచీలే కావాలి.

నువ్వు ఆశించిన శాంతి....

నువ్వు బోధించిన అహింస...

నువ్వు నమ్మిన సత్యం....

ఏవి గాంధీ? ఏవి?

అసలు మేము ఎవరి అడుగుజాడల్లో నడవాలి? ఎవరి ఆశయాలు అనుకరించాలి?

నువ్వు నడవడానికి కర్ర పట్టుకున్నా, యావత్ భారతదేశాన్ని నువ్వొక్కడివే నడిపించేవు.

ఇప్పుడు మేము వేసేవన్నీ తప్పటడుగులే. చేసేవన్నీ తప్పుడు పనులే!

భారతదేశం రత్నగర్భ అనీ, అన్నపూర్ణ అనీ ఏదో హిస్టరీ పాఠాలు చదివేం.

అవన్నీ గత వైభవాలు.

చరిత్ర మిగిల్చిన జ్ఞాపకాలు

ఇప్పుడు మాకు మిగిలిందేమిటో తెలుసా?

నాయకుల దారిద్ర్యం

భావ దారిద్ర్యం....

భాష దారిద్ర్యం....

తిండి దారిద్ర్యం...

ఎటు చూసినా దరిద్రమే!

ఎప్పుడో ఏ మహానుభావుడో ఈ దేశాన్ని అమ్మేస్తాడు.

అప్పుడు ఈ దరిద్రం వదలదు.

గాంధీ! నువ్వు చాలా అదృష్టవంతుడివి. కాబట్టే ఇవేవీ చూడకుండా వెళ్ళిపోయేవు.

ఎందుకిలా ఎండిపోయిన మైదానాల్లోనూ, దుమ్ముకొట్టిన రోడ్లమధ్య దిక్కులేని వాడిలా నిల్చుంటావు? మాకెవ్వరికి కనిపించకుండా, మా కందనంత దూరం పారిపో!

గూండాలేలే రాజ్యంలో గాంధీలకు చోటులేదు.

మాయల మరాఠీ రాజ్యంలో మహాత్ములకు తావులేదు.

ఒక ఆడపిల్ల లేవలేని తల్లిని, రెక్కలు రాని తోబుట్టువులనూ ఆకలికి చావకుండా బ్రతికించుకోవడం కోసం పనిలోకి వెళితే, ఎవడో పాపం ఆ అమ్మాయికి పిండప్రదానం చేసేడు.

పాపం.... మేము దానకర్ణులం కదా!

కర్ణుడు పుట్టిన దేశం కదా!

అంతా కర్ణులే పుడతారు మరి....

ఇంకా నువ్వు ఆడది అర్ధరాత్రి ఒంటిరిగా తిరిగే రోజు కోసం ఎదురుచూడమంటావా?

నువ్వు బ్రతికున్న రోజుల్లో సారా మానండ్రా అని గొంతు చించుకొని అరిచేవు. గుర్తుందా?

ఆ రోజుల్లో కాస్తమంది తాగినందుకే నువ్వు గుండెలు బాదుకున్నావు.

మరి ఇప్పుడో!

హైస్కూలు గుంటలు కూడా బార్లలోనే వుంటున్నారు. ఆడ, మగా తేడా లేదు.

అసలు ఆడ, మగా కలిసి తాగడం హైక్లాస్ సొసైటీకి చిహ్నం.

తాగనివాడు చేతకానివాడితో సమానం

ఉన్నవాడు విస్కీ తాగుతున్నాడు.

లేని వాడు సారాతాగుతున్నాడు.

ఆడది అర్ధరాత్రి ఒంటరిగా బయటికి వెళ్ళక్కర్లేదు.

ఇంట్లో ఉన్నా తాగొచ్చి తంతున్నారు మొగుళ్ళు.

మంచితనం, మానవత్వం, అన్న మాటలు అసలు డిక్షనరీ లోనే లేదు.

నీతీ, నిజాయితీ పూర్తిగా నిండుకున్నాయి.

కష్టపడి సంపాదిద్దాం అనే ఆలోచనే పోయింది.

న్యాయం అన్న మాటకు అర్థం లేదు.

చదువు కొనుక్కుంటున్నారు.

సీట్లు కొనుక్కుంటున్నారు.

ప్రమోషన్లు కొనుక్కుంటున్నారు.

ట్రాన్స్ఫర్లు కొనుక్కుంటున్నారు.

ఆఖరికి మనదేశం ఒక పెద్ద అంగడి అయిపోయింది.

ఆడవాళ్ళు పిల్లల్తో సహా అన్నీ అమ్ముతున్నారు.

ఇదీ పెద్దవాళ్ళ ప్రోగ్రెస్.

"నేటి బాలలే రేపటి పౌరులు అన్నది" కేవలం నీలాంటి వాళ్ళు కనే కల!

ఇప్పుడు పరిస్థితి ఏమిటో తెలుసా?

నేటి బాలలే రేపటి రౌడీలు.

ఎల్లుండి గూండాలు.

ఇప్పటి పిల్లలకు బుద్ధులు నేర్పడానికి అసలు మాకు వుంటే కదా!

వాళ్ళు ఎవర్ని అనుకరించాలి?

ఎవరి అడుగుజాడల్లో నడవాలి?

భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు....

రుద్రమదేవి, నాగమ్మ...

ఈ పేర్లు ఎవరైనా విన్నారా?

ఏ గొప్పవాడి జీవిత చరిత్రనైనా కనీసం క్లాసులో నాన్ డీటైల్డ్‌గా నయినా చదివిస్తున్నారా?

మహాత్మాగాంధీ ఎవరంటే ఇందిరాగాంధీ తండ్రి అంటున్న మా పిల్లల చదువుల్నేవనాలి.

స్కూల్లో చదువులు చెప్పే టీచర్లకి ఏం తెలుసని?

మూర్ఖులు, దుర్మార్గులు అని అర్థం చేప్పే తెలుగు మాష్టార్ని ఏం చేయాలి?

తల్లిదండ్రులకి పిల్లల మీద శ్రద్ధ లేదు.

పిల్లలకి చదువు మీద శ్రద్ధలేదు.

సి,బి.సి,డిలు రానివాడు ఎడ్యుకేషన్ మంత్రి.

'లా' అన్నమాటకి స్పెల్లింగ్ అర్థం తెలీనివాడు లా మినిష్టరు.

ఇరవై నాలుగ్గంటలూ మందులో మునిగితేలేవాడు హెల్త్ మినిష్టరు.

గాంధీ! నీకే మాత్రం బుర్ర వున్నా దేశానికి ఒక కోడ్ ఆఫ్ కాండక్టు రాసి వుండేవాడివి.

స్వతంత్రం తేవడమే నీ డ్యూటీ అనుకున్నావు కాని దాన్ని ఎలా అమల్లో పెట్టాలన్నది వదిలేశావు.

ఇదిగో ఫలితం చూడు!

అరాచకం...

అల్లకల్లోలం....

"లైఫ్ ఫాస్ట్ అయిపోయింది" అన్నది ఈనాటి ఫేషన్

జీవితం పరుగుపందెం అయిపోయింది.

ఓపిక ఉన్నవాడు పరిగెడుతున్నాడు.

లేనివాడు కూలబడుతున్నాడు.

ఇప్పుడు మనల్ని ఎవరేలుతున్నారో తెలుసా?

డబ్బు! డబ్బు! డబ్బు!

అంతే!

పాపం అన్నమాట లేదు.

డబ్బుతో ఏ పాపాన్నయినా కడిగేసుకోవచ్చు.

డబ్బు గంగాజలం లాంటిది.

ఖూనీ చేయడం కూర తరగడం కన్నా సులువయి పోయాయి.

మానభంగాలు మామూలు మాటలయిపోయాయి.

సిగ్గు చీర విప్పేసుకుంది.

సంస్కృతి సంతలో కలిసిపోయింది.

బాపూ! నీకు పిల్లలంటే యిష్టంట కదా?

ఇప్పుడు గాని నువ్వు బ్రతికుంటే ఈ పిల్లల పరిస్థితి your heart kleeds

ఈనాటి పిల్లలు తల్లిదండ్రుల అత్యాశకి బలయిపోతున్న బలిపశువులు.

ర్యాంకుల రణరంగంలో రాలిపోతున్న నక్షత్రాలు.

చదువుల చదరంగంలో చచ్చిపోతున్న పావులు.

వీళ్ళకి ఆట తెలీదు.

వీళ్ళకి తెలిసిన ఆట ఒకే ఒకటి.

దెబ్బలాట.

వీళ్ళని క్షమించటం తల్లిదండ్రులు చెప్పరు.

పదేళ్ళ గుంటడికి పగ.

వీళ్ళకి కసి. ద్వేషం, ఉగ్గుపాలతో రంగరించి పోస్తున్నారు.

వీళ్ళు చదివేవి కాశీమజిలీ కథలు కావు.

పంచతంత్రం వీళ్ళకి తెలీదు.

వీళ్ళకి తెలిసినవి సెక్స్ పుస్తకాలు.

సెక్స్ సినిమాలు

పదేళ్ళ పిల్లలు ప్రేమించుకుంటున్నారు.

పెద్దవాళ్ళు ఎలాగూ చెడిపోయారు.

వాళ్ళని బాగుచేయడం అనవసరం.

కాని....

ఈ పిల్లల్ని ఏ పుణ్యాత్ముడయినా రక్షిస్తే బావుండును.

ఈ పసికందుల్ని అరాచకాల నుండి ఏ మహాత్ముడయినా కాపాడితే బావుండును.

కాని ఇది కేవలం అరణ్య రోధన మాత్రమే.

ఇంకా ఈ జాతికి విముక్తి ఎప్పుడో తెలుసా?

పూర్తిగా నాశనం అయిపోయినప్పుడు.

కొత్త సృష్టి జరిగినప్పుడు

అంతవరకూ లేచి వుండడం మినహా మాలాంటివాళ్లేం చెయ గలరు చెప్పు?

నువ్వు చెప్పిన సిద్ధాంతాలు...

నువ్వు బోధించిన ఆశయాలు...

ఆవేవీ మాకు జ్ఞాపకం లేకపోయినా నిన్ను మాత్రం మేము మరచిపోలేదులే.

చంద్రుడికో నూలుపోగులా సంవత్సరానికో రోజు సెలవు ఇస్తూనే వున్నాం.

ఏడాదికో మూడు నిమిషాలు మౌనం పాటిస్తున్నాం.

ఏవిటో బాబూ! నిన్ను చూడగానే ఆవేశం ఆపుకోలేక ఏమి టేమిటో అన్నాను.

ఏం అనుకోవు కదూ? నీది క్షమా హృదయం కదా!

అంచేత క్షమించి వదిలేయ్.

తన బాధా, కోపం, ఉక్రోషం అంతా గాంధీ మీద చూపిం చిన తరువాత పేర్రాజుకి కొంత ఉపశమనం దొరికింది. లేచి బయలుదేరాడు నారాయుడి దగ్గరకి.

## 7

ఆ మర్నాడు ఉదయం...

కార్తీకమాసం చలికి సూర్యుడు మబ్బుశాలువా కప్పుకున్నాడు.

ఎండ వేడిగా కాకుండా చల్లచల్లగా వుంది.

నారాయుడి పాక ముసలి జంతువు ముడుచుకొని పడుకు న్నట్టుంది.

పాక ముందున్న గన్నేరు చెట్టుకింద పిచ్చికలు చలికి ముడుచుకొని కూర్చుని కిచకిచలాడుతున్నాయి.

పక్కనే ఉన్న బంతిచెట్టు ఆకు ఆకుకీ పువ్వు పూసింది. ఆ ముద్దుబంతి పువ్వులన్నీ వయసు రాకుండానే ఎదిగిపోయిన ఆడ పిల్లల్లా సిగ్గు పడుతున్నాయి.

అందం ఉన్న ఆడపిల్లకి సిగ్గే అందం అని వాటి సిగ్గు చూసి మురిసిపోతున్నాయి గన్నేరు పువ్వులు.

చలికి భయపడిన కోడి పిల్లలు తల్లి రెక్కల కింద వెచ్చగా పడుకున్నాయి.

పాక ముందున్న వాకిట్లో నులకమంచంమీద పడుకున్న నారాయుడు దూరంగా ఆకాశంలో ఎగురుతున్న గెద్దవేపే చూస్తు న్నాడు. అతనికా గెద్ద అచ్చు కాబూలీవాడిలా కనిపించింది.

వెంటనే మంచం పక్కనే ఉన్న కోడివేపు చూశాడు. పిల్లలన్ని టినీ రెక్కల కింద దాచుకున్న దాన్ని చూస్తే తనకంటే ఆ కోడే నయమనిపించింది. అది తన పిల్లల్ని గెద్ద ఎత్తుకుపోకుండా కాపాడుతోంది. మరి తనో?

తన పిల్లలు ఆ కాబూలీ గెద్ద పాలుకాకుండా ఎలా కాపాడ గలడు? అన్ని వంద రూపాయలు ఎక్కడి నుండి తేవాలి?

సంక్రాంతికి అల్లుడు వస్తాడు. ఈలోగా ఆ గాజులు విడిపిం చకపోతే నారాయుడి ఆలోచన అక్కడితో ఆగి పోయింది.

దీపావళినాడు కాబూలీవాడు వచ్చినప్పటి నుండి నారా యుడు పన్లోకి వెళ్ళడం మానేశాడు. ఎంత ఆలోచించినా ఓ దారీ, తెన్నూ దొరకడంలేదు. ఆలోచన గాజుల దగ్గర ఆగిపోయింది.

అప్పుడొచ్చాడు పేర్రాజు.

పేర్రాజుని చూసిన నారాయుడికి ఏరుకి వరదొచ్చినట్టు దుఃఖం పొంగుకొచ్చింది.

తల్లి చచ్చిపోయిన పసిపిల్లలాగా బావురుమన్నాడు.

"రారా పేర్రాజూః రా ! ఏటి యీడింకా ఎందుకు బ్రతికున్నా డని అనుకుంటున్నావా?" నాలోటోళ్ళకి సావెందుకొస్తాదిరా? అక్కడా దరిద్రమే నాలాటోళ్ళకి బతుకునేదు. సావూలేదు. దిక్కు లేనోళ్ళకి దేవుడే దిక్కంటారు కదా? మరిప్పుడే దేవుడూ రాడేం?

ఏ దేవుడొచ్చినా నా కూతురి బంగారం ఇడిపిస్తాడు? ఏ దేవతొచ్చి నాకూతుర్ని కాపరానికి పంపిస్తాది? ఒరే పేర్రాజు నానోటి సెప్తాను యినుకో. "నన్నూ, నా పిల్లనీ ఏడిపించిన ఆ దేవుడు ఆడెవడయినా కానీ, ఆడికి నా ఉసురు తగలక మానదు. నా ఏడుపే ఆడికి కొడతాది చూడు...".

చెట్టంత మనిషి చంటిపిల్లాడిలా ఏడుస్తూ ఉంటే ఎలా ఓదార్చాలో తెలీక పేర్రాజు ఊరుకో మావా కష్టాలు వచ్చినప్పుడే ధైర్యం తెచ్చుకోవాలి. ఏడుస్తే ఏటొస్తుంది. వోదార్చబోయేడు.

నారాయుడికి ఏడుపుతో పాటు కోపం కూడా వచ్చింది. "ఏడుస్తే ఏటొస్తాదంటావా? గుండె తేలికవుతాది? కడుపుతో పేరుకుపోయిన దుఃఖం కరుగుతాది" ఒరే బాబు! నాను తాగుతాను నిజమే! తాగడం తప్పే అయితే నాను తప్పుటోడ్నే. కానొరే తాగటం తప్పే అయి మరి ఆ గవర్నమెంటోడే దుకాణాలు ఎట్టి అమ్ముతాడు కదా అది తప్పు కాదా? నేకపోతే గవర్నమెంటు తప్పుడు పన్లుసేసినా అది తప్పుకాదా? ఇంతకీ నాను తాగితే నోరు లేనిది ఆ గుంటేం చేసింది?

నాను తప్పుచేస్తే నన్ను పాతెయ్యమను. నన్ను తగలెట్టేమను.

అంతేగాని దాన్నుసురు పెట్టడం బావుందా? ఆడు దేవుడే అయితే ఆడికి నాయం వుండాలా?

దరమం వుండాలా?

ఛీ! ఛీ! మా బతుకులిలా బండలేసిన ఆడుబాగుపడతాడా? సస్తే బాగుపడ్డరే పేర్రాజు నా కూతుర్ని అన్యాయం సేసినవాడు ఆడు దేవుడయినా సరే మరింక ఆడికి మంచి జరగమంటే జరగదు.

తాగకుండానే ఒళ్ళు తెలీకుండా మాట్లాడుతున్న నారాయుడితో ఏమని చెప్పాలో అర్థం కాలేదు పేర్రాజుకి.

చచ్చిపోయిన పిల్లడ్ని వళ్ళో పెట్టుకొని ఏడుస్తున్న తల్లితో నీ మొగుడు కూడా చచ్చిపోయాడని చెప్పాల్సి వస్తే? పేర్రాజు అలాగే వుంది.

ఇప్పుడు మహాలక్ష్మి గురించి ఎలా చెప్పాలి?

నువ్వు తాతవి కాబోతున్నావనా?

నీ కూతురుకి అన్యాయం చేసింది దేవుడు కాదు ఒక మృగం అనా?

ఏమని చెప్పాలి?

అయినా ధైర్యం కూడదీసుకున్నాడు.

"మావా మహాలక్ష్మి ..." మాట పూర్తి చేయలేదు.

"మాలచ్మేరా బాబూ!" అది మా ఇంటికి మాలచ్చిరా కానే ట్నాబం. మట్టిపాలు సేసుకుంటున్నాను. ఔనొరే పేర్రాజు నాకు తెలకడుగుతాను. ఆ దేవుడికి బుద్దుందిరా? అలాంటి మాణిక్యాన్ని మనలాంటి చెడ్డెదవలకి యిస్తాడేట్రా. దరిద్రుడికి ధనం దొరకితే దాసుకోవడానికి చోటులేదని అలాంటి పిల్లని మనవెలా సాకుతాం? అదుగో, అల్లదుగో అల్ల మేడల తొంగుంటారో ఆళ్ళకేమో జెష్టెదవల్ని యిస్తాడు. ఏట్రా? మనవంటే దేవుడికి తమాషాగా వుందా?

పేర్రాజుకి నారాయుడి మాటలకి ఆశ్చర్యం వేసింది. బాదలో ఎంత కవిత్వమయినా వస్తుందేమో?

కడుపుమంటకీ కవిత్వానికీ దగ్గర సంబంధముంది!

ఔన్నిజం! అన్ని పాపాలూ డబ్బుతో పరిహారం అయిపోతాయి.

పాపాలకి మూల కారణం డబ్బే!

ఇదే పరిస్థితి ఓ గొప్పింటి పిల్లకి వస్తే?

మరో దేశం తీసుకుపోయి పురుడు పోసి ఆ పిల్లని డబ్బుతోనే వదుల్చుకుంటారు. ఆ తరువాత ఇన్ని లక్షలు గుమ్మరించి ఏ తలమాసిన వెధవకో కట్టబెట్టేస్తారు.

పురుడు పోయకుండానే కట్టబెట్టిన దాఖలాలూ వున్నాయి. కాకపోతే కొంచె రేటెక్కువ అంతే!

ఇక్కడా గొప్పవాళ్ళదే పైచేయి.

వాళ్ళు పాపాలు చేయనూగలరు.

మాపు చేయనూగలరు.

సర్వపాప నివారిణి డబ్బు.

డబ్బుతో తప్పుని ఒప్పు చేయెచ్చు.

పాపాన్ని పుణ్యంగా మార్చవచ్చు.

అన్నిటికంటే పెద్ద పాపం డబ్బు లేకపోవడమే. ఇక్కడ పాప పుణ్యాల తర్కం కాదు కావల్సింది.

అంచేత పేర్రాజే మళ్ళీ ప్రారంభించాడు.

ఏదో చేద్దాంలే మావా నువ్విలా దిగాలుపడితే ఎలా? ఇప్పుడింకో పెద్ద కష్టం వచ్చింది. ఊరికే అరిచి యాగిచేయకు. మన మహాలక్ష్మి కాలుజారింది. పాఠం అప్పచెప్పినట్లు చెప్పేశాడు. మధ్యలో ఆపితే మళ్ళీ నారాయుడు ఏడుపు అందుకుంటాడు.

ఆఖరి మాట విన్న నారాయుడు పేర్రాజు బదులు పిశాచాన్ని చూసి నట్టు వెర్రి చూపులు చూడడం ప్రారంభించాడు.

ఐదు...

పది...

పదిహేను నిమిషాలు గడిచాయి.

చచ్చిపోయేదేమోనని భయమేసింది పే(్రరాజుకి.

అప్పుడు అందుకున్నాడు నారాయుడు ఏడుపు.

తొమ్మిది నెలలు మోసి, పేగు తెంచుకొని కన్నబిడ్డని తన చేతుల తోనే మట్టి చేయాల్సి వచ్చిన నిర్భాగ్యపు తల్లిలా కుమిలి కుమిలి ఏడ్చాడు.

చేతికంది వచ్చిన చెట్టంత కొడుక్కి చితి అంటించవలసి వచ్చిన దౌర్భాగ్యపు తండ్రిలా భోరు భోరున ఏడ్చాడు.

కట్టుకున్న భార్య కడుపున పుట్టిన పిల్లలు కళ్ళముందే కాలి బూడిదయిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయుడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఓర్నాయినో, ఎంతపని చేసేవే కూతురా... నా బంగారపు లచ్చిగిల్టుదైపోయిందిరా దేవుడో! నా అల్లుడొస్తే ఏం సెప్పనే తల్లీ! అసలు నా నెందుకు బతికున్నానే అమ్మడూ, నాకు సావెందుకు రాదురా తండ్రీ! అందుకే గొప్పోళ్ళ ఇళ్ళలో పనులు వద్దన్నానే తల్లీ..."

నెత్తికొట్టుకుని ఆడదానిలా ఏడుస్తున్న నారాయుడిని నీకేటి చెప్పాను ఏటి చేస్తున్నావు? నీ శోకాలు వింటే ఎవరో చచ్చారను కొని అంతా పరిగెత్తుకొస్తారు. కడుపులో దాచుకోవాల్సిన మనమే యిలా కాకుల్లా గోల చేస్తే ఎలా? దాని బతుకేం కావాలి? అని మెత్త మెత్తగా చీవాట్లు పెట్టాడు.

మనం కడుపులో దాచుకున్నా దాని కడుపులో పిల్ల దాగదు కదా? అందరూ కలిసి ఏట్లోకి గెంతేడవే కాని మరేటుందిరా? గొంతు తగ్గించినా ఏడుపు ఆపలేదు.

"మన్లాటోళ్ళకి ఏదో కష్టం వస్తూనే వుంటుంది. ఎన్నిసార్లు గెంతేస్తావు ఏట్లోకీ! అసలు మావా వున్నమాట చెపుతున్నాను. మా లక్ష్మికి పెళ్ళి అవకుండా వుంటే ఈ పరిస్థితిలో నేనే దాన్ని చేసుకొని దాని బిడ్డకు తండ్రినయ్యే వాడిని. కానీ ఇప్పుడు వీల్లేదు. మరింక మనం ఆ బిడ్డని రాజయ్యకి యివ్వలేం కదా? అంచేత ఒకటే మార్గం వుంది. నువ్వేం అనుకోకు నేను ఎవరయినా డాక్టర్‌ని చూస్తాను గుట్టు చప్పుడు కాకుండా తీయించేద్దాం. పాపం అంటావా. ఒక పాపం పోవాలంటే మరో పాపం చేయక తప్పదు. మాలక్ష్మి చిన్నపిల్ల. దానికేం తెలీదు దాన్ని ఒప్పించే పూచీ నాది. ఈ లోగా నువ్వు డబ్బు సంగతి చూడు. దాన్నేవీ అనకు, అసలే పిల్ల బెదిరిపోయింది పాపం. ఇవన్నీ అయ్యేవరకు మాత్రం తాగకు. నువ్వు తాగేవంటే మోళ్ళొ దప్పుకట్టుకున్నట్టే" పే(్రరాజు నచ్చచెప్పాడు.

నారాయుడు ఏడుపు తగ్గించాడు. తరువాత పే(్రరాజే లేకపోతే తను బతకలేనన్నాడు. తనని ఈ కష్టం నుండి గట్టెక్కిస్తే పే(్రరాజు పేరు చెప్పి రోజూ దీపం పెట్టుకుంటా నన్నాడు. ఇవన్నీ తీరేవరకే కాదు యింకా ఎప్పుడూ తాగనని పే(్రరాజు మీద ప్రమాణం చేశాడు. తన కూతురు ఎవరు? తల్లి మాలచ్చిమి. దాని బతుకు బాగుపడితే మరింకేమీ అక్క ర్లేదన్నాడు దాని కోసం తన ప్రాణాలయిన యిచ్చేస్తానన్నాడు.

పే(్రరాజకి నవ్వొచ్చింది.

మన ప్రాణాలెవరిక్కావాలి మావా? అర్ధరూపాయి నెత్తిన పెడితే పావలాకి ఎవరూ కొనరు. మహాలక్ష్మికేం ఫరవాలేదు. నేనున్నాను కదా! ఒక్కటి మాత్రం గుర్తుంచుకో ఈ విషయం ఎక్కడా పొక్కకు. అని బుద్ధి చెప్పాడు.

# 8

అప్పన్నని అంతా అప్పన్నా అనే పిలుస్తారు. అతను లేన ప్పుడు మాత్రం మెల్లప్పన్న అంటారు.

నిజానికి అతనికి మెల్లలేదు. ఫ్యాక్టరీ ప్రమాదంలో ఒక కన్ను చూపుపోయి మెల్లలా కనిపించేది. ఆ తరువాత ఆ కన్ను తీసేసి గాజు కన్ను పెట్టారు. పిల్ల చచ్చినా పురుటి వాసన పోలేదన్నట్టు, అతనికి మెల్లపోయినా మెల్లప్పన అనే పేరు స్థిరపడి పోయింది.

అప్పన, నారాయుడు మంచి స్నేహితులు.

నారాయుడు అప్పన్నని అభిమానం వచ్చినప్పుడు ఒరేయ్ మెల్లప్పన్నా అంటాడు.

తాగాక అభిమానం ఎక్కువై ఓరి మెల్ల నంజికొడకా అంటాడు.

వంటసారా అయినా, విప్పసారా అయినా, గవర్నమెంటు సారా అయినా వాళ్ళిద్దరూ కలిసే తాగుతారు. బోనస్ వచ్చిన నెలలో బ్రాందీ కూడా తాగుతారు.

తాగుబోతులకీ, రాజకీయ నాయకులకీ చాలా పోలిక లుంటాయి.

ఇద్దరూ ఒళ్లు తెలీకుండా మాట్లాడతారు.

ఇద్దరూ ఎడాపెడా వాగ్దానాలు చేసేస్తారు.

ఇద్దరూ... ఒకడు సారా కోసం, మరొకరు పదవి కోసం.. ఏ పని చెయ్యడానికైనా వెనుకాడరు.

నారాయుడు తాగుబోతు. అంచేత అతను పే(్రాజుకిచ్చిన మాట వెంటనే మర్చిపోయాడు.

ఆ సాయం(త్రమే మెల్లప్పన్నతో కలిసి సారా దుకాణానికి వెళ్ళి పోయాడు.

ఇద్దరూ సారా తాగారు

కబాబులు తిన్నారు.

సారా తాగారు.

పకోడీలు తిన్నారు.

సారా తాగారు.

మిరపకాయ బజ్జీలు తిన్నారు.

ఇంక సారా తాగలేదు. డబ్బు అయిపోయింది బజ్జీలు తింటు న్నప్పుడే దుఃఖం పొర్లుకొచ్చింది నారాయుడికి. అసలు అతనికి తాగకముందు నుంచీ దుఃఖం వుంది.

తాగడం ప్రారంభించగానే ఆ దుఃఖం కొంచెం తగ్గినట్టు అనిపించింది కాని మళ్ళీ తాగినకొద్దీ పెరిగిపోయింది. అంచేత చివర్లో ఇద్దరూ మాట్లాడ్డం మానేశారు.

సారా దుకాణం బయటకు వచ్చేవరకు బాగానే వున్నాడు నారాయుడు.

ఆ తర్వాత తూలుతూ, తోసుకుంటూ చిన్న తల్లి కిల్లీ కొట్టు వరకు బాగానే వున్నాడు.

దుకాణం దాటి వందగజాల్లో ఒక ఊడల మ(ర్రిచెట్టుంది. ఆ చెట్టు కింద దిక్కులేని వాళ్ళు, కుక్కలు, ముష్టివాళ్ళ కాపలాలు వుంటారు. చెట్టుమీద కాకులు, పిచ్చుకలు, గద్దలు, వగైరా అన్ని రకాల పక్షులు కాపురం వుంటాయి. ఆ చెట్టు కొమ్మలు ఎంత చక్కగా వుంటా యంటే చెట్లకింద ఏ టైంలోనూ ఎండకానీ, వెన్నెల కానీ పడదు.

అది పేదల పాలిటి ఏ.సి. హోటలు.

దాన్ని అంతా చీకటి చెట్టంటారు.

నారాయుడు, మెల్లప్పన ఆ చెట్టువరకు రాగానే, నారాయుడు అక్కడ కూలబడి బోరుమన్నాడు.

నారాయుడి ఏడుపు విన్న ముష్టివాళ్ళు కొందరు ఏటైందే టైంది అంటూ పరిగెత్తుకొచ్చారు. ఏట్నేదు డోసెక్కువైంది ఎల్లం డెల్లండి అని మెల్లప్పన్న వాళ్ళను తగిలేశాడు.

సాధారణంగా వాళ్ళిద్దరూ తాగితే మెల్లప్పన్న మొ(్రోమనడం, నారాయుడు సముదాయించటం పరిపాటి.

ఈ వేళ ప్లేటు తిరగబడింది.

ఈ వేళ మెల్లప్పన మాంచి మూడ్‌లో వున్నాడు.

ఈ వేళ అతనికొడుకు మొదటి నెల జీతం తెచ్చాడు.

ఈ వేళే ఆ డబ్బుతో కాబూలీ అప్పు తీర్చేశాడు.

ఈ వేళే అతని కొడుక్కి కూపన్ వున్న ఒక టొబేకో కూలీతో పెళ్ళి నిచ్చయమయింది.

ఈ అప్పన్న గాడెప్పుడూ యిలాగే వుండిపోడ్రా, నాకూ ట్టయిం వస్తాది. అప్పుడు సూడిస్తాను నా తడాకా. అప్పన్న గాడంట ఎటనుకుంటున్రా? అల్లాటప్పాగాడి ననుకుంటున్నారా? అనుకోండిరా? అనుకోండి. ఈ అనుకున్నెదవలే రేపు అందలం ఎక్కిస్తారు. పెతీవాడికీ దశ వొస్తుందిరా! అదొచ్చినప్పుడు ఎవుడూ ఆపనేడు మరి. ఈ అప్పన్నగోడికీ దశ వొస్తాది. అప్పుడో ఎలుగు ఎలిగిపోతాడు. అనే అతని మాటలు నిజం కాబోతున్నాయి.

అంచేత అతను ఈవేళ ఏడవలేదు.

నారాయుడి దశ బాగులేదు.

మరైతే నారాయుడు ఎలా ఏడిచాడు?

దొరసానిలా ముక్కు ఒత్తుకున్నాడా?

పెద్దింటి వాళ్ళలా పొడి కళ్ళు ఒత్తుకున్నాడా?

లేకపోతే సినిమా హీరోలా సైలెంట్‌గా కాలువలు కాలువలు కన్నీళ్ళు వదిలాడా?

లేదు... లేదు...

అతను ఎవరిలాగా ఏడవలేదు.

అచ్చు కూలీలాగే ఏడిచాడు.

తాగుడు, ఎక్కిళ్ళు, అవకాశం ఇచ్చినప్పట్లా ఏడిచాడు.

ఏదో సుక్కేసుకుంటాను గాని, పరువుగానే బతుకు తున్నాను కదాఁ! మరిప్పుడా పరువేటి గావాలా? పలానా వోడి కూతురు యిలాటి జెడ్డపని సేసిందంటే మరింక నాకు తలెత్తుకోవాలా వద్దా సెప్పరా అప్పనా సెప్పు. రేపు నా అల్లుడొచ్చి ఏటి మావా

ఇది? అని నన్నడిగితే ఏటి సెప్పాలి? కన్నకూతురే కడుపుతో సిచ్చు పెట్టేస్తారని ఎరగన్రా అప్పన్నా తన కొచ్చిన కష్టం అంతా సెప్పుకొని ఏడిచాడు.

చెప్పడం అయిపోయింది.

ఏడుపూ అయిపోయింది.

మరింక యిప్పడేటి దార్నాకు? ఒరే అప్పన్నా సెప్పురా సెప్పు. నూతిలోకి గెంతేమంటావా? రైలుకింత బుర్రపెట్టే మంటావా. నేకపోతే కొంపకి అగ్గి పెట్టేమంటావా? అని తన చావుకి ఉపాయం అడిగాడు.

ఉపాయం చెప్పలేదు అప్పన్న.

అసలు ఏదీ చెప్పలేదు.

కొంతసేపు నిశ్శబ్దంగా ఆలోచించాడు.

ఈ లోపున నారాయుడు మళ్ళీ ఏడుపు అందుకుం టాడే మోనని భయం వేసింది. అంచేత ఏడకేడక మొగాడి కేడుపు, ఆడదానికి నవ్వు వుండకూడదని జనరల్ స్టేట్‌మెంటు యిచ్చాడు.

"మొగోడు సేతనైతే ఏడిపించాలి గాని, ఏడవకూడదని" పురుష లక్షణాన్ని స్పెసిపై చేశాడు.

స్త్రీ పురుష లక్షణ విమర్శ మరింక పెంచదల్చుకోలేదు.

"నీక్కావలసింది డబ్బే కదా!" డబ్బుంటే ఇయన్నీ కష్టాలు కావు కదా అన్నాడు.

కాదని ఒప్పుకున్నాడు నారాయుడు.

"ఇంతకీ ఎంత కావాలంటావ్?" అడిగాడు అప్పన్న. బుర్ర గోకున్నాడు నారాయుడు.

అక్కడేం తగల్లేదు.

ఔను భోరున ఏడవటవే గాని ఎంత కావాలో తనకి తెల్దు. కాబూలీవాడి ఏడొందలు అది తెలుసు. మరి మాలచ్చి సంగతి. డాక్టరుకి ఎంత యివ్వాలో, ఏదీ సరిగ్గా తెల్దు. పేర్రాజుని అడగ నేదు. అయినా ఎంత గావాలో లెక్కవేశాడు నారాయుడు.

ఎంతకీ లెక్క తేల్లేదు.

అయినా తెగించి "రెండేలుఔద్ది" అన్నాడు.

"ఏలు కావాలంటే ఏలిచ్చీడవే" నిరాశగా ప్రకటించాడు అప్పన్న.

చెప్పబోయేడు నారాయుడు.

మైకం మొత్తం దిగిపోయింది.

ఏడుపు పూర్తిగా ఆగిపోయింది.

ఒళ్ళంతా మలేరియా వాడిలా వణికిపోయింది.

అంటే?

అప్పన్నకి మైకం దిగలేదు. అంచేత కురుక్షేత్రంలో యుద్ధం చెయ్యనని మొరాయించిన అర్జునుడ్ని చూసి కృష్ణుడు నవ్వినట్టు నవ్వాడు. నవ్వు అయిపోయాక కృష్ణుడిలా గీతోపదేశం చేశాడు.

"ఏటోరే నారాయుడూ! నువ్వు యియేలే వచ్చి నావేటి పన్లోకి? నేకపోతే నాటకాలాడుతున్నావా? సుక్కెక్కువైందా? మనకాడేటుండాది తాకటెట్టడానికి? అమ్ముకోడానికీ? మరంచేత ఏలు కావాలంటే ఓ వేలిచ్చీడవే. ఏం ఫరవాలేదు. ఇంకా తొమ్మి దుంటాయి కదా! మొన్న మన కాజాగాడు యిచ్చేనేదా? నీకు తెల్దం టావా? పోన్లేగాని రేపు మన సత్తెం బాబుకాడికెల్దాం" అని నారా యుడ్ని లేవనెత్తి మరో సుక్కేసుకుందాం పద. కసింత దయిర్యం వొస్తాది. ఏటి డబ్బునేదంటావా? సగం జీతం ఆడికే ముదుపు కడతన్నం కదా! అరువుంటాడ్లే నంజికొడుకు" అని సారా దుకాణం వేపు లాక్కెళ్ళిపోయాడు.

## 9

సత్తెంబాబు అసలు పేరు సత్యనారాయణ. కానీ అందరూ అతన్ని చిన్నప్పుడు "సత్తిగోడు" అని పిల్చేవారు.

అతను 8వ క్లాసు పాసు కాలేకపోయాడు.

ఎందుకు సార్ చదువు టైమ్ వేస్ట్ తప్పితే అదెందుకు పని కొస్తుంది? పెద్ద చదువులు చదువుకున్న ఆఫీసర్లంతా నాకు సలాంలు కొడతారు. చదువుకుంటే నేనూ ఆళ్ళలాగే గొర్రె తోక లాగా బతికేవాడ్ని. ఇప్పుడు నాకేం తక్కువైంది? డబ్బుంది పలుకుబడి వుంది. ఆ రెండూ వుంటే మరింక చదువెందుకు సార్ అని తను చదువుకోనందుకు బాధలేదని అందరికీ చెప్తూ వుంటాడు.

అతను ప్రస్తుతం ఆ ఫ్యాక్టరీలో లేబర్ లీడరు. ఇప్పుడతను "సత్తెంబాబు"

లేబర్ లీడర్ ఎలా అయ్యాడన్నది ఓ పెద్ద కథ.

అది ఈ చరిత్రకి అనవసరం.

అతనికి ఏ యిజం లేదు.

పొట్ట నిండటం కోసం పాలిటిక్స్‌లో చేరాడు.

పొట్టతో పాటు పెట్టె కూడా నిండుతోంది.

అసలు తన సిద్ధాంతం కమ్యూనిజం అంటాడు.

అయితే గాంధీయిజం బహు గొప్పదంటారు. ఈనాడు గాంధీ బ్రతికుంటే తప్పకుండా కమ్యూనిస్టు అయి వుండే వాడం టాడు.

అందరికీ ఉపకారం చెప్పడమే తన వృత్తి అంటాడు.

ఉపకారం అంటే ఏమిటి? పనేకదా అయితే ఆ పని మంచి దవాలి. ఎదుటి వాడికి మంచి జరగాలి. పని చేశాక ఆ పనికి తగిన ప్రతిఫలం పుచ్చుకోవాలా?

డాక్టర్లు డబ్బు తీసుకునే వైద్యం చేస్తున్నారు.

మాస్టర్లు డబ్బు తీసుకునే చదువు చెప్తున్నారు.

డబ్బు తీసుకునే ఓటు వేస్తున్నారు.

పోనీ మన ప్రభుత్వం ఏదైనా మనకి ఉచితంగా యిస్తోందా?

మన డబ్బుతో మనం చదువుకొని, మన డబ్బుతో మనం ఉద్యోగం కొనుక్కొంటే దానిని గవర్నమెంటుకి డబ్బు కట్టాలి. అదేలెండి దాన్ని లంచం అనరు టాక్స్ అంటారు. సరే చదువు కోలేదు. ఉద్యోగం కూడా కొనుక్కోలేదు. గిన్నె, చెంబు తాకట్టు పెట్టి చిన్న కిరాణా దుకాణం పెట్టుకున్నాం. అయినా దుకాణం పెట్టి నందుకు మునిసిపాలిటీకి డబ్బు కట్టాలి. దాన్నీ టాక్సే అంటారు.

పోన్లెండి సార్ ఉద్యోగం లేదు. వ్యాపారం కూడా చేయను. దొంగతనం చేస్తాను. అప్పుడూ పోలీసులకి డబ్బు యివ్వాలి. దీన్ని మామూలంటారు. కష్టం నాది డబ్బు పోలీసోడిది.

ఆఖరికి జడ్జీలు డబ్బు, జీతం తీసుకునే కదా న్యాయం చెప్తున్నారు!

మరి నాలాటోడు ఎవరికైనా పన్చేసి డబ్బు పుచ్చుకోవడం తప్పు కాదంటాను. దాన్ని లంచం అన్న వాడిని పిచ్చి వాడనాలి" అది అప్పుడప్పుడు సత్యం యిచ్చే ఉపన్యాసంలో ఓ చిన్న తునక.

అతను లేబర్‌కి సాయం చేస్తాడు.

"నేనూ లేబర్నే కద్సార్. పైగా లేబర్ లీడర్ని. మరింక మా వాళ్ళకి సాయం చేయకపోతే ఎలా?" అంటాడు.

మేనేజిమెంటుకీ సాయం చేస్తాడు.

"ఎంతమాట సార్. ఆళ్ళ ఉప్పు తింటున్నాను. ఆళ్ళకి సాయం చెయ్యకపోతే పాపం కదా?" అంటాడు.

అతనికి సాయం చేయడంతోనూ, డబ్బు పుచ్చు కోవడం తోనూ తన పర భేదం లేదు.

చిన్నప్పుడు కూర తెచ్చినందుకు తల్లి దగ్గర డబ్బు తీసుకునేవాడు.

అతని ముఖంలో ఎప్పుడూ ఒక రకమైన సంతృప్తి వుంటుంది.

అది తపోసిద్ధి పొందిన మహర్షి సంతృప్తి కాదు. డబ్బున్న వెధమ్మొండని పట్టిన దొంగ సన్యాసి సంతృప్తి.

ఆ సాయంత్రం.

సంధ్య కన్నె రంగు రంగుల మేకప్‌చేసుకుంటోంది. పౌడర్ పఫ్‌లా సాగిపోతోంది. ఓ తెల్లటి మేఘం కాఫీ తాగి, ఓ సిగరెట్ వెలిగింది పాకెట్లోఈజీ చైర్లోపడుకొని పేపరు తిరగేస్తున్నాడు సత్తింబాబు.

దండాలు అంటూ వచ్చాడు మెల్లప్పన్న.

బలికి వెళుతున్న మేకపిల్లలా భయం భయంగా, బెంగ బెంగగా అతని వెనకే వచ్చాడు నారాయుడు.

సత్తెంబాబు పేపరు మడిచాడు.

కళ్ళజోడు తీసి పక్కన పెట్టాడు.

ఒకసారి వాళ్ళని ఎగాదిగా చూశాడు.

మీరట్రా రండి. అని ఆహ్వానించాడు.

మెలప్పన్న పక్కనున్న బెంచీమీద కూర్చున్నాడు. నారాయుడు కూర్చోలేదు.

జడ్జీగారి ముందు జవాన్లా, హెడ్మాస్టరు ముందు ఎల్కేజీ కుర్రాడిలా, భగవంతుడి ముందు పాపిలా, తలొంచుకుని చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

"కూకోరా, సత్తెంబాబు మనోడే" అని అభయం ఇచ్చాడు మెల్లప్పన్న.

అప్పుడు కూర్చున్నాడు నారాయుడు. బెంచీకి నెప్పె డుతుందేమో అన్నంత నెమ్మదిగా.

"ఏమిటి సంగతి?" అడిగాడు సత్తెబాబు కళ్ళజోడు పంచెతో తుడుస్తూ.

"సంగతా? సంగతివేటి? శానా వుంది. అనక సెప్తాను. ముందో సిగరెట్టు ముక్క యిలాగిచ్చుకో" అన్నాడు మెల్లప్పన్న.

ఇద్దరికీ సిగరెట్టిచ్చాడు సత్తెంబాబు.

నారాయుడు తీసుకోలేదు.

వద్దుగాక వద్దన్నాడు.

నారాయుడు సిగరెట్టు కూడా మెల్లప్పన్న తీసుకొని జేబులో పెట్టుకున్నాడు.

ఆ తర్వాత "ఓ అగ్గిపుల్ల యియ్యి" అని సత్తెంబాబు దగ్గరే అగ్గిపెట్టే తీసుకొని తన సిగరెట్టు అంటించి ఓ దమ్ములాగి సంగతంటావా! పెద్దదే ఈదున్నాడా నారాయుడు. ఈడెప్పుడో కాబూలీ కాడ అప్పుజేసేడు. అది పాపం పెరిగినట్టు పెరిగి పోయింది. మొన్న ఆ కాబూలీ వాడొచ్చి ఈడి కూతురి గాజులు పట్టుకుపోనాడు. ఆ గాజులు దానికి దాని మొగుడు పెళ్ళిలో పెట్టినవి. ఆ మొగుడు రేపు సంక్రాంతికొస్తాడు.

"అయ్యో పాపం" విచారం ప్రకటించాడు సత్తెంబాబు.

"ఇంకా పెద్ద పాపం వున్నది. ఆ గుంట ఎక్కడో పనిచేస్తాది. దాని మొగుడు మిలట్రీలో వున్నాడా? దీనికి కడుపొచ్చినాది ఏ దగుల్బాజీ నంజికొడుకో దీన్ని పాడు చేసినాడు. మరిప్పుడీడికి ఏటి దారి?" మెల్లప్పన్న వివరించాడు.

"ఎంత పన్జేసిందీ గుంట?" సత్తెంబాబు ఆశ్చర్యపోయాడు.

నారాయుడు వచ్చినప్పటి నుండి తల దించుకునే కూర్చు న్నాడు. తన కూతుర్ని గురించి వాళ్ళలా మాట్లాడ్డం అతనికి బాధగానూ, సిగ్గుగానూ కూడా వుంది. నాకూ డబ్బు ఒద్దు ఏం ఒద్దు అని గట్టిగా అరిచి పారిపోవాలని పించింది.

"మరంచేత అడికేదో దారి నువ్వే సూపెట్టాల. నేకపోతే ఆడికింక ఏ నుయ్యో, గొయ్యో కూడా నువ్వే సూపెట్టాల" మెల్లప్పన్న సిఫారసు చేశాడు.

ఓ ఐదు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు. ఖూనీ కేసులో జడ్జిమెంటు కోసం ఎదురు చూసే ముద్దాయిలా భయం భయం గానూ దిగులుగానూ సత్తెంబాబు మాటలకోసం ఎదురు చూస్తు న్నాడు నారాయుడు.

సత్తెంబాబు మరో సిగరెట్ అంటించాడు. లేచి అటూ ఇటూ పచార్లు చేశాడు మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

నారాయుడికి భయంతో చమట పట్టేస్తోంది.

మెల్లప్పన్నకీ గుండె గుబగుబ లాడింది.

ఇప్పుడీ బాబు కాదంటే యింకీ నారాయుడికి నుయ్యే గతి.

"ఏటి సత్తెంబాబు, నిన్నే నమ్ముకొని వచ్చేం. నువ్వేటి సెప్ప వేటి? నువ్వే ఏదో ఉపాయం సూడాలి. నేకపోతే ఈడి సంసారం బుగ్గైపోతాది" మెల్లప్పన్న మెల్లిగానే బతి మాలాడాడు.

సత్తెంబాబు సిగరెట్ పారేసి ఓరే నా బాధలు ఎవరితో చెప్పు కోమంటారు? చెప్పుకుంటే సిగ్గుచేటు మీరు నమ్మరు నేనేదో ఉపకారం చేయడానికి ఏడుస్తున్నాననుకుంటారు. కొత్త మేనే జరున్నాడే, ఈకలు పీకేసిన కోడిలాగా రూపూ వీదూను. అసాధ్యం ముండాకొడుక వాడి నైజం ఏమిటో అర్థం కాదు.

నిజం నమ్మడు, అబద్ధం నమ్మడు. దొంగని నమ్మడు, దొరని నమ్మడు.

అతగాడొచ్చాక ఈ కేసులు అసలు నమ్మడం లేదు. వీడొచ్చేక మన బతుకెలాగైపోయిందంటే, మన దగ్గర ఎంగిలి సిగరెట్ పీకలుకొచ్చే సూపర్వైజరు వెధవలు కూడా ఇవేళ నుండి మేము పతివ్రతలం అంటున్నారు.

"వేలు పొయినా వందయినా చేతికొస్తుందో రాదోనని నా భయం మరే చేద్దామంటారు నారాయుడూ?" అనడిగాడు.

నారాయుడికి కడుపులో దుఃఖం గొంతు వరకూ వచ్చి గొంతుక మూసేసింది.

"ముద్దిమ్మంటే పక్కింటిదాన్ని అడగమందిట నీలాంటి పెళ్ళమే! నువ్వేదో గట్టుకు లాగుతావని వస్తే యీత నేరుసు కోమంటున్నావు... ఇదిగో, ఇప్పుడే సెపుతున్నాను నువ్వేటి సేస్తావో నాకు తెల్దు. యీడు నా కాళ్ళట్టుకున్నాడు. నేను నీ కాళ్ళ ట్టుకున్నాను. మరింక మమ్మల్ని గట్టెక్కించే పూచీ నీదే అంటూ ఆఖరి దమ్ములాగి సిగరెట్ విసిరేసి లేచాడు అప్పన్న.

నారాయుడూ లేచాడు.

సరే సరే ఒప్పుకున్నది మంతర్సాని పని తప్పుతుందా? ఏరా నారాయుడూ నీకు నైట్ డ్యూటీ ఎప్పుడు?

"వచ్చే మంగళవారం కాడి నుంచి మా ఇద్దరికీ నైట్ డ్యూటీనే! అప్పన్నే జవాబిచ్చాడు.

"అయితే బుధవారం రాత్రికి ఏర్పాటు చేస్తాను" అభయం ఇచ్చాడు సత్యంబాబు.

దండాలు పెట్టి శలవు తీసుకున్నారు వాళ్ళిద్దరూ.

బుధవారం రాత్రి ఏం జరుగుతుంది?

"ఎంత పన్జేసిన" ఆమె నెవరయినా పీక పిసికి చంపేస్తారా?

డైనమైట్ పెట్టి ఫ్యాక్టరీ పేల్చేస్తారా?

కొంపతీసి విప్లవం మొదలుపెడతారా?

❖ ❖ ❖

ఫ్యాక్టరీకి ఫర్లాంగు దూరంలో...

ఓ గేరేజీ

ఆ గేరేజీలో ఒకప్పుడు రామదాసు బాబు మోజుపడి కొన్న ఫారిన్ కారుండేది.

మరి ఇప్పుడా కారేదీ?

"అమ్మేశాను"

"ఎందుకు?"

"ఎందుకా? కడుపు మండి"

ఆ మోజు నాది! అనుభవం ఆఫీసర్లది ఇన్‌కమ్‌టాక్స్ వాడి పెళ్ళాం సినిమాకి వెళ్ళడానికి నా కారే కావాలి.

సేల్స్‌టాక్స్ వాడు చిలకలూరిపేట వెళ్ళడానికి నా కారే కావాలి.

కారొక్కటేనా?

టాంక్ నిండా పెట్రోలు, డ్రైవరు!

ఆఖరికి ఆ ఆఫీసరు ముండకిచ్చే మల్లెపువ్వుల్తో సహా సప్లై చెయ్యాలయ్యే.

సొమ్మొకడిదీ, సోకొకడిదీ అని...

ఈ ఆఫీసర్లంతా నాకో మంచి గుణపాఠం నేర్పారు. ఏమిటో తెలుసా? బిజినెస్ వాళ్ళకి కారుండకూడదు. అంచేత అమ్మి పారేశాను. ఎక్కడికయినా వెళ్ళాలంటే టాక్సీలే చవక. నాకు డబ్బుంది సార్! అంచేత నేను టాక్సీలో వెళ్తాను కానా ఈ ఆఫీ పర్ గాడిదకొడుకులున్నారే వాళ్ళు డబ్బుదండుకుంటారే గాని కాణీ కదపరు.

అసలు ఈ ఆఫసర్ లం... కొడుకుల గురించి నన్నడ గండి చెబుతాను. వీడు కొత్తగా రాగానే చెక్ చేసేది ఏమిటో తెలుసా?

ఏవడికి కారుంది?

ఎవడికి లారీ వుంది?

ఎవడికి బారుంది?

ఇవీ వాడు ఎంక్వైరీ చేసేది!

మేమేదో బిజినెస్‌లో లక్షలుపోగేస్తున్నాం అని ఆ వెధవల యేడుపు!.

నిజమే! లక్షలార్జిస్తున్నాం....

కానీ మరి లక్షలు పెట్టుబడి కూడా పెట్టాం. ఇలాంటి కుక్కల్ని మేపుతున్నాం. లాభాలు తింటాం.

ఏ పెట్టుబడి లేకుండా నెలకి లక్షలు కళ్ళ జూస్తున్నాడే ఆఫీసరు.

వాడ్ని ఎవరూ ఏమీ అనరు.

ఫస్టు తారీఖు వస్తే చాలా మా వర్కర్లకుజీతాలయినా ఓ రోజు ఆలస్యం అయినా ఫర్వాలేదు. కానీ ఆఫీసరు గాడికి మాత్రం పుట్టమీద పెట్టినట్టు ముడుపు చెల్లించాల్సిందే.

మీరు గమనించారో లేదో గాని ఈ లంచాలు తినే ఆఫీస ర్లంతా కక్కుర్తి వాళ్ళను యింకెక్కడా చూడరు. రూపాయి యిచ్చి ఏదయినా కొనాలంటే ఏమి ఏడుస్తాడో చూడాలి.

ఛీ! ఛీ! అందుకే ఈ బాధలు పడలేక కారు మెయిన్ టైన్ చేయడము మానేశాను అని గోలపెట్టేస్తాడు రామదాసు.

ఇప్పుడింతకీ ఆ గేరేజిలో కారు లేకపోయినా ఖాళీగా మాత్రం లేదు.

గేరేజ్ తలుపుల మీద పీపుల్స్ క్లినిక్, డా. ఆనంద్ అన్న బోర్డు వుంది.

అనంద్ స్టూడెంట్‌గా వున్నప్పుడు స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్! ఆ స్టూడెంట్లు మార్క్స్, మావో పుస్తకాలు చదవడం, ఆకలి కేకలు వెయ్యడం వగైరాలు ఫాషన్‌లా వుండేది. ఆనంద్ కూడా అవన్నీ చదివాడు. అయితే అవి నిజజీవితంలో తను అమలులో పెట్టాలని తను డాక్టరై పీడిత ప్రజానీకానిక ఉచిత వైద్యం చెయ్యాలనీ అనుకునేవాడు.

అనుకున్నట్టుగానే ఆ లేబరుపేటలో క్లినిక్ ప్రారంభిం చాడు. అంతవరకూ బాగానే వుంది. వైద్యానికి ఏమీ తీసుకోకూడ దను కున్నాడు. కొన్నాళ్ళ పాటు తీసుకోలేదు. ఫలితంగా డాక్టరైనా కూడా అమ్మా నాన్నాల దగ్గర డబ్బు తీసుకోవలసిన పరిస్థితి తప్పనిసరైంది.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

తను పేషెంట్ల దగ్గరయినా డబ్బు తీసుకోవాలి. పేరెంట్సు దగ్గరయినా తీసుకోవాలి. ఎవరి దగ్గర తీసుకోవాలి. నిర్ణయించు కోలేకపోతున్నాడు.

తన దగ్గరున్న శాంపిల్స్ పేషెంట్లకి ఊరికే ఇచ్చేవాడు. అయితే ఆ తరహా అతనికి ఒక భయంకరమైన నిజం తెలిసింది.

వాళ్ళు మందులు వాడటం లేదు. మందుల షాపులకు అమ్మేసి, ఆ డబ్బుతో సారా తాగేస్తున్నారు. ఇది తెలిసిన అతనికి కోపం రాలేదు బాధ తప్ప!

వీళ్ళకి కావలసింది ఉచిత వైద్యం. మందులు కావు కడుపు నిండా తిండి. అది లేనినాడు ఎవరూ ఏమీ చెయ్యలేరు. చెద్దామనుకోవడం తెలివితక్కువతనం.

చెయ్యడం నిరర్ధకం.

ఓసారి అతని దగ్గరికొచ్చిన లేబరు లీడరు సత్యం చాలా సత్యాలు చెప్పాడు ఆనంద్‌కి.

సూడు డాక్టరు బాబూ! నువ్వు ఊరికే వైద్యం సేస్తానంటే ఏటో తెల్సా! నువ్వు చాలా గొప్పోడివన్నమాట. నువ్వు దేవుడితో సమానం! నువ్వు శానా మంచోడివి. కానీ నీ మంచితనం అరాయించుకొనే స్తితిలోలేం మేము. నీకు తెలుసో తెలీదోకాని నీ వైద్యానికి డబ్బులిచ్చేది కూలోడు కాదు. మేనేజ్‌మెంటు నువ్వు వైద్యం చేసేవా లేదా అనెవడూ అడగడు. ఆళ్ళక్కావల్సింది నువ్వు ఏ మందులు రాసేవూ అని. నువ్వు రాసే మందుల కరుసు కంపెనీ యిస్తాది. అందులో షాపువాడితో నీకు పర్సెంటేజ్ వుంటోంది. మరంచేత నువ్వు ఏదో ఈ అలగాజనాన్ని ఉద్దరిం చేద్దామనీ ఆళ్ళకి సేవ సేద్దామనీ అనుకోకు, అంత గొప్ప గాంధీగోరే ఏమీచేయలేకపోయాడు.

మరంచేత నువ్వు ఇంత తిను.

మమ్మల్నింత తిననీ

నువ్వు బాగుపడు.

మమ్మల్ని బాగుపడనీ.....

ఆనంద్‌కి అతని మాటలు నచ్చాయా లేదా అన్నది చెప్పటం కష్టం. అయితే అతను అప్పటి నుండి మారటం ప్రారంభించాడు.

## 10

మంగళవారం సాయంత్రం...

డాక్టరు ఆనంద్ ఫ్యాక్టరీ దగ్గరున్న తన గేరేజ్ క్లినిక్‌లో కూర్చున్నాడు. అతని కెదురుగా కొత్తగా డాక్టరయిన దేవదానం కూర్చున్నాడు.

డాక్టర్ ఆనంద్‌కి ఏలిన్నాటి శని రేపటితో వెళ్ళిపోతుంది.

అతన్ని బంధించిన కష్టాల కొండచిలువ రేపటితో పట్టువది లేస్తుంది.

పెళ్ళానికి మల్లెపువ్వులు కొనడానిక్కూడా ఈ వేళ వరకూ చేస్తున్న పాపాలు రేపటి నుంచి చెయ్యనవసరం లేదు.

రేపటి నుండి పెళ్ళాన్ని రబ్బరు పరుపుల మీద నడిపించగలడు.

పట్టు చీరలు కట్టించగలడు.

ముత్యాల సరాలతో ముందచెయ్యగలడు.

ఆ "రేపు" అతను విదేశం వెళ్ళిపోతున్నాడు.

"నేను వెళుతున్న రాజ్యం ఎలాంటిదో తెలుసా?" ఆనందు ఆడిగాడు దానాన్ని.

"తెలీద"న్నట్టు మొహం పెట్టాడు.

అక్కడ దొంగతనం చేస్తే చెయ్యి కొట్టేస్తారు. సారా తాగితే పీక కోసేస్తారు. రంకుత... రా అమ్మా రా... ఎలా వుంది? అంటూ వీధివేపు చూశాడు.

"కుసింత నయం బాబూ" అంటూ వచ్చింది మల్లమ్మ.

ఆవిడ వయసులో వున్నప్పుడు అందగత్తె.

ఇప్పుడూ అందంగానే వుంది కాని ఆ అందం వాడిపోయిన పువ్వు అందం.

ఇప్పుడూ వయసులోనే వుంది. అయితే అంతా గుల్ల యిపోయినట్టు నీరసంగా వుంటుంది.

దేవుడూ, మనిషి కలిసి మోసంచేసిన మనిషిలా ఉంటుంది.

ఆమె ఎవర్ని చూసినా నవ్వడానికి డబ్బు పుచ్చుకున్న మనిషిలా నవ్వుతుంది.

నాది మనిషి బతుకు కాదు–కుక్కల బతుకు అని గ్రహించిన మనిషిలా ఎపోలజెటిగ్గా వుంటుంది.

ఎప్పుడూ నిద్రలేని దాన్లా అలిసి వుంటాయి ఆమె కళ్ళు.

ఆమె కళ్ళల్లో కాంతి వుంటే అది నూనె అయిపోతున్న ప్పుడు ఒత్తి తాలూకు ఆఖరి మంట.

ఆమె రాగానే ఆనంద్‌కి నమస్కారం పెట్టింది. తరువాత ఎవరో తెలీకపోయినా దానానికి కూడా నమస్కారం పెట్టింది.

"లోపలికి పదమ్మా!" అన్నాడు ఆనంద్.

"లోపల" అంటే తెర వెనుక.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

అయిదు నిమిషాలయ్యాక ఇంజక్షన్ ఇచ్చిన చోట దూదితో రాసుకుంటూ బయటికి వచ్చింది.

ఆమె వెనుకే వస్తున్న ఆనంద్ "చూడమ్మా! మళ్ళీ ఎల్లుండి రా! నేను వూరికి వెళ్ళిపోతున్నాను. ఇదిగో ఈ డాక్టరు గారు చూస్తారు. నాకంటే మంచివాడేలే" అన్నాడు.

ఆవిడ బల్లమీద మూడు రూపాయలు పెడుతూ "తమరు ఎలిపోతున్నారంటే శానా బెంగెట్టుకున్నాను బాబూ! అయితే ఈ బాబు వుంటాడన్న మాట. సల్లని మాట సెప్పేవు. సల్లగా ఎల్లిరా బాబూ!" అని వెళ్ళిపోయింది.

ఆమె మాటలు విన్న దానంకి కడుపులో పేగులు తెగినట్లయి పోయింది. అతను ఇంతకు ముందు ఇలాంటి మనుషుల్ని చూడలేదు.

అలాంటి మాటలూ వినలేదు.

ఆమె మాట్లాడిన మాటలు మూడు అయినా ఎన్నో ఏళ్ళ ఆత్మీయత, ఎంతో దగ్గరవాళ్ళ అనురాగం వినిపించాయి అతనికి.

కళ్ళతో తడి కనిపించింది.

"బ్లడ్‌ప్లెజర్ కేసు మామూలే!" ఇక్కడ మన పేషెంట్లు, కలక్టర్లూ సూపర్నెంట్లూ కాదు.

కూలీ నాలీలు

పట్టపు రాణీలు కాదు!

పడుచుకునే పడతులు

"ఈ క్లినిక్ వల్లనీకు కాఫీ డబ్బులే కాదు అదృష్టం వుంటే భోజనము డబ్బులు కూడా వస్తాయి"

వింటున్నాడు దానం.

"దీనిమీద నేను పెట్టిన పెట్టుబడి మూడువేలు వుంటుంది. గుడ్‌విల్ ఏమీ లేదు కాబట్టి రేపు మూడువేలు తీసుకొచ్చి, రేపు రాత్రి పది తర్వాత నా క్లినిక్,బొక్కి కుర్చీలు పనిచెయ్యని ఇన్‌స్ట్రుమెంట్స్, డబ్బులేని పేషెంట్లు అన్నీ నీవి"

మర్నాడు పొద్దున మూడువేలూ చేతులు మారాయి. రాత్రి తొమ్మిది గంటలకి క్లినిక్ చేతులు మారింది.

ఇవిగో తాళాలు! అందించాడు ఆనంద్.

థాంక్యూ!

"అన్నట్టు భోంచేసి వచ్చావా? ఇవాళ రాత్రి అర్జంటు కేసొకటి రావచ్చు. అంచేత రాత్రి పన్నెండు వరకు వుండు కాలక్షేపం అంటావా? వీధివేపు చూస్తూ కూర్చో దరిద్రం ఎంత భయంకరంగా వుంటుందో తెలుస్తుంది"

ముండల బేరాలు ఎన్ని రకాలో తెలుస్తుంది.

మన దేశంలో ఆడదాని పరిస్థితి ఏమిటో అర్ధ మౌతుంది.

విష్ యు ఆల్ ది బెస్ట్ అని షేక్‌హాండ్ యిచ్చి వెళ్ళి పోయాడు ఆనంద్.

పాత మెడికల్ మేగజైన్ తిరగేస్తూ కూర్చున్నాడు దానం.

అదే రాత్రి...

పది గంటలు కావస్తోంది.

క్షయ వచ్చిన రాక్షసిలా నిప్పులు కక్కుతోంది ఫ్యాక్టరీ.

యంత్రాల అదురుకి భూమి బెదురుతోంది.

లైట్ల వెలుగుకి కళ్ళు బెదురుతున్నాయి.

రాక్షసుల దెబ్బలాటలావుంది మెషిన్ల చప్పుడు.

"నైట్ షిఫ్టు కూలీలు" తాగిన సారా హుషారు ఇంకా తగ్గలేదు.

"ఈ పొద్దునువ్వ తాగడానికి యీల్లేదు" అని నారాయుణ్ణి సారా వాసన కూడా చూడనివ్వలేదు మెల్లప్పన్న.

నారాయుడు దొంగతనంగా తాగుతాడన్న భయంతో నారాయుడ్ని ఒక్క నిమిషం కూడా వదలకుండా అంటి పెట్టుకుని తిరిగాడు కూడా.

అయితే ఇద్దరి వంతు తనే తాగాడు.

టైము ఇంకా పదవలేదు.

ఊళ్ళో సినిమాలు ఫస్ట్‌షోలు విడిచిన వేళ.

సాయంత్రం అంతా సారా సేవించిన సరసులు ఇళ్ళకొచ్చి పెళ్ళాల్ని చావకొట్టేవేళ.

ఖుషీ పురుషులు కులాసాలు వెతుక్కునే వేళ.

వాళ్ళ కులాసాలలో ఎందరో ఆడపడుచులు ఆకలి మంటలు చల్లార్చుకునే వేళ.

వాళ్ళ కులాసాలలో ఎందరో ఆడపడుచులు ఆకలి మంటలు చల్లార్చుకునే వేళ.

నారాయుడి గుండెలు భయంతో గడ్డకట్టుకొని పోతున్నాయి.

మొసలి కోరల్లా వున్న పళ్ళ చక్రాల ట్యూబ్‌లైట్ కాంతిలో ఇంకా పదునుగా ఇంకా భయంకరంగా మెరుస్తున్నాయి.

ఒరుసుకొని తిరుగుతున్న ఆ రెండు పళ్ళ చక్రాల మధ్య తల వెంట్రుక పడినా తెగిపోతుంది.

ఎడమచెయ్యి బొటనవేలు కుడిచేత్తో పట్టుకున్నాడు.

ఈ చిన్ని వేలు మీద అంత మమకారం వుంటుందని అతని కంతవరకు తెలియదు.

ఇంకా కొద్దిసేపట్లో ఆ బుజ్జి వేలుకీ తనకీ ఋణం తీరి పోతుంది.

అతడికి మనసొప్పడం లేదు.

కాని ఆ పళ్ళ చక్రాల మధ్య మహాలక్ష్మి ఆమె కాలిపోతున్న కాపురం వగయిరాలన్నీ కనిపిస్తున్నాయి.

తాగుడు ఉత్సాహంలో వున్న మెల్లప్పన్ననారాయుడి భుజం మీద చెయ్యివేసి ఏటాలోసన? ఎట్టు ఎట్టేరా? ప్రోత్సహించాడు.

నారాయుడు కదల్లేదు.

"ఏటి? నువ్వు ఏలెడతావా? నీ పీక పట్టుకొని నన్ను ఎట్టీమంటావా?"

ఇంత సేతకానోడివి కాబట్టే ఇలాగున్నావు.

అతను కదల్లేదు.

"ఏట్రో బాబూ! అవతల టయిం అయిపోతున్నాది. ఇంజీషను పవరు కూడా పోద్ది. అంత దయిర్యం లేనోడివి ఎందు కొప్పుకున్నావు? అవతల నా మాటపోద్ది. సత్యంబాబు పరువు పోద్ది. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక ఏటీ తాత్సారం? బేగెట్టు.

మెల్లిగా మిషన్ దగ్గరకు వెళ్ళాడు నారాయుడు.

ఒకసారి తన వేలు చూసుకున్నాడు.

ఒకసారి మిషన్‌వేపు చూశాడు.

కళ్ళు మూసుకున్నాడు.

వేలు పెట్టేశాడు.

ఎక్సిడెంట్... ఎక్సిడెంట్ పొలికేకలు పెట్టాడు అప్పన్న.

స్విచ్ ఆఫ్ చేసి పరుగెత్తుకొని వచ్చాడు సూపర్‌వైజర్.

అగుతున్న చక్రాలు రక్తం కక్కుతున్నాయి.

నారాయుడి ఏడుపు అసహజంగా వుంది.

తన బుర్రనున్న గుడ్డతీసి నారాయుడి చేతికి చుట్టాడు మెల్లప్పన్న.

పావుగంటలో దానం దగ్గరకు చేరారు నారాయుడూ, అప్పన్న సత్తెంబాబు.

"ఏం జరిగిందీ?" ఆతృతగా అడిగాడు దానం, రక్తం గుడ్డ చుట్టిన నారాయుడి చెయ్యి చూస్తూ....

"చిన్న ప్రమాదం ఫ్యాక్టరీలో ఇలాంటివి మామూలే" సమాధానం చెప్పాడు సత్తెంబాబు.

ముక్కులేని మొహంలా భయంకరంగా వుంది.

బొటనవేలు లేని అతని చెయ్యి.

తాగుబోతు వెధవకి నొప్పన్నా తెలీడం లేదు. అనుకున్నాడు దానం.

తాగుడు వాసన నారాయుడిది కాదనీ, అప్పన్నదనీ తెలీదు అతనికి .

చెయ్యవలసినదంతా చేశాడు దానం. కట్టు కట్టడం పూర్తి అయ్యేక మళ్ళీ రేపురా అన్నాడు చేతులు కడుక్కుంటూ.

రెపరెపలాడుతున్న వందరూపాయల నోటు బల్ల మీద పెట్టాడు సత్యంబాబు.

చిల్లర లేదు అన్నాడు దానం చేతులు ఒత్తుకుంటూ.

ఫరవాలేదు వుంచండి అని నారాయుణ్ణి అప్పన్నని తీసుకొని వెళ్ళిపోయాడు సత్యం.

క్లినిక్ పెట్టిన వేళ మంచిదనుకున్నాడు దానం.

"కూలీలు డబ్బివ్వలేరు" అన్న తన అంచనా తప్పేమో అని కూడా అనుకున్నాడు.

అయితే ఆ రాత్రి ఎమర్జెన్సీ వస్తుందన్న సంగతి ఆనంద్‌కెలా తెలుసో మాత్రం అర్ధం కాలేదు.

❖ ❖ ❖

నారాయుడి వేలు తెగిన మూడోరోజు ఉదయం.... క్లినిక్‌లో కూర్చున్నాడు డా. దానం.

ఆ వేళ చాలామంది వర్కర్లకి సెలవు.

రోడ్డుమీద జనం గుంపులు, గుంపులుగా తిరుగుతున్నారు.

క్లినిక్ ఎదురుగా రోడ్డుకి అవతల కొన్ని పాకలున్నాయి.

ఆ పాకలముందు చిన్న చిన్నపిల్లలు దుమ్ములో ఆడు కుంటున్నారు.

వాళ్ళలో కొంతమందికి ఒంటిమీద దారప్పోగు కూడా లేదు.

ఆ పాకల గుమ్మాల్లో కూర్చున్న ఆడవాళ్ళు ఈ పిల్లల ఆటల్ని చూసి మురిసిపోతున్నారు.

ఆ పిల్లల పక్కనే కుక్క, పంది పిల్లలు ఆడుకుంటు న్నాయి.

అందులో ఒక పిల్లాడు ఒక కుక్క పిల్ల తోకకి తాటాకు కట్టి దాన్ని పరిగెత్తిస్తున్నాడు.

వాడి తల్లి కాబోలు ఒకావిడ గబుక్కున వచ్చి ఆ పిల్లాడి తెలివికి వాడ్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది.

దానానికి వాళ్ళని చూసి నవ్వాలో, ఏడవాలో, బాధపడాలో, జాలిపడాలో తెలీలేదు.

అసలు వీళ్ళ గురించి ఎవ్వరూ ఒక్క క్షణం ఆలోచించరేం?

వీళ్ళు మనుషులన్న సంగతి మనం మర్చిపోయాం.

తాతాలు, బిర్లాలు ఫ్యాక్టరీలు స్వయంగా తాపీ పట్టుకొని కట్టరు. అవి కట్టడానికి కొన్ని వందలమంది కూలీలు కావాలి.

ఫైవ్‌స్టార్ హోటల్స్ 'ఒబరాయ్' నెత్తికి గుడ్డచుట్టుకొని ఇటు కలు మోసి కట్టరు. అవి కట్టడానికీ వందల సంఖ్యలోనే కూలీలు కావాలి.

కొన్ని వేల ఎకరాలున్న కామందులు, కాడి భుజాన వేసుకుని పంట పండించరు. వాటికీ కూలీలే కావాలి.

ఆఖరికి బస్సు దిగిన నువ్వు ఆటో వరకు నీ సూట్ కేస్ నువ్వు మొయ్యవు. దానికీ కూలీలే కావాలి.

ఒక్కముక్కలో చెప్పాలంటే మన మనుగడకి కావల్సింది వాళ్ళే.

అలాంటి వాళ్ళని ఇంత దయనీయమైన, ఇంత దారుణమైన పరిస్థితుల్లో వుంచినందుకు మనం సిగ్గు పడాలి.

వీళ్ళకి జీవితమంటే ఏమిటో తెలుసా?

వాళ్ళకి తెలిసింది ఒక్కటే. వారంలో ఆర్రోజులు పొద్దన్నే లేవడం.

కలో, గంజో, కడుపులో వేసుకోవడం.

ఫ్యాక్టరీకి పరిగెత్తడం –

అక్కడ యంత్రంలో యంత్రమై.

తమ చెమటనే యంత్రానికి ఆయిల్‌గా వేసి యజమానికి లక్షలార్జించి పెట్టడం.

సాయంత్రం కడుపునిండా తాగేసి ఒంటిమీద తెలివుంటే పెళ్ళాలతో చమట కంపుతో, దుమ్ముతో, కుళ్ళుతో పడుకుని దుమ్ము పిల్లల్ని కనడం.

తెలివి లేకపోతే పెళ్ళాన్ని, పిల్లల్ని తన్నడం ఇవి వీళ్ళ ఆర్రో జుల దినచర్య.

ఏడో రోజు సెలవు వస్తే ఏం చెయ్యాలో తెలీదు.

వీళ్ళకి గొడ్డులా పని చెయ్యడమే తెలుసు తప్ప – జీవితంలో ఆనందాలు, సరదాలు వుంటాయని, అనుభవించవచ్చనీ తెలీదు.

ఆర్రోజులు బిజీగా వున్న జీవితం ఏడో రోజు స్థంభించి పోతుంది. ఆ రోజు ఏం చెయ్యాలి? గుంపులుగా చేరి కబుర్లు చెప్పు కుంటారు.

రోడ్డు పక్కనే కొట్టు దగ్గర చేరి టీ తాగి తగువులు పెట్టు కుంటారు.

కారణం లేకుండా దెబ్బలాడుకుంటారు. దెబ్బలాట ఒక్కటే వాళ్ళ ఎంటర్‌టైన్‌మెంట్. ఆఖరికి రోడ్డు మీద రెండు కుక్కలు దెబ్బలాడుకుంటూ వుంటే రెండు పార్టీలు చేరి ఆనందిస్తారు.

సాయంకాలం వరకు ఆగలేని వాళ్లు మధ్యాహ్నమే సారా కొట్టుకు వెళ్ళిపోతారు.

వాళ్ళ జీవితాలు మొద్దుబారిపోతాయి.

సున్నితం వాళ్ళకి తెలీదు.

సుకుమారం వాళ్ళకి అర్థం కాదు.

వాళ్ళగుండెలు బండ బారిపోయాయి. వాళ్ళని ఇలా ఎవరు తయారు చేశారు? మనమేఁ!

కేవలం మన స్వార్థం కోసం, మన సుఖం కోసం, మన ఆర్జన కోసం వాళ్ళని అలాగే వుంచుతాం.

వాళ్ళ పిల్లలు చదువుకోకూడదు.

చదువుకుంటే మంచి, చెడ్డ తెలిసి మనమీద తిరగ బడతారు.

వాళ్ళకి చాలినంత తిండి, గుడ్డ, గూడు ఇవ్వకూడదు.

ఇస్తే వాడు నీకెందుకు కూలి చేస్తాడు?

మరి నీకు పన్లెవరు చేస్తారు?

అందుకే... అందుకే...

వాళ్ళని అథోగతిలోకి తోసేస్తున్నాం.

ఎన్ని అభివృద్ధి ప్రణాళికలు వేసినా, ఎన్ని పంచవర్ష ప్రణాళికలు చేపట్టినా అవన్నీ కాయితాల మీద నుండి జనం వరకు రావు.

రాకూడదు.

ప్రతి సెలవురోజు వీళ్ళని చూసి, వీళ్ళ గురించి ఆలోచిస్తూనే వుంటాడు దానం.

మనసు వికలమైపోతుంది అతనికి.

ఏ గాంధీవచ్చి వీళ్ళ బతుకుల్ని బాగుచేస్తాడు?

ఏ దేవుడొచ్చి వీళ్ళని రక్షిస్తాడు?

అసలు వీళ్ళు మనుషులేనా?

కాదు సార్.కాదు.

భూమికి చేసిన జబ్బులోంచి పుట్టుకొచ్చిన పురుగులు. ఈ జబ్బు కాన్సరు కంటే భయంకరమైనది.

అంచేత ఈ పురుగులు వందలు, వేలు, లక్షలు, కోట్లై ఈ భూమిని పూర్తిగా ఆక్రమించేస్తారు.

అప్పుడొస్తుంది సోషలిజం.

సోషలిజం గురించి ఆలోచిస్తున్న దానం సత్యం రావడం చూడలేదు.

సత్యం వచ్చి దానానికెదురుగా కూర్చున్నాడు.

అతను సిగరెట్ ఫారెన్‌ది.

ఓ సిగరెట్ దానానికిచ్చి ఒకటి తను వెలిగించేడు.

"ఎలా వుంది సార్ ప్రాక్టీసు?" కుశల ప్రశ్న వేసేడు.

"థాంక్స్ ఫరవాలేదు"

"ఫ్యాక్టరీని నమ్ముకుంటే, మేడలు, కార్లు కొనలేకపోవచ్చు కాని దినం గడిచిపోతుంది" హామీ ఇచ్చేడు.

ఏమనాలో తోచని దానం నంగిరి నవ్వు నవ్వేడు.

ఆఫ్టరాల్ ఆరోక్లాసు కూడా చదవని వెధవ వీడో పెద్ద లీడర్. వీడు నాకు భరోసా ఇవ్వడం" దానం మనసులోనే మండిపోయాడు.

"నారాయుడి దెబ్బ ఎలా వుంది?" ఏదో ఒకటి అడగాలి కాబట్టి అడిగాడు.

"అబ్బే! మానిపోతుంది"

"మరే. నీ వేలు కాదు కదా అనుకున్నాడు" దానం.

జేబులోంచి ఖరీదైన పర్సుతీసి రెండు వంద రూపాయల నోట్లు టేబులు మీద పెట్టేడు సత్యం.

"దేనికి?" డబ్బు తీసుకోకుండానే అడిగేడు దానం.

"రాత్రి కేసొస్తుంది." "అంటే?"

"జైలోకేన్ ఇంజక్షను ఇవ్వాలి."

నిర్ఘాంతపోయేడు దానం.

"ఆ ఇంజక్షను సర్జరీలో గాని, దెబ్బతగినప్పుడు నొప్పి తెలీకుండా ఇస్తాం."

ఎలిమెంటరీ స్కూలు కుర్రాడ్ని చూసి ఎడ్యుకేషన్ మినిష్టరు నవ్వినట్టు నవ్వేడు సత్యం.

"అందుకే నొప్పి తెలీకుండా ఉండడం కోసం."

"క్షమించండి. నాకేం అర్థం కాలేదు" అయోమయంగా అన్నాడు దానం.

మళ్ళీ అదే నవ్వు నవ్వేడు సత్యం.

"అయితే డాక్టరు ఆనంద్ గారు మీతో ఏం చెప్పలేదన్నమాట. పోన్లెండి. ఇందులో చెప్పడానికేం వుంది? మావాడు మీ దగ్గర ఇంజక్షను తీసుకొని, ఫ్యాక్టరీకి వెళ్ళి వేలు మిషన్లో పెట్టేస్తాడు. ఇది ఇక్కడ చాలా మామూలు సార్. ఈ రాత్రికే మావాడొకడు వస్తాడు. మీరు ఇంజక్షను ఇవ్వాలి"

"అమానుషం" అరవబోయిన దానం నిలదొక్కుకుని ఆనంద్ నాతో ఏమి చెప్పినా, చెప్పకపోయినా ఈ పనికి నేనొప్పుకోను. నావల్ల కాదు అరచినట్టుగానే చెప్పాడు.

సత్యానికి చిరుకోపం వచ్చింది. అయినా అవసరం కాబట్టి కొంచెం తగ్గేడు.

చూడండి డాక్టరుగారూ, డబ్బిస్తే మత్తుమంతు కూడా ఇవ్వకుండా పీకలు కోసే డాక్టర్లు ఈ వూళ్ళో ఎంత మందున్నారో మీకు తెలుసో తెలీదో కాని నాకుతెలుసు. ఏదో ఫ్యాక్టరీని నమ్ముకున్నారు కదా అని, మీకు నాలుగు డబ్బులు వస్తాయనీ మీ దగ్గర కొచ్చేం కాని ఇచ్చేవాళ్ళు లేక కాదు.

ఆ డబ్బు అలాగే ఉంచండి.

"సాయంత్రం మనిషిని తీసుకొస్తాను. అప్పటికి మీ మనసు మారితే ఇంజక్షను ఇవ్వండి. లేకపోతే నా డబ్బు నేను తిరిగి తీసుకుంటాను. అంతగా మీ అంతరాత్మ ఒప్పుకోక పోతే అర రోజుకి వడ్డీ కూడీ తీసుకుంటాను" అని డబ్బు అక్కడే వదిలేసి చరచరా వెళ్ళిపోయాడు.

జైలోకేన్ ఇంజక్షన్ ఒళ్ళంతా తీసుకున్నట్లు ఒళ్ళు, మొదదు మొద్దుబారిపోయింది దానానికి.

ఏమిటీ దారుణం?

ఎవడి వేలు వాడు తెగ్గోసుకుంటాడా?

దరిద్రం దారుణమైనదే

కాని ఇంత భయంకరమా?

ఈ సంగతి మేనేజిమెంటుకి తెలుసా?

తెలిస్తే ఎందుకూరుకుంటారు?

తినడానికి కంచంలో ఏ వున్నా లేకపోయినా చేతికి ఐదు వేళ్ళు వుండాలి కదా?

వీళ్ళని యింత దారుణానికి ఒడిగట్టించిన పరిస్థితు లేమిటి?

ఈ ప్రశ్నలన్నీ తనని తనే వేసుకున్నాడు దానం.

ఎంకరేజిమెంటు కోసం అన్నట్టు ఒక సిగరెట్టు కూడా యిచ్చేడు. అప్పుడు సడన్‌గా అతని బుర్రలో వెలిగింది. ఆ రోజు నారాయుడి వేలు కూడా యిలాగే తెగిందని అప్పుడే అర్థం అయింది. ఆనంద్‌కి పోతున్నప్పుడు అర్జంట్ కేసోస్తుందని ఎందుకు చెప్పేడో.

నారాయుడు సిగరెట్టు ఒక దమ్ములాగి, ఒక మూడు మణుగులు నిట్టూర్చేడు.

ఆ నిట్టూర్పుకి దానం రేకుల షెడ్డు గజగజలాడింది.

"ఏటిసెప్పమంటావు బాబూ! మా బతుకులు. మాకొచ్చే డబ్బులు మా సారాకి చాలవు. సారా ఏసుకోవడం తప్పే బాబూ! తప్పే కాని ఆ సుక్కేసు కోకపోతే మేం పని సెయ్యలేం బాబూ. పగలంతా చేతులు ముక్కలు సేసుకొని వస్తాం కదా బాబూ. మరింక రేత్తిరికి ఓ సుక్క ఏసుకోక పోతే నిద్దరట్టదు. మరింక మా పెళ్ళాం, పిల్లలు ఓ పూటైనా గలాసుడి గంజినీళ్ళు తాగాలి కదా! నువ్వే సెప్పు బాబూ మరంచేత పదీ పరకా కాబూలీ వాడి కాడ అప్పు చేస్తాం. అదలా పెరిగి వందా, వెయ్యో అయి పోతాది. అప్పుసేస్తాం గాని ఎలా తీరుస్తాం బాబు. తీర్చక పోతే ఆడు మమ్మల్ని ఏవీ అనడు.

మా ఆడోళ్ళ కోకలిప్పుకుపోతాడు.

గిన్ని ముంత యీదిలో యిసిరేస్తాడు.

మరింక ఈ వుపాయం ఎవుడు సెప్పేడో కాని బాబూ ఆడికి రెండు సేతులూ ఎత్తి దణ్ణం పెట్టాలి.

యాక్సిడెంటు అయితే కాలూ, సెయ్యి పోవడం నేదా? యిదీ అంతే అనుకో.

చిటికెన ఏలుకింత, సూపుడు ఏలుకింత అని రేట్లున్నాయి కదా బాబూ. మరింక మనక్కావల్సిన డబ్బుని బట్టి ఏదో ఏలు యిచ్చీడవే, ఏటి బాబూ అలా బెదిరిపోతున్నావు. కుర్రాడివి కదా అంతా కొత్తగా వుంటాది రెండ్రోజులు పోతే అదే అలవాటై పోతాది.

నేను ఏదాంతం చెప్తున్నాననుకోకు. ఏట్రాయిడూ నాకు బుద్ధులు సెప్తున్నాడనుకోకు. కాని బాబూ సచ్చేకైనా నా శరీరం బుగ్గయిపోతాది కదా! మరి యిప్పుడు మన అవసరం కోసం ఒకటి రెండు ఏళ్లు పోతే మాత్తరం ఏటౌద్ది?

అందం అంటావా? మంచోడివే బాబూ ఆయన్నీ గొప్పోళ్ళకి, మాకు అందం ఏటి బాబూ ఓ సిన్నమాట. ఈ సంగతి అందరికీ తెలుసు. అంచేత అందరికీ సత్తెం బాబుకీ, లేబరు ఇనస్పెక్టరికీ, మేనేజరు బాబుకి, ఒకరేవిటి అందికీ సదివింపులు సదివించాలి. మాకు సగమే మిగుల్తాది.

ఏటి సేత్తాం బాబూ ఎయ్యి దరిద్రాలకి లక్ష వుపాయాలు కానైతే బాబూ యిందులో యింకో తిరకాసుంది. పాపం ఎవడికైనా నిజంగా యాక్సిడెంటు అయినా, ఆడు కూడా అన్ని సదివింపులూ సదివించాలి. అదంతే నువ్వు దీనికోసం అంత యిదైపోకు.

కాని బాబూ నాను సదూకోలేదు. నీ అంత తెలివైనోణ్ణి కాను. అయినా నాకు అప్పుడప్పుడు అనిపిస్తాది మనిషికి యిలవ కడతారేటీ అని.

ఎవడైనా ఏ బస్సుకిందో పడి చస్తే ఆడి పెళ్ళాం, బిడ్డలకి యింత అని యిస్తారు కదా అంటే ఆ సచ్చినోడి ప్రాణం ఖరీదు అంతేనన్న మాట. కాని దాట్రుబాబు ఎంత దబ్బిచ్చినా ఆ పిల్లలకి తండ్రిని, ఆ ఆడదానికి మొగుడ్ని తేగలవా బాబు సెప్పు నానేమైనా తప్పుగా మాట్లాడితే ఏం అనుకోకు.

దానానికి మతిపోతోంది. నువ్వు తప్పు మాట్లాడ్డవేమిటి నారాయుడూ మా అందరి కంటే తెలివిగా మాట్లాడు తున్నావు ఆశ్చర్య పోతున్నాడు.

రోజూ వీణ్ణి కూర్చోపెట్టుకొని కాస్సేపు మాట్లాడితే ప్రపంచంలో ఏ యూనివర్శిటీ చెప్పని విషయాలు ఎన్నో తెలుస్తాయి. అని అనిపించింది తనకి.

నారాయుడు ఆ పూట సుక్కేసుకోలేదు. అయినా మంచి ఊపులో వున్నాడు.

"నీ కాడకి సత్తెం బాబు ఒచ్చినాడేటి బాబూ తోవలో అగుపించేడు"

వచ్చేడన్నట్టు తలూపాడు దానం.

"అయితే ఏదో కేసొచ్చిందన్న మాటే. ఆడు ఒట్టి పుండాకోరు. ఎప్పుడెప్పుడు ఏలు తెగ్గోసుకుంటాడా అని గోతికాడ నక్కలా కాసుక్కూర్చుంటాడు. ఎవుడికెంత యిస్తాడో మాకేటి తెలుస్తుంది సెప్పు? కానేటి సేస్తాం? ఆయన్ని మేం సెయ్యలేం. మరింక ఎపుడో ఒకణ్ణి నమ్మాల్సిందే కదా. మరోడైతే యింకా వూడబొడుస్తాడా?"

ఏటో వెర్రి!

ఒకడు అమ్మకి మొగుడు.

మరోడు తల్లికి మొగుడు.

మోటగా చెప్తున్నందుకు ఏటీ అనుకోకు బాబూ. ఉన్న మాట అది.

అణ్ణి సూత్తారం నువ్వు నమ్మకు బాబూ నీక రెండొందలు యిచ్చేదంటే ఆడు నీకు యిస్తానని నాలుగొందలు తీసుకుంటాడన్న మాట.

"ఎన్ని వందలు పుచ్చుకోవడానికీ నేను అసలు అలాటి పనిచేస్తే కద. తిండిలేకపోతే మాడి చస్తాను కాని యిలాంటి వెధవ పనులు చెయ్యను. ముందే గనుక తెలిస్తే అసలు యిక్కడికి రాకపోదును" దానం తన నిర్ణయం చెప్పేశాడు.

నారాయుడి సిగరెట్టు అయిపోయింది. లేచి వెళ్ళి బైట పారేసి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు. దానం మరో సిగరెట్టు యివ్వబోయేడు గాని నారాయుడు తీసుకోలేదు.

"ఏటి బాబూ నీ ఎర్రి నువ్వు యియ్యకపోతే ఆగిపోద్దేటి? మరోడు యిస్తాడు"

డబ్బెవ్వరికి అక్కర్నేదు?

మావూ డబ్బు కోసమే కదా ఈ పని సేస్తున్నాం!

నువ్వైనా ఏం పాపం సెయ్యటం లేదే!

మాకు బాధ లేకుండా, నొప్పి తెలీకుండా చేస్తున్నావు. అంతే గదా.

ఎవురికైనా బాధ కలిగిస్తే పాపం అవుతాది. కాని బాధని పోగొట్టడం పాపం కాదు బాబూ.

అదీ పుణ్యమే కదా!

దానం అవాక్కై వింటున్నాడు.

పాప, పుణ్యాలు అర్థం ఒక కొత్త కోణంలోంచి వింటు న్నాడు.

ఏ యుగంలోనో కృష్ణుడు భగవద్గీత చెప్పాడో లేదో ఎవరూ విన్లేదు కాని యిప్పుడే నారాయుడు కొత్త గీత ఉపదేశిస్తున్నాడు.

"డబ్బు పుచ్చుకుంటున్నానంటున్నావా? మనం ఎవరి దగ్గరా ఏదీ పూరికే తీసుకోకూడదు కదా? అసలూ దేవుడే మన కాడ డబ్బు తీసుకుంటున్నాడు కదా! నిజానికి దేవుడికి డబ్బెందుకు బాబూ. కాని మనం గుళ్ళో దక్షిణ వేస్తున్నాం కదా. దేవుడికి మొక్కుకుంటాం కదా. నాకీ పని చేసి పెడితే నీకు తలనీలాలు యిస్తానని, నిలువు దోపిడీ యిస్తాననో మొక్కుతాము"

మరి అది లంచం కాదా బాబూ.

దేవుడూ డబ్బు తీసుకునే కదా మన కోరికలు తీర్చేది.

మరికం మనల్ని పుట్టించిన దేవుడికే లేని పాప భీతి మన కెందుకు బాబూ. ఏటా యాడిలా చెప్తున్నాడనుకోకు.

నిజం, నాయం నీకైనా ఒకటే. నాకైనా ఒకటే.

నాను పనిచేసి డబ్బులు తీసుకుంటున్నాను.

మీరంతా నాకు సాయం చేసి డబ్బు తీసుకుంటున్నారు.

అందులో తప్పేం వుందనుకోకు.

నీకు యింత సదువు చెప్పించిన మీ అమ్మ, అయ్యలకి యింత అన్నం పెట్టొద్దా బాబు.

నిన్ను కట్టుకున్న దానికి ఓ కోక కొనొద్దా బాబూ.

నువ్వు మాలాగ కాయ కష్టం సెయ్యలేవు కదా.

మరింక పాపం, నాయం అనుకొని కూసోక, నీ డ్యూటీ నువ్వు సెయ్యి.

పాపన్నాలంటావా.

అటి సంగతి. ఆ దేవుడే సూసుకుంటాడు.

అది ఆడి డ్యూటి.

సంసారం అన్నాక, బతుకన్నాక మంచీ వుంటాది, సెడ్డా వుంటాది.

అన్నింటినీ బరించాల మరి.

ఏటో బాబూ. ఈయేల నిన్ను చూస్తే తోడబుట్టిన వోణ్ణి చూసినట్టనిపించినాది.

ఏటేటో వాగేసినాను.

ఏటనుకోకు.

అంటూ లేచేడు నారాయుడు.

తరువాత వేలుకి బాండేజీ ఓసారి చూపించుకొని వెళ్ళి పోయాడు.

వెళ్ళిపోతున్న నారాయుడి వైపు నరుడు నారాయణ మూర్తిని చూస్తున్నట్టు భక్తిగా చూశాడు దానం.

చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపించింది.

ఆ రాత్రి దానం ఇంజక్షన్ యిచ్చాడా?

ఇవ్వకుండా ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు వుండగలడు?

## 11

ఆ ఊర్లో రామదాసు, అతని ఫ్యాక్టరీ, నారాయుడూ వగైరాలు కాకుండా యింకా చాలా వున్నాయి.

అసలా ఊరు ఎలా వుంటుంది?

కంటికి చిన్నా, ఉగరానికి పెద్దా అన్నట్టుంటుంది ఆ ఊరు.

రైల్వేస్టేషను లేదు.

ఒకప్పుడు బ్రిటీషువారి హయాంలో రైల్వే లైను వేస్తా మన్నారు.

అమ్మో! ఇంకేమైనా వుందీ రైలు వచ్చిందంటే ఊర్లో జనం పెరిగిపోతారు. ధరలు పెరిగిపోతాయి. మాకు ఒద్దుగాక ఒద్దు. ఏదో మమ్మల్నిలా బతకనీయండి. అది ఆ వూరి పెద్దలంతా ఉమ్మడిగా గోల పెట్టేరు.

అంచేత ఆ వూరికి పది మైళ్ళ దూరంలో రైల్వే లైను వేసారు.

సముద్రం లేదు.

ఒక్క ఏరు మాత్రం వుంది. అది వూరికి రెండుమైళ్ళ దూరం. ఎండాకాలంలో ఏ ఏట్లో ఇసక మీద నడవడం కన్న పీర్ల పండుగ నాడు నిప్పుల మీద నడవడం తేలిక.

ఊరి చివర్లో మాత్రం నాలుగో ఐదో చెరువులున్నాయి. ప్రతి చెరువు గట్టున ఒక బావి వుంది. అవి మాత్రం మంచినీళ్ళే.

ఊర్లో అందరి పెరళ్ళలోనూ బావులున్నాయి. కానీ వాటి నీరు సముద్రపు నీటి కంటే ఉప్పు. అంచేత వూరి ప్రజలందరికీ ఆ బావుల నీరే తాగడానికి ఆధారం.

అయితే లేబరుమాత్రం నూతి నీళ్ళు వేడి చేస్తాయి అని చెరువు నీళ్ళే తాగుతారు.

ఆ వూరికి మంచినీటి పథకం తయారై పదేళ్ళయింది. ఈ పదేళ్ళలో చాలా ప్రభుత్వాలు మారాయి. అయితే ఏ ప్రభుత్వమూ ఆ పథకాన్ని కాయితం మీద నుండి భూమ్మీదకు దింపలేదు.

అమ్మవారి గుళ్ళు, రామ మందిరాలు తీసేస్తే ఆ ఊర్లో చెప్పుకో తగ్గ దేవుళ్ళు ఇద్దరు మాత్రమే వున్నారు.

ఒకడు శివుడు, రెండు విఘ్నేశ్వరుడు.

ఆంజనేయస్వామి వున్నాడు కాని అతన్ని ఎవరూ దేవుడిగా గుర్తించలేదు. అతను కేవలం రాముడి పాదాల దగ్గర రామ బంటుగా మాత్రమే గుర్తింపబడ్డాడు.

స్కూలు పిల్లలు మాత్రం పాపం! అతనికి పెళ్ళి అవలేదు ట్రో అని జాలిపడి ఆ గుడికి వెళ్తుంటారు.

ఉన్న యిద్దరు దేవుళ్ళని వూరి మోతుబరులిద్దరూ పంచే సుకున్నారు.

రామదాసుబాబు శివుణ్ణి కొలిస్తే....

కృష్ణంబాబు విగ్నేశ్వరుడ్ని కొలుస్తాడు.

ఆ బాబు శివరాత్రి ఉత్సవాలు రంగరంగ వైభవంగా జరిపిస్తాడు.

ఈ బాబు వినాయక చవితి నవరాత్రులు నభూతోన భవి ష్యత్తుగా జరిపిస్తాడు.

శివరాత్రికీ గాంబ్లింగ్‌కీ ఏం సంబంధం వుందో తెలీదు కాని, శివరాత్రి నాడు శివాలయం ముందు అధమం ఒక వందైనా లాటరీ బల్లలు వేసేవారు.

ఊర్లో ఉన్న చిన్న, పెద్ద మొగాళ్ళంతా ఆ రాత్రంతా ఆ లాటరీల దగ్గరే వుండేవారు.

దీ క్లబ్ ఈజ్ ది విన్నర్ అని అంతిమ గెలుపు లాటరీ వాళ్ళదే.

వినాయకుడికీ, గేంబ్లిక్‌కీ పడదేమో! వినాయక చవితికి మాత్రం హరికథలు, పురాణ కాలక్షేపాలు మాత్రం వుండేవి.

పట్నానికి తమ్ముడు.

పల్లెకి అన్న.

భారతదేశంలో అన్ని పల్లెటూరుల్లాగే అక్కడా పంటలూ, వంటసారా ఉత్పత్తి అవుతాయి.

అక్కడా...

ఆడా, మగా...చిన్నా, పెద్దా.

అప్పులు ఇచ్చేవారు...

పుచ్చుకునే వారూ...

ఎగ్గొట్టే వాళ్ళూ...

డబ్బు మనుషులూ...

జబ్బు మనుషులు...

చెడిపోయిన వాళ్లు...

చెరిచే మగాళ్ళు...

సారా చేసే వారూ, తాగేవారూ....

జైలుకి వెళ్ళేవాళ్ళూ...

వెళ్ళవలసిన వాళ్ళూ....

ఖూనీలు చేసే వాళ్ళు...

చేయించే వాళ్ళూ....

వగైరా అన్ని రకాల మనుషులూ ఉన్నారు.

అక్కడ దేశాభిమానం అంటే అర్థం తెలిసిన వారికి అది లేదు.

తెలియని వారిక్కూడా లేకపోవచ్చు.

అక్కడ ప్రజాస్వామ్యం వుంది.

కాని కూలీలు హరిజనులూ జనాభా లెక్కల్లోకీ, ఓటర్ల లిస్టులోకీ తప్ప ప్రజలకింద రారు.

అక్కడ పట్టుబడనంతవరకు దొంగలే దొరలు.

కానీ కూలీల కడుపులు ఆకలితో మండుతాయి.

అక్కడ మహర్షులు, మా మంచి వారూ లేరు.

పురుషులున్నారు కాని ఋషులు లేరు.

కౌరవులున్నారు కాని కర్ణుడు లేడు.

బీదవాడు జబ్బుచేస్తే వాడికీ, వాడి దగ్గర వాళ్ళకీ కూడా సుఖం.

బ్రతుకులు సంబంధించినంతవరకు రెండే జాతులు.

డబ్బున్న వాళ్ళు లేని వాళ్ళు.

కామందులు.... కూలీలు.

ఆ ఊరిలో....

అత్తరు దీపాలు పెట్టుకోగల కామందులున్నారు. అముదం దీపమే అత్తరు దీపమైన అభాగ్యులున్నారు. కూలీలు పండించిన చేలు పంట భారానికి వంగిపో తాయి. దరిద్ర భారానికి కూలీలు వంగిపోతారు.

కోటికి పడగలెత్తిన వారూ వున్నారు.

ఆ పడగ నీడన బతికే బడుగు వారూ వున్నారు.

కోటల్లాంటి భవంతులున్నాయి.

కాకి గూళ్ళలాంటి గుడిసెలున్నాయి.

వేదాలు నేర్పిన పండితులున్నారు.

పసిపిల్లల ఏడుపులే వేదఘోషగా వినే దరిద్రులూ వున్నారు.

ఆ ఊరికి కృష్ణంబాబు మోతుబరి.

ఆ వూరికి రామదాసు బాబు కుడి భుజమైతే, కృష్ణం బాబు ఎడమభుజం.

ఈ వూరిని కురుక్షేత్రంతో పోలిస్తే రామదాసు కర్ణుడు, కిష్ణంబాబు అర్జునుడు.

అన్ని బలాల్లోనూ ఇద్దరూ సమానులే.

కృష్ణంబాబు ఆరడుగుల ఎత్తు, ఎత్తుకి తగిన లావూ వుంటాడు.

అతని రంగు నలుపు కాదు.

ఎరుపూ కాదు.

తెలుపు అంతకంటే కాదు.

భావాన్ని బట్టి మారుతుంది.

కోపం వస్తే ఎర్రగా రాగి పళ్లెంలా అవుతుంది.

వెర్రికోపం వస్తే కాలిన పెనంలా నల్లగా వుంటుంది.

ఓట్లు అడుగుతున్నప్పుడూ, తన ఎత్తులు పారుతున్నప్పుడూ శరత్కాలం వెన్నెల్లా తెల్లగా వుంటాడు.

అతను ఎవర్నీ ఏమీ అడగడు ఓటు తప్ప.

ఎవ్వరికీ ఏమీ యివ్వడు అప్పు తప్ప.

రూపాయి వస్తుందన్న గ్యారెంటీ వుంటేకానీ ఖర్చు పెడతాడు.

ఎంతమందిలో వున్నా అతను అవుల మందలో ఆంబోతులా, మేకల్లో చొరబడ్డ తోడేలులా కాన్స్పిక్యువస్ గా కనిపిస్తాడు.

ప్రజల్ని పాలించడానికే పుట్టిన రాజులా అతి దర్జాగా వుండ గలడు.

రాజులా దయ జూపగలడు.

రాజులాగే పీక తీయించగలడు.

అతను ఎవరితోనూ "ఈ పని నువ్వు చెయ్యి" అని గాని "చెయ్యాలి అని" గాని అనడు.

నువ్వు చేస్తావు అంటాడు.

"రాబోయే వారం డైరీ" ఈవేళే రాసుకోగల బలవంతుడు.

అతను రాముణ్ణి చంపిన రావణుడిలా అతి భయం కరంగా నవ్వగలడు.

అవసరం అయితే విశ్వామిత్రుడి దగ్గర మేనకలా అతి మనోహరంగా నవ్వగలడు.

అతను రాక్షసుడని ఎవరూ అనరు.

తనకీ, తన అంతస్థుకీ భంగం రానంతవరకూ గెడ్డాల, ఋషులు సిగ్గుపడేటంత మంచిగా వుండగలడు.

"అవసరం అయితే నా పిల్లని ఇతని దగ్గర ట్రైనింగు పెడితే బావుండును" అని రావణాసురుడు అనుకునేటంత రాక్షసత్వం ప్రదర్శించగలడు.

ఊరు శివార్లలో వున్న అతని పొలం ఒక గట్టున నిల్చుంటే రెండో చివర కనిపించదు.

అతని ఇంటి ప్రహరీగోడ, గోడవతల ఏనుగు నిల్చున్నా ఇవతలకి కనిపించనంత ఎత్తుంది.

ఆ ఇంటి ముఖద్వారం దాటి వందగజాలు వస్తే, ఆ ఇంటి మొట్లుంటాయి.

ఆ ఇల్లు ఎంత పెద్దదంటే... ఇంటి మధ్య గదిలో ఖూనీ చేస్తే, చస్తున్న వాడి కేకలు వరండాలోకి వినిపించవు.

అలాంటి ఇల్లే మరో పేటలో వుంది.

అది రామదాసు బాబుది.

వీళ్ళ అబ్బాయిల్ని వాళ్ళ అమ్మాయిలకి ఇవ్వడం, వాళ్ళ అబ్బా యిల్ని వీళ్ళ అమ్మాయిల్కి ఇవ్వడం మూడు నాలుగు తరాల నుండి జరుగుతోంది.

అదేం వింత కాదు.

వింతేమిటంటే వాళ్ళింట్లో మగాళ్ళని వాళ్లు అల్లుడన్న అను బంధం మరచిపోయి ఖూనీలు చేసుకోవడం రివాజై పోయింది.

ఆ తరువాత కేసులు తప్పించుకోవడం మామూలే.

రెండు కుటుంబాల మధ్య ఐస్ పెడితే అగ్గయిపోతుంది. పారిజాతం మొక్క నాటితే విషపు పువ్వులు పూస్తుంది. అమృతం పెడితే హాలాహలం అయిపోతుంది. ఏమీ పెట్టకపోతే గాలి నిప్పుగా మారిపోతుంది.

కృష్ణంబాబు అసలు పేరు గోపాలకృష్ణ. అతను ఆ వూరి ప్రెసిడెంటు. దేవుడు మేలు చేస్తే ఈ ఏటితో ఏకైక పుత్రుడు ప్రసాద్ చదువైపోతే ఈ ప్రెసిడెంటు పట్టం వాడికి కట్టేసి, తను హైదరాబాద్ రాజకీయాల్లోకి వెళ్ళిపోదామని అతని జీవితాశయం.

ఆ ప్రయత్నం మీదే వున్నాడు కూడా.

తనకున్నదే ఒక్కనలుసు.

వాణ్ణి ఈ రాజ్యానికి యువరాజుని చేసెయ్యాలి. వాడీ రాజ్యం ఏలుతుంటే తను హాయిగా హైదరాబాదులో హైలెవల్లో వుండిపోవచ్చు.

ఈ పంచాయితీ ప్రెసిడెంటు గిరీ పర్మినెంటు లాంటిది.

నోరు తడి అవుతుంటే తప్ప కడుపు నిండదు.

ఆ ఇంటి వీధి వరండాలో ఎప్పుడూ ఒకే ఒక పడక్కుర్చీ వుంటుంది. దానిలో సన్నటి పరుపు కూడా వుంటుంది.

అది కృష్ణంబాబు తాతల టైములో చేయించింది.

నల్లచేవ కర్రతో చేయించారేమో అది నల్ల మార్బల్‌తో చేస నట్టు నిగనిగలాడుతూ వుంటుంది. కృష్ణబాబు సింహాసనం అది.

అందులోకూర్చునే అతను వ్యవహారాలన్నీ చక్కబెడతాడు. అందులో అతను తప్ప మరెవరూ ఆఖరికి అతని కొడుక్కూడా కూర్చోడు.

అతనెప్పుడూ పెద్దాపురం పట్టులాల్చీ, పొందూరు ఖద్దరు పంచెలే కడతాడు. భుజంమీద జరీవాణీ వేలాడుతూ వుంటుంది.

మెడలో పులిగోరు పతకం వున్న బంగారు గొలుసు వుంటుంది.

అతనెప్పుడూ నాటు చుట్టలు కాల్చడు.

ఫారిన్ సిగార్‌లే వాడతాడు.

ఏ గ్రహానికి ఎప్పుడు కోపం వస్తుందో! అంచేత అతను ఎడంచేతి మధ్యవేలుకి నవరత్నాలు పొదిగిన వుంగరం, వుంగరం వేలుకి ముత్యం పగడం కలిపిన వుంగరం వుంటాయి.

కుడిచేతికి బంగారు కడియం వుంటుంది. దానితో మొడితే ఎంత గట్టి బుర్రయినా కొబ్బరికాయలా మధ్యకి పగలాల్సిందే.

ఆ సాయంత్రం చీకటి చమ్కీ పౌడరు అద్దుకుంది.

చల్లగాలి సన్నజాజి మొగ్గలతోను, సంపంగి మొగ్గలతోను సరసాలాడుతోంది.

ఆ గాలి స్పర్శకి ఆ మొగ్గలు పులకించి పువ్వులౌతున్నాయి.

రోజులాగే ఆ సాయంత్రం కూడా కృష్ణంబాబు అదే వరండాలో అదే కుర్చీలో పడుకొని కొడుకు పట్టాభిషేకం కలలు కంటున్నాడు.

పక్కనే చిన్న స్టూలు మీద రేడియోలో వార్తలు వస్తున్నాయి.

కలలు కంటూ వార్తలు వింటున్న కృష్ణంబాబు ఒక్కసారి కల చెదిరిపోయింది.

అతితొందరలో మధ్యంతర ఎన్నికలుండొచ్చు అన్న వార్త అతని కల చెరిపేసింది.

ఈ వార్తకోసమే అతను ఎదురుచూస్తున్నాడు. ఈసారి ఎల క్షన్లలో తనకి ఎమ్మెల్యే సీటు రావాలి. తను హైదరాబాద్ తరలిపోవాలి.

ఈ పెప్పరమెంట్ ప్రెసిడెంటుగిరి తన లెవెల్‌కి చాలదు. అయితే ఆ రామదాసు తన మీద పోటీ రాకుండా చూడాలి. అక్కడి భోగట్టాలు చెప్పే సత్యానికి కబురు పెట్టాలి.

"రాజు తల్చుకుంటే దెబ్బలక్కొదవా" అని కృష్ణంబాబు తల్చుకుంటే జరగనిదేం వుండదు.

వెంటనే సత్యానికి కబురు వెళ్ళింది.

కబురు తీసుకెళ్ళినవాడూ, సత్యం కలిసే వచ్చారు.

సత్యం వచ్చేసరికి కృష్ణంబాబు అలవాటు ప్రకారం వరం డాలో పడక్కుర్చీలో పడుకొని వున్నాడు.

ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగలడు సత్యం.

"ఏమిటోయ్ మరీ కనిపించడం మానేశావు. ఏమంటున్నాడు మీ రామదాసు?" అని పలకరించి "ఒరే అప్పన్నా సత్యం వచ్చాడు కుర్చీ, మంచినీళ్ళు తీసుకురా" అని కేక పెట్టాడు.

అప్పన్న చాలా నమ్మకమైన పాలేరు.

ప్రభు భక్తి పరాయణుడు.

అంచేత కుర్చీ తేలేదు.

కృష్ణంబాబు ముందు కలక్టరు హోదాకి తక్కువాళ్ళు ఎవరూ కూర్చోడానికి వీల్లేదు.

"అప్పన్న లేడు! బజారుకి వెళ్ళాడు" లోపలినుండి ఆకాశ వాణి జవాబు.

పనిమినిషి మాత్రం మంచినీళ్ళుతెచ్చింది.

ఇవన్నీ సత్యానికి తెలుసు.

ఫరవాలేదులెండి. అని వరండాలో వున్న చిన్న పిట్టగోడ మీద కూర్చున్నాడు కావాలనే కూర్చున్నాడు.

సత్యానికి తెలుసు తనతో పనుంటే తప్ప కృష్ణంబాబు కబురు పెట్టడు. మరింక కూర్చుంటే చచ్చినట్టు భరిస్తాడు.

భరించాడు కృష్ణంబాబు.

"ఎలా నడుస్తోంది మీ ఫ్యాక్టరీ?"

నడవడేం ఖర్మ! పరిగెడుతోంది. లాభాలు చూస్తే మా రామ దాసు బాబుకీ ఆశ్చర్యం వేస్తోంది. మా వర్కర్లు గొర్రెల్లో గాంధీ లాంటి వాళ్ళు. ఒక్కగంట పని మానేస్తే అయ్యగారికి అయిదు రూపాయలు నష్టం వస్తుందేమోనని ఆరాటపడిపోతారు.

కృష్ణంబాబుకి కావల్సింది ఆ వర్కర్లు గొర్రెల్లో గాంధీలా? మేకల్లో మహాత్ములా అని కాదు రామదాసుకి ఎలక్షను ఐడియా వుందా, లేదా అని మాత్రమే. ఈ సత్యంగాడే తక్కువ్వాడా? తను అడిగేవరకు చెప్పడు. వీడికి అవకాశం లేకగాని లేకపోతే యూనియన్ లీడరేం ఖర్మ ఇండియాకి లీడరై వుండేవాడు.

"మరి బోనసు అడక్కపోయారా? జీతాలు పెంచమని అడ గొచ్చు"

సత్యం ఆ గోడమీద సర్దుక్కూర్చున్నాడు.

"సర్లెండి! ప్రతి ఏడూ అడుగుతూనే వున్నాం. పాపం ఆ వర్కర్లకి జీతాలు చాలవు. ప్రతి నెలా డబ్బు కోసంఎవడో ఒకడు వేలు తెగ్గోసుకుంటూనే వున్నాడు. ఇంకా కొన్నాళ్ళకి మా

ఫ్యాక్టరీలో రెండు చేతులకీ పదివేళ్ళూ వున్న మనిషి కనిపించడు" మొసలి కన్నీరు కార్చాడు సత్యం.

ఇనుము వేడిగా వుంది. ఒక దెబ్బ వెయ్యాలి.

"ఇలా నీళ్ళు కారుస్తూ కూర్చోకపోతే స్ట్రయిక్ చెయ్యం డయ్యా. రామదాసు అతన్ని రక్షించిన రాముడూ కూడా దిగొ స్తాడు. అయినా వాళ్ళకంటే ఏమీ తెలీదు నువ్వేం చేస్తున్నా వయ్యా? అసలు ఈ డబ్బంతా ఏం చేశాట్ట?"

బావుంది సార్. డబ్బున్న వాళ్ళంతా ఆ డబ్బుతో ఏం చేస్తారు? ఆ డబ్బుతో యింకా డబ్బు ఆర్జిస్తారు. ఆయనెవరో చెప్పినట్టు డబ్బు డబ్బుని ప్రేమిస్తుంది.

కృష్ణంబాబు వింటున్నాడు. సిగార్ వెలగటం లేదు. వెలిగించిన వెంటనే అగ్గిపుల్ల కంటే ముందే ఆరిపోతోంది.

ఏం చుట్టలయ్యా బాబూ! మన చుట్టలకి ఫారిన్ ముద్ర వేసి ఫారిన్ ధరకి అమ్మేస్తున్నారు. ఛ! ఛ! దగాకోరు వెధవలు. అయినా వాళ్ళని అనుకొని ఏం లాభం? మనకి మన దేశంలో తయారీలంటే నమ్మకం లేదు. మరి మన సరుకు లెలా చెల్లాలి? అంచేత మనవాళ్ళు ఈ పద్ధతి మరిగేరు.... ఒరే అప్పన్నా! మరో చుట్టపట్రా... అంటూ చేతిలో వున్న చుట్టని పక్కనే వున్న గులాబీ మొక్కలోకి విసిరేశాడు.

"ఏం వుంది సార్! ఎలక్షన్లొస్తాయని పుకారుంది కదా! ఈసారి రామదాసుబాబు పోటీ చేస్తాడని కూడా పుకారుంది"

ప్రభు భక్తి పరాయణుడు చుట్ట తెచ్చాడు.

అగ్గిపుల్ల గొట్టేడు సత్యం.

చుట్ట వెలిగింది.

అగ్గిపుల్లతో పాటు కృష్ణంబాబు గుండె కూడా మండింది.

ఎలక్షన్‌లో రామదాసు నిలబడకూడదు.

అంతే!

"రేపు మీ వాళ్లందరితో మీటింగు పెట్టి ఎల్లుండి స్ట్రయిక్ ప్రారంభించు"

"అదేమిటి సార్! నోటీస్ ఇవ్వకుండా స్ట్రయిక్ చెయడానికి రూల్సు ఒప్పుకోవు" రూల్సు మాట్లాడాడు సత్యం.

"అల్లెవరు మధ్యలో ఒప్పుకోవడానికి, మానడానికి రూల్సు మనం చేసినవే కదా! మనం ఎలా చెప్తే అలా వింటారు. నువ్వు ప్రారంభించు ఆ వెనుక నేనున్నాను" అని కురు క్షేత్రంలో కృష్ణుడిలా అభయం యిచ్చాడు కృష్ణంబాబు.

సాధారణంగా స్ట్రయికులు ఎక్కువ శాతం యూనియన్ లీడర్లు చేయించినవే. ఆ లీడర్ల చేత ఆ వూరి పెద్ద పార్టీల్లో ఒక పార్టీ చేయించి మద్దతు, మదుపు యిస్తుంది. ఇప్పుడు కృష్ణంబాబు మదుపు కూడా యిచ్చాడు.

డబ్బు, సలహా తీసుకుని వెళ్ళిపోయాడు సత్యం.

❖ ❖ ❖

స్ట్రయికు పేరు విన్న నారాయుడు కుప్పకూలిపోయాడు. ఇంకో వారం దాటకుండా మహాలక్ష్మిని ఆస్పత్రిలో చేర్చాలి. అంటే తన కాంపెన్సేషన్ డబ్బు ఈ వారంలో అందాలి.

ఈ స్ట్రయికు అయ్యేదెప్పుడు?

ఆ డబ్బు అందేదెప్పుడు?

దరిద్రుడు తల కడగబోతే వడగళ్ళ వాన వచ్చిందట.

కథ మళ్ళీ మొదటికొచ్చింది.

ఇప్పుడీ డబ్బు రాకపోతే ఇంక కోసుకోవలసినవి వేళ్లు కాదు పీక....

మార్కండేయుడు శివలింగాన్ని చుట్టేసినట్టు నారాయుడు మళ్ళీ పేర్రాజు కాళ్ళే పట్టుకున్నాడు.

"ఏటోరే పేర్రాజూ!" అర్థంతరంగా ఈ సమ్మె ఏటి? అసలెందుకు సేస్తన్నారో నీకేటైనా తెలుసా?

నారాయుడి అమాయకత్వానికి పేర్రాజుకి నవ్వొచ్చింది.

సమ్మె ఎందుకు చేస్తారు?

పదవి కోసం పెద్దవాళ్ళు చేయిస్తారు.

డబ్బు కోసం లీడర్లు చేయిస్తారు.

రెండు తోడేళ్ళ దెబ్బలాట.

మధ్యలో నారాయుడిలాంటి వాళ్ళకి నాశనం.

ఈ సమ్మె ఇంకా ఎన్నాళ్లుంటాదో ఏటో? నారాయుడి బెంగ.

ఎన్నాళ్లుంటుంది?

కృష్ణంబాబు డబ్బు పారేసినన్నాళ్ళు.

అతడు ఎన్నాళ్ళు పారేస్తాడు?

తన పని అయ్యేవరకు.

అతని పని ఎప్పుడౌతుంది.

వర్కర్లు విసిగిపోయాక

వర్కర్లు ఎప్పుడు విసిగిపోతారు?

సగం మంది చచ్చాక.

ఇంతకీ ఇది వర్కర్లకి సంబంధించినది కాదు.

పదవులకు సంబంధించినది.

మరింక దీనికి అంతం ఎక్కడ?

ముందీ నారాయుడి బెంగ తీరాలి.

బెంగ తీరాలంటే డబ్బు కావాలి.

ఎంతకావాలి?

"నారాయుడూ! నీ కూతురి కడుపులోని నలుసంత ప్రాణం ఖరీదు ఎంత?"

ప్రాణం పొయ్యడానికి ఖరీదంటే అర్థం వుంటుంది. కానీ ప్రాణం తియ్యడానికి ఖరీదుంది.

"మనం అంతా నాగరికులం"

"ఇంతకీ డాక్టర్ దగ్గరకు వెళ్ళావా? ఎంత ఖర్చు అవుతుందో అడిగేవా? అన్నిటికీ బుర్రూపి వచ్చేశావా?"

మొన్న పొద్దుటేల మాలచ్చిని తీసుకుని ఎళ్ళే కదా! ఆయమ్మ పేరేటి సెప్మా? ఆ .... కనకరత్నంట. తల్లి కనక మాలచ్చిలాగున్నది.

❖ ❖ ❖

ఆ ఊరిలో గవర్నమెంటు ఆస్పత్రి కాక, మరో రెండు ప్రైవేటు ఆస్పత్రులున్నాయి.

ఒకటి డాక్టర్ దామెదరంది.

అతను ఎమ్.బి.బి.ఎస్. చదవలేదు. అయుర్వేదం చదవలేదు.

హోమియో కూడా చదవలేదు.

నార్త్‌లో ఏదో యూనివర్శిటీలో ఏదో డిగ్రీ తీసుకున్నాడు.

అతని పేరు పక్కనున్న డిగ్రీ ఏమిటో ఎవరికీ తెలీదు కాక పోతే అతని వైద్యంతో అతనికే నమ్మకం లేదేమో, అతనికి ఏ జబ్బు వచ్చినా గవర్నమెంటు డాక్టరు దగ్గరకు వచ్చేస్తాడు.

ఎవరయినా అదేమిటని అడిగితే.

"పెరటి చెట్టు మందుకి పనికిరాదు కదా" అని నవ్వేసే వాడు.

అతను ప్రాక్టీసు పెట్టిన కొత్తల్లో...

అతని కాంపౌండరుకి ఓనాడు తలనొప్పి వచ్చింది.

"తలనొప్పికి సవాలక్ష కారణాలుంటాయి. నిన్ను క్షుణ్ణంగా పరీక్ష చేస్తాను" అన్నాడు దామోదరం.

ఆ డాక్టరు గారి పరీక్షలు గురించి అతనికి బాగా తెలుసు. అంచేత "అక్కర్లేదు. ఇంటికెళ్ళి అమృతాంజనం రాసుకుంటాను" అన్నాడు.

"నా దగ్గర పని చేస్తున్న నువ్వు చిట్కా వైద్యం చేసుకుంటే నాకు యిన్సల్టు–బల్ల ఎక్కు" అన్నాడు డాక్టరు.

బల్ల ఎక్కేడు కాంపౌండరు.

ఆ డాక్టరుగారికి ఆ సంవత్సరంలో తన కాంపౌండరే మొదటి పేషెంటు.

అంచేత వెర్రి తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడికి మేనక కనిపించినట్లు కనిపించేడు కాంపౌండరు.

మెడ దగ్గర నుండి మొల వరకు స్టెతస్కోపుతో పరీక్ష చేశాడు.

మధ్య మధ్యలో ఊపిరి తీసుకో.

"ఊపిరి వదులు"

"ఊపిరి బిగపెట్టు."

వగైరాలతో పరీక్ష చేస్తున్నాడు.

పరీక్ష మధ్యలో కాంపౌండరు భూకంపం పుట్టేలా ఒక వెర్రి దగ్గు దగ్గి బల్లమీద నుండి గెంతేశాడు.

డాక్టరుకి పిచ్చి కోపం వచ్చింది.

పరీక్ష మధ్యలో ఈ గెంతులేమిటి?

"డాక్టరు చేత పరీక్ష చేయించుకోవడం కూడా చేతకాని వాడివి కాంపౌండరువి ఎలా అయ్యావ్?" తిట్టేడు.

కాంపౌండరుకి దగ్గు తగ్గి ఆయాసం తీరేక స్వామీ..... నేను శివానందనూ, వివేకానందనూ కాను. ఊపిరి బిగబెట్టి గంటలు గంటలు వుండడానికి. మీరు ఊపిరి బిగబెట్టమని చెప్పి అరగంటైంది. మళ్ళీ తీసుకో అనకపోతే నేనేం కావాలి? అని అయాసపడుతూనే మొరపెట్టు కున్నాడు కాంపౌండరు.

కొంచెం ఊపిరి సలకపగానే "తలనొప్పి పోయింది. ఇంక పరీక్ష ఆపేద్దాం" అని కూడా మొరపెట్టుకున్నాడు.

"ఊపిరి బిగపెట్టినంత మాత్రాన పోయే ప్రాణాలు పోతాయి కాని తలనొప్పి పోదు. మళ్ళీ బల్లెక్కు. బి.పి. చూస్తాను" అని అతను ఆ కాంపౌండర్ని మళ్ళీ బల్లెక్కించాడు.

తరువాత బి.పి. ఏపరేటస్ పట్టీ కాంపౌండరు చేతికి చుట్టి, స్టెత్ చెవులకి తగిలించుకొని, కాంపౌండరు నోటిలో థర్మా మీటరు పెట్టి మాట్లాడకు అన్నాడు.

అంత భయంలోనూ నోట్లో థర్మామీటరుతో ఎవరైనా ఎలా మాట్లాడతారా అని నవ్వు వచ్చింది కాంపౌండరుకి.

"ఎమిటా వెర్రినవ్వు?" అని కసిరి డాక్టరు బి.పి. ఆపరేటర్ బల్బు నొక్కడం ప్రారంభించాడు. అలా నొక్కడంతో అతనికి ఏం ఆనందం కలిగిందో కాని పాదరసం పూర్తిగా ఎక్కేవరకూ అలా నొక్కాడు. అపరేటస్‌లోని గాలి పాయిజనస్ గాస్ అయి నట్టు అతి నెమ్మదిగా వదలడం ప్రారంభించాడు.

అలా మూడుసార్లు బి.పి. చూసేక "ఇంత చిన్నప్పుడే యింత బి.పి. ఎందుకొచ్చిందో?" అని బాహాటంగానే ఆశ్చర్యపోయాడు.

తను చూసిన పక్షవాతం పేషెంట్లు అందరూ తన చుట్టూ కుష్టు, ముష్టి వాళ్లు చుట్టుకున్నట్టు అనిపించింది కాంపౌండరుకి.

"ఈ వేళ నుండీ ఉప్పు మానీ" సలహా యిచ్చేడు డాక్టరు.

ఈ బి.పి. పక్షవాతం గొడవ వదిలిపోతే జీవితాంతం కంద మూలాలు తిని బతకడానికి సిద్ధంగా వున్నాడు కాంపౌండరు.

"ఈ టాబ్లెట్స్ వేసుకొని మూడురోజులు రెస్ట్ తీసుకో" అని కాంపౌండర్ని పంపించేశాడు డాక్టరు.

కాంపౌండరు తన అక్కగారింట్లో వుంటాడు. అతను ఆ మధ్యాన్నం మజ్జిగ అన్నమే తిన్నాడు. రాత్రీ చప్పిడి వంటే తిన్నాడు.

ఆ రాత్రి నిద్రలో తనకి పక్షవాతం వచ్చినట్టు కలవచ్చి ఓ గావుకేక పెట్టాడు. ఆ కేకకి ఇంటిల్లిపాదీ లేచి కూర్చున్నారు.

"పీడకల" అన్నాడు వణుకుతున్న గొంతుకతో.

కల వివరాలు అడక్కుండానే దిష్టితీసి పారేసింది అక్క.

కొంచెం మంచినీళ్ళు తాగి పక్కకి తిరిగి పడుకోమన్నాడు బావ.

రెండు రోజులు చప్పిడి తిండి తిని, డాక్టరు యిచ్చిన మందు బుద్ధిగా వేసుకున్నాడు.

మూడో నాడు ఉదయం....

స్నానానికి బాత్రూమ్‌లోకి వెళ్ళాడు.

మరికొంత సేపటికి వంటకి టైమై, స్నానం చేద్దామను కున్న అక్కకి అప్పుడు జ్ఞాపకం వచ్చి "ఒరేయ్ తమ్ముడూ" అని ఒక పొలికేక పెట్టింది.

తమ్ముడు పలకలేదు.

కూతురికి జడవేస్తున్న అక్క "కదలకే" అని కూతుర్ని ఒక్క మొట్టికాయ పెట్టి "స్నానానికి కెళ్ళిన తమ్ముడు వెధవ ఎమయ్యాడో చూడండి" అని భర్తకి పురామాయించింది.

అతని కేకకీ సమాధానం లేదు.

వాళ్ళది తాటాకుల బాత్రము అవటం వల్ల అతను తడికి తోసుకుని తోపలికికెళ్ళాడు.

తర్వాత ఓ పొలికేక పెట్టాడు. బురదలో కప్పలా పడి వున్న బావమరిదిని చూసి –

"ఏమేవ్! వీడు తెలివి తప్పి పడిపోయేడు. రిక్షాని పిలు" అని అతడ్ని లేవదీశేడు.

అక్క, బావ కలిసి అతన్ని గవర్నమెంటు అస్పత్రికి తీసికెళ్ళి సరికి అతనికి తెలివొచ్చింది.

అతను తన జబ్బు, తన డాక్టరు గారు చేసిన వైద్యం వగైరా లన్నీ గవర్నమెంటు డాక్టరు సిరాజుద్దీన్‌కి చెప్పేడు.

సిరాజుద్దీన్ అతన్ని మళ్ళీ పరీక్ష చేసి "మీ డాక్టరు గారికి బి.పి. చూడడం వచ్చా?" అని మృదువుగా అడిగాడు.

ఆ తరువాత "నీకున్నది లో.బి.పి. మీ డాక్టరిచ్చింది మందు హై బి.పి.కి అంచేత అతని దగ్గర పనిచేసినా జీతం మాత్రం పుచ్చుకో. మందు పుచ్చుకోకు. కొన్ని రోజులు ఉప్పు కొంచెం ఎక్కువే వేసుకో!" అని సలహా ఇచ్చేడు సిరాజుద్దీన్.

ఏతా వాతా దామోదరం హాస్పిటల్లో ఎవరూ వైద్యం చేయించుకోరు.

యింక మిగిలింది....

కనకమాలచ్చి లాగున్న ఆ డాక్టరు పేరు కనకరత్నం.

ఆ వీధిలో...

డా.యం. కనకరత్నం .ఎం.డి. (గైనిక్).

డా. యం. గౌరీశంకరం ఎం.డి (పిల్లల నిపుణులు)

ఈ బోర్డు వూరి వాళ్లందరికీ పరిచయమే.

ఇద్దరూ ఒకే కాలేజీలో చదవలేదు.

ఒకే చోట ఉద్యోగం చెయ్యలేదు.

కాలేజీలో చదివే రోజుల్లో గౌరీశంకరాన్ని ఒక జూనియర్ ప్రేమించింది.

అందులో వింతేమీ లేదు.

గౌరీశంకరం అందగాడే.

ఆ అమ్మాయి అందగత్తే.

ఇద్దరూ తెలివైన వాళ్ళే.

అయితే ఆ అమ్మాయి తండ్రి ఇంకా తెలివైనవాడు.

అ అమ్మాయిది కులం ఎక్కువ.

అంతస్తూ ఎక్కువే.

అంచేత అ అమ్మాయి తండ్రి ఆమెని అమెరికా పంపిం చేశాడు.

ప్రేమని అమెరికా జయించేసింది.

కాలేజీ రోజుల్లో కనకరత్నాన్ని ఎవరూ ప్రేమించలేదు.

అయితే ఆమెకి పెళ్ళికాని బాధ తీర్చడానికి మాత్రం చాలా మంది సిద్ధపడ్డారు.

తక్కువ కులం –

స్కాలర్‌షిప్‌లు

స్టయ్ ఫండులు

వీటితో చదువుకోవడం వల్ల బాధలు ఆమెకి బాగానే వంట పట్టేయి.

కాని దానివల్ల ఆమెకి రాజకీయ చైతన్యం కలగలేదు.

నక్సలైట్ అవలేదు.

కనీసం కమ్యూనిస్టు అయినా అవలేదు.

ఈ కుళ్ళిపోయిన సంఘాన్ని పునాదుల్తో సహా పెకలిం చెయ్యడానికి నా జీవితాన్ని అంకితం చేస్తాను. వగైరా శపథాలేం చెయ్యలేదు.

మరైతే ఏమిటి ఆవిడ ఆశయం?

ఏమిటి సార్ ఆవిడ కనీసపు కోరిక?

"వీలైతే ఒక డాక్టర్ని కట్టుకొంటే మా ఇద్దరి జీవితం మాకూ, మా పిల్లలకీ చాలు" ఇదీ ఆమె చిరు ఆశ.

అదే ఆమె దేవుడికి చేసే ఏకైక ప్రార్థన.

దేవుడు ఆమె ఆశకి అడ్డురాలేదు.

ఆమె ఎత్తు అడ్డువచ్చింది.

అమె ఎత్తు అయిదడుగుల పదంగుళాలు.

ఆడవాళ్ళలో అంత ఎత్తు అరుదు.

ఆ ఎత్తుకి తగిన ఒళ్ళుంది.

"ఈవిడ మిలటరీకి వెళ్ళిపోతే బావుంటుంది" అనేవారు కాలేజీలో తోటి స్టూడెంట్లు.

ఆమె ఒంటికి మెరుగుంది.

కళ్ళకి కాంతి వుంది.

ముక్కుకి తీరుంది.

పెదిమలపైన అందమైన చిరునవ్వుంది.

ఆమెలోని ఓ భాగం చూసినా బావుంటుంది.

అన్నీ కలిపి చూస్తే ఇంకా బావుంటుంది.

ఇన్ని ఉన్న ఆడదాన్ని మరే దేశంలోనైనా అయితే ఎవరైనా తన్నుకుపోతారు. ఇండియాలో కూడా తన్నుకుపోవడానికే కాని పెళ్ళికి ఎవరూ సిద్ధపడలేదు.

ఆవిడకి కాలేజీలోనే జ్ఞానోదయం అయింది ఏవని?

తన పెళ్ళి తన కులం వాడితోనే అవ్వాలని–

మరో కులం వాడైతే ఆమెకేం అభ్యతరం లేదు.

కాని అభ్యంతరం ఆ మరో కులం వాడికే.

కాలేజీలో చదివే రోజుల్లో ఆమెకు తన కులం వాళ్ళు ఒక రిద్దరు తగిలేరు కాని తన భుజాల వరకు కూడా లేరు.

అంచేత ఆమె ఉద్యోగంలో చేరగానే భోగట్టా చెయ్యడం ప్రారంభించింది.

ఏమని?

నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు కాదు ఆమెక్కా వల్సింది.

తనకంటే –

ఏత్తైన వాడు –

తన కులం వాడు

డాక్టరైన వాడు

ఉన్నాడా? ఎవరైనా వున్నాడా?

లేకేం?

డాక్టరు గౌరీశంకరం అని మనవాడే.

ఎవరీ గౌరీశంకరం?

ఎవడు వీడు?

ఎచటివాడు?

గౌరీశంకరం రిజర్వుడ్ కాండిడేట్.

అంచేత అతనికి మెడికల్ సీటొచ్చింది.

అంచేత ఎమ్.డి. కూడా వచ్చింది.

అతను స్కాలర్‌షిప్పుల్తో చదవలేదు.

సెకండ్ హేండ్ పుస్తకాల్తో చదవలేదు.

దర్జాగా స్వంత డబ్బుతో, కొత్త పుస్తకాల్తో చదువుకున్నాడు

కాలేజీకి స్కూటరు మీద వెళ్ళాడు.

ఖరీదైన హోటళ్ళకి తిరిగాడు.

ఎక్కువ కులాల వారితో తిరిగాడు.

అలా తిరగడానికి చాలా డబ్బు ఖర్చు చేశాడు. అలా ఖర్చు పెట్టినందుకు బాధపడలేదు.

అతని తండ్రి ఎమ్మెల్యే, ఇప్పుడున్న సి.యం దిగిపోతే వచ్చే కాబినెట్‌లో మంత్రి అవచ్చు.

గౌరీశంకరం సంఘాన్ని, దేవుణ్ణి అంగీకరించాడు. ఒక్క మినహాయింపుతో...

తనని తక్కువ కులంలో పుట్టించాడన్నదే అతనికి దేవుడి మీద కంప్లయింట్.

దేవుడే అనేవాడే వుంటే అతను సృష్టి చేశాడే తప్ప కులాలు చెయ్యలేదనీ, ఇవన్నీ మనుషుల సృష్టి అనీ అతను అనుకో లేదు.

అతనికి దేవుడంటే కోపం –

అతని తండ్రి గాడ్యుయేట్ –

తనది చదువుకున్న కుటుంబం –

డబ్బున్న కుటుంబం.

ఇంకా డబ్బు కావాలనుకుంటున్న కుటుంబం.

గౌరీశంకరం గురించి కనకరత్నం భోగట్టా చేసింది. వివ రాలు సేకరించింది.

తరువాత ఈ ఛాన్సు వదలకూడదనుకుంది.

మధ్యవర్తుల్ని పంపింది.

గౌరీశంకరాన్ని, అతని తండ్రినీ కలిశారు ఆ మధ్య వర్తులు.

కనకరత్నం గురించి ఆలోచించాల్సింది కాని, అనుమా నించాల్సిందిగాని ఏం లేదన్నారు.

"ఎమ్.డి. చదవింది ఏభయ్‌వేలన్నా యివ్వలేదా?" అన్నారు గౌరీశంకరం తండ్రి.

గౌరీశంకరానికి తండ్రంటే గౌరవం వుంది. కానీ అతను ఈ విషయంలో తండ్రితో ఏకీభవించ లేకపోయాడు.

"ఏమిటీ ముసలాయన చాస్తం? డాక్టర్‌కి ఏభయ్ వేలివ్వటం అంటే గొప్పకాదు. ఎవరయినా కళ్ళకద్దుకుని యిస్తారు. అందు లోనూ తన కులములో చదువుకున్న వాళ్ళు తక్కువ. డాక్టర్లు బహు తక్కువ అయితే ఇక్కడ డిగ్రీ కాకుండా తన అరడుగుల రెండు అంగుళాల ఎత్తుకి పలుకుతుంది ధర. డిగ్రీ ఎవరికయినా పనికొస్తుంది. ఎత్తు మాత్రం ఒక్క ఈ కేసుతోనే క్యాష్ చేసు కోవాలి" అన్నది అతని ఆర్యుమెంటు.

కొడుకు ఆర్యుమెంటు తండ్రికి నచ్చింది.

బేరాలు సాగాయి.

ఆఖరికి ఎలాగయితేనేం బేరం డెబ్భైవేలకి సెటిలయ్యింది.

అయితే కొంత టైము అడిగింది కనకరత్నం.

❖ ❖ ❖

పెళ్ళి సెటిలవకముందు కనకరత్నం మంచి డాక్టరు. సెటిల య్యాక మంచి డాక్టరే.

కాకపోతే మంచితనమే నిండుకుంది.

ఇదివరకు ఏ పేషెంటు దగ్గరా డబ్బు అడగలేదు. నా జీతం నాకు చాలు అనుకునేది. ఎవరయినా సంతోషంగా యిచ్చినా పుచ్చుకోవడానికి మొహమాటపడేది.

గౌరీశంకరంతో పెళ్ళి కుదిరేనాటికి ఆమె దగ్గర డబ్బులేదు.

కేవలం డబ్బులేని కారణంగా ఈ సంబంధం వదులు కోవడం ఆమెకు ఇష్టం లేదు. అంచేత యిప్పుడు డబ్బు తీసు కోవడం ప్రారంభించింది.

అయితే మొదట్లో కేవలం కట్నం కోసం మాత్రమే డబ్బు తీసుకొని, తరువాత మానేద్దామని అనుకుంది.

కానీ ఆవిడకి తెలీని విషయం...

డబ్బు ఆర్జన అన్ని వ్యసనాల్లోనూ రాచవ్యసనం అనీ, అది మనిషిని పిశాచలంలా పట్టుకుంటుందనీ, దాని ఇనపకోరల నుండి ఎవరూ తప్పించుకోలేదనీ...

ఆవిడకి తెలిసినా, తెలియకపోయినా ఆ వ్యసనం ఆవిణ్ణి దెయ్యంలా పట్టుకుంది.

పేషెంటు బీదదా? గొప్పదా?

ఎమర్జెన్సీనా? మామూలు కేసా?

తను చేయగలదా? మరో డాక్టర్‌కి రిఫర్ చేయాలా?

ఈ ప్రశ్నలు ఆమె మరిచిపోయింది.

డబ్బు ఇవ్వగలరా? ఇవ్వలేరా?

ఇంతే ఆమె ఆలోచించేది.

ఇంటి దగ్గర ముడుపు చెల్లించిన వాళ్ళకే ఆస్పత్రిలో వైద్యం. లేకపోతే నాడి కాదు కదా నాలిక్కూడా చూసేది కాదు.

ఎప్పుడయినా ఎమర్జన్సీ కేసు డైరెక్టుగా అస్పత్రికే వస్తే?

పేషెంటుని ఆపరేషను టేబులు ఎక్కించి బయటకొచ్చి పేషెంటు తాలూకు వాళ్ళతో బేరం సెటిల్ చేసుకొని ఆపరేషను చేయడం.

పేషెంటు ఖర్మకాలి బల్లమీద కునికేస్తే!

ఆ సంగతి బయటకు చెప్పకుండా డబ్బు వసూలు చేశాకే శవాన్ని అప్పచెప్పేది.

“కనకరత్నం కాదు మరిడే మాలక్ష్మి అన్న పేరు ఆర్నెల్లు తిరక్కుండా తెచ్చుంది.

ఇంతమందిని పీక్కుతున్న డబ్బుతో పెళ్ళి చేసుకొని ఈవిడేం సుఖపడుతుంది? వీళ్ళ వుసురు వూరికే పోతుందా? ఈవిడ పెళ్ళిపాడుగాను” అని సిస్టర్లు, వార్డు బోయ్‌లు తిట్టుకునే వారు.

ఎవరు తిట్టుకున్నా, ఎవరు శపించినా గౌరీ శంకరంతో ఆమె పెళ్ళి ఘనంగా జరిగింది.

పెళ్ళికోసం మొదలయిన ధనదాహం పెళ్ళయ్యాక పెరిగిందే తప్ప తరగలేదు.

మావగారి సాయంతో గౌరీశంకరాన్ని తన ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది.

అది వరకు ఆమె పురుళ్ళ స్పెషలిస్టు.

గౌరీశంకర్ పిల్లల స్పెషలిస్టు.

విస్కీ, సోడా కాంబినేషన్లా పని చేసింది వాళ్ళ కాంబినేషన్.

ఇప్పుడు తల్లి కేసు, పిల్లకేసూ కూడా వాళ్ళవే.

ఈ రెండు వెళ్ళి తండ్రి కేసు కూడా తెచ్చేవి.

పెళ్ళినాటికి కనకరత్నానికి కనకం లేదు.

రత్నాలూ లేవు.

అయితే తరువాత పదేళ్ళకి ఆమె తనకున్న నగలన్నీ పెట్టుకుంటే పండగనాడు అలంకరించిన కనకదుర్గ విగ్రహంలా వుంటుంది.

అమ్మవారికీ ఆమెకీ ఒక్కటే భేదం.

విగ్రహం ఇంకా నగలు కోరదు.

వాళ్ళిద్దరూ పొద్దున మాత్రమే గవర్నమెంటు అస్పత్రిలో వుంటారు.

మధ్యాహ్నం, సాయంత్రం, తెల్లవారుజాము స్వంత ఆస్పత్రిలో వుంటారు.

వాళ్ళ వ్యక్తిగత జీవితం చిత్రించడం ఈ చరిత్రకారిణి వుద్దేశ్యం కాదు.

దొంగ శలవులకి సర్టిఫికెట్టు కావాలా?

చర్మం గీరుకుపోయిందా?

దాన్ని గ్రీవస్ హార్ట్ చేయాలా?

తగలని దెబ్బలకి సర్టిఫికెట్టు కావాలా?

మూడ్రోజులు ముండ దగ్గరికి వెళ్ళినవాడికి మెడికల్ సర్టిఫికెట్ కావాలా? అదేవిటి? అతనా మూడ్రోజులు డా.కనకరత్నం గారి ఆస్పత్రిలో ఇన్‌పేషెంటుగా వున్నాడే! కావాలంటే సర్టిఫికెట్ చూడండి.

కన్నెపిల్లకి కడుపొచ్చిందా? ఏం ఫరవాలేదు.

సేఠ్‌గారికి సుఖరోగం వచ్చిందా? డోంట్‌వర్రీ.

కనకరత్నం అందె వేసిన చెయ్యి.

గవర్నమెంటు ఆస్పత్రిలో మందులు చాలావరకు వీళ్ళ ఆస్పత్రికే నడిచి వచ్చేస్తాయి.

గవర్నమెంటు ఉద్యోగాల్లేకా, ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకునే స్తోమత లేక బాదపడుతున్న ముగ్గురు మగ, ఇద్దరూ ఆడ డాక్టర్లు వీళ్ళ ఆస్పత్రిలోనే నర్స్ జీతాలకు పని చేస్తున్నారు.

ఇది ఆ డాక్టర్ల కథ.

రెండ్రోజుల క్రితమే నారాయుడు మహాలక్ష్మిని డాక్టర్ కనకరత్నం దగ్గరకు తీసికెళ్ళాడు.

డాక్టర్ ఆమెని చూసింది.

"పెళ్ళయినదానివి తొలిచూలు ఎందుకు వద్దంటున్నావు?" నిలేసింది.

మహాలక్ష్మి మాట్లాడలేదు.

"ఇదివరకు ఎక్కడయినా టెస్ట్ చేయించుకున్నావా? ఆడపిల్లని చెప్పారా?"

ఈ మధ్య ఆడపిల్లల్ని కనకూడదని అనుకుంటున్నారు కదా? ఒక వేళ అందుకే వద్దనుకుంటోందేమో అనుకుం టోంది కనకరత్నం.

ఈ మధ్య కడుపులో ఉన్నది ఆడో, మగో తెలిసే టెస్టు వచ్చిన తరువాత కనకరత్నం లాంటి వాళ్ళ ప్రాక్టీసు బాగా పెరిగింది. ఈ ప్రకారము ఆడపిల్లల్ని అందర్నీ నరుక్కుంటూ పోతే కొన్నేళ్ళ తరువాత పదిమంది మగాళ్ళు ఒకే ఆడదాన్ని కట్టుకునే పరిస్థితి వస్తుందేమో. మంచిదే అప్పుడయినా ఆడదాన్ని అపురూపంగా చూసుకుంటారు. ఈ ఆలోచనలు వచ్చినప్పుడల్లా కనకరత్నం నవ్వుకుంటుంది.

"ఆడపిల్లని చెప్పారా?" రెట్టించింది కనకరత్నం.

లేదన్నట్టు తలూపింది మహాలక్ష్మి.

"మరెందుకు వద్దనుకుంటున్నావు?"

మహాలక్ష్మి తలదించుకుంది.

ఈ పిల్లకి మాటలు రావా?

మాట్లాడటం ఇష్టం లేదా?

"సిస్టర్! ఈ అమ్మాయి తండ్రిని పిలు"

సిస్టర్ పిల్చింది.

నారాయుడు వచ్చాడు.

"పెళ్ళయిన పిల్ల కదా! పైగా తొలిచూలు ఎందుకు ఒద్దను కుంటున్నారు?" నారాయుణ్ణి నిలేసింది కనకరత్నం.

నారాయుడికి తనని నిలువుగా గోతిలో కప్పెట్టేస్తే బావుం డుననిపించింది.

తను అకస్మాత్తుగా మూగవాడయిపోతే బావుండుననిపించింది.

ఓసారి కూతరువేపు చూశాడు.

బతికున్న మహాలక్ష్మిలా కాకుండా ప్రాణంలేని బొమ్మలా కనిపించింది.

ఈ వూరు, ఈ మనుషులు, ఈ డాక్టర్లు ఎవరూ లేని చోటికి తన కూతుర్ని తీసుకొని పారిపోదామనిపించింది.

అయినా నిలదొక్కుకున్నాడు.

"ఏటి సెప్పమంటావు డాక్టరమ్మత తల్లీ! దీని పెనివిటి మిలట్రీలో వున్నాడు. సంకురేత్తిరికి వచ్చి తీసుకెళిపోతాడు. ఇదిగో ఇప్పుడే ఆపదొచ్చింది. ఎవడో దగుల్బాజీగాడు నా కూతుర్ని దగా చేసినాడు. లేకపోతే తొలిసూలుని ఎవరయినా కాలిసేసుకుంటారా తల్లీ! మరింక నన్నేటీ అడక్కు. దాన్నెలాగ యినా కాపాడు తల్లీ! అది సల్లగా కాపురానికెళిపోతే అంతేసాలు" అంటూ భుజం మీద గుడ్డతో మొహం కప్పుకున్నాడు.

కనకరత్నంలోని ఆడమనసు ఒక్క అరక్షణం చివుక్కు మంది.

మరుక్షణం దాన్ని డబ్బు దెయ్యం నోరు నొక్కేసింది.

సరే ఓ వారం పదిరోజుల్లో రండి. మళ్ళీ ముదిరితే కష్టం. ఇప్పుడయితే చిన్న ఆపరేషనుతో సరిపోతుంది.

"మరైతే డబ్బు ఏపాటి ఔతాదో సెప్పుతల్లీ! మరేటి అనుకోకు మారాజా! డబ్బు సరుదుకోవాలి కదా" అంటూ లేచి నిల్చున్నాడు నారాయుడు.

మామూలు "డియండ్సీ" కదా అంచేత మరో అయిదు వందలు తీసుకుంటుంది.

కానీ ఇది పరువు "డియండ్సీ" కదా అంచేత మరో అయిదు వందలు ఫైన్.

అంటే నారాయుడు పరువు ఖరీదు అయిదువందలా?

"సుమారు వెయ్యిరూపాయలు ఔతుంది"

వెయ్యిరూపాయలనగానే నారాయుడి గుండె లయ తప్పింది.

"వస్తాం తల్లీ! మళ్ళీ వోరంనాడు వస్తాం" అని వెళ్ళి పోయాడు.

ఇదీ డాక్టరు కథనం.

ఇవి విన్న పేర్రాజుకి మతిపోయింది.

రూపైనా ఏర్పడని ఆ ప్రాణం ఖరీదు వెయ్యి రూపాయలా?

ఒక ప్రాణం బతికించడానికి ఎంత డబ్బు తీసుకున్నా ఫరవాలేదు.

కాని ఒక ప్రాణం తియ్యడానికి ఇంత డబ్బా?

వెయ్యి రూపాయలు!

వంద, రెండు వందలు అయితే సర్దగలడు. కాని వెయ్యి రూపాయలంటే మాటలా?

"సరే మావా! ఇంకా వారం టైముంది కదా! చూద్దాంలే. పోనీ ఓ సారి ఆ సత్యాన్నే అడిగిచూడు. ఎక్కడయినా అప్పు ఇప్పిస్తాడేమో మళ్ళీ నీ డబ్బు రాగానే ఇచ్చెయ్యవచ్చు" అని సలహా ఇచ్చాడు పేర్రాజు.

ఈ సలహా బావున్నట్టనిపించింద నారాయుడికి.

ఇప్పుడే వెళ్తాను అని లేచాడు.

"లేడికి లేచిందే ప్రయాణమా? తరువాత వెళ్ళచ్చులే" అంటున్న పేర్రాజు మాటలు వినకుండా సత్యం దగ్గరికి బయలు దేరాడు నారాయుడు.

అతను వెళ్లేసరికి సత్యం చోటా చోటా లీడర్లతో మాట్లాడు తున్నాడు.

రా! నారాయుడు రా! ఏమిటి సంగతులు పలకరించాడు సత్యం.

నారాయుడు రాక తమ బాతాఖానీకి అడ్డు అని తెలిసిన ఆ చోటా చోటా లీడర్లు వెళ్ళిపోయారు.

అక్కడే వున్న బెంచీమీద కూర్చున్నాడు నారాయుడు.

"నీకు తెల్దేమిటి సత్తెంబాబూ! ఈ సమ్మె అయినా డబ్బు రావడానికి మరో పదిరోజులు పట్టదంటారా?"

ఔనన్నట్లు తలూపాడు సత్యం.

నిజానికి వీడో వెర్రి పీరు పదిరోజులు కాదు కదా మరో నెల పట్టినా ఆశ్చర్యం లేదు. కాని ఆ ముక్క చెప్తే వీడిక్కడే గుండె ఆగి ఛస్తాడు ఆ పాపం తనకెందుకు?

"మరింక నా అవసరం నీకు తెల్సు. ఇంక ఆగడానికి వీల్లేదు. అంచేత నాకు వున్న ఫళాన వెయ్యి రూపాయలు కావాలి. నువ్వే యిస్తావో, ఎవురి సేతనయినా ఇప్పిస్తావో అదంతా నాకు తెల్దు. ఈడెలా తీరుస్తాడన్న బెంగ అక్క ర్లేదు. నాకు రావలసిన డబ్బు నీ సేతి మీదుగానే ఒస్తాది కదా. అప్పుడు మినహాయించకో.."

సత్యం ఖంగుతిన్నాడు.

ఇదివరకు నారాయుడు మన్నుతిన్నపాములా వుండేవాడు. మెల్లప్పన్న సాయం లేనిదే కాలు కదిపే వాడు కాదు. నోరు మెదిపేవాడు కాదు. మరిప్పుడు నారాయుడూ!

ఈ నారాయుడి గొంతులో దబాయింపే కాని దైన్యం లేదు. వేడి తప్ప వేడుకోలు లేదు.

"ఎవడి కోసం యిప్పిస్తావు?" అన్న దబాయింపు వుంది.

ఎక్కడి నుండి వచ్చింది వీడికింత ధైర్యం?

పరిస్థితులు ఎదురుతిరిగితే?

జీవితం చెయ్యి జారిపోతుంటే?

బురదపాము కూడా బుసకొడుతుంది.

వానపాము కూడా విషం కక్కుతుంది.

శాంతి పావురం కూడా సమరం సాగిస్తుంది.

నారాయుడు వూరుకోలేదు.

ఏటి సత్తెంబాబూ! అలా ఒల్లకుంటే కుదర్దు మరి నాకు డబ్బు కావాలి. నువ్వే ఇస్తావో ఎవరిచేతనయినా ఇప్పిస్తావో అదంతా నాకు తెల్దు మళ్ళీ దబాయించాడు.

సత్యానికి పరిస్థితి అర్థమైంది.

"సరే నా దగ్గర మాత్రం అంత డబ్బెలా ఉంటుంది? నేనేం జమిందారునా? నేనూ నీలాంటి వర్కర్నే. నీ అవసరం నాకు తెలుసు పద! అల్లక్కడ రోడ్డుపక్కన కమలమ్మ భోజనం హోట లుంది తెలుసా?"

తెలవదన్నాడు నారాయుడు.

ఆ రోడ్డుకి యిటూ అటూ షాపులూ, భోజన హోటళ్ళు చాలా వున్నాయి. అందులో కమలమ్మ రాజుల భోజన హోటలు కూడా వుంది.

ఎవరీ కమలమ్మ?

ఈవిడ చరిత్ర ఏమిటి?

ఇది తెలుసుకోవడానికి ముందు ఆ రోడ్డు చరిత్ర కూడా తెలుసుకోవాలి.

ప్రతి మనిషికీ, ప్రతి ఊరికీ, ప్రతి చెట్టుకీ, పుట్టకీ, గుట్టకీ ఆఖరికి రోడ్డుక్కూడా మనం తెలుసుకోవాలే కానీ ఒక చరిత్ర ఉంటుంది.

అలాగే ఆ రోడ్డుకీ ఒక చరిత్ర వుంది.

అనగనగా ఒకప్పుడు ఆ రోడ్డు వున్న స్థలంలో కేవలం కాలిబాట మాత్రమే వుండేది.

తరువాత అది నెమ్మదిగా బండి బాట అయింది.

ఆ బాటని రోడ్డుగా వేయించినవాడు ఒక బ్రిటిస్ దొర.

ఆ దొర పగటిపూట స్వదేశాభిమాని.

పక్కా బ్రిటీష్ పౌరుడు.

చీకటి పడేసరికి అతనికి పండితుల భాషలో మధిర, మద వతి కావాలి.

పామరుల భాషలో మందు, ముండ కావాలి.

అతనికి విస్కీ అంటే ఇష్టం.

విప్పసారా అంటే యింకా ఇష్టం.

మధవతుల విషయంలో కూడా అతనికి స్వదేశీ, విదేశీ బేధం కాని, స్వదేశీ పక్షపాతం గాని లేవు.

దొరసానికి దొరికితే తెలుపు ప్యూరిటీకి చిహ్నం అనేవాడు.

నల్లసాని దొరికితే బ్లాక్ ఈజ్ లైవ్ కలర్. ఇట్ హేజ్ విగర్ అనేవాడు.

అతను బ్రిటీస్ వాడయినప్పటికీ సర్వస్త్రీ సమానత్వం పాటించేవాడు.

అతనికి దొరసానులు పున్నమిరాత్రి వెండికుప్పల్నీ....

దొమ్మరిసానులు అమావాస్య చీకటి తళుకుల్నీ...

గుర్తుచేసేవారు.

రాజుకి మంత్రి ఎంత అవసరమో....

ఇంజనీరుకి ఓవర్సీరు అంత అవసరం.

ఆ ఇంజనీరు దగ్గర ఓ ఓవర్సీరు వుండేవాడు.

పేరు కృష్ణావతారం.

శ్రీరామచంద్రుడి నమ్మిన బంటు ఆంజనేయుడు.

ఇంజనీరు నమ్మిన బంటు కృష్ణావతారం.

పరమ ప్రభు భక్తి పరాయణుడు.

అందుకే అతని పైన వున్న సీనియర్లు ఏడుగుర్ని తప్పించి కృష్ణావతారినికి ప్రమోషనిచ్చారు దొర.

ఆ రోజుల్లో కాంట్రాక్టర్లు లేరు?

బ్రిడ్జిలు, బిల్డింగులు కట్టించడం, రోడ్లు వేయించడం వగైరా పన్లన్నీ, ఓవర్సీర్ల సాయంతో ఇంజనీర్లే చేసేవారు. అంచేత బ్రోకర్లు పర్సంటేజీ సిస్టమ్ లేదు. ప్రభుత్వం డబ్బు ప్రభుత్వాధి కారులే స్వయంగా తినేయాల్సి వచ్చేది.

అయితే ఎంత తిన్నా పన్లు మాత్రం పకడ్బందీగానే చేసే వారు. ఇప్పటిలో మూడో అంతస్తు కడుతూ వుంటే, రెండో అంతస్తూ కూలేటట్టు వాళ్లు ఏదీ కట్టలేదు.

ఆనాడు వాళ్లు కట్టిన బిల్డింగునే ఇప్పుడు మనం కలక్టరా ఫీసులు గానూ, గవర్నమెంటు ఆఫీసులుగానూ వాడు కుంటు న్నాం. అధికారులు తినగా మిగిలిన డబ్బుతోకొంత కిందా, మీదా పారేసేవారు. అక్కడా, యిక్కడా పారేసిన డబ్బు ఏరుకుని దానితో దొరలకి సుఖసంతోషాలు ఏర్పాటు చేసేవాడు కృష్ణావతారం.

అందుకే ఇంజనీరుకి అతనంటే అభిమానం.

దొర పలకరించే తీరుని బట్టి అతని మూడ్‌ని కనిపెట్ట గలడు అవతారం.

"యూ బాస్టర్డ్ (ఒరే లంజికొడకా)" యిది కోపం వచ్చి నట్టు లెక్క.

"యూ ఓల్డ్ బాస్టర్డ్ (ఓరే ముసలి లంజికొడకా)" యిది ముద్దు పిలుపు.

"కృష్ణా! యూ ఓల్డ్ బాస్టర్డ్" అంటే మరీ ముద్దొచ్చి కౌగిలిం చుకోవడానికి సిద్ధంగా వున్నట్టు.

ఆ రోడ్డు వేసే పని ఇంజనీరు దొరకి అప్పగించబడింది. ఆ రోడ్డుకి ప్లాను గీయవలసిన పని అవతారానికి అప్పగించాడు దొర.

అందురు దొరల్లాగా ఇంజనీరు దొర కూడా ఒడుపులు తెలిసిన మనిషి.

"నేను వెయ్యబోయే రోడ్డుని" గాని...

"నువ్వు వేసే రోడ్డుని" గాని...

"మనం వెయ్యాల్సిన రోడ్డుని" గాని..

ఎప్పుడు... ఎవరితో...

ఎలా అనడమో బాగా తెలుసు.

ఇప్పుడు నువ్వు వెయ్యబోయే రోడ్డేమిటో తెలుసా? అని అడిగాడు అవతారాన్ని.

తనా రోడ్డు వెయ్యబోతున్నందుకు...

పిల్ల అశోకుడిలా ఫీలవడమో...

రోడ్డు రోలర్లా ఫీలవడమో...

ఈ ఛాయిస్ అవతారానికే వదిలేశాడు.

పిల్ల అశోకుడిలా ఫీలవడానికే నిశ్చయించుకున్నాడు అవతారం.

రోడ్డు ఊరికి కాస్త దూరంగా వుండాలి.

కాస్త ఎత్తుగా వుండాలి.

అర్థం అయిందా? అడిగాడు దొర.

అర్థం అవకపోవడానికి యిదేం ఆల్‌జీబ్రానా? మహా చక్కగా అర్థం అయింది అవతారానికి.

మరింక నా తడాకా చూసుకో అన్నట్టు గర్వంగాను, దర్జాగాను తలూపాడు అవతారం.

ప్రజోపయోగంతో నిమిత్తం లేకుండా ఊరికి రెండు ఫర్లాంగులు దూరంలో ప్లాను గీశాడు అవతారం ఆ ప్లాను గురించి మాట్లాడ్డానికి వెళ్లాడు దొరగారి బంగ్లాకి.

అప్పుడు దొరేం చేస్తున్నాడు?

తెల్లటి పక్కమీద పడుకున్నాడు.

పడుకుని ఏం చేస్తున్నాడు?

అసలే తొక్క వలిచేసిన శవంలా ఎర్రగా వుంటాడు.

ఇప్పుడు నిజంగానే తన చర్మం ఎవరో వలిచేసినట్టు బాధ పడుతున్నాడు.

మంచానికి అటూ ఇటూ నిల్చుని విసురుతున్న నౌఖర్లలో ఎవర్ని తందామా అని ఆలోచిస్తున్నాడు.

అసలేం జరిగింది దొరగారూ?

ఎందుకంత కోపం మీకు?

ఏం జరిగిందంటే...

మొత్తటి గులాబీకి మేకుల్లాంటి ముళ్లుంటాయి.

అందమైన నాగుపాముకి విషపు కోరలుంటాయి.

మత్తెక్కించే మొగలి పువ్వుకి ముళ్ళ రేకులుంటాయి.

అలాగే అవతారం దొరకి అమర్చిన సుఖాలలో కొన్నిటికి రోగాలున్నాయి.

ఆ రోగాలు దొరకి రెండ్రోజుల క్రితం తెలిశాయి.

అవి డాక్టరిచ్చిన మందులకి లొంగలేదు.

అంచేత దొర తన స్వంత మందు వళ్ళు తెలీని స్థితి వరకు వేసుకున్నాడు.

సింహానికి క్షవరం చేస్తా.

పెద్దపులికి పాలు పితుకుతా.

ఖడ్గమృగానికి కడుపు చేసేస్తా

అని వీరోచితంగా పాటా. దానికి ట్యూనూ కడుతున్నాడు దొర.

అదిగో...

సరిగ్గా ఆ టైములో...

ఆ సుముహూర్తాన....

హాజరయ్యాడు అవతారం.

కృష్ణా! ముసలి లంజకొడుకా అని అతి ముద్దుగా దగ్గరికి పిలిచాడు.

దగ్గరగా వెళ్ళాడు లంజికొడుకు.

ప్రజల్తో కలిసి మెలిసి తిరగడానికి తెలుగు నేర్చుకునే దొరలు ముందు బూతులు నేర్చుకొనేవారు.

దొర ముందు తెలుగులో బూతులు తిట్టారు.

ఎంతైన పరభాష కాబట్టి అవి అంత ఫరవ్‌ఫుల్‌గా అనిపించలేదు.

అంచేత ఇంగ్లీషులో తిట్టాడు.

ఇంగ్లీషు బూతులు కొంచెం, తెలుగు బూతులు పూర్తిగాను అర్థం అయ్యాయి అవతారానికి.

బూతులు తీసేస్తే దొరగారి స్పీచ్‌లో ముఖ్యాంశం ఏమిటంటే.....

రోడ్డుని ఊరు నుండి నాలుగు ఫర్లాంగులు దూరం యీడ్చేమనీ.

దాని పిలక పట్టుకొని నలభై అడుగులు లేవనెత్తమనీ.

ఆ ప్రకారం కడితే అది ఆ వూరికి రోడ్డు కాదు. ప్రాకారం అవుతుంది.

కానీ అది గవర్నమెంటు రోడ్డు.

అంచేత పూర్తి అయ్యేసరికి ప్లానులో నలభై అడుగులు, భూమ్మీద ఇరవై అడుగులైంది.

రోడ్డు వేస్తున్నప్పుడు...

ఒకకూలీ బురదలో కాలు జారి...

ఇరవై అడుగులూ కిందపడి....

పగిలిన వక్షాలతో...

విరిగిన వెన్నుముకతో...

చితికిన తలనుండి కారుతున్న రక్తం జుత్తులో నుండి కారి పక్క నున్న కుళ్ళు వర్షపు నీటిని....

ఎర్రగా మారుస్తూ వుంటే...

పక్కనే పొలం గట్టున

పొన్న చెట్టుకు కట్టిన వుయ్యాలలో

ఆకలికి సొమ్మసిల్లిన

తన కొడుకు గతేమిటని...

ఆడగబోతే...

విరిగిన పళ్ళ నుండీ...

తెగిన నాలికనుండీ...

చారెడు రక్తం పైకొచ్చి...

భాషలకూ...

విపులకూ...

అతీతమైన ప్రార్థనని

ఒక పెను పశువు....

పురుటి కేకలా బయటపెట్టి ప్రాణాలొదిలేసింది.

భారీ పనికి బలి తప్పదు అన్నారు పెద్దలు.

కానీ ఆ బలి ఎప్పుడూ బడుగు ప్రజలే ఎందుకౌతారో ఏ పెద్దలూ చెప్పరు.

చెప్పలేరు..

ఇదీ ఆ రోడ్డు కథ.

ఇంక కమలమ్మ.

"అది హోటలు కాకుండా వడ్డీ వ్యాపారం చేస్తుంది కాకపోతే వడ్డీ మాత్రం ఎక్కువ మరి వెళ్దామంటావా?" అడిగాడు సత్యం.

నారాయుడు లేచి భుజంమీద గుడ్డదీసి దులిపాడు. దుల పడం అయ్యాక దాన్ని తలకి చుట్టుకున్నాడు.

ఎంతడుగుతాదేటి? మహా అయితే వందకి వంద అడుగు తాది అంతేకదా! అడగనీ అవసరం నాది. అయివేజు అవిడది. నా బిడ్డకంటే నాకేది ఎక్కువ కాదు. అది సల్లగా వుండడానికి నా పీక ఇచ్చేమన్నా ఇచ్చేస్తాను. మరింక తాత్సారం సెయ్యక పద అంటూ గుమ్మంలోకి వెళ్ళి నిల్చున్నాడు.

సత్యం కూడా లేచాడు.

నారాయుడూ, సత్యం కమలమ్మహోటల్లోకి వెళ్ళారు. భోజనం చెయ్యడానికీ, కాఫీ తాగడానికి కాదు.

అప్పు అడగడానికి.

ఎవరీ కమలమ్మ?

ఏమిటీవిడ చరిత్ర?

కమలమ్మ పూర్వాశ్రమంలో...

ఆవిడ అసలు పేరు కమలమ్మ కాదు.

ఆవిడ తల్లితండ్రి పెట్టిన పేరు అప్పలనరసమ్మ.

ఆవిడది ఏ ఊరో ఎవరికీ తెలీదు. నిలదీసి అడిగితే భీమారం సైదు అంటుంది.

ఆవిడ కులం ఏమిటో ఎవరికీ తెలీదు.

"రాజుల మడిసిని" అంటుంది.

ఒకటి మాత్రం నిజం. ఆవిడ్ని ఈ ఊరు కొట్టుకొచ్చిన బస్ డ్రైవరు సన్యాసిరాజు నిజంగా రాజే.

అతనిదీ "భీమారం సైడే"

కమలమ్మ ఎలా వుంటుంది?

ఆవిడ నేలను కూర్చుంటే పెద్ద సైజు కుర్చీలా వుంటుంది.

కుర్చీలో కూర్చుంటే సోఫాలా వుంటుంది.

పడుకుంటే పందిరిమంచంలా వుంటుంది.

ఆవిడ రంగు...

నలుపు ఇష్టమైన వారికీ...

తెలుపు ఇష్టమైన వారికీ...

కూడా యిష్టమే

ఆవిడకి...

ఉండవలసిన ఒంపులు అన్నీ వున్నాయి.

పెను సైజులో వున్నాయి.

ఆవిడ...

పువ్వులిష్టమైన వాళ్ళకి పెద్ద బంతిపువ్వు, జంతువులు ఇష్ట మైన వాళ్ళకి అందమైన ఖడ్గమృగం.

ఆవిడ వయస్సు ఎంతున్నా ఎదుటివాళ్ళకి ఇష్టమైన రేంజి లోనే వుంటుంది.

ముసలివాళ్ళకి కూతురులాగా...

పడుచువాళ్ళకి అక్కలాగా కనిపించదు.

ఆవిడ ఆభరణాలన్నీ పెట్టుకుంటే....

రాజుగారి చిన్న భార్యలా వుంటుంది.

తీసేస్తే...

స్నానానికెళుతున్న చిన్న భార్యలా వుంటుంది ఆవిడ.

పట్టుచీర కట్టుకొని,

తలనిండా పువ్వులు పెట్టుకొని...

పళ్లెంలో పళ్ళూ, పువ్వులూ పెట్టుకొని వెళుతుంటే దేవాలయా నికి వెళ్తున్న భక్తురాలిలా వుండదు.

పడగ్గదిలోకి వెళుతున్న ప్రౌఢస్త్రీలా వుంటుంది.

ఆవిణ్ణి చూసిన ఏ మొగాడికీ...

తపస్సు చేసుకుందామనిపించదు.

తప్పుదారే పట్టాలనిపిస్తుంది.

ఆవిణ్ణి చూసిన ఆడవాళ్ళకి అసూయ.

ఆవిడ కళ్లు మూసి ముగ్గుర్నీ

ఆర్పి ఆరుగుర్నీ

మొగాళ్ళని ముగ్దుల్ని చేసెయ్యగలదు. బోటు షికారు ఇష్ట మైన వాళ్ళకి.

ఆమె వలపుల తెప్ప.

సేర్‌జీలకు కెంపుల కుప్ప.

ఇంతకీ అప్పల నరసమ్మ కమలమ్మగా ఎలా మారిందీ...

డ్రైవరు రాజుగారు తన బొందిలో కైలాసం వెళ్ళాడో, బొంది లేకుండా కైలాసం వెళ్ళాడో తెలియనంత మత్తులో వున్నపుపడు మాత్రం ఆమెను కమలా అని పిలిచేవాడు.

కమల అతని స్వంత మరదలు.

కొత్త సబ్బు బిళ్ళలా అందంగా ఆరోగ్యంగా వుండేది.

కొత్త టూత్ పేస్టు ట్యూబులా పిటపిటలాడుతూ వుండేది.

పాపం చిన్నప్పుడే, ఆవిడ నొసటి కుంకుమ చెరిగి పోయింది. ఆవిడ పాతికేళ్ళ ప్రాయంలో కొన్నాళ్ళు డ్రైవరు రాజుగారింట్లో వుంది. వచ్చిన రెండు నెలల వరకు ఆవిడ బావగారి కంట పడలేదు.

తర్వాత కంటపడినా ఒప్పుకోలేదు.

తన బావగారు ఎంత బలవంతం చేసినా ముందు "దేవుడికి ద్రోహం చెయ్యలేనంది"

తర్వాత పెళ్ళపోయిన "మా'రాజు"గారికి ద్రోహం చెయ్య లేనంది.

ఆఖరు మాటగా తన అప్పకు ద్రోహం చెయ్యలేనంది. మరో మూడు నెలలకి దేవుడికీ, తన రాజాగారికీ ద్రోహం చెయ్యడానికి సిద్ధపడినా తన అప్పకి ఏ పరిస్థితుల్లో ద్రోహం చెయ్యడం యిష్టం లేక ... పెళ్ళికాని డ్రైవరు రాజుగారి తమ్ముడితో (పెళ్ళి కానిది డ్రైవరు రాజు గారికికాదు) లేచిపోయి బరంపురం వెళ్ళిపోయింది.

డ్రైవరు రాజుగారికి స్త్రీ స్నేహం కొత్తేమీ కాదు. అతను కమలను పట్టుకున్నప్పటికే ఆమె తన తమ్ముడి సాయంతో దేవుడికీ, రాజుగారికీ ద్రోహం చేసేసింది. ఆ పట్టుకున్నప్పుడు అతను మంచి మందుపట్టుతో ఉన్నాడు.

"నువ్వు మీ అప్పకు ద్రోహం చెయ్యక్కర్లేదు. దాన్ని వది లేస్తాను. లేకపోతే విషం పెట్టి చంపేస్తాను. అది మన పవిత్ర ప్రేమకు అడ్డురాదు" అని నచ్చచెప్పాడు.

"చచ్చినా బ్రతికినా అప్ప అప్పే" అంది మరదలు.

అంతేకాకుండా ఆమెకు అతని తమ్ముడితో ముందు రోజు రాత్రే పవిత్ర ప్రేమ కుదిరింది.

బాగా ఆలోచించుకో అన్నాడు బావగారు-బాగానే ఆలో చించుకుంది. ఆమెకు ఆ ముందు రాత్రే ప్రియుడితో ఈడూ జోడూ కుదిరింది బావగారు మంచివారైనా పదిహేనేళ్ళు పెద్ద, అదీగాక తమ్ముడు చిలక్కొట్టని కాయ.

బావగారు ఏదో చిలకను ప్రతి రాత్రీ కరిచేస్తూనే వున్నారు. చాలా సంవత్సరాలనుండీ.

"కమలా" అన్నారు బావగారు.

అప్పుడు అతనిలోని ఫీలింగు చూస్తే రోమియో, మజ్నులు సిగ్గుతో తలవంచేసుకుంటారు.

కానీ మొగుడ్ని మినహాయించి మరొకరికి లైలా.

అంచేత "బావా" అనలేదు.

అంతవరకూ బావగారి బలమైన బహుబంధాల మధ్య బంధీ అయిన ఆమె వూపిరి, నరాలూ బిగించి బావగార్ని ఒక్క తోపు తోసింది. అంతవరకూ ఆమెను ప్రేమతోటే, కామంతోటే పట్టు కొని ఆర్గ్యుమెంట్లు చెప్తూ అభ్యర్ధనలు చేస్తున్న రాజుగారికి ఒక్క సారి ఒళ్ళు తూలి స్తంభానికి తల తగిలి ప్రేమ మాటెలా వున్నా కామం తాత్కాలికంగా తగ్గిపోయింది.

పది రేసులు గెలిచిన "జాకీ" ఒక జట్కా పందెంలో ఓడిపోతే?

వాడికి జట్కా పందేల మీద కోరిక ఎక్కువైపోతుంది.

అగ్రరాజ్యాలన్నిటినీ ఆక్రమించుకున్న అలెగ్జాండర్‌ని ఆరెక రాల రాజ్యం విజయవంతంగా ప్రతిఘటిస్తే?

అలెగ్జాండర్‌కి అణాపరక రాజ్యం మీద కోరిక పెరిగి పోతుంది.

పండిట్ నెహ్రూకి పంచాయితీ ఎలక్షన్ పోతే?

నెహ్రూకి పంచాయితీ ఎలక్షన్ల మీద కోరిక ఎక్కువై పోతుంది.

అలాగే సరదాల వెనుక, ముందు ఒక్కలాగే విజయాలు సాధించిన రాజుగారికి ససేమిరా ఒద్దన్న మరదలు మీద కాంక్ష పెరిగిపోయింది.... అయితే ఆ తర్వాత ఆ మరదలు బావగారి తమ్ముడితో బరంపురం పారిపోయింది.

సుఖపడుమా నీవైనా అని పాట పాడుకుందామనుకున్న బావగారికి పిడుగులాంటి వార్త అందింది.

మరదలు తొలి కాన్పుకే హరీమంది.

ప్రేమ ప్రేమగా వుండాలంటే ఫలించకూడదు అన్నమాట రైటుకాదు.

ప్రేమ పెళ్ళిగా ఫలించినప్పుడే నశించిపోతుంది.

రంకుతనం ఫలిస్తే చాలా కేసుల్లో నిలవవచ్చు.

ఫలించిన ప్రేమ భగ్న ప్రేమ.

అందులో ఒకరు చస్తే అమర ప్రేమ.

మరంచేత రాజుగారి భగ్న ప్రేమ అమర ప్రేమగా మారి పోయాక దానికి ఢోకా లేకపోయింది. ఆయన మందు సహా యంతో, అమరలోక ప్రవేశం జరిగినప్పుడు అతనికి తన అమర ప్రేమ గుర్తుకు వచ్చి ఎదురుగా ఏ ముండవున్నా సరే దాన్ని "కమలా" అనే అంటారు.

ఈ ప్రకారం ఆయన అప్పల నర్సమ్మని చాలాసార్లు కమలా అనే పిల్చేవారు.

డ్రైవరు రాజు ఈ ఊరు వచ్చిన ఆర్నెల్లకే "హరీ" అనేశాడు.

అటు మొగుడికీ మనకుండా, ఇటు మనదానికి దారీ చూప కుండా తన దారి తను చూసుకున్నాడు. అని దుఃఖ సముద్రంలో మునిగిపోయింది.

తర్వాత ఆ సముద్రం ఎండి చెరువు అయి పోయింది.

ఆ తర్వాత ఆ చెరువూ ఎండిపోయింది.

అంచేత ఆమె తన దుఃఖ చెరువు (సారీ దుష్టసమాసం) ఇంకిపోగానే రాజుగారి ఆఖరి జ్ఞాపకం తన పేరు కమలగా మార్చుకుని తరువాత రాజుగారిని మరిచి పోయింది.

ఎండిన చెవువు పన్నీటి సరస్సు అవుతుందా?

చేసుకోవచ్చు అని తీర్మానించుకుంది.

నెలరాజులాంటి రాజు వెళ్ళిపోయేక కమలకు కమలాకరుదు కనిపించడానికి కొంతకాలం పట్టింది.

తనకు ఎక్కువ కాలం భుక్తి వెళ్ళదని, ఏమీ చెయ్యకుండా బతకాలంటే ఆస్తి వుండాలని, అది తనకు లేదని, తను అతి త్వరలో జీవనోపాధి చూసుకోవాలని ఆమె గ్రహించింది.

అయితే ఆ జీవనోపాధి దొరికే ఉపాయం ఏమిటి?

ఆమె పోర్జరీలు చెయ్యలేదు.

దొంగనోట్లు అచ్చుకొట్టలేదు.

ఎలక్షన్‌లు గెలవలేదు.

ఆమె చదువు సంతకం చెయ్యడానికీ, చాకటి పద్దు వెయ్య డానికి మాత్రమే సరిపోతుంది.

వ్యాపారం చెయ్యాలంటే....

పెట్టుబడేనా ఉండాలి...

పలుకుబడేనా ఉండాలి...

ఈ రెండు తనకు లేవు....

కొంతమంది ఆడవాళ్ళు అప్పడాలూ ఒత్తీ, విస్తళ్ళు కుట్టి బతుకుతారని విన్నది గానీ అలాంటి అప్పడం బతుకు ఆమెకు యిష్టం లేదు.

ఏ బస్స్టాండులోనో, ఏ కోర్టు పక్కనో ఒక బడ్డీకొట్టు పెట్టగల స్థోమత ఉంది. కాని ఎందుకో ఆమెకు ఆ వ్యాపారం కూడా యిష్టం లేదు.

రాజుగారున్నప్పుడు గోడచాటు బ్రతుకు అలవాటైపోవడం ఒక కారణం అయితే అయ్యుండవచ్చు గాని ముఖ్య కారణం మాత్రం కాదు.

పక్కింటి సన్యాసమ్మ కూతురు వరాలు. ఇలాగెలా గుండేదం టూవేటి? పిప్పళ్ళ బస్తాలాగుండేది. అది దుకాణ మెట్టి పెతి కోన్కిస్కాగాడికి అరువు ఏచ్చేసి సెడిపోనాది అన్నది ముఖ్య కారణం.

అరువు ఇయ్యకపోతే ఏ వ్యాపారమూ సాగదు.

ఆఖరికి ముండలక్కూడా అరువుపెట్టే మహానుభావు లున్నారు.

రాజు పోయిన తర్వాత ఓ నెలరోజులు అలా ఆలోచించగా, ఆలోచించగా అకస్మాత్తుగా ఆమెకు ఓ ఆలోచన తట్టింది.

రాజుల భోజనం హోటల్ పెడితే!!

బ్రహ్మాండమైన ఆలోచన.

పెట్టుబడి ఎక్కువ అక్కర్లేదు.

అరువులు వుండవు.

అదీ పెట్టటానికి కావలసిన బేక్గ్రౌండ్ ఆవిడ రాజుగారి టయింలోనే సంపాదించింది.

జెండా ఎగిరితే వుండవచ్చును. లేకపోతే జెండా ఎప్పు డయినా ఎత్తెయ్యవచ్చు.

ఆమెకు ఆ ఆలోచన వచ్చిన ముహూర్తం మంచిది. సరిగ్గా అదే టైముకి నరిసిమ్మరాజు హోటల్ అమ్మకాని కొచ్చింది అదెలాగంటే....

కొత్తపేట్నుంచొచ్చినాడు నరసిమ్మరాజబాబు ఇంకా నలభై కూడా నిండలేదు. అదే మాయరోగం వొచ్చినాదో మూడో రోజు కల్లా దాన్ని మూసేసినాడు. ఆ బాబు పోనాక అతగాడి భార్య మల్లెసెట్టునాగుండేది... దగ్గరుండి దినవారాలన్నీ జరిపించినాది.

కులపోళ్ళందర్నీ కూడదీసినాది.

పదిమందిరి సేతా సెబాసనిపించుకున్నాది. అలాగనిపిం చుకున్న మడిసి ఆ రేత్తిరి తొంగున్నాక మరి నెగవనేదు.

తెల్లారేసరికి సచ్చిపడుకున్నాది.

ఆరేత్తిరి ....అరదరేతిరి దాటేక సచ్చిపోయిన నరిసిమ్మ రాజ బాబు లాంతరట్టుకొని తనింట్లో కెళ్ళడం మల్లయ్య గాడు సూసినాట్ట.

నరసింహరాజు వారసులు ఆ హోటల్ అమ్మకానికి పెట్టేరు. రాజగారి టైములో చేయించుకున్న బంగారం వగైరాలున్నాయి కమలమ్మ దగ్గర వడ్డీకి తిప్పుతున్న డబ్బు ఎప్పుడుపడితే అప్పుడు వసూలు అవుతుంది.

మధ్యవర్తులు ద్వారా బేరం మూడువేలకి సెటిలైంది.

తన అదృష్టాన్ని తనే నమ్మలేకపోయింది కమలమ్మ. అయితే ఎంత రాజు చేరదీస్తే మాత్రం ఏ లాభం? ఆఖరికి కూటికి కూడమ్ముకోవలసి వచ్చింది అది తనమీద తను జాలిపడి ఒక కంట ముత్యంలాంటి నీటి బిందువు కార్చింది.

వెంటనే తమాయించుకుంది.

ముందుకొచ్చే వాడెప్పుడూ తన గురించి తను జాలిపడి ఏడుస్తూ కూర్చోడు.

అంచేత ఆలస్యం చేయకుండా ఒక పురోహితుణ్ణి పిలిచి "ఓటేలుకి మంచి ముహూర్తం ఎట్టు" అంది.

దగ్గరలోనా? దూరంలోనా? అడిగాడు పురోహితుడు. అతని తండ్రికి పెళ్ళికి ముహూర్తం పెట్టమంటే, పెళ్ళి కూతురుకి ముట్టు డిగిపోయేలోగా అతనికి ముహూర్తం కుదిరేది కాదు. అతనికి అంతరాత్మ వుండేది.

అతని శాస్త్రజ్ఞానం ఆచారం.

అతను చంద్రబలం, తారాబలం, లగ్నం, వర్జం, దుర్ము హూర్తం, రాహుకాలం, గుళికకాలం, వారశూల వగైరా లెన్నో సరిపడితే గాని ముహూర్తం పెట్టలేకపోయేవాడు.

అన్న ప్రాశనకి ముహూర్తం పెట్టమంటే, అశ్వమేథ యాగా నికి పెట్టినంత పకడ్బందీగా పెట్టేవాడు. అంచేత ఓ పట్టాన ముహూర్తాలు కుడిరేవి కాదు. కానీ అతను ముహూర్తం పెట్టే డంటే దానికి తిరుగుండేది కాదు.

గర్భదానానికి ముహూర్తం పెడితే సంవత్సరానికల్లా కవల పిల్లలు పుట్టాల్సిందే.

అన్నప్రాశనకి ముహూర్తం పెడితే మరింక అక్షరా భ్యాసానికి పెట్టనవసరం లేదు. ఆ పిల్లడు వంటిల్లు వదిలి బయటికి వెళ్ళడు.

అందుకే అతని చేతిమీదుగా జరిగిన పెళ్ళిళ్ళు వగైరా శుభకార్యాలు అతి తక్కువ.

ప్లీడర్లు "సివిల్" సైడు ఫెయిలైతే "క్రిమినల్"కి దిగుతాడు.

పౌరోహిత్యంలో అపరకర్మలు క్రిమినల్ ప్రాక్టీసు లాంటివి.

మనల్ని అడిగి ఎవరూ మనమీద క్రిమినల్ కేసులు పెట్టరు.

అలాగే ఎవరూ ఎవర్నీ అడిగి ముహూర్తాలు పెట్టుకొని చచ్చిపోరు.

అంత తొందరలో ముహూర్తం కుదిరినందుకు కమలమ్మ సంబరపడినా, తర్వాత గాభరా పడింది. ఈలోగా ఏర్పాట్లు చెయ్యగలనా అని.

ఇంటిముందు పచ్చటి తాటాకు పందిరి వేసింది.

ఇంటికీ, పందిరికి మావిడాకు తోరణాలు కట్టింది.

పందిరి కింద కళ్ళాపుజల్లి ముగ్గులు పెట్టింది.

ఖాతాదార్లు కూర్చోవడానికి బెంచీలు వేసింది.

సుక్కురోరం సీకటుండగానే తలకు నీళ్ళోసుకొని, కనక మాలచి గుడికి ఎల్లి, మూడు పెదచ్చినాలు చేసి, మూడు కొబ్బరి కాయలు కొట్టి, సరిగ్గా బేపనోడు సెప్పినా టయముకి ఒటేల్లో పాలు పొంగించి, వంట చేసి మాల చ్చికి నైవేద్యం ఎట్టి, తనింత తిని, తెలిసినోళ్ళందరికీ యింత పెట్టింది.

ఎత్తయిన రోడ్డుమీద నుండి చూస్తే సైను గుడ్డలు కట్టుకున్న వెధమ్ముండల మధ్య పట్టుచీర కట్టుకున్న పెళ్ళి కూతురిలా వుంది కమలమ్మ హోటలు మిగిలిన హోటళ్ళ మధ్య.

దాన్ని చూసినప్పుడు భక్తులకి సీతమ్మ పర్ణశాల గుర్తు కొస్తుంది.

ఏ హోటలైనా సరే బాగా నడవాలంటే ఏమిటి కావాలి?

మంచి వంట వాళ్ళా?

అబ్బే!

డెకొలామ్ టేబుల్సా, గాజుప్లేట్లూనా?

అబ్బెబ్బే!!

కౌంటరు దగ్గర ఇస్పేటురాణీ లాంటి యువరాణి.

యువరాణి లాగే వుంటుంది కమలమ్మ చేరదీసిన కాంతం గుంట.

ఆ గుంటని గల్లాపెట్టె దగ్గర కూర్చోబెట్టి తను వడ్డీ వ్యాపారం చూసుకుంటుంది కమలమ్మ. ఆవిడ దగ్గర ఎక్కువగా వర్కర్లు రోజు వడ్డీ పైన అప్పు తీసుకుంటారు.

వారానికోసారి వడ్డీ కడుతూ వుంటారు.

అసలెప్పుడూ అలాగే వుంటుంది.

సత్యం, నారాయుడూ వెళ్ళేసరికి కమలమ్మ. తన అంత రంగిక గదిలో కూర్చుని తమలపాకులు నవుల్తోంది. మధ్య మధ్య నాలిక పండిందో లేదోనని చూసుకోవడానికి పాములా నాలిక బైట పెట్టి చూసుకుంటోంది.

దా... సత్యం బాబూ... దా. అల్లదుగో ఆ స్టూలు యీడుసు కొని కూకో. ఏటీ మధ్య రావడమే మానేసేవు. అని సత్యాన్ని పలకరించి ఒసే కాంతం మన సత్యం బాబొచ్చేడు. రెండు టీలు పంపించు అని కాంతానికి కేకేసింది.

ఏదోలే కమలమ్మ. అంతా నీలాంటి అదృష్టవంతులే వుంటారా? ఫ్యాక్టరీలో గొడవలు, ట్రయికులు ఎక్కడా తీరిక లేదు. అంటూ ఒక స్టూలు మీద తను కూర్చొని మరోటి నారాయుడికిచ్చాడు.

ఇద్దరూ కూర్చున్నాక టీలు వచ్చాయి.

మరేం లేదు కమలమ్మ. వీడు నారాయుడు. వీడికి అర్జం టుగా వెయ్యి రూపాయలు కావాలి. నువ్వే ఇవ్వాలి. డబ్బుకి నాది పూచీ సత్యం కప్పు కింద పెట్టాడు.

కమలమ్మ తమలపాకులు నమలడం తాత్కాలికంగా వాయిదా వేసింది. నారాయుడ్ని తేరిపార చూసింది. ఒక చేతికి వేలులేని చోట బ్యాండేజీ కూడా చూసింది.

కమలమ్మ చిన్నప్పుడు లెక్కలు నేర్చుకోలేదు.

అయినా ఆవిడ జీతాన్ని కరెక్టుగానే అంచనా వేస్తుంది.

నారాయుడి పరిస్థితి అంతా ఆ బ్యాండేజీ చెప్పింది.

అయితే డబ్బుకి ఢోకా వుండదు.

అయినా అడగ్గానే యిచ్చేస్తే తన గొప్పేంటి?

అయ్యో! ఎంత పని చేసేవు సత్యంబాబూ. ఇప్పుడే యింకె వరో వస్తే వున్నదంతా వూడ్చి మరీ యిచ్చేసేను. నేకపోతే నువ్వు అడిగితే లేదంటానా? ఊరికే యిస్తున్నా నేటి? వడ్డీ వస్తాది కదా. ఇదిగో ఇలా అళ్ళెల్లారు మీరొచ్చేరు. మళ్ళీ వచ్చేవారం వసూలైతే తప్ప యియ్యలేను మరి"

"అమ్మమ్మా, అలాగనకు కమలామ్మ. నారాయుడికి అర్జంటు

అవసరం. వారం కాదు కదా ఒక రోజు కూడా ఆగడానికి లేదు. ఎలాగైనా సర్ది పుణ్యం కట్టుకో. మరి తప్పదు ఎక్కడ తెస్తావో, ఎలా యిస్తావో అదంతా నాకు తెలీదు. సాయంత్రానికి రెడి చెయ్యి. మరింక మాట్లాడకు" అని నారాయుడ్ని తీసుకుని లేచాడు.

ఆ సాయంత్రానికి కమలమ్మ నారాయుడికి వెయ్యి రూపాయల ఇచ్చి ఒక నెల వడ్డీ తీసుకుంది.

ఆ వేళ ..........

కనకరత్నం అస్పత్రిలో ఆపరేషన్ టేబులు మీద పడు కుంది మహాలక్ష్మి.

కనకరత్నం అసిస్టెంట్లు తెల్లబట్టలేసుకున్న దయ్యాల్లా అటు ఇటు తిరుగుతున్నారు.

పక్క గదిలో స్టౌ చప్పుడు.

దూరంగా పురిటి మూలుగు.

ఏదో ఇంజక్షను ఇవ్వడం వరకే తెలుసు మహాలక్ష్మికి.

తర్వాత మేఘాల్లో తేలిపోయింది.

కామరాజు వల్ల మహాలక్ష్మికి కలిగిన మూడు నెలల పిండాన్ని ఆ పిండం పెరిగి పెద్దదైతే మహాలక్ష్మి కంటే అందంగా వుండేది ... ముక్కలు ముక్కలుగా కోసిపారేశారు డాక్టర్లు.

ఆ సాయంత్రం పేర్రాజు తన రిక్షాలోనే ఆమెని ఇంటికి తీసుకెళ్ళాడు.

ఇది వరకు మహాలక్ష్మి వూరికి వెన్నెల.

ఇప్పటి మహాలక్ష్మి గ్రహణం నాటి చంద్రుడు.

ఇది వరకు మహాలక్ష్మి సెలయేటి సంగీతం.

ఈనాటి మహాలక్ష్మి కళ్ళల్లో కాంతిలేదు.

మొహంలో చిరునవ్వు లేదు.

పూర్వజన్మలో నవ్విన నవ్వు తాలూకు నీడలా వుంది ఆమె.

సంక్రాంతి వచ్చింది.

రాజయ్య రాలేదు.

సంక్రాంతి వెళ్ళింది. రాజయ్య రాలేదు.

శివరాత్రి దగ్గర పడుతోంది.

నారాయుడు గుమ్మం దగ్గర నులక మంచం మీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు.

పేర్రాజు పక్కనే వున్న గన్నేరు చెట్టు కిందున్న రాతి మీద కూర్చున్నాడు.

బంతిపువ్వులు, గన్నేరు పువ్వులు మంచు దుప్పటి ముసుగు తీసి తొంగిచూస్తున్నాయి.

గాలికి కదులుతున్న గన్నేరు ఆకులు మంచుముత్యాల పేర్రాజు తల మీద తలంబ్రాలు పోస్తున్నాయి.

మహాలక్ష్మి వాకిట్లో పెట్టిన ముగ్గుని చీమలు తింటున్నాయి.

ఆ చీమల్ని కోడిపిల్లలు కాళ్ళతో కుమ్మేస్తున్నాయి.

ఆ కోడిపిల్ల కోసం ఒక గ్రద్ధ ఆకాశంలో ప్రదక్షిణాలు చేస్తోంది.

"ఒరే పేర్రాజూ, శివరేత్తిరి కూడా దగ్గర పడుతోంది. రాజయ్య కాడ నుండి ఏ కబురూ లేదు" అన్నాడు నారాయుడు చుట్ట వెలిగిస్తూ.

వస్తుందిలే మావా! మిలటరీ కదా. ఎప్పుడు ఏ అర్జంటు పనొస్తుందో చెప్పలేం. నువ్వు అన్నింటికీ అలా బెంగ పెట్టుకోకు. ఒక కోడి పిల్లని దువ్వుతూ చెప్పాడు పేర్రాజు.

నారాయుడికి అభయం అయితే యిచ్చేదు కాని, నిజానికి అతనికీ భయంగానే వుంది.

కొంపదీసి మహాలక్ష్మి సంగతి గిట్టనివాళ్ళెవరైనా రాజయ్యకి చేరవెయ్యలేదు కదా. ఈ రోజుల్లో ఏ పనికైనా తగిన వాళ్ళున్నారు.

అలాగైన్నాదు మహాలక్ష్మి గతేమిటి? భర్తకోసం బిడ్డనీ, బిడ్డవల్ల భర్తనీ పోగొట్టుకుంటుందా?

రాజయ్య వచ్చి నిలదీస్తే?

నిజం చెప్పి క్షమించమని కాళ్ళు పట్టుకోవాలా?

అబద్ధం ఆడి దాటుకోవాలా?

ఛీ! ఛీ!

వెధవ బతుకులు.

సమస్యల తోరణాలైపోతే ఎలా?

ఈ నీతి సూత్రాలూ, ఈ కట్టుబాట్లు యివన్నీ ఎవరు చేశారండి?

ఎవరైనా కానీ మొగాడికి విశృంఖలంగాను, ఆడదాన్ని పకడ్బంధీగాను వుండేటట్లు మహా గొప్పగా చేశారు.

ఈ నీతి శాస్త్రాలు ఆడదాని బ్రతుకుని బాగుచేస్తున్నాయా? బరువు చేస్తున్నాయా?

భర్తలేని ఆడది బిడ్డల్ని కనకూడదా?

ఎందుకు కనకూడదు?

మరి భారతంలో సత్యవతికొడుకులు చచ్చిపోతే కోడళ్ళని మరొకరి దగ్గరకు బలవంతంగా పంపలేదా? రాజ్యం కోసం, వంశం కోసం రాజులు, గొప్పవాళ్ళు ఇలాంటి పన్లు చెయ్యటం తప్పు కాదు.

ధృతరాష్ట్రుడు, పాండురాజు స్వంత తండ్రికి పుట్టారా?

పాండవులు పాండురాజుకే పుట్టారా?

మరి ఆనాడు ఆమోదయోగ్యం అయింది. ఈనాడు ఎందుకు కాదు?

బిడ్డకి తండ్రి ఎవరో తల్లికి తెలిస్తే చాలు.

ప్రపంచానికి తెలియనవసరం లేదు.

ప్రతి ఆడది తన పిల్లని తండ్రి ప్రమేయం లేకుండా పెంచుకో గలిగిన్నాడు ఆనాధలూ వుండరు, శరణాలయాలు అవసరం లేదు.

ఇన్ని శిశు హత్యలు వుండవు.

గూండాలు, రౌడీలు, హంతకులుగా తయారయ్యేది ఎక్కువ శాతం అనాధలే.

ఈ అనాధలే లేనినాడు అవినీతి మాట ఎలా వున్నా, అరా చకం వుండదు.

మాతృత్వానికీ, మొగుడికీ లింకు తీసేస్తే!

అమ్మో! ఇంకేమైనా వుందా?

ఆడవాళ్ళు బరితెగించరూ?

మోరలిస్టులు గుండెలు బాదుకోరూ?

అవినీతి (ఆడవాళ్ళకే సుమా. దాని దగ్గర కొచ్చే మొగాడికి అది అంటదు) ఎక్కువైపోదూ.

ఏమిటి సార్! మీ వెర్రి.

పూర్వం పెళ్ళికాని తల్లులు, విధవ తల్లులు, ఆత్మహత్య చేసుకునే వారు.

ఇప్పుడు అబార్షను లీగలైజు చేశాక శిశు హత్యలు, భ్రూణ హత్యలు చేస్తున్నారు.

ఏ ఆడదీ కడుపుకోత కోరదు.

తల్లి అవడం తప్పుకాదు.

కాని దాన్ని మొగుడితో లింకుచేసి నీతి శాస్త్రాల పేరుతో శిశుహత్యలు చేస్తున్నారు.

ప్రతి ప్రాణికీ బ్రతికే హక్కు వుంది.

ఏ ప్రాణికీ చంపే హక్కు ఎవరికీ లేదు.

ఈ సమస్యకి పరిష్కారం లేదు.

పేర్రాజు బుర్ర ఆలోచించి, ఆలోచించి వేడెక్కిపోయింది.

అదిగో సరిగ్గా వచ్చాడు పోస్టుమేన్.

పోస్ట్‌మేన్ ఇచ్చిన టెలిగ్రాం పేర్రాజు తీసుకొని సంతకం చేశాడు.,

టెలిగ్రాం చదివేడు పేర్రాజు.

రాజయ్య కాడినుంచేనా? నారాయుడి గొంతులో అతృత.

ఔనన్నట్టు తలాడించాడు పేర్రాజు.

ఎప్పుడొస్తాట్ట.

ఇంక ఈ జీవితంలో రాడని చెప్పాలా?

ఇంతకీ ఆ టెలిగ్రాంలో ఏవుంది?

రాజయ్య వెళుతున్న జీవుకి ఏక్సిడెంటై జీవులో వున్న అందరూ చచ్చిపోయారు.

పేర్రాజుకి ఏం చెప్పాలో తెలీలేదు.

విధి అంటారా?

ఖర్మ అంటారా?

శాపం అంటారా?

కూతురి కాపరం కోసం నారాయుడు వేలు పోగొట్టు కున్నాడు.

ఆ కాపరం కోసమే మహాలక్ష్మి యింకా ఆకారమే ఏర్ప డని పిల్లని పోగొట్టుకుంది.

ఇప్పుడా కాపరం ఏదీ?

కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే రాజయ్య పోవడమే తప్ప నప్పుడు ఓ పదిహేను రోజులు ముందే పోయి వుంటే....

నారాయుడికి వేలు దక్కేది.

మహాలక్ష్మికి భర్త కాకపోయినా, ఆ పిల్లకి తను తండ్రి అయి వుండేవాడు. అప్పుడు ఆ పిల్లా దక్కేది.

ఇప్పుడా వార్త వింటే నారాయుడు ఏమైపోతాడు? మహాలక్ష్మి ఎలా తట్టుకుంటుంది.

అసలీ వార్త వీళ్ళకి తెలీకపోతే?

సర్రున టెలిగ్రాం చింపేశాడు పేర్రాజు.

ఏర్రా ఎప్పుడొస్తాడంటే మాట్లాడవేం? నారాయుడు గట్టిగా అరిచాడు.

ఏం లేదు మావా. త్వరలోయుద్ధం వస్తుందేమోనని అను మానంగా ఉందట. అంచేత ఎవరికీ శలవలు యివ్వటం లేదుట. శలవులో వున్న వాళ్ళని కూడా తెప్పిం చేస్తున్నారట. అంచేత యింక వేగం రావడం కుదరదట.

అబద్ధం ఎంత బాగా అతికింది!

తన అబద్ధానికి తనకే నవ్వొచ్చింది పేర్రాజుకి.

"ఎన్నాళ్ళు పడుతుందో?" తనలో తనే గొణుకున్నాడు నారాయుడు.

ఎన్నేళ్ళు పట్టినా ఈలోగా మహలక్ష్మి కోలుకుంటుంది. కొంత వయస్సూ వస్తుంది.

మనస్సు ఎదుగుతుంది.

అప్పుడు తేలిగ్గా నచ్చచెప్పవచ్చును.

ఏమో! అప్పుడు మహాలక్ష్మి ఎవరినైనా పెళ్ళి చేసు కుంటుంది.

పిల్లల్ని కంటుంది.

సుఖంగా వుంటుంది.

ఆశ పడటం తప్పుకాదు.

మానవుడు ఆశాజీవి.

ఎంత నిరాశలోనైనా చిన్న చిరుఆశ మినుకు మినుకు మంటుంది.

అదే మనిషిని బ్రతకనిస్తుంది.

అదే మనిషిని ముందుకు నడిపిస్తుంది.

పేర్రాజు ఆశ ఫలిస్తుందా.

ఏమో!

**(పల్లకి, 1993)**

# చెకుముకి నిప్పు

**"పు**నరపి జననం, పునరపి మరణం" అంటుంది శంకర భగవత్పాదులవారి భజగోవింద శ్లోకం.

"జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మమృతస్యచ" అంటుంది భగవద్గీత.

అయితే, ఇవన్నీ తెలీకేనా అలనాడు రావుడు సీత కనిపించక పోతే చెట్టుకీ, పిట్టకీ చెప్పుకొని బావురుమన్నాడు!

ఇవన్నీ తెలీకేనా సతీదేవి అగ్నిలో ఆహుతైనపుడు శివుడు విలయతాండవం చేసేడు!

మరింక మానవమాత్రుడినైన నేను ఏపాటివాణ్ణి?

ఆనందరావు పోయేడన్న వార్త విన్న నేను రాఁవుడిలా భోరు మనలేదు, శివుడిలా తాండవం చేయ్యలేదు.

మరైతే ఏం చేసేవయ్యా అంటారేమో?

ఏఁవీ చెయ్యలేదు. శిలలా ఉండిపోయేను.

ఒక ఎత్తయిన శిఖరం మీద నుంచి కాలు జారి లోయలో పడిపోతే ఏఁవనిపిస్తుంది? ఏఁవీ అనిపించదు. అంతా శూన్యం అంతే.

శరీరం, మనసుమొద్దుబారిపోయేయి. అంతలో నెమ్మదిగా సర్దుకున్నాను. అతని పరంగా ఆలోచిస్తే అదృష్టవంతుడు అని పించింది.

ఒంటరి బతుకు నుంచి విముక్తి దొరికింది.

అతని భార్య పోయి అయిదేళ్ళయింది. ఈ అయిదేళ్ళ నుంచి అతను ఒంటరివాడే. ఉండడానికైతే ముగ్గురు కొడుకులున్నారు. ఇద్దరు కూతుళ్ళున్నారు. ఏ కోడలూ అన్నం తింటారా మావ గారూ అని అడిగిన పాపాన పోలేదు.

కూతుళ్ళిద్దరూ తల్లి బంగారం కోసం తన్నుకున్నారే తప్ప "కాఫీ తాగుతావా నాన్నా" అనలేదు ఏనాడూ

"సత్రం భోజనం, మఠం నిద్రలా ఉంది నా బ్రతుకు" అని బాధపడేవాడు.

"అయినా, ఈ ఆడవాళ్ళు ఎప్పుడూ పునిస్త్రీగా పోవాలనే గోలపెట్టేస్తారు. వీళ్ళకసలు బుద్ధుందా? కట్టుకున్న మొగాడేవై పోవాలి? వీళ్ళ పసుపు కుంకం కోసం మొగుడు బలైపోవాలా?